# ఏ పుట్టలో ఏమున్నదో

నవల

- అత్తలూరి విజయలక్ష్మి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 192

కౌముది మాసపత్రికలో

జనవరి 2018 సంచిక నుంచి ఆగస్ట్ 2019 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

(ప్రారంభం)

" అత్తయ్యగారూ ... జానకి అక్కడికి ఏమన్నా వచ్చిందా ?" పొద్దున్నే ఆరు గంటలకి అల్లుడు ఫోన్ చేసి అడిగిన ప్రశ్నతో లీలమ్మకి మతిపోయింది..

" జానకి రావడం ఏంటి ఇంట్లో లేదా?" అడిగింది..

భాస్కర్ స్వరం వణికింది ... " లే లేదు ...నిన్న సాయంత్రం బైటికి వెళ్తున్నా రావడానికి రెండు గంటలు పడుతుంది మీరు, పిల్లలు భోజనం చేసేయండి అని చిన్న కాగితం ముక్క మీద రాసిపెట్టి వెళ్ళింది.. నేను ఆఫీస్ నుంచి వచ్చి ఆ కాగితం చూసి పక్కింటి అమ్మాయితో సినిమాకి ఏమన్నా వెళ్ళిందేమో వచ్చాక భోజనం చేయచ్చులెమ్మని టి వి చూస్తూ కూర్చున్నాను .. హరి, చరిత కాలేజ్ నుంచి వచ్చి అమ్మేది అని అడిగినా సినిమాకి వెళ్లిందని చెప్పాను .. వాళ్ళు భోజనం చేసేసి చదువుకుంటూ కూర్చున్నారు.. తొమ్మిదైంది ... పదైంది ... మనిషి రాలేదు ... నాకు టెన్షన్ మొదలైంది. చరితని పక్కింటికి పంపించి ఆవిడ ఇంట్లో ఉందో, లేదో చూసి రమ్మన్నాను .. ఆవిడ హాయిగా పడుకుని ఉంది .. తనూ, జానకి ఎక్కడికి వెళ్ళలేదు అని చెప్పింది.. ఏం చేయాలో, ఎక్కడ వెతకాలో తెలియలేదు.. అలా రాత్రంతా కనురెప్ప వాల్చకుండా నేను, పిల్లలు ఎదురుచూస్తూ కూర్చున్నాం .. మీరు ఎప్పుడు నిద్ర లేస్తారా .. ఎప్పుడెప్పుడు ఫోన్ చేద్దామా అని ఎదురుచూసి చేసాను.. "

" అయ్యో ... అదేంటి భాస్కర్ ఎక్కడికెళ్ళింది? మీరిద్దరూ ఏదన్నా గొడవ పడ్డారా? " ఆందోళనగా అడిగింది లీల..

భాస్కర్ ఏది ఊహించాడో సరిగ్గా అదే ప్రశ్న ... చాలా ఇబ్బందిగా చెప్పాడు.

" లేదండి ఇదివరకన్నా అప్పుడప్పుడు చిన్న, చిన్న మాట పట్టింపులు వస్తుండేవి కాని, ఈ మధ్య తన ఆరోగ్యం బాగా లేనప్పటి నుంచి నేను కాని, పిల్లలు కానీ తనని ఏమి అనడం లేదు. తను ఏం చెప్తే అది చేస్తున్నాం .. ఎలా అంటే ఆలా మసలుకుంటున్నాం..."

భాస్కర్ స్వరంలో నిజాయితీ ....

" ఏంటి జానకి ఆరోగ్యం బాగాలేదా ఏం ? ఏమైంది? ఎప్పటి నుంచి బాగాలేదు... నాకు మాట మాత్రం చెప్పలేదేం !"

" అత్తయ్యా! ఇవన్నీ ఫోన్ లో మాట్లాడే విషయాలు కావు .. మీరు, మావయ్య గారు ఓసారి ఇక్కడికి రండి.. నాకు కాళ్ళు, చేతులు ఆడడం లేదు ..." జాలిగా అన్నాడు భాస్కర్ ..

" వస్తాం .. ఇప్పుడే ఆయన్ని నిద్ర లేపి చెప్తాను. ఇంకో గంటలో బయలు దేరతాం."

లీల అభయం ఇవ్వడంతో భాస్కర్ కి కొంచెం రిలీఫ్ గా అనిపించింది.

ఫోన్ పెట్టేసి నిస్సత్తువగా సోఫాలో వాలిపోయాడు.

" ఎక్కడికి వెళ్ళింది జానకి? అసలు ఎందుకు వెళ్ళింది? "

అసలు జానకికి ఏమైంది ఈ మధ్య ఎప్పుడూ రుసరుసలాడుతూ ఉంటోంది. అయిన దానికి, కానిదానికి పిల్లల మీద అరుస్తోంది... తన మీదా అరుస్తోంది .. ఇదివరకు చిరునవ్వు చెదరనీకుండా ఎంతో ప్రశాంతంగా ఉండేది.. సౌమ్యంగా మాట్లాడేది.. తను ఎప్పుడన్నా పని ఒత్తిడిగా ఉన్నప్పుడు విసుక్కున్నా, శాంతంగానే జవాబిచ్చేది.. అలాంటిది సుమారు నాలుగు నెల్ల నుంచి విచిత్రంగా మారిపోయింది.

ఎప్పుడూ ఏదో చికాకుగా , అస్థిమితంగా ఉంటోంది.. అక్కడికి తను డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళ్తానని కూడా అన్నాడు రెండు, మూడు సార్లు.. ఎందుకు డాక్టర్ నాకేమైందని అని విసుక్కుంది..

ఇదివరకు ఉదయాన్నే నిద్ర లేచి దేవుడి గదిలో దీపం పెట్టి కొంచెం పటిక బెల్లం నైవేద్యం పెట్టి రొటీన్ లో పడేది .. ఈ మధ్య గంటలు, గంటలు పూజ చేస్తోంది. తను, పిల్లలు ఆవిడ పూజ అయి బ్రేక్ ఫాస్ట్ చేసిందాకా పడిగాపులు పడుతూ ఇంక టైం అయిపోడంతో అలాగే వెళ్ళిపోయి బైట తినేయడం చేస్తున్నా ఆవిడలో మార్పు రాలేదు.

" నాన్నా పోలీస్ రిపోర్ట్ ఇద్దామా?" హరి మాటతో ఆలోచనలనుంచి బైట పడి కొడుకు వైపు చూసాడు.

తన ఎదురుగా మరో సోఫాలో కూర్చున్న చరిత బాగా ఏడ్చినట్టు కళ్ళు తడిగా, వాచి ఉన్నాయి.

హరి మరోసారి అడిగాడు " పోలీస్ రిపోర్ట్ ఇద్దామా నాన్నా .. ఎక్కడని వెతుకుతాం ?"

హరి ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.. బుద్ధిమంతుడు, వివేకవంతుడు. చరిత ఇంటర్ మొదటి సంవత్సరం లోకి వచ్చింది. తల్లి అంటే పంచ ప్రాణాలు. జానకి కూడా తనని విసుక్కున్నట్టు పిల్లల్ని విసుక్కోలేదు. చికాకు పడుతుండేది. ఆ ఇద్దరినీ చూస్తుంటే గుండె చెరువైంది భాస్కర్ కి జానకీ ఎక్కడికి వెళ్ళింది? ఎందుకిలా చేసింది? బాధగా అనుకున్నాడు.

" ఏమని ఇస్తాం నాన్నా? వాళ్ళు మనలని ఒక పట్టాన విడిచి పెడతారా?. ప్రశ్నలతో, అనుమానాలతో తూట్లు పొడుస్తారు. నన్ను క్రిమినల్లా చూస్తారు. నాకేం పాలు పోవడం లేదురా మీ అమ్మ ఇలా ఎందుకు చేసింది?" ఆవేదన నిండిన స్వరంతో అన్నాడు.

హరి జాలిగా చూసాడు తండ్రి వైపు. అమ్మ, నాన్న ఎంతో అన్యోన్యంగా ఉంటారు. సరదాగా ఆర్గుమెంట్లు తప్ప వాళ్ళ మధ్య ఎప్పుడూ సీరియస్ తగాదాలు చూసిన గుర్తులేదు. పాపం ఒక్క రాత్రికే ఎంత నీరసించి పోయాడో!.

అమ్మ ఎక్కడికెళ్ళింది? ఆవిడని ఎవరన్నా కిడ్నాప్ చేశారేమో అనడానికి అమ్మ చిన్నపిల్ల కాదు. నలభై దాటింది వయసు. పోనీ అమ్మ ఒంటి మీద నగల కోసం ఎవరన్నా కిడ్నాప్ చేసారా.. అమ్మ మెడలో సూత్రాలు తప్ప ఇంక ఏమి ఉండదు. ఆ ఒక్క గొలుసు లాక్కు పోతారే గాని కిడ్నాప్ చేసి కాజేస్తారా పెద్ద వాళ్ళ దగ్గరనుంచి. అసలు రెండు గంటల్లో వస్తాను అని కాగితం మీద రాసిపెట్టి వెళ్ళాల్సిన పని ఏంటి? అమ్మ ఎక్కడికన్నా వెళ్ళాలి అనుకుంటే నాన్న తీసుకుని వెళతాడు. లేదంటే తను తీసుకుని వెళ్తాడు. ఎప్పుడూ లేనిది అంత అకస్మాత్తుగా ఎక్కడికి వెళ్ళింది? వెళ్ళిన మనిషి ఫలానా చోటికి వెళ్తున్నాను అని చెప్తే ఎవరో ఒకళ్ళు వెళ్ళి పికప్ చేసుకునే వాళ్ళు.

అమ్మకి ఫ్రెండ్స్ కూడా ఎవరూ లేరు. ఒకవేళ ఈ మధ్య పేస్ బుక్ లో ఎక్కడెక్కడి వాళ్ళు వచ్చేసి, ఓల్డ్ ఫ్రెండ్స్ మిట్ అని పాత ఫ్రెండ్స్ కలవడం ఎక్కువైంది అలా ఏమన్నా పాత ఫ్రెండ్స్ దొరికారా. అసలు అమ్మ పేస్ బుక్ చూస్తుందా. హరి చరిత వైపు చూసాడు. తెరిచి ఉన్న వాకిలి గుండా విదిలోకి ఆశగా చూస్తూ కన్నీళ్ళు తుడుచుకుంటోంది

దగ్గరగా వెళ్ళి నెమ్మదిగా అడిగాడు " చరి అమ్మకి ఫేస్బుక్ చూసే అలవాటు ఉందా?"

చరిత ముక్కు ఎగబిల్చి " అసలు అమ్మ లాప్ టాప్ ముట్టుకోదు.. తనకి అసలు అవన్నీ తెలియదు కూడా" అంది .

హరి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

భాస్కర్ ఏదో గుర్తొచ్చినట్టు గబాల్న అన్నాడు " చరితా .. వెళ్ళి ఒక్కసారి పక్కింటి ఆంటిని పిలుచుకు రా .."

చరిత తండ్రి వైపు సందేహంగా చూసింది..

హరి కూడా తండ్రి వైపు చూసి అడిగాడు.." ఎందుకు నాన్నా .."

" ఆంటి , అమ్మ కొంచెం క్లోజ్ గా ఉంటారు కదరా. ఆవిడకి ఏమన్నా చెప్పిందేమో అమ్మ అడుగుదాం."

చరిత నేప్ కిన్ తో కళ్ళు, ముక్కు తుడుచుకుని లేచి బయటికి వెళ్ళింది..

భాస్కర్ తల పట్టుకుని కూర్చున్నాడు ..

చరిత శారద ని వెంట పెట్టుకుని వచ్చింది ..

" ఏంటండి ఏం జరిగింది ? చరిత ఏదో అంటోంది.. నాకేం అర్ధం కావడం లేదు .."అయోమయంగా చూస్తూ అడిగింది శారద భాస్కర్ ని ..

భాస్కర్ వస్తున్న దుఃఖం అదిమి పట్టి అడిగాడు .." మీకు జానకి నిన్న ఏమన్నా చెప్పిందా?"

" ఏ విషయం?" అడిగింది శారద ..

ఏం చెప్పాలో అర్ధం కాలేదు భాస్కర్ కి .

చరిత ఏడుస్తూ అంది “ ఆంటి అమ్మ నిన్న సాయంత్రం ఎక్కడికో వెళ్తున్నానని, రెండు గంటల్లో వస్తాను అని మాకు పేపర్ మీద రాసి పెట్టి ఎక్కడికో వెళ్ళింది. ఇంతవరకూ ఇంటికి రాలేదు. మీకేమన్నా చెప్పిందా ఎక్కడికి వెళ్తోందో.”

శారద నివ్వెరపోతూ చూసింది.. జానకీ ఎక్కడికి వెళ్ళింది.. నిన్న సాయంత్రం వెళ్ళిన మనిషి ఇంకా ఇంటికి రాలేదా..” లేదమ్మా .. నాకేం చెప్పలేదు.. అసలు నిన్న మేమిద్దరం కలుసుకోలేదు.”

భాస్కర్ ఆ మాటకి రెండు చేతుల్లో మొహం కప్పేసుకున్నాడు.. అతని భుజాలు ఎగిరెగిరి పడుతున్నాయి.. అతని ఏడుపు చూసి చరిత, హరి కూడా బావురుమన్నారు.

శారదకి ఆ దృశ్యం చూడగానే గుండె చెదిరిపోయింది. ఎంత చక్కటి ఫ్యామిలీ. దాదాపు ఐదేళ్ళ నుంచి చూస్తోంది. శారద భర్తకి బదిలీ అయి నాగపూర్ నుంచి హైదరాబాద్ వచ్చి సఫిల్ గూడాలో జానకీ ఇంటి పక్కకే అద్దెకి వచ్చారు. అప్పటినుంచి శారద, జానకి మంచి ఫ్రెండ్స్ అయారు. ఇద్దరూ కలిసి పిల్లలు, భర్త బయటికి వెళ్ళగానే మాటిని షోలు చూడడం కలిసి షాపింగ్ చేయడం. ఎంతో ఆత్మీయంగా ఉంటారు. అలాంటిది జానకి తనకి కూడా చెప్పకుండా ఎక్కడికి వెళ్ళింది. వెళ్ళిన మనిషి ఇంకా ఇంటికి రాకపోవడం ఏంటి? కొంపతీసి ఏదన్న యాక్సిడెంట్ అవలేదు కదా. ఆ ఊహ రాగానే ఆదుర్దా నిండిన స్వరంతో అడిగింది “పోలిస్ కంప్లైంట్ ఇచ్చారా ..?”

భాస్కర్ తల అడ్డంగా ఆడించాడు..

“మరి ఎందుకు ఇవ్వలేదు.. దేవుడి దయవలన ఏమి అవకూడదు .కాకపోతే ఎందుకైనా మంచిది ఏదన్నా యాక్సిడెంట్ అయితే తెలుస్తుంది కదా .. వెంటనే కంప్లైంట్ ఇవ్వండి.. మా వారిని పిలుస్తాను ఇద్దరూ కలిసి వెళ్లి ఇవ్వండి” అంటూ చనువుగా ల్యాండ్ ఫోన్ దగ్గరకు వెళ్లి ఇంటికి ఫోన్ చేసి భర్తను ఉన్నపళంగా భాస్కర్ ఇంటికి రమ్మని చెప్పింది..

ముగ్గురి వైపు చూసి “అయ్యో... ఇప్పటివరకూ మీరు కాఫీ కూడా తాగినట్టులేరు. ఇలా అయితే ఎలా?! మన కర్తవ్యం మనం నిర్వహిస్తూ, మన పనులు చేసుకోవాలి. ఇలా కూర్చుంటే అవుతుందా” అంటూ మెత్త, మెత్తగా మందలిస్తూ వంట గదిలోకి వెళ్లి స్టవ్ వెలిగించి కాఫీ డికాషన్ వేసింది. ఫ్రిడ్జ్ లో నుంచి పాలు తీసి స్టవ్ మీద పెట్టి , అంట్ల గిన్నెలన్ని సింక్ లో వేసింది. వంట గది ఊడ్చి, కాఫీ కలిపి ముగ్గురికి తీసికెళ్ళి ఇచ్చింది. వద్దు అంటున్నా బలవంతంగా చేతికి ఇచ్చింది.

శారద భర్త జనార్ధన్ వచ్చాడు. అతనికి జరిగిందంతా చెప్పి “మీరు, అన్నయ్యగారు వెళ్లి పోలిస్ కంప్లైంట్ ఇచ్చి రండి.. ఏం జరిగిందో తెలుస్తుంది కదా” అంది.

“ అరె. రాత్రే చెప్పి ఉంటే ఏదన్నా చేసేవాళ్ళం కదా. పదండి వెళ్దాం.. తప్పకుండా కంప్లైంట్ చేయాలి. వాళ్ళు ప్రశ్నలు అడుగుతారు. అది వాళ్ళ వృత్తి ధర్మం. మనం మనకి తెలిసినవి చెప్తాం ఇందులో భయపడాల్సింది ఏమి లేదు” అంటూ ధైర్యం చెప్పి భాస్కర్ ని బయలుదేరా తీశాడు.

వాళ్ళిద్దరూ బయటకు వెళ్ళగానే చరితను, హరిని “ మీరు స్నానాలు చేసి మా ఇంటికి రండి. ఈ లోగా నేను వెళ్లి ఇడ్లి వేస్తాను తిందురుగాని” అంది ..

“ వద్దాంటి” అన్నారిద్దరూ.

“ వద్దు, లేదు అని అనకండి. నేనున్నాగా అమ్మకేం కాదు క్షేమంగా వస్తుంది. నా మాట విని స్నానాలు చేసి రండి. నేను చెప్పిన మాట వినకపోతే మీరు పిలిచినా రాను అంతే” అంటూ చనువుగా బెదిరించి ఇద్దరినీ ఒప్పించింది.

అప్పుడే పనిమనిషి గేటులోకి రావడంతో “ అదిగో పనిమనిషి వచ్చింది.. మీరు ఏం జరగనట్టు అమ్మ చుట్టాలింటికి వెళ్ళినట్టుగా ఉండండి ..” అంటూ లోపలికి వచ్చిన పనిమనిషి దుర్గకి “ అమ్మగారూ లేరు బంధువులేవరికో బాగా లేదంటే చూడడానికీ వెళ్లారు. నువ్వు ఉన్న పని చేసేసి వెళ్ళు. మధ్యాహ్నం అంట్లు ఏమి ఉండవు రానక్కరలేదు” అని చెప్పింది.

“ అయ్యో గట్లనా మంచిదమ్మా ... అమ్మ ఎన్నాడోస్తది?.” అని అడుగుతూ చీపురు తీసుకుని ఊడవసాగింది.

" వాళ్లకి కాస్త కుదుట పడ్డాక వస్తుందిలే" అంటూ చరితకి సైగ చేసింది లోపలికి వెళ్ళమన్నట్టు. చరిత ఒక బాత్రూం లోకి, హరి ఒక బాత్రూం లోకి వెళ్ళగానే తను ఇంటికి బయలు దేరింది శారద.

భాస్కర్, జనార్ధన్ పోలీస్ స్టేషన్ కి వెళ్లేసరికి అప్పుడే ఎస్ ఐ వచ్చి కూర్చుని న్యూస్ పేపర్ చదువు తున్నాడు.

భాస్కర్ ని, జనార్ధన్ ని చూసి పేపర్ పక్కన పెట్టి కూర్చోమని కుర్చీ చూపించాడు..

ఇద్దరూ కూర్చున్నారు. ఎస్ ఐ వాళ్ళవైపు ప్రశ్నార్థకంగా చూడసాగాడు ఏం చెప్తారా అన్నట్టు.

భాస్కర్ కి గొంతు పెగిలి మాట రావడం లేదు.. దుఃఖం అడ్డు వస్తోంది. జనార్ధన్ వైపు చూసాడు చెప్పమన్నట్టుగా .

జనార్ధన్ జరిగిన విషయం స్థూలంగా చెప్పాడు.

ఆయన చెప్పింది విన్న ఎస్ ఐ కనుబొమలు ముడిపడ్డాయి. భాస్కర్ వైపు చూస్తూ అడిగాడు. "నిన్న ఆవిడ ఎన్ని గంటలకి బయటకు వెళ్ళారు..?"

భాస్కర్ బలవంతంగా గొంతు పెగిలించుకున్నాడు. " నేను ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చేసరికి సిక్స్ థర్టీ అయిందండీ. ఇల్లు తాళం వేసి ఉంది. మేము ఎవరన్నా బయటకి వెళ్తే పెరటి వైపు తులసి మొక్క ఉన్న కుండీలో తాళం చెవి పెట్టి వెళ్తాం. తను కూడా అలాగే పెట్టి వెళ్ళింది. నేను తాళం తీసుకుని లోపలికి వెళ్లి నా మొబైల్ జేబులోంచి తీసి టేబుల్ మీద పెడుతుంటే తను రాసి పెట్టిన స్లిప్ కనిపించింది. దాని మీద టైం వేయలేదు. బహుశా ఏ ఆరింటికో వెళ్ళిందనుకుంటాను."

" నిన్న మీరిద్దరూ ఏమన్నా గొడవ పడ్డారా? "

" లేదండి.. "

" ఆవిడ రాసిన స్లిప్ తెచ్చారా?"

భాస్కర్ జేబులోంచి తీసి ఇచ్చాడు.

ఎస్ ఐ కళ్ళు ఆ అక్షరాల వెంట పోతుంటే అతని చొక్కా జేబు దగ్గర ఉన్న బాడ్జ్ మీద అతని పేరు చూసాడు భాస్కర్. అతని పేరు రవీంద్ర ...

అతను చదవడం పూర్తీ చేసి భాస్కర్ వైపు చూస్తూ " ఇంతకూ ముందు ఇలా ఎప్పుడన్నా వెళ్ళారా ..?" అడిగాడు .

భాస్కర్ తల అడ్డంగా ఆడించాడు." లేదు. అసలు ఆ అవసరం లేదు. ఎక్కడికి వెళ్ళాలన్నా నేనే తీసుకుని వెళ్తా. నాకు ఏదన్నా అనారోగ్యం కాని వేరే ఇబ్బంది ఏదన్నా ఉంటె మా అబ్బాయి తీసుకుని వెళ్తాడు. ఇలా ఎందుకు వెళ్ళిందో, ఎక్కడికి వెళ్ళిందో అర్ధం కావడం లేదు."

" ఆవిడ నార్మల్ గా ఉంటారా. ఏదన్నా అనారోగ్య సమస్య ఉందా ..?"

" లేదు. అనారోగ్యం ఏమి లేదు. కాని నాలుగైదు నెలలుగా అసహనంగా, విసుగ్గా, చికాకుగా ఉంటోంది ."

" ఐసి " తల పంకించాడు ఎస్ ఐ ...

" ఆవిడ బయటకు వెళ్ళినపుడు ఒంటి మీద నగలేమన్నా ఉన్నాయా?."

" లేదు ... సూత్రం గొలుసు తప్ప వేరే ఏమి వేసుకోదు."

" ఓ కె రిటెన్ కంప్లైంట్ ఇవ్వండి. "

ఎస్ ఐ టేబుల్ సొరుగులోంచి తెల్ల కాగితం తీసిచ్చాడు.

భాస్కర్ కంప్లైంట్ రాసి ఎస్ ఐ కి ఇచ్చాడు.

**హైదరాబాద్** నగరంలో అత్యంత బిజీ సెంటర్ దిల్ షుక్ నగర్.

దిల్ సుఖ్ రాంప్రసాద్ అనే భూస్వామి మలకపేట ప్రాంతంలో ఉండేవాడని, అనేక ఎకరాల్లో ఉన్న తన భూమిలో సగం ప్లాట్లు గా మార్చి తన పేరు మీద కాలనీలుగా ఏర్పరచాడని ఒక చరిత్ర.

ఎటు చూసినా కళ్ళు మిరుమిట్లు గొలిపే వాణిజ్యసంస్థలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, అనేక విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లే కాక పిలిచిన పలికే దైవంగా ప్రసిద్ధి పొంది, షిరిడి పుణ్య క్షేత్రానికి నమూనాగా భక్తులు భావించే షిరిడి సాయిబాబా దేవాలయం దిల్ సుఖ్ నగర్ ప్రత్యేకం. అంతేకాక  సాంకేతిక ప్రగతికి నిదర్శనంగా తయారైన  మెట్రో స్టేషన్ కూడా ఇప్పుడు మరింత అందాన్ని సంతరించుకుని దిల్ సుఖ్ నగర్ ప్రత్యేకతని చాటుతోంది.

ఎటు చూసినా  క్రిక్కిరిసిన జనాభా, అన్ని రకాల వాహనాల రాకపోకలతో  ఇరవై నాలుగు గంటలు పెళ్లి వారి ఇల్లులా కళకళలాడిపోతూ ఉంటుంది. తళ, తళలు, మిలమిలలు తోపాటు కావాల్సినంత దుమ్ము, ధూళి కూడా నిండిపోయి వాతావరణ కాలుష్యానికి కూడా దిల్ సుఖ్ నగర్ పెట్టింది పేరు అయింది.

దిల్ సుఖ్ నగర్ నుంచి ముందుకు వెడితే కొత్తపేట ఫ్రూట్ మార్కెట్, అక్కడినుంచి లోపలికి వెళితే రామకృష్ణ పురం, వాసవి కాలనీలో ఎంతో ప్రఖ్యాతి గాంచిన అష్టలక్ష్మి ఆలయంకి దగ్గరలో భాస్కర్ తండ్రి హయాంలో మూడు వందల గజాల్లో కట్టించిన ఇల్లు… ఆయన తదనంతరం ఇద్దరు కొడుకులు భాస్కర్, మోహన్ లకు వచ్చింది. అయితే మోహన్ ఉద్యోగ రీత్యా పూనాలో స్థిరపడడం వలన భాస్కర్ కుటుంబమే అక్కడ ఉంటోంది. భాస్కర్ మునిసిపల్ ఆఫీసులో అసిస్టెంట్ కమిషనర్ గా చేస్తున్నాడు. హరి ఇంజనీరింగ్ కాలేజ్ కొంచెం దూరం అయినా చరిత దిల్ సుఖ్ నగర్ లోనే ఒక జూనియర్ కాలేజిలో చదువుతోంది.

నిజాయితీపరుడుగా,  స్ట్రిక్ట్ ఆఫీసర్ గా మంచి పేరుంది భాస్కర్ కి.. స్వంత ఇల్లు, అవసరాలకి సరిపడా జీతం, పెద్ద, పెద్ద కోరికలు, ఆశలు లేకుండా ఉన్నంతలో క్రమశిక్షణ తో బతకడమే కాక పిల్లల్ని కూడా ఎంతో క్రమశిక్షణతో పెంచారు భార్యాభర్తలు. భాస్కర్ ఎంత నిజాయితిగా ఉండాలని అనుకున్నా కొంతమంది, కొన్ని సందర్భాలలో అతని మీద వత్తిడి తీసుకొచ్చి ప్రలోభ పెడతారేమో అని భయంతో మనకున్నది చాలు, ఎలాంటి ప్రలోభాలకి లొంగి  లంచాల జోలికి వెళ్ళద్దు అని జానకి భాస్కర్ తో ప్రమాణం కూడా చేయించుకుంది. చాలామంది భార్యల వత్తిళ్ళతో లంచాలు తీసుకుంటారు కాని,  నా భార్య సిద్ధాంతాలు ఉన్న మనిషి అని మురిసిపోతాడు భాస్కర్.

భాస్కర్ కి ఎలాంటి చెడ్డ అలవాట్లు లేవు. భార్య అన్నా, పిల్లలు అన్నా అతనికి ప్రాణం. సాధారణంగా ఆఫీస్ లో పని ఉంటె తప్ప ఇంటికి ఆలస్యంగా రాడు. ఒకవేళ ఏ కారణం చేతనైనా ఆలస్యం అయితే ముందే జానక్కి ఫోన్ చేసి చెప్తాడు.

భార్యాభర్తల మధ్య కానీ, పిల్లల వల్ల కాని ఆ కుటుంబంలో ఎప్పుడూ ఎలాంటి గొడవలు ఉండవు. చుట్టుపక్కల కుటుంబాల్లో వాళ్ళది ఒక ఆదర్శ కుటుంబంగా భావిస్తారు అందరు.. అంతేకాక ఎవరికీ ఎలాంటి సాయం అవసరం వచ్చినా భార్యాభర్తలు ఇద్దరూ సహాయానికి ముందుంటారు. అందుకే అందరికి వాళ్ళంటే గౌరవం.

అలాంటిది జానకి ఉన్నట్టుండి కనిపించక పోవడంతో ఏం జరిగిందో అర్ధం కాక మతి పోయినట్టు అయింది శారదకి.

ఈ విషయం ఇంకా చుట్టు పక్కల ఉన్న మిగతా కుటుంబాల వాళ్లకి తెలియదు.. వాళ్ళేవారికీ తెలియక ముందే జానకి వచ్చేస్తే బాగుండు అనుకుంది. ఆనందం, అన్యోన్యత, ప్రేమానురాగాలు వీటికి కేరాఫ్ అడ్రస్ గా ఉన్న ఆ కుటుంబంలోని  ఇల్లాలు చెప్పా చేయకుండా ఇల్లు వదిలి వెళ్ళింది  అనే వాస్తవం జీర్ణించు కోవడం అసాధ్యం అయింది శారదకి.

ఇల్లు వదిలి వెళ్ళవలసిన అగత్యం ఏముంది జానక్కి ఖచ్చితంగా ఏదో ప్రమాదం జరిగింది… ఆవిడ దగ్గర మొబైల్ ఫోన్ కూడా లేదు.. అయినా ఎప్పుడూ బయటికి వెళ్ళాలంటే తనని సాయం అడిగే జానకి ఒక్కతే ఎందుకు వెళ్ళింది? ఎక్కడికి వెళ్ళింది?

ఆలోచనలతో మెదడు పనిచేయడం మానేసింది.. కానీ పిల్లలిద్దరిని చూస్తుంటే గుండె తరుక్కుపోయింది. అందుకే తనని తాను నిగ్రహించుకుని పిల్లల సంగతి చూడడానికి నిశ్చయించుకుంది.

ఆందోళన బయటికి కనిపించనియకుండా హరిని, చరితని కాలేజికి తయారు కండి అంది.

'నేను వెళ్ళను .... వెళ్ళను  అమ్మ వచ్చేదాకా కాలేజికి వెళ్ళను' అని ఏడవసాగింది చరిత.

'ఎక్కడికి వెళ్తుంది అమ్మ. తనే వస్తుంది నువ్వు కాలేజికి వెళ్ళకుండా తనకోసం ఎదురు చూస్తున్నావని తెలిసిందంటే కోప్పడుతుంది వెళ్ళమ్మా  నువ్వు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అమ్మ ఇంట్లో ఉంటుంది' అని నచ్చచెప్పింది శారద.

హరికి కూడా వెళ్లాలని లేకపోయినా వయసులో చరితకన్నా పెద్దవాడు, సహజంగానే కొంచెం సహనం, సంయమనం ఉన్నవాడు కావడంతో చెల్లెలికి తనూ నచ్చచెప్పాడు..

'నాన్న పోలీస్ రిపోర్ట్ ఇవ్వడానికి వెళ్ళారుగా చెర్రి మనం కాలేజ్ నుంచి వచ్చేసరికి అమ్మ వచ్చేస్తుంది. వెడదాం పద నిన్ను కాలేజ్ దగ్గర దింపి నేను వెళ్తాను' అన్నాడు.

చరిత సమాధానం చెప్పకుండా ఏడుస్తూ కూర్చుంది.

'నువ్వు తయారై వెళ్ళు హరీ దూరం వెళ్ళాలిగా చరితను వంశీ దింపేస్తాడులే' అంది శారద.

హరి శారద పెట్టిన ఇడ్లి తినేసి వెళ్ళిపోయాడు.

శారద దంపుతులకి ఒక్కడే కొడుకు వంశీ.

కంప్యూటర్స్ అండ్  ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ పూర్తీ చేసి చందన బ్రదర్స్ దగ్గర ఒక చిన్న షాపు లీజ్ కి తీసుకుని మొబైల్స్ షాపు పెట్టుకున్నాడు..

జనార్ధన్ కి కొడుకు ఇంజనీరింగ్ చేసి అమెరికాకో ఆస్ట్రేలియాకో వెళ్ళకుండా అలా షాపు పెట్టడం ఇష్టం లేదు కాని అక్కడికి వెళ్లి ఇబ్బంది పడుతూ అమ్మ, నాన్నని, బంధువులని మిస్ అవడం వంశీ కి ఇష్టం లేదు. అంతేకాక అతనికి దేవుడన్నా, గుడులు గోపురాలు తిరగడం అన్నా పిచ్చి. విపరీతంగా దేవుడిని అందులోనూ బాబాని నమ్ముతాడు. అందుకే  అతను ఎనిమిదిన్నరకల్లా ఇంట్లోనుంచి బయలు దేరి ముందు బాబా గుడికి వెళ్లి తరవాత షాపు తీస్తాడు.

చరితకి బలవంతంగా ఇడ్లి పెట్టి, టిఫిన్ కారేజ్ ఇచ్చి జాగ్రత్తగా కాలేజి దగ్గర దింపమని కొడుకుతో బండి మీద పంపించింది శారద.

ఎలాగోలా కాలేజికి పంపించగలిగింది కానీ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చి కలతబారిన మనసుతో హృదయం ఆక్రోశిస్తుంటే కాఫీ కూడా తాగకుండా ఇంట్లో కూర్చున్న భాస్కర్ ని ఓదార్చడం ఆవిడ వల్ల కాలేదు. జనార్ధన్ తో ఇడ్లీ పంపించింది. కాని ఎంత బతిమాలినా తినలేదు భాస్కర్. చేసేది లేక ఆఫీస్ టైం అయిపోడంతో జనార్ధన్ తనకి తోచిన ఓదార్పు మాటలు చెప్పి ఆఫీస్ కి వెళ్ళిపోయాడు.

శారద బాధపడడం తప్ప ఏమి చేయలేకపోయింది.

వంశీ చరితని జాగ్రత్తగా కాలేజి గేటు దగ్గర దింపి 'మరోసారి అమ్మ ఎక్కడికి వెళ్ళదు వస్తుంది నువ్వు అనవసరంగా టెన్షన్ పడకు' అని చెప్పి వెళ్ళాడు.

చరిత కాలేజి ఆవరణలో అడుగు పెట్టేసరికి ఎనిమిది నలభై ఐదు అయింది.

తొమ్మిది దాటి ఐదు నిమిషాలు అయిందంటే చాలు వాచమాన్ గేటు వేసేస్తాడు.. చాలా స్ట్రిక్ట రూల్స్ .

అప్పటికే చాలామంది అమ్మాయిలు వచ్చేశారు. ఆ కాలేజ్ లో ఇంటర్ వరకు కో ఎడ్యుకేషన్. డిగ్రి కేవలం ఆడపిల్లలే. కాకపోతే ఆడపిల్లల స్ట్రెంగ్త్ కన్నా మగపిల్లలు తక్కువ. అందరూ గ్రూపులు, గ్రూపులుగా క్లాస్ లవైపు వెళ్తున్నారు.

వాళ్ళందరిని చూస్తుంటే చరితకు ఏడుపు, బాధ తన్నుకు రాసాగాయి.

అందరూ తనవైపు జాలిగా చూస్తూ 'మీ అమ్మ ఎక్కడికో వెళ్ళిపోయిందిటగా , ఎవరో ఎత్తుకుపోయారటగా ... పాపం ... ఏదన్నా యాక్సిడెంట్ అయి చచ్చిపోయిందేమో , లారీ గుద్దేసిందేమో' అంటున్నట్టుగా చెవుల్లో ప్రతిధ్వనించ సాగింది.

కాళ్ళల్లో వణుకు, గొంతు తడారిపోయినట్టు అయింది. అడుగులు ముందుకు సాగడంలేదు. కాళ్ళల్లో శక్తి సన్నగిల్లిపోయినట్టు అయి ఉన్నట్టుండి కళ్ళు తేలిపోతూ. పరిసరాలన్నీ గిర్రున తిరుగుతున్నట్టు అయి తూలి పడబోయింది.

'ఏయ్ చరితా ! ఏమైంది... అయ్యో హారికా చెర్రి పడిపోతోంది..' అప్పటికే చరితను గమనించిన ఆమె క్లాస్ మేట్ నిషా గట్టిగా అరుస్తూ పరుగున వచ్చి పడిపోతున్న చరితను పట్టుకుంది.

ఆమె వెనుకే మరో ముగ్గురు అమ్మాయిలు కూడా పరిగెత్తుకుంటూ వచ్చి నిషాకి సాయం చేశారు. కళ్ళు తిరిగిపోతుంటే తనని నలుగురు కలిసి పట్టుకుని ఎటో తీసుకువెళ్తున్నట్టు మాత్రం అర్ధం అయిన చరిత కళ్ళు తేలేసింది.

'అయ్యో తను అన్ కాన్షస్ అయింది..' హారిక గాభరాగా అంది.

'క్లాస్ కి తీసుకుని వెళ్దాం' అంది నిషా.

అవంతి మాత్రం బెదిరిపోయిన దానిలా గుడ్లప్పగించి చరితనే చూస్తూ వాళ్ళ వెనకాల నడవసాగింది.

నలుగురు కలిసి దాదాపు చరితను వాళ్ళ భుజాల మీద మోస్తున్నాట్టుగా తిసుకువెళ్తుంటే మిగతా వాళ్ళంతా విచిత్రంగా చూస్తూ, వాళ్ళల్లో వాళ్ళే ఏదో మాట్లాడుకుంటూ కొందరు, కొందరు వాళ్ళ దగ్గరకి వచ్చి 'ఏమైంది?' అని అడుగుతూ ఉంటే తెలియదు.. 'షి మే బి సిక్' అని చెబుతూ క్లాస్ రూమ్ కి తీసుకువచ్చారు.

ముందు వరసలో కూర్చున్న అమ్మాయిలను లేపి బెంచి మీద పడుకోబెట్టారు.

అందరూ 'ఏమైంది, ఏమైంది?' అని అడుగుతూ ఖంగారుగా చరితను చూడసాగారు.. ఇద్దరమ్మాయిలు పరిగెత్తుకుంటూ వెళ్లి స్టాఫ్ రూమ్ లో ఉన్న ఇంగ్లిష్ లెక్చరర్ మాధవిని పిలుచుకు వచ్చారు.

అప్పటికే కొంచెం వణుకు తగ్గి కళ్ళు తెరిచిన చరిత తను క్లాసు రూమ్ లో ఒక బెంచి మీద పడుకుని ఉండడం, తన చుట్టూ క్లాస్ మేట్స్ అందరూ ఆదుర్దాగా చూస్తూ ఉండడం చూసి లేవబోయింది.

హారిక 'లేవకు, లేవకు' అని అరిచింది.

నిషా గబాల్న ముందుకు వంగి 'ఏమైంది చెర్రీ... నీకు ఫీవర్ వచ్చిందా ...?' అని అడిగింది.

చరిత లేదు అని తలాడిస్తూ లేచి కూర్చుంది.

అప్పుడే మాధవి ప్రవేశించి హడావుడిగా 'గర్ల్స్ వాట్ హేపెండ్?' అని అడిగింది.

'తెలియదు మేడం ... కాలేజికి ఎంటర్ అవుతూనే పడిపోయింది' అంది నిషా.

ఆవిడ వాళ్ళని 'జరగండి' అంటూ చరిత దగ్గరకి నడిచింది.

నలుగురూ పక్కకి తప్పుకుని ఆవిడకి చరితవైపు దారి ఇచ్చారు.

మాధవి చరిత దగ్గరకు వచ్చి చేయి అందుకుని చూస్తూ' టెంపరేచర్ లేదే ... ఏమైంది? బ్రేక్ ఫాస్ట్ చేయలేదా?' అంది.

ఆ హడావుడి, వాళ్ళందరి ఆదుర్దా, వాళ్ళ ప్రేమ చూడగానే చరితకి దుఃఖం ఎగదన్నుకుంటూ వచ్చింది. కుండ భళ్ళున బద్దలైనట్టు , ఒక్కసారిగా వెక్కి, వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

అందరూ తెల్లబోయారు.

ఆ ఏడుపుకి నిషా, ప్రణిత, హారికలు బిక్కమొహాలు వేసారు..

అవంతి చేష్టలుదిగినట్టు బిగుసుకుపోయి నిలబడిపోయింది.

చరిత ఎందుకు ఏడుస్తోందో తెలియకపోయినా అప్రయత్నంగా అందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మాధవి నివ్వెరపోయింది.

ఊహించని ఆ పరిస్థితి చూస్తుంటే ఏం చేయాలో అర్థం కాలేదు. స్నేహితురాలి కన్నీటికి కారణం తెలియకపోయినా తామూ కన్నీరు పెడుతున్న ఆ ఆడపిల్లలని చూసి ఆడపిల్లలు ఎంత సున్నితం! అనుకుంది.

చరిత పక్కన కూర్చుని ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుని 'ఏమైంది చరితా? ఇంట్లో అమ్మ కానీ, డాడి కాని తిట్టారా? ఎందుకేడుస్తున్నావు? చెప్పమ్మా ...' జుత్తు సవరిస్తూ ఆప్యాయంగా అడిగింది.

చరిత పన్నెండు గంటల నుంచి గుండెల్లో మౌనంగా దాచుకున్న భయం, దిగులు ఒక్కసారి వెల్లువై ప్రవహించాయి. వెక్కిళ్ళు పెడుతూ అంది 'అమ్మ , మా అమ్మ ఇంటికి రాలేదు మేడం ...'

మాధవి అయోమయంగా చూస్తూ అంది 'మీ అమ్మ ఇంటికి రాకపోడం ఏంటి? ఎక్కడికి వెళ్ళారు? ఇంట్లో లేరా?'

అడ్డంగా తల ఊపుతూ అంది చరిత 'లేదు .. నిన్న ఈవినింగ్ ఏదో పని ఉంది టూ అవర్స్ లో వస్తాను అని మేమంతా ఇంటికి వెళ్లేసరికి లెటర్ రాసి పెట్టి వెళ్ళింది. కాని టూ అవర్స్ కాదు కదా అసలు రాలేదు. నాకు భయంగా ఉంది మేడం. మా అమ్మకి యాక్సిడెంట్ అయిందేమో. లేకుంటే ఎవరన్నా కిడ్నాప్ చేశారేమో అని భయం వేస్తోంది.'

మాధవి నిశ్చేష్టురాలైంది.. పిల్లలంతా గట్టిగా అరిచారు 'అమ్మో ఆంటిని కిడ్నాప్ చేసారా? ... మేడం ... మాకు భయం వేస్తోంది' అంటూ.

అవంతి భయంగా వచ్చి మాధవిని గట్టిగా పట్టుకుంది.

మాధవికి ఆ అమ్మాయిల అరుపులు, ఏడుపులు చూస్తుంటే మతిపోయినట్టు అయింది.

తనని గట్టిగా పట్టుకుని నిలువెల్లా వణికిపోతున్న అవంతి వైపు ఆశ్చర్యంగా చూస్తూ 'అవంతీ! రిలాక్స్ ... ఏమైందని అంత భయపడుతున్నావు?' అంది వీపు మీద రాస్తూ.

అవంతి మాట్లాడలేదు. అలాగే వణికిపోతూ నిలబడింది.

అవంతి పక్కన కూర్చునే ఆర్తి అవంతి ప్రతి దానికి అలా భయపడడం రోజూ చూడడం వల్ల ఆ అమ్మాయిని మాధవి దగ్గరినుంచి భుజం పట్టుకుని నడిపిస్తూ వెనక బెంచి వైపు వెళ్లి కూర్చోబెట్టింది.

తను కూడా ఆమె పక్కన కూర్చుని ఆ పిల్ల చేయి అందుకుని నిమురుతూ ' టెన్షన్ పడకు. ఏమి కాదు' అంది.

మాధవి తేరుకుని వాళ్ళందరిని ఓదారుస్తూ 'మీరలా భయపడకూడదు.. ఆంటీకి ఏమి కాదు. ఆవిడ పెద్దావిడ కదా. ఎవరన్నా ఫ్రెండ్స్ ఇంట్లో ఆగిపోయి ఉంటారు. ఫోన్ అవైలబిలిటి లేక కాల్ చేసి ఉండరు. తప్పకుండా వచ్చేస్తారు. మీరు భయపడి చరితను ఇంకా భయపెట్ట కూడదు. పదండి అందరం ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్లి చెప్దాం. ఆవిడ కూడా ఏదన్నా సలహా ఇస్తారు. రా చరితా!' మాధవి చరిత భుజాలు పట్టుకుని లేవదీసింది.

వెక్కుతూనే చరిత ఆవిడ వెంట నడుస్తుంటే స్నేహితురాలి ఏడుపు చూడలేని అమ్మాయిలంతా 'పాపం చరిత' అనుకుంటూ అలాగే కూలబడి పోయారు.

నిషా, ప్రణిత, హారిక మాధవికి సాయంగా  చరిత చేయి పట్టుకుని ఒకళ్ళు, భుజాల మిద చేతులు వేసి ఇద్దరు ఆవిడని అనుసరించారు.

ప్రిన్సిపాల్ రూమ్ లోకి వెళ్లేసరికి ఆవిడ అప్పుడే వచ్చినట్టుంది హ్యాండ్ బాగ్ లోంచి దువ్వెన, అద్దం తీసి చెరిగిన జుట్టు దువ్వుకుంటోంది. మాధవి వెనకాల వస్తున్న వాళ్ళందరిని ఆశ్చర్యంగా చూస్తూ 'వాట్స్ ద మేటర్?' అంది.

మాధవి చరిత కళ్ళు తిరిగి పడిపోవడం, పిల్లలు నలుగురూ చరితను దాదాపు భుజాల మీద మోస్తూ క్లాస్ రూమ్ లోకి తీసుకురావడం, ఇద్దరమ్మాయిలు  కంగారుగా తన దగ్గరకు వచ్చి చరిత పరిస్థితి చెప్పడం, చరిత ఏడుపు, తన ఓదార్పు, చరిత తల్లి కనిపించడం లేదని చెప్పడం మొత్తం చెప్పింది ఆవిడకి.

ఆవిడ ఆశ్చర్యంగా అంది 'అరె ... ఎలా జరిగింది? పోలిస్ రిపోర్ట్ ఇచ్చారా?'

మాధవి చరిత వైపు చూసింది.

చరిత తల ఊపుతూ 'డాడి, మా పక్కింటి అంకుల్ వెళ్ళారు. ఇచ్చే ఉంటారు.'

'మంచిపని చేసారు. రిపోర్ట్ ఇస్తే వాళ్ళే ఎంక్వైరీ చేస్తారు. ఏదన్నా జరిగితే కూడా తెలిసిపోతుంది. మీ అమ్మగారి దగ్గర జువలరి ఉందా?' అడిగింది ఆవిడ.

'లేదు మేడం. అమ్మ ఏమి వేసుకోదు. ఓన్లి మంగళసూత్రం గొలుసు, నల్లపూసల గొలుసు ఉంటుంది ఆవిడ మెడలో.'

'అలాగా..' ఆవిడ సాలోచనగా అని కొంచెం సేపు ఏదో ఆలోచిస్తూ అంది  'ఏంటో మాధవీ.. సొసైటి దారుణంగా మారిపోయింది. వయసు, వావి తారతమ్యాలు ఉండడం లేదు. సొసైటీలో క్రిమినల్స్ పెరిగిపోయారు. పాపం. ఆవిడని ఎవరూ ఏమి చేయకుండా ఉంటె బాగుండు' అంది నిట్టూరుస్తూ.

చరిత ఆవిడవైపు కళ్ళు పెద్దవి చేసి చూసింది..

మాధవికి చిరాకేసింది. ఈవిడకి పిల్లల ముందు ఏం మాట్లాడాలో కూడా తెలియదు అని మనసులో విసుక్కుంటూ మాట మారుస్తూ, ' ఏం కాదు చరితా అనవసరంగా టెన్షన్ పడకు. పదండి క్లాసులు మొదలైపోయాయి. సిలబస్ మిస్ అవుతారు. కమాన్ గర్ల్స్' అంటూ వాళ్ళందరిని ఒకవిధంగా బలవంతంగా తీసుకు వెళ్ళింది.

❦❦❦

**మలక్ పేట** యశోదా హాస్పిటల్ వెనక వైపు అపార్ట్ మెంట్ లో సెకండ్ ఫ్లోర్ లో అవంతి ఫ్లాట్.

తండ్రి బాంక్ మేనేజర్ గా చేస్తున్నాడు. అవంతి, సిద్ధార్ధ ఇద్దరు  పిల్లలు. సిద్ధార్ధకి  చిన్నప్పటినుంచి చదువు మీద శ్రద్ధ తక్కువ ... ఇతర విషయాల మీద ఆసక్తి ఎక్కువ. చెల్లెలు ఇంటర్ కి వచ్చినా అతను ఇంకా డిగ్రీ లోనే ఉన్నాడు.

సుధాకర్, జాహ్నవి ఒకే కాలేజ్ లో కలిసి చదువుకున్నారు. అప్పుడే ఇద్దరి మధ్యా ప్రేమ చిగురించింది. పార్క్ లు, సినిమా హాళ్ళు తిరగక పోయినా కాలేజ్ లోనే ఏ మాత్రం సమయం దొరికినా కబుర్లు చెప్పేసుకుంటూ ప్రేమించేసుకున్నారు.

డిగ్రీ సెకండ్ ఇయర్ లో మొదలైన ప్రేమ డిగ్రీ ఫైనల్ ఇయర్ వచ్చేసరికి పెళ్ళికి దారి తీసింది. ఒకే కులం, పైగా ఇరు  వైపులా పెద్దలకి దూరపు చుట్టరికం కూడా కలవడంతో వాళ్ళ పెళ్లి పెద్దగా అభ్యంతరాలు లేకుండానే నిర్ణయించేశారు. ఫైనల్ ఇయర్ పరిక్షలు అవగానే పెళ్లి అయిపొయింది.

అయితే చూడడానికి నాజూగ్గా, దంతం బొమ్మలా ఉండే జాహ్నవిది ఎంత క్రూరమైన మనస్తత్వమో మూడు నిద్రల లోనే తెలిసిపోయింది సుధాకర్ కి.  తెలిసాక విస్తుపోయాడు. అమ్మో ఇంత రాక్షసా జాహ్నవి అనుకున్నాడు. సుధాకర్ ది మెత్తటి మనసు. గట్టిగా

మాట్లాడడం కూడా రాదు. అలాంటిది భార్యగా మారాక జాహ్నవి విశ్వరూపం చూసి మతి పోయింది. ఆమె గొంతు, మాటల్లో కరకుదనం, స్వభావంలో అనుమానం, తన మాటే నెగ్గాలన్న పంతం ...

తనతో పాటు కాంపిటిటివ్ ఎగ్జామ్స్ రాయమని చెప్పాడు సుధాకర్.. ఇద్దరూ డిగ్రీలతో పెళ్లి చేసుకోడంతో కాంపిటిటివ్ ఎగ్జామ్స్ రాస్తే గవర్నమెంట్ ఉద్యోగాలు వస్తాయి..సుఖంగా ఉండచ్చు అని , ఇద్దరూ ఉద్యోగాలు చేస్తేగాని గడవదని అటు తండ్రి, ఇటు భర్త ఎంతగా చెప్పినా ససేమిరా అంది జాహ్నవి. తను ఉద్యోగం చేయడం అసంభవం అని తెగేసి చెప్పింది.

భర్త అంటే భరించేవాడు.. కాబట్టి సుధాకర్ కష్టపడాలి, ఉద్యోగం చేయాలి తనని పోషించాలి అని నిక్కచ్చిగా చెప్పింది.

సుధాకర్ ఎంతగా నచ్చ చెప్పినా వినకుండా పెళ్ళి కాగానే సర్టిఫికేట్ లు అన్నీ అటక ఎక్కించి గృహిణిగా సెటిల్ అయింది.

అంతే కాదు.. జాహ్నవి చాలా పోసేస్సివ్. భర్త పొరపాటున వేరే అమ్మాయివైపు రెండోసారి చూస్తే కూడా భరించలేదు. భర్త తను చెప్పినట్టు వినాలి.. తన మాట జవదాటి కూడదు. తల్లి, తండ్రులను కూడా తను పర్మిషన్ ఇచ్చినపుడే వెళ్లి చూడాలి. వాళ్ళు కూడా అస్తమానం కొడుకే కదా అని ఇంటి మీదకి వచ్చేసి నెలల తరబడి ఉండకూడదు. ఇలాంటి అనేక నిబంధనలు పెళ్లి అయిన వారానికే పాస్ చేసింది.

చదువుకున్న అమ్మాయి, అందమైనది , చురుకైనది అని ఇష్టపడి చేసుకున్న జాహ్నవి మనస్తత్వం కొద్ది కాలానికే ఆకళింపు చేసుకున్న సుధాకర్ చిరాకు పడ్డాడు . కొత్తల్లో " ఇది టూ మచ్ జాహ్నవి ... నేను నీ భర్తనా, నీ సర్వెంట్ నా ... ఏమనుకుంటున్నావు ... నా తల్లి, తండ్రులను చూడడానికి నాకు నీ పర్మిషన్ ఏంటి" అని ఎదురు తిరిగాడు. అయితే అప్పుడు జాహ్నవి ప్రవర్తించిన విధానంతో అతనికి మతి పోయింది.

"నా మాట కాదని నువ్వేం చేసినా ఈ విషం తాగేస్తాను" అంటూ చేత్తో విషం బాటిల్ పట్టుకుని బెదిరించడం కాక గృహ హింస కేసు పెడతాను అంటూ ఆ చట్టాన్ని ఒక ఆయుధంగా మలచుకుని భర్త మీద ఆదిపత్యం తీసుకుంది. ఆమె విపరీతమైన మనస్తత్వంతో కొంతకాలానికే ఆ భార్యాభర్తల మధ్య పెద్ద గ్యాప్ ఏర్పడి పోయింది.

ఇద్దరు పిల్లలు పుట్టినా ఆ గ్యాప్ పోకపోగా రాను, రాను ఎక్కువ అవుతూ ఇంట్లో ఒక అనారోగ్యకరమైన వాతావరణం ఏర్పడి పోయింది. పిల్లల ముందే వాళ్ళ మధ్య పెద్ద, పెద్ద గొడవలు అవడం సర్వ సాధారణం అయింది. ఆ పరిస్థితిని సిద్దార్ధ అవకాశంగా తీసుకుని చిన్నప్పటినుంచి మొండిగా, మూర్ఖంగా ప్రవర్తించడం, తల్లి, తండ్రులను నిర్లక్ష్యం చేయడం, వాళ్లమాట వినకపోవడం చూసి తల్లి పోలికే వీడికి ... ఆవిడని వంచడానికి పుట్టాడు.. కానీ కాలం ఏం నిర్ణయిస్తుందో అని ఊరుకున్నాడు సుధాకర్.

జాహ్నవి వాడి మొండితనానికి అలవాటు పడిపోయింది. ఫలితంగా సిద్ధార్ధ ఆడింది ఆట, పాడింది పాటగా అయింది.

సిద్ధార్ధకి ఐదేళ్ళు వచ్చాక అవంతి పుట్టింది. ఇంట్లో వాతావరణం సిధ్ధార్ధని పెంకేగా, మొండివాడుగా మారిస్తే అవంతిని భయస్తురాలిగా మార్చింది. ప్రతి చిన్న విషయానికి బెదిరిపోయి ఏడ్చేయడం , నలుగురిలో కలవడానికి భయపడడం, తల్లి కళ్ళెర్ర చేయగానే వెక్కి, వెక్కి ఏడవడం అంతేకాక పదేళ్ళు వచ్చిందాకా నిద్రలో భయపడి లేచి పక్క తడిపేస్తూ ఉండేది.

అదిచూసి తెల్లవారాక జాహ్నవి ఎడాపెడా కొట్టి "పో నీ బట్టలు నువ్వే ఉతుక్కో" అంటూ ఆ చిన్న పిల్ల చేత దుప్పట్లు ఉతికించేది.

జాహ్నవి చదువుకోవాలి కాబట్టి చదువుకుంది.. ఆమెకి చదువుతో రావాల్సిన సంస్కారం, సభ్యత అనేవి మచ్చుకు కూడా లేవు. తనకి నచ్చని పని ఎవరు చేసినా ఆమె సహించలేదు.. పిల్లలు, భర్త , తల్లి, తండ్రి, అత్తగారు, మావగారు ఎవరైనా సరే ... ఆమెకి వరసలతో పనిలేదు. నోటికి ఎంత వస్తే అంత నిర్మొహమాటంగా అనేస్తుంది. ఆమె నోటికి జడిసి ఆ ఇంటికి రావడం మానేశారు అందరు.. అందుకే పెద్దగా బంధువులు అంటూ వచ్చి, పోయే ఇల్లు కాదు.

సుధాకర్ స్నేహితులు కూడా ఎవరూ రారు.. ఎవరితో మాట్లాడినా అన్ని బయటే. కొంతకాలం ఆమెలో మార్పు కోసం ఎదురు చూసిన సుధాకర్ తన జీవితంలో కోల్పోయిన ప్రేమానురాగాలు బయట వెతుక్కోడం మొదలు పెట్టాడు. తనకి స్నేహాలు ఉన్నా, లేకున్నా ఆమె పెట్టె టార్చర్ భరించడం అలవాటు అయింది కాబట్టి ఉంటె తప్పేంటి అనేది అతని ఫిలాసఫీ. రాత్రిళ్ళు ఆలస్యంగా ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడడం చాలా మాములు అయిపొయింది.

ఈ పరిస్థితుల్లో అవంతి మానసికంగా కాని, శారీరకంగా కాని వయసుతోపాటు గా ఎదగలేదు. పీలగా ఉంటుంది. పొట్టిగా, సన్నగా, రెండు జడలు పైకి కట్టుకుని స్కూలు పిల్ల లాగే వస్తుంది కాలేజ్ కి.

జీన్స్ పాంట్లు, టి షర్ట్ లు, వదిలేసిన జుట్టు, అత్యంత ఆధునికంగా తయారై వచ్చే అమ్మాయిల్లో అవంతి ఒక్కతే విభిన్నంగా ఉండడంతో తక్కిన వాళ్ళు ఆమెని ఒక జోకర్ లాగా చూడడం కాక ఆమెని ఏడిపిస్తూ ఉండేవాళ్ళు.

ఈ పరిస్థితుల్లో ఆమె ఎవరితో మాట్లాడకుండా వెనక బెంచిలో వంటరిగా కూర్చోడం అలవాటు చేసుకుంది. దీంతో ఆమెకి ఎక్కువ స్నేహితులు లేరు. ఒక్క చరిత మాత్రమె ప్రేమగా మాట్లాడుతుంది. చరిత మాట్లాడుతుంది కాబట్టి మిగతా వాళ్ళు అంతో, ఇంతో మాట్లాడతారు. అందుకే చరిత అంటే అవంతికి చాలా ఇష్టం.

తనకి ఎంతో ఇష్టమైన చరిత ఆరోజు కాలేజ్ లో పడిపోడం, వాళ్ళ అమ్మ ఎక్కడికో వెళ్లి పోవడం ఆ అమ్మాయిని బాగా కలవర పరచింది.

కాలేజ్ లో ఆ రోజు ఒక్క పాఠం కూడా ఆమె బుర్రలోకి ఎక్కలేదు. మధ్యాహ్నం నుంచి చరితని మేడం ఇంటికి పంపేయడంతో అవంతికి తోచలేదు. హారికను పదే, పదే అడుగుతూనే ఉంది చరిత ఎలా ఉందో ఏమో ... వాళ్ళమ్మగారు వచ్చి ఉంటారా అని.. హారిక విసుక్కుని వేరే దగ్గరకు వెళ్లి కూర్చుంది.

అలాగే సాయంత్రం అవడం కాలేజ్ లోంచి బయటకు రావడం జరిగింది. బస్ స్టాప్ కి వెళ్లి రోజూలాగే బస్ లో ఇంటికి వచ్చింది. ఎట్టి పరిస్థితిలోనూ ఆటోలో రాకూడదు అది జాహ్నవి పెట్టిన రూలు. డబ్బులు ఖర్చు పెట్టకూడదు.. జాగ్రత్తగా ఉండాలి. డబ్బులు దాచి బంగారం మాత్రం కొంటుంది జాహ్నవి. సరిగ్గా బస్ చార్జీలు మాత్రమే ఉంటాయి అవంతి పర్స్ లో.

కాలేజ్ నుంచి అన్యమనస్కంగా ఇంటికి వచ్చిన అవంతి బట్టలు మార్చుకోకుండా సోఫాలో కూర్చోడం చూసి గయ్ మంది జాహ్నవి.

"ఏం వచ్చింది... ఎప్పుడు చూసినా మన్ను తిన్న పాములా ఉంటావు.. లేచి బట్టలు మార్చుకుని కాళ్ళు, చేతులూ కడుక్కొని తగలడు.."

అవంతికి తల్లి అలా కసురుకునేసరికి ఏడుపు వచ్చింది. అసలే చరిత పర్తిస్తితికి దిగులుగా ఉందేమో ఆవిడ ధుమ, ధుమలకి వణికిపోతూ బావురుమంది.

"ఎందుకే ఏడుస్తావు.. దరిద్రపు మొహం నువ్వూను .... అన్నీ అయ్య పోలికలే ఏ కోశానా నవ్వు ఉండదు ఆ మొహంలో ..." అరిచింది జాహ్నవి.

అవంతికి తల్లి కసురుకుంటున్నా కొద్ది ఏడుపు ఉధృతం కాసాగింది.

"ఆపుతావా ..." చెంప పగలకొట్టమంటావా అరిచింది జాహ్నవి.

"అ ... అ మ్మా .... మరి, మరి ... నా ఫ్రెండ్ చరిత వాళ్ళ అమ్మ కనిపించడం లేదు ... పాపం అది ఏడుస్తోంది ..."

"ఏంటి? మొహం చిట్లించింది జాహ్నవి .. మీ ఫ్రెండ్ వాళ్ళ అమ్మ కనిపించడం లేదా"!

"అవును పాపం ఎక్కడికో వెళ్ళారు.. ఆవిడని ఎవరో కిడ్నాప్ చేసారు.."

కూతురు మొహంలోకి తదేకంగా చూస్తూ వింటోన్న జాహ్నవి ఉన్నట్టుండి పగలబడి నవ్వసాగింది. తల్లి అలా నవ్వడంతో అవంతికి ఏమి అర్ధం కాలేదు.. తెల్లబోయి చూడసాగింది.

ఆవిడ నవ్వి, నవ్వి అంది " యాభై ఏళ్ళు వస్తున్నావిడని ఎవరో కిడ్ నాప్ చేసారా.. మంచి కధలే చెప్పింది నీకు నీ ఫ్రెండ్ ... ఇంకా నయం ... నాతో అన్నావు సరిపోయింది.. ఎవడితో లేచిపోయిందో! ఆవిడకి సిగ్గు లేదు.. పిల్లలిని వదిలి ఈ వయసులో ఎవడితోటో లేచిపోతే నీ ఫ్రెండ్ అదో పెద్ద వార్త లాగా మీ అందరికి చాటింపు వేసిందనమాట. అయినా ఈ వెధవ కబుర్లు చెప్పుకోదానికా మీరు స్కూల్ కి వెళ్ళేది.. పని, పాటా లేని పిల్ల ఏదో చెబితే అది విని నువ్వు ఏడుపు మొహం వేసుకుని వచ్చావనమాట ... చాలు చెప్పింది, విన్నది.. నోరు మూసుకుని బట్టలు మార్చుకుని హోం వర్క్ చేసుకో ..."

ఆ మాటలు, ఆ స్వరంలోని కరుకుదనం అవంతి మనసుని కోసినట్టు అనిపించింది. అమ్మ అర్ధం చేసుకోదేం ... తప్పు కదా అమ్మ ఇట్లా మాట్లాడకూడదు.. ఆంటి చాలా మంచిది. అసలు పెద్ద వాళ్ళు లేచి పోతారా... తను పదో తరగతిలో ఉన్నప్పుడు ఒకమ్మాయి ఒక అబ్బాయితో లేచిపోయింది. కానీ ఆంటి .. ఛీ ... ఆవిడ ఎంతో మంచిది. చరిత అస్తమానం చెబుతూ ఉంటుంది మా అమ్మ చాలా మంచిది అని.

తను మాత్రం ఎప్పుడూ చెప్పుకోలేక పోయింది మా అమ్మ మంచిది అని. చెప్పాలనుకుంది కాని ఎప్పుడూ గొంతుకి ఏదో అడ్డం పడ్డట్టు అయి చెప్పలేకపోయేది. అవును ఎలా చెబుతుంది... అమ్మ మంచిది కాదు.. చాలా చెడ్డది.. ఏనాడన్నా తనతో ప్రేమగా మాట్లాడిందా ... దగ్గరకు తీసుకుందా .. తనతో కాని, నాన్నతో కాని, ఒక్క అన్నయ్యతోటే కాస్త మెత్తగా మాట్లాడుతుంది. అది కూడా ఆవిడ అలా మాట్లాడకపోతే వాడు ఆవిడ కన్నా గట్టిగా మాట్లాడతాడు కాబట్టి.

"ఏంటే అట్లా దిష్టి బొమ్మలా నిలబడ్డావు వెళ్ళు.." ఆవిడ మరోసారి కసరడంతో ఉలిక్కిపడి అక్కడినుంచి కదిలింది అవంతి.

జానకి కనిపించకుండా వెళ్లి రెండు రోజులైంది.

పోలీస్ లు ఎక్కడ యాక్సిడెంట్ కేసు వచ్చినా భాస్కర్ కి ఫోన్ చేయడం, భాస్కర్ అదిరే గుండెలతో వెళ్లి చూసి జానకి కాకపోడంతో కొంచెం తేలికగా నిట్టూర్చి నా జానకికి ఏమి కాలేదు అనుకోడం జరుగుతోంది.

జానకి తల్లి, తండ్రి వచ్చాక పిల్లలిద్దరిని వాళ్లకి అప్పగించి కొంత ఊరట పొందాడు.

లేకుంటే హరి కొంచెం గంభీరంగా ఉన్నా చరితను ఒదార్చడం మాత్రం ఎవరి వల్లా కావడం లేదు. ఆ పిల్ల ఒక్కరోజు స్కూల్ కి వెళ్లి మధ్యాహ్నం నుంచి వచ్చేసింది.. మళ్ళీ స్కూల్ కి మొరాయించింది. అమ్మ ఇంటికి వచ్చిందాకా వెళ్ళను అని చెప్పేసింది.

తిండి తినడం మానేసింది. ఆ పిల్లని ఎలా ఓదార్చాలో భాస్కర్ కి అర్ధం కాలేదు. అత్తగారు, మావగారు రాగానే వాళ్ళకి అప్పచెప్పేసాడు.

లీలమ్మ కూతురు హటాత్తుగా కనిపించంకుండా పోయిందన్న వాస్తవం జీర్ణం చేసుకుని, ఎక్కడికి వెళ్తుందిలే అదే వస్తుంది అని మనసుకు నచ్చ చెప్పుకుంటూ , చరితను గుండెల్లో పొదువుకుని ధైర్యం చెప్పడానికి తన వంతు ప్రయత్నం చేయసాగింది.

"అమ్మ ఎక్కడి వెళ్ళదు తల్లి... బహుశా ఎవరన్నా ఫ్రెండ్ కనిపించి వాళ్ళ ఇంటికి తీసుకుని వెళ్లి ఉంటుంది" అంది.

"అలాంటప్పుడు ఫోన్ చేయచ్చుగా" అంది చరిత.

"అమ్మ దగ్గర ఫోన్ లేదుగా."

"వాళ్ళ ఫ్రెండ్ దగ్గర ఉంటుందిగా .."

"ఏమో నెంబర్ మర్చిపోయిందేమో.."

"అమ్మ మర్చిపోదు ... నాకు తెలుసు.. నాన్న తన ఫోన్ నెంబర్ తనే మర్చిపోతాడు.. అమ్మ చెప్పేది."

లీలమ్మకి ఏమని సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

ఆవిడకి మాత్రం ఏం తెలుసు.. హాయిగా, అన్యోన్యంగా సాగిపోతున్న ఈ కుటుంబంలో ఊహించని ఈ తుపాను ఎందుకు సృష్టించావు తండ్రి ... ఈ పిల్లలకి నేను ఏమని సమాధానం చెప్పను..

ఈ వయసులో ఇల్లాంటి విపత్కర పరిస్థితి వచ్చినందుకు కుమిలి, కుమిలి పోతున్న నా భర్తను ఎలా ఓదార్చను!?

అల్లుడు ఆఫీస్ కి వెళ్ళడం లేదు. ప్రతి న్యూస్ పేపర్ ఆఫీస్ లో, టివి చానల్స్ లో జానకి ఫోటోలు ఇచ్చి ప్రకటన ఇప్పించాడు.

ఈ విషయం గాలి దుమారంలా బంధువులు, మిత్రులు, పరిచయస్తులు అందరికి వ్యాపించింది.

తెల్లారి లేచిన దగ్గర నుంచి పొద్దు పోయిందాకా ఎక్కడెక్కడినుంచో ఫోన్ లు వస్తున్నాయి.

ఏంటి జానకి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందా.. అయ్యో... ఎంత పని జరిగింది.. ఏమైంది.. భార్యాభర్తలు గొడవ పడ్డారా ... భాస్కర్ మంచివాడేనే .. జానక్కి ఇల్లు వదిలి వెళ్ళిపోయే అవసరం ఏం వచ్చింది..

అవునా జానకి ఇల్లు వదిలి వెళ్ళిందా.. అయ్యో ..పోలిస్ రిపోర్ట్ ఇచ్చారా !?

ఏంటి జానకీ ఇల్లు వదిలి వెళ్ళిందా!.. ఈ వయసులో ఇదేం మాయరోగం! ఈ మధ్య టి వి సీరియల్స్ చూసి ఆడాళ్ళు మరీ సిగ్గు, ఎగ్గు లేకుండా తయారు అవుతున్నారు.. యాభై ఏళ్ళు వచ్చి ఎవడినన్నా ప్రేమించిందా ఏం ?

ఇలా ఎవరికీ తోచినట్టు వాళ్ళు విమర్శలు, పరామర్శలు.

లీలకి కూతురు ఏమైందో అనే బాధకన్నా ఇలాంటి మాటల తూట్లు చేస్తున్న గాయం ఎక్కువగా బాధ పెట్టసాగింది.

యాంత్రికంగా వండి పెడుతూ, దేవుడితో మొరపెట్టుకుంటూ రోజులు గడపసాగింది.

నెమ్మదిగా చరితకు నచ్చ చెప్పి స్కూల్ కి పంపిస్తోంది.

అందరి మనసుల్లో ఒకటే తృప్తి.

ఇప్పటివరకూ చాలా యాక్సిడెంట్ కేసులు చూసి వచ్చాడు భాస్కర్. కాని జానకికి ఏ ప్రమాదం జరగలేదు.

కాకపోతే ఎక్కడికి వెళ్ళింది అనేది మాత్రం ఇంకా తెలియలేదు..

భాస్కర్ కూడా నెమ్మదిగా మనసు దిటవు చేసుకుని ఆఫీస్ కి వెళ్ళడం మొదలు పెట్టాడు.

కొలీగ్స్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంతో సానుభూతి చూపించారు.

ఒక కొలీగ్ ఒక రహస్యం కనుక్కున్న వాడిలా అన్నాడు. "గురూ ఈ మధ్య డ్రగ్స్ ముఠాలు ఎక్కువై పోయాయి. ఎవరు కనిపిస్తే వాళ్ళకి డ్రగ్స్ అలవాటు చేస్తున్నారుట.. అలా అలవాటు అయిన వాళ్ళని ఎక్కడికో తీసికెళ్ళి వాళ్ళ ముఠాలో కలిపెసుకుంతున్నారట. వయసు, వావి ఏమి పట్టించుకోవడం లేదని విన్నాను .."

భాస్కర్ కి చిరాకేసింది.. మతి ఉండి మాట్లాడుతున్నాడా. జానక్కి ఎవరు డ్రగ్స్ ఇస్తారు. ఇస్తే మాత్రం జానకి తీసుకుంటుందా! పైగా డ్రగ్స్ కి అలవాటు పడిన వాళ్ళు జానకి లా మామూలుగా ఉంటారా. కొంచెం చిరాకు, పరాకుగా ఉంది కాని, మత్తులో మునిగి లేదే జానకి. ఛి నేనేంటి వీడి మాటల ప్రభావంలో పడ్డాను. తల విదిల్చి "అలా జరగదులే" అనేసాడు.

"పద గురూ కొంచెం కాఫీ తాగి వద్దాం ... రిలాక్స్ అవు" అంటూ వినోద్ భాస్కర్ ని కాంటిన్ కి తీసుకెళ్ళాడు.

తెల్లవారుతున్నా సూచనగా పక్షులు కలకల రావాలతో ఆకాశ మార్గంలో పయనం ప్రారంభించాయి. గాలి, కొమ్మలను, రెమ్మలను రాచుకుంటూ  భూపాల రాగం ఆలపిస్తోంది. రంగు, రంగుల పూల మొక్కలతో ఆవరణ అంతా పరిమళ భరితంగా ఉంది..

ముప్పై నుంచి, యాభై ఏళ్ల వయసు ఉన్న ఆడవాళ్ళు ఓ ఇరవై మంది అటు, ఇటూ తిరుగుతూ ఏవో పనులు చేస్తున్నారు. కొందరు మొక్కలకి నీళ్ళు పెడుతున్నారు ట్యూబులతో , కొందరు వాకిలి ఊడ్చి కల్లాపి చల్లి ముగ్గులు పెడుతున్నారు. కొందరు పెరటిలో విరగబూసిన, కూరగాయలు తెంపుతున్నారు.

ఒక  స్త్రీ చామంతి, కనకాంబరం తెంపుతుంటే ,  ఒకావిడ నేల మీద గడ్డిలో రాలిన పారిజాతాలు ఏరి సజ్జలో వేస్తోంది.

ఆ ఆశ్రమ వాతావరణం ప్రశాంతంగా, హాయిగా ఉంది.

ఎవరూ ఒకరితో ఒకరు ఏమి మాట్లాడుకోకుండా ఎవరి పని వాళ్ళు చేస్తున్నారు.

లోపలి నుంచి ఒక ఆజానుబాహుడు విశాలంగా ఉన్న హాల్లోకి వచ్చాడు.

ఆయన వయసు నలభై, నలభై ఐదు ఉండచ్చు. పచ్చటి శరీరం , నలుపు, తెలుపు మిశ్రమంలో గుండెల దాకా పెరిగిన గడ్డం , వత్తుగా పెరిగిన జుట్టు. నుదుట గుండ్రంగా తీర్చి దిద్దిన గంధం, దానిమీద కుంకుమ బొట్టు. కాషాయ పంచె కట్టుకుని, ఒక కాషాయ వస్త్రం భుజాల మీద కప్పుకున్నాడు.

అప్పటికే అక్కడ సిద్ధంగా ఉంచిన సింహాసనం లాంటి కుర్చీలో ఆశీనుడయాడు.

అతనిని అనుసరించి వచ్చిన ఇద్దరు శిష్యులు పూజకి అన్ని సిద్ధంగా పెట్టారు.

ఒక పెద్ద దుర్గామాత విగ్రహం, పసుపు, కుంకుమ, గంధం, విభూతి, అక్షితలు, అరటిపళ్ళు  వెండి చెంబులో నీళ్ళు ... ఉద్ధరిణ, ఇంకా చాలా వస్తువులు ఉన్నాయి.

పారిజాత పూలు, చేమంతి పూలు నిండిన వెండి పూల సజ్జలతో ఇద్దరు స్త్రీలు ఆయన దగ్గరకు వచ్చి పూలు పూజ దగ్గర పెట్టి, ఒంగి ఆయన పాదాలకు నమస్కరించి కొంగు భుజాల చుట్టూ కప్పుకుని ఒద్దికగా ఒక పక్కకు నిలబడ్డారు.

**వెండి సింహాసనం** మీద పులి మీద కూర్చున్న పెద్ద కాళిమాత విగ్రహం...ఆ విగ్రహం మెడలో ఆయన శిష్యురాళ్ళు అల్లిన పెద్ద మందారపూల మాల. విగ్రహం పక్కనే స్ఫటిక శివలింగం .

పక్కనే హోమగుండం ... సమీపంలో సమిధలు, హోమ సామాగ్రి ఉన్నాయి.

ఆయన జింక చర్మం మీద అశీనుడయాడు ..

కొద్ది నిమిషాల్లో ప్రారంభం కాబోయే చండీ హోమం కోసం శిష్యులంతా ఆయనకి  కొంచెం దూరంలో వినయంగా నిలబడి ఉన్నారు.

కొందరు లోపలినుంచి ప్లాస్టిక్ చాపలు తెచ్చి విశాలమైన ఆ హాలులో హోమ గుండానికి , అమ్మవారి విగ్రహానికి దూరంగా కాసేపట్లో రాబోయే భక్తులు కూర్చోడానికి వీలుగా పరిచారు. అప్పటికే కొందరు భక్తులు వచ్చేశారు. తము తెచ్చిన పూజా ద్రవ్యాలు తెచ్చి శిష్యులకు అందించి చాపల మీద కూర్చున్నారు.

స్వామి వారి స్వరం మంద్రంగా  మొదలైంది.

హ్రీం క్లీం గం గణపతయే నమ:   గణపతి పూజ, నమకం , చమకం, శివార్చన  అభిషేకం కార్యక్రమాలన్నీ ఎంతో భక్తి, పారవశ్యంతో సాగిపోతున్నాయి .  అభిషేకానంతరం ఆ జలం భక్తుల మీద దూరంనుంచే చల్లారు స్వామి. అందరూ తలలు వంచి ఒక్క చుక్క పడినా చాలు పునితులం అవుతాము అన్నట్టు ఆ అభిషేక జలం కోసం తహతహ  లాడారు.

అనంతరం కాళీమాత విగ్రహానికి పూజ మొదలైంది.

నెమ్మదిగా “ఓం ఐం హ్రీం శ్రీం శ్రీ మాత్రే నమ:” అంటూ కాళీ మాత విగ్రహానికి పసుపు, కుంకుమలతో, పూలతో పూజిస్తూ, అష్టోత్తరశతనామావళి పటించసాగారు ..

ఆ స్వరం నుంచి వినిపిస్తున్న స్తోత్రాలు, మంత్రాలు ప్రశాంతంగా ఉన్న ఆ పరిసరాలలో ప్రతిధ్వనిస్తూ అక్కడ ఉన్న అందరిలో ఒక పవిత్రమైన భావాన్ని కలగచేస్తున్నాయి.

అంతేకాదు ఆయన వదనంలో ఒక దేదిప్య మానమైన వెలుగు ఆ పరిసరాలను తేజోవంతం చేస్తోంది.

మొక్కలు భక్తీ పారవశ్యంలో మునిగిపోయినట్టుగా నిశ్చలంగా ఉండిపోయాయి. మొక్కల మీద, గడ్డి మీద అల్లరిగా చిందులేస్తూ అందరిని పలకరిస్తున్న గాలి మంత్ర ప్రభావానికి కాబోలు స్తంభించినట్టు ఉండిపోయింది .

అప్పుడే ఇద్దరు స్త్రీలు చేతిలో పూలు, పళ్లు ఉన్న కవర్ లతో లోపలికి వచ్చి దూరం నుంచే స్వామి వారికి నమస్కరించి చేతిలో ఉన్న కవర్ లు శిష్యుడికి అందించి వినయంగా చాప మీద కూర్చున్నారు. వారి మొహాల్లో అయ్యో పూజ మొదలైంది మేము ఆలస్యంగా వచ్చామే అనే భావన ..

హోమం మొదలైంది.

ఆయన స్వరం గంభీరంగా మంత్రాలు పటిస్తోంది ...

మరికొందరు భక్తులు జంటలుగా, పిల్లలతో వస్తున్నారు. వచ్చిన వాళ్ళంతా పళ్ళు, పూలు తెస్తున్నారు.

అందరి మొహాల్లో భక్తీ పారవశ్యం ...అది అమ్మవారి మీదో, స్వామి వారి మీదో వాళ్ళకి తెలియదు.

దాదాపు నాలుగు గంటల సేపు సాగిన పూజ, హోమం తరవాత అమ్మవారికి పళ్ళు నివేదించారు.. హారతి ఇచ్చారు.

హారతి ఇస్తున్నప్పుడు అక్కడికి వచ్చిన స్త్రీలంతా మహిషాసుర మర్దిని స్తోత్రం పాడడం మొదలు పెట్టారు. అయిగిరి నందిని నందిత మోదిని విశ్వవినోదిని నందినుతే, గిరివర వింధ్య శిరోధిని వాసిని విష్ణు విలాసిని జిష్ణు నుతే అంటూ రాగయుక్తంగా, లయబద్ధంగా మహిళల స్వరాలూ అన్నీ ఒకే స్వరంలా వినిపిస్తుంటే కొన్ని వేల జేగంటలు తాళం వేస్తున్నట్టుగా గణ గణ మోగుతూ, దివ్యంగా వెలుగుతున్న కర్పూర హారతి వెలుగులో అమ్మవారు విగ్రహానికి జీవం వచ్చినట్టు అనిపించింది.

హారతి అయాక అందరూ నమస్కరించారు. స్వామీజీ అందరికి తీర్థం స్వయంగా ఇచ్చారు.

శిష్యులు అనుసరిస్తుండగా ఆయన జింక చర్మం మీదనుంచి లేచి హాలుని ఆనుకుని ఉన్న ఆయన వ్యక్తిగత మందిరంలోకి వెళ్ళారు. భక్తులు అందరూ తమ, తమ కష్టాలు, బాధలు, సమస్యలు స్వామికి సాంత్వన పొందే సమయం అందరూ ఆత్రుతగా ఆయన పిలుపు కోసం చూస్తున్నారు ..

అమ్మవారికి నివేదించిన పళ్ళు, హోమ గుండం నుంచి తీసిన భస్మం పళ్ళాలలో లోపలికి స్వామి మందిరం లోకి తీసుకుని వెళ్లారు శిష్యులు.

కొన్ని క్షణాలు ఉద్వేగంగా ఎదురు చూసాక ఒక్కొక్కరినే స్వామి ఆదేశం మేరకు లోపలికి పంపసాగారు శిష్యులు. ముందు వచ్చిన వాళ్ళను ముందు పంపిస్తున్నారు. వారంతా చేతిలో ప్రసాదంతో సంతృప్తి నిండిన వదనాలతో బయటికి వస్తుంటే మహాలక్ష్మి , విశాలాక్షి తమ వంతు కోసం ఆత్రంగా చూడసాగారు.

ఇంతలో ఒక శిష్యుడు వచ్చి వాళ్ళని లోపలికి వెళ్ళమన్నట్టు సైగ చేసాడు.

ఇద్దరూ ఆత్రంగా లోపలికి వెళ్ళారు ...విశాలంగా ఉన్న స్టూల్ మీద స్వామి కూర్చున్నారు..

స్వామికి పాదాభివందనం చేసారు.

“కూర్చోండి ..” స్వామి వాళ్ళకి తన ముందు ఉన్న చాపలు చూపించారు.

మహాలక్ష్మి గొంతు సవరించుకుని సందేహంగా ఆగిపోయింది.

“చెప్పమ్మా ఏంటి నీ సమస్య ...” అడిగారు స్వామి.

మహాలక్ష్మి విశాలాక్షి వైపు చూసింది .

చెప్పు అన్నట్టు సైగ చేసింది విశాలాక్షి.

మహాలక్ష్మి బిడియంగా కొన్ని క్షణాలు తలవంచుకుని కూర్చుని నెమ్మదిగా చెప్పింది ..” స్వామీ నాకు సంతానం లేదు..”

“వివాహం అయి ఎంత కాలం అయింది?” అడిగాడు స్వామి.

“నాలుగేళ్ళు .. ఎన్నో నోములు నోచాను.. ఇంకా నోస్తూనే ఉన్నాను కానీ ఇంకా దైవం కరుణించలేదు. మా అత్తగారు నాకు ఇంక పిల్లలు పుట్టరని నిర్ధారించి మా వారికి మళ్ళీ పెళ్లి చేయాలనుకుంటున్నారు .. నాజీవితం నిలబెట్టండి స్వామీ ...” దుఃఖంతో స్వరం వణుకుతుంటే రెండు చేతులూ జోడించి ప్రార్ధించింది మహాలక్ష్మి .

విశాలాక్షి స్నేహితురాలికి మద్దతుగా తనూ స్వామిని అర్ధిస్తూ అంది “ మీరు తలచుకుంటే, మీ ఆశీర్వాదం ఉంటె మా మహాలక్ష్మి కాపురం నిలబెట్టగలరు స్వామీ” అంది.

స్వామి తల పంకించి చేతికి అందుబాటులో ఉన్న రెండు యాపిల్ పళ్ళు, హోమ భస్మం ఆమె చేతికి ఇస్తూ “ఆ జగన్మాత కటాక్ష ప్రాప్తిరస్తు” అన్నారు.

మహాలక్ష్మి మహాప్రసాదంలా అవి అందుకుని కళ్ళకి అద్దుకుంది.

స్వామి మరో రెండు పళ్ళు, కొంత భస్మం విశాలాక్షి చేతికి కూడా ఇచ్చారు,

మహాలక్ష్మి ఇంకా ఏదన్నా చెప్తారని ఎదురు చూసింది. ఆయన నిశ్శబ్దంగా కళ్ళు మూసుకోడంతో ఆమె విశాలాక్షి వైపు దిగాలుగా చూసింది. విశాలాక్షి మళ్ళీ అడుగు అన్నట్టు సైగ చేసింది.

అడగనా వద్దా అని సందేహిస్తూనే “మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు స్వామి?” అని అడిగింది మహాలక్ష్మి .

ఆయన చిరునవ్వు నవ్వి “ఈ ఆశ్రమం తలుపులు భక్తులకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి” అన్నారు.

“అలాగే వస్తాను ... కానీ నాకు సంతానం ....”

“ఆ తల్లిని నమ్ముకోమ్మా జగన్మాతని దర్శించుకో ... ఆ తల్లి కటాక్షం లభిస్తే చాలు” అన్నారు.

“కనిపించని ఆ తల్లి కన్నా కనిపించే దైవం మీరే.. మీరే మాకు దిక్కు స్వామీ ... ఆ తల్లి ఉపాసకులు మీ దీవెనలే మాకు రక్ష” అన్నారు ఇద్దరూ.

భగవంతుడి మీద విశ్వాసం ఉంచండి నా మీద కాదు అన్నాడు స్వామి.

“అంతమాట అనకండి స్వామీ ... మీరు దయతలచి ఏదన్నా పూజ గాని, మంత్రం కాని చెప్పండి “

“ ఓం ఐం హ్రీం శ్రీం శ్రీ మాత్రే నమ: ఇదే మంత్రం వెళ్ళిరండి శుభం” అన్నారు ప్రశాంతమైన స్వరంతో.

ఇంకా ఏదో చెప్పబోతున్న వారిని ఇంక వెళ్ళమన్నట్టు సైగ చేశాడు శిష్యుడు .

వాళ్ళు అసంతృప్తిగా అక్కడినుంచి బయటకు వచ్చేశారు..

మరి ఇద్దరు భక్తులు లోపలికి వెళ్లారు.

"ఈయన మీద ఎంతో ఆశ పెట్టుకుని వచ్చాను. ఏదన్న మంత్రం ఉపదేశిస్తాడు అనుకున్నా .. ఏంటి విశాలా అలా తేల్చేసాడు. అమ్మవారిని నమ్ముకునేట్టైతే ఇంత దూరం ఎందుకు రావడం .... ఈయనకి బోలెడు మహిమలు ఉన్నాయని విన్నాను.. మరి ఇదేంటి – నాకేం నచ్చలేదు" అంది మహాలక్ష్మి .

"అదే నాకూ అనిపిస్తోంది. బహుశా డబ్బేమన్నాఆశిస్తున్నారేమో. మనం పళ్ళు తీసుకుని వెళ్ళాము. అందుకే అలా ముక్తసరిగా మాట్లాడి ఉంటారు" అంది విశాలాక్షి ..

"అవునా డబ్బు తీసుకుంటారా ఎంతో...?" దిగులుగా చూసింది మహాలక్ష్మి .

"ఏమో మరి ఇలాంటి స్వాములు వేలల్లో తీసుకుంటారు.. మనం అంత ఇవ్వగలమంటావా? "

"అమ్మో... ఏదో ఐదు వందల దాకా అయితే ఆయనకీ తెలియకుండా ఎలాగో సర్దగలను. అంత కన్నా ఎక్కువ అంటే మా ఆయనకీ తెలుస్తుంది.. మా అత్తగారికి కూడా తెలుస్తుంది. ఆవిడ ముందే వార్నింగ్ ఇచ్చింది డబ్బు తగలేయకు చేసింది చాలు అని.. తెలిసిందంటే చంపేస్తారు."

"ఎలా ?" ఆలోచిస్తూ అంది విశాలాక్షి.

"ఏమో ... నాకూ పాలు పోవడంలేదు.. ముందు చూస్తే గొయ్యి, వెనక చూస్తే నుయ్యిలా ఉంది పరిస్థితి."

ఇద్దరూ రోడ్ దాటి వాళ్ళ అపార్ట్ మెంట్ కి వెళ్ళే సందు దగ్గరకు వచ్చారు.

"ఓసారి అమ్మవారి గుడికి వెళ్దామా ...? దగ్గరేగా" అంది మహాలక్ష్మి .

"పద.." అంది విశాలాక్షి.

ఇద్దరూ గుడి వైపు తిరిగారు.

మహాలక్ష్మి , విశాలాక్షి ఒకే అపార్ట్ మెంట్ లో ఉంటారు. ఇద్దరిది ఒకే వయసు అది కాక పదేళ్ళ క్రితం ఇద్దరూ ఒకే కాలేజ్ లో బి.కాం మొదటి సంవత్సరం చదువుకున్నారు. విశాలాక్షి తండ్రికి బదిలీ అవడంతో వాళ్ళు వెళ్ళిపోయారు.

తరవాత మళ్ళీ ఒకే అపార్ట్ మెంట్ లో పక్క, పక్క ఫ్లాట్స్ లో దిగేసరికి ఒకరిని ఒకరు గుర్తుపట్టి స్నేహాన్ని అభివృద్ధి చేసుకున్నారు. కష్ట సుఖాలు కలబోసుకుంటూ ఆత్మీయంగా కలిసిపోయారు. మహాలక్ష్మి కి పెళ్లి అయి నాలుగేళ్ళు దాటినా పిల్లలు పుట్టక పోవడంతో అత్తగారు , భర్త ఆమెని టార్చర్ పెడుతున్నారు. ఆవిడ ఎక్కడెక్కడి నోములు, పూజలు చేయిస్తోంది. స్వాముల చుట్టూ గుళ్ళ చుట్టూ తిప్పిస్తోంది. ఒక్కో గుడిలో నూట ఎనిమిది ప్రదిక్షణలు చేయడం, అర్చనలు, అభిషేకాలు, ఉపవాసాలు, ఏం చేసినా ప్రయోజనం కనిపించక పోవడంతో మహాలక్ష్మి గొడ్రాలు అని నిర్ధారణకి వచ్చి కొడుక్కి వేరే పెళ్లి చేస్తానని కూర్చుంది.

"అదేంటి పిన్నిగారు భార్యాభర్తలిద్దరూ డాక్టర్ దగ్గరకు వెళ్తే ఎవరిలో ఏం లోపముందో చూసి మందులిస్తారు.. అదేపనిగా పూజలు చేస్తే ఎలా?" అని విశాలాక్షి ఉచిత సలహా ఇచ్చింది.

ఆ మాటతో ఆవిడ మండిపడింది.

"పూజ కొద్ది బిడ్డలు అన్నారు. మందులకి మాకులకి కుంటి పిల్లలు, గుడ్డి పిల్లలు పుడతారు. అయినా నా కొడుకులో లోపం ఉండడం ఏంటి..వీళ్ళమ్మ ఈమె చేత మంచి పూజలు చేయించలేదు. అందుకే గొడ్డు మోతు అయింది" అని విరుచుకు పడింది.

పూజకొద్దీ పురుషుడు దానం కొద్ది బిడ్డలు అన్నారు ఈవిడ సామెతలు కూడా తనకి అనుకూలంగా మార్చుకుంటుంది కాబోలు అనుకుని ఆవిడని మాటలతో మార్చడం కష్టం అని నిర్ధారణకి వచ్చేసింది విశాలాక్షి .

అయితే ఈ ఆపద ఎలా గట్టేక్కాలా అని మహాలక్ష్మి , విశాలాక్షి ఆలోచించడం మాత్రం మానలేదు. మూర్ఖులను మూర్ఖంగానే గెలవాలి అని నిశ్చయించుకున్నారు.

ఈ విషయం తీవ్రంగా ఆలోచిస్తుండగా స్వామి వారి గురించి తెలిసింది.

తమిళనాడుకి సంబంధించిన విద్యానంద స్వామి ఊరూరు తిరుగుతూ ప్రతి ఊళ్ళో చండి యాగం చేస్తూ నిజామాబాదు వచ్చారు. ఆ స్వామి అమ్మవారి ఉపసాకుడు అని, ఎంతో మహిమ కలవాడు అని ఆయన దగ్గరకు ఏ సమస్యతో వెళ్ళినా చిటికెలో పరిష్కరిస్తాడని ఆ నోటా, ఈ నోటా వినడమే కాక టివిలో కూడా అన్ని న్యూస్ చానెల్స్ లో ఆయన చేస్తున్న పూజలు, హోమాలు, ఆయన ఆశ్రమం చూపించి, ఆయనని ఇంటర్వ్యూ చేసారు.

ప్రతిరోజూ ఉదయాన్నే ఆయన చండి హోమం చేస్తారు హోమం అయాక భక్తుల సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చెప్తారని ఆ సమయానికి వెళ్లి ఆ హోమ ప్రసాదం స్వీకరించి తమ సమస్యలు, కష్టాలు చెప్పుకోవచ్చు అని వెళ్లి వచ్చిన వాళ్ళు కూడా చెప్పడంతో మహాలక్ష్మి అత్తగారితో అదే విషయం చర్చకు తెచ్చింది విశాలాక్షి .

కాని ఆవిడ కొడుక్కి వేరే పెళ్లి చేయాలన్న నిర్ణయానికి వచ్చేయడంతో ఆ చేసిన పూజలు, తిరిగిన బాబాలు, స్వామిలు చాలు... నీ మోహన తల్లి ఆయె యోగం ఉంటే ఇవన్ని ఎందుకు ... డబ్బులు తగలేయడం తప్ప ప్రయోజనం లేదు అని తిరస్కరించడంతో ఆ విషయం విశాలాక్షి కి చెప్పింది.

కానీ విశాలాక్షి ఊరుకోలేదు ఎలాగైనా మహాలక్ష్మి ని ఆయన దగ్గరకు తీసుకువెళ్ళి ఆమె కాపురం నిలబెట్టాలని ధృఢ సంకల్పంతో ఓపిగ్గా నచ్చ చెప్పింది. ఈ ఒక్కసారి చూద్దాం ఫలితం లేకపోతే మీ ఇష్టప్రకారం చేయండి అని కూడా చెప్పింది.

“అంతే కాక ఇటీవల దసరా ఉత్సవాల్లో స్వామివారు ఎంతో వైభవంగా చండి హోమం చేయడం , ఆ హోమానికి ముఖ్యమంత్రి తో సహా ఎందరో గొప్ప గొప్పవారు రావడం , లక్షల సంఖ్యలో జనం హాజరు అవడం జరిగిందని, ఆయన అమ్మవారి ఉపాసకులు అని, మాట శుద్ధి కలవాడని , ఎన్నో మహిమలున్నవాడని ఆయనని దర్శించుకున్న వారి కష్టాలు అన్నీ తొలగిపోతాయని వార్తా పత్రికల్లో, న్యూస్ చానల్స్ లో చెప్తున్నారని పైగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చేస్తున్న హోమానికి అయిన ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని చెప్పి ఎంత మహిమ కలవాడు కాకపోతే ప్రభుత్వం ఆయనని అంతగా గౌరవిస్తుంది! పైగా ఆయనకీ ఆర్మూర్ వెళ్ళే దారిలో ఆశ్రమం కట్టుకోడానికి కొంత స్థలం కూడా ఉచితంగా ఇచ్చారు. అలాంటిది మంత్రులు నమ్మగా లేనిది మనం నమ్మడంలో తప్పేముంది” అంటూ చెప్పడంతో ఆవిడ కూడా ఆ స్వామి గురించి వినడంతో , డబ్బులు ఖర్చు పెట్టకుండా ఏదన్న మంత్రమో, తంత్రమో తెలుసుకోండి అంటూ అనుమతి ఇచ్చింది.

ఆ కాస్త మాటకి ఊపిరి పీల్చుకున్న విశాలాక్షి, మహాలక్ష్మి ని ఆయన దగ్గరకు తీసుకుని వెళ్ళడం జరిగింది. అంత మహిమ గల స్వామి సాక్షాత్తూ అమ్మవారి ఉపాసకుడు అంటే సామాన్యం కాదు తప్పకుండా తనకి పిల్లలు పుట్టే మార్గం చెప్తాడని భావించిన మహాలక్ష్మి ఆయన ఏ తాయెత్తు ఇస్తాడు, లేదా ఏ మంత్రమో చెప్తాడు అని ఆశించింది. తన కష్టాలు గట్టెక్కుతాయని ఆశించింది.. కాని ఆయన ఎంతో మామూలుగా ఆ తల్లిని నమ్ముకో అని చెప్పడంతో నిరాశ ఆవరించింది.

ఇద్దరూ గుడి చేరారు.. అప్పటికే పన్నెండు అవుతోంది.

గుడి మూసే వేళ అయింది. జనం పల్చబడ్డారు.

మంగళవారం కావడంతో ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు జరిగినట్టున్నాయి.

లోపలికి అడుగు పెట్టగానే అగరుబత్తులు , కర్పూరం, కొబ్బరి నీళ్ళు , పూల పరిమళాలతో స్వాగతం పలిగింది వేపచెట్టు మీదనుంచి వీస్తున్న గాలి.

ఇద్దరూ పంపు దగ్గర కాళ్ళు కడుక్కుని మూడు సార్లు ప్రదిక్షణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

చక్కటి అలంకారంతో కళ కళ లాడుతున్న అమ్మవారి విగ్రహం చూడగానే మహాలక్ష్మి కి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అమ్మా నా కాపురం నిలబెట్టు తల్లీ ... నా కడుపు పండించు ...పుట్టబోయే నా పిల్లలకి నీ పేరు ఆ పరమేశ్వరుడు పేరు పెట్టుకుంటాను" అని వేడుకుంది.

తీర్ధ, ప్రసాదాలు తీసుకుని ఇద్దరూ గర్భగుడిలో నుంచి బయటకి వచ్చారు.

వాళ్ళతో పాటే మరో ఇద్దరు భార్యాభర్తలు కూడా అమ్మవారిని దర్శించుకుని బయటకు రాగానే పూజారి గర్భగుడి మూసేసి తనూ బయటకి వచ్చాడు.

విశాలాక్షి , మహాలక్ష్మి వేపచెట్టు గట్టు మీద కూర్చున్నారు.

మహాలక్ష్మి నిట్టూరుస్తూ అంది "మునుపు మునులు తపస్సు చేస్తే దేవుడు ప్రత్యక్షమై వాళ్ళ కోరికలు తీర్చేవారట ...ఆ తపస్సు విధానం ఏదో తెలిస్తే బాగుండు అనిపిస్తోంది,"

"అయినా మీ అత్తగారికి బుద్ధి లేకపోతే మీ ఆయన చదువుకున్నవాడు ఆవిడకి నచ్చచెప్పి డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి కాని రెండో పెళ్ళికి రెడీ అవడం ఏంటి? అసలు పోలీస్ రిపోర్ట్ ఇవ్వు. తమాషా అనుకుంటున్నాడా" ఆవేశంగా అంది విశాలాక్షి ..

మహాలక్ష్మి నిర్వేదంగా నవ్వి అంది "అదెంత పని .... క్షణంలో చేయచ్చు.. ఆ తరవాత కలిగే పర్యవసానం తట్టుకుని నిలబడే శక్తి నాకు లేదు. మన ఈ పిరికి తనాన్నే మగవాళ్ళు అవకాశంగా తీసుకుని ఆడిస్తున్నారు."

విశాలాక్షి మాట పూర్తి అవుతుండగా యాభై దాటిన ఒక స్త్రీ గుడిలోపలికి వచ్చింది.

ఆమె బాగా అలసిపోయిన దానిలా ఉంది. జుట్టంతా రేగి ఉంది.

నేరుగా పంపు దగ్గరకు వెళ్లి కాళ్ళు , చేతులు కడుక్కుని , దోసిట్లో పట్టుకుని నీళ్ళు తాగింది. పైట చెంగుతో మొహం తుడుచుకుని మూసి ఉన్న గర్భ గుడివైపు చూసింది. ఆవిడ మొహంలో నిరాశ స్పష్టంగా కనిపించింది.

కాసేపు అలాగే నిలబడి అటు, ఇటూ కలయ చూసింది. గుడి ప్రశాంతంగా ఉంది. వేప చెట్టు గట్టు మీద కూర్చున్న స్త్రీలు, ఒకరిద్దరు పని వాళ్ళు తప్ప ఎవరూ లేరు. ఆవిడ గర్భగుడికి ఎడం పక్క ఉన్న అశ్వద్ధ వృక్షం, పక్కనే పాము పుట్ట చూసింది. అక్కడ చెట్టుకి పూజ చేసి నైవేద్యం పెట్టిన అరటిపండ్లు మీద ఆమె దృష్టి పడింది.

ఏమి ఆలోచించకుండా గబా,గబా వెళ్లి అరటి పండ్లు తీసుకుని తినేసింది.

మహాలక్ష్మి , విశాలాక్షి ఆవిడనే విచిత్రంగా చూడసాగారు.

ఆవిడ పండ్లు తిని దృష్టి తిప్పింది. బహుశా విశ్రాంతి కోసం స్థలం వెతుకుతున్నట్టుంది అనుకున్నారు ఇద్దరు. ఆవిడ నేరుగా వాళ్ళు కూర్చున్న దగ్గరకు వచ్చి కొంచెం ఎడంగా కళ్ళు మూసుకుని కూర్చుంది.

మహాలక్ష్మి , విశాలాక్షి ఒకరిని ఒకరు చూసుకున్నారు. ఇద్దరి మనస్సులో ఒకే ఆలోచన .. ఎవరు ఈమె .. చూస్తుంటే మంచి కుటుంబానికి చెందిన దానిలా ఉంది. దూరం నుంచి అమ్మవారి గుడికి వచ్చిందా. అలసి పోయిందేమో.. కాని ఎంత అలసినా, ఆకలి వేసినా అలా ఎవరిని అడక్కుండా పండ్లు తినేసింది ఏంటి?

విశాలాక్షి ఆవిడకి కొంచెం దగ్గరికి జరిగి అడిగింది “మీరు ఎక్కడినుంచి వస్తున్నారు ?”

ఆవిడ సమాధానం చెప్పకుండా అడిగింది “ ఈ చుట్టు పక్కల విద్యానంద స్వామి వారి ఆశ్రమం ఉందిట.. ఆయన కాళీమాత ఉపాసకులు అని విన్నాను ...ఆశ్రమం ఎక్కడ ఉందో చెప్తారా.”

ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. “స్వామి వారిని కలుసుకోడానికి వచ్చారా ..?” అడిగింది విశాలాక్షి

“అవునండి నాకు సరైన అడ్రస్ దొరక్క రెండు మూడు ఆశ్రమాలకు వెళ్ళాను కానీ అవి ఆశ్రమాలు కావు షిరిడి సాయిబాబా వారి సంస్థానాలు. నాకు విద్యానంద స్వామి వారి ఆశ్రమం కావాలి.. “

“ఈవిడకి ఏం సమస్య ఉందో పాపం ...” ఇద్దరూ జాలి పడ్డారు..

“మాకు తెలుసు చూపిస్తాం మాతో రండి ఇక్కడికి దగ్గరే” అన్నది మహాలక్ష్మి ..

ఆవిడ మొహంలో వెలుగు ... ఎంతో కాలంగా కొనసాగుతున్న అన్వేషణ ఫలించినప్పటి నిశ్చింత,

ఆనందం .... ఇంక లభించదేమో అని నిరాశతో ఉన్న మనసుకు ఊహించని ఒక వరం లభించినప్పటి తృప్తి..

ఆత్రంగా అడిగింది “నిజంగా తెలుసా మీకు .. నన్ను అక్కడికి తీసుకుని వెళ్తారా?”

“తప్పకుండా పదండి వెళ్దాము ...మిమ్మల్ని ఆశ్రమం దగ్గర దింపి మేము మా ఇంటికి వెళ్ళాలి ఇప్పటికే బాగా ఆలస్యం అయింది” అంటూ లేచారు ఇద్దరూ.

ఆవిడ కూడా చటుక్కున లేచింది .

“మీ పేరు?” అడిగారు వాళ్ళు.

ఆమె ఒక్క క్షణం ఆలోచించింది చెప్పింది “జానకి ..”

***

జానకి వెళ్లి ఆ వేల్టికి మూడోరోజు.

పోలీస్ రిపోర్ట్ ఇచ్చినా ఇంతవరకు ఆమె జాడ తెలియలేదు. మిత్రుల బలవంతం మీద నిన్న సాయంత్రం కొన్ని ప్రముఖమైన టి వి చానల్స్ లో జనార్ధన్ తో కలిసి వెళ్లి జానకి వివరాలు, ఫోటో ఇచ్చి ప్రకటన ఇచ్చాడు భాస్కర్. పరువు, ప్రతిష్ట అంటూ కూర్చుంటే ఆవిడ జాడ ఎలా తెలుసుకుంటావు ఏం ఫర్వాలేదు ఇవ్వు అని లీలమ్మ, ఆదినారాయణ కూడా చెప్పడంతో ధైర్యంగా ఇచ్చాడు.

రాత్రి నుంచే ప్రకటన ప్రారంభిస్తాం అని ఛానల్ వాళ్ళు చెప్పారు.. బాగా పొద్దుపోయిందాకా టివి చూస్తూ కూర్చున్నాడు భాస్కర్.. కానీ ఎక్కడా ప్రకటన కనిపించలేదు. అలా టి.వి చూస్తూనే ఎప్పుడో నిద్రపోయాడు.

తెల్లవారి బాగా ఆలస్యంగా లేచాడు. అప్పటికే చరిత, హరి కాలేజ్ లకు వెళ్ళిపోయారు. చరిత లీలమ్మ వచ్చాక కొంచెం తేరుకుంది కానీ తల్లిని తలచుకుని పిచ్చిదానిలా ఏడుస్తూ కూర్చునేది. లీలమ్మ “అమ్మ ఎక్కడికి వెళ్ళదు తప్పకుండ వస్తుంది” అని ధైర్యం చెప్పి కాలేజ్ కి పంపిస్తోంది.

ఆదినారాయణ పైకి గంభీరంగా ఉన్నా లోలోపల విపరీతంగా ఆందోళన పడుతున్నాడు. కూతురు ఈ వయసులో ఇల్లు వదిలి పోడానికి కారణం ఏమి ఉంటుందో ఆయనకీ ఏ మాత్రం అర్ధం కావడంలేదు. పిల్లలతో కాని, భర్తతో కాని, ఆర్ధికంగా కానీ ఇతరత్రా కాని

ఎలాంటి సమస్యలు లేవు. అనారోగ్య సమస్యలు లేవు.. మరి ఎందుకు అలా వెళ్ళిపోయింది? బయటికి వెళ్లిన మనిషి ఎటన్నా దారి తప్పి పోయిందా .. ఏదన్నా యాక్సిడెంట్ అయిందా ? ఏం జరిగి ఉంటుంది! ఆమె అదృశ్యంతో ఇల్లంతా తల్లకిందులైంది. పిల్లలు తల్లడిల్లిపోతున్నారు.

భాస్కర్ని చూస్తుంటే అందరికి గుండె తరుక్కుపోతోంది. ఆఫీసుకి వెళ్తున్నాడు, వస్తున్నాడు కానీ మనిషి ఇహలోకంలో లేడు. గడ్డం బాగా పెరిగిపోయి, బాగా జబ్బుపడి లేచిన వాడిలా అయాడు. రాత్రిళ్ళు అసలు నిద్రపోడం లేదు. ఆఫీస్ నుంచి పోలీస్ స్టేషన్ కి వెళ్లి జానకి గురించి ఏమన్నా సమాచారం తెలిసిందేమో అని తెలుసుకుని, నిరాశగా, ఆలస్యంగా ఇంటికి వస్తాడు.. ఏదో తినాలి కాబట్టి నాలుగు మెతుకులు కతికి అలా సోఫాలో నిర్వేదంగా కూర్చుని ఆలోచిస్తూ, మధ్య, మధ్య కంట తడి పెడుతూ ఉంటాడు.

ఆలస్యంగా నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని వచ్చి సోఫాలో కూర్చుని టివి ఆన్ చేసాడు.

లీలమ్మ కాఫీ కప్పుతో వచ్చింది. ఆవిడ వెనకాలే ఆదినారాయణ కూడా వచ్చి అల్లుడి పక్కన కూర్చున్నాడు. ఆవిడ ఇద్దరికీ కాఫీ ఇచ్చింది.

భాస్కర్ తను ఏ చానెల్ కి ప్రకటన ఇచ్చాడో ఆ చానెల్స్ తిప్పుతూ కూర్చున్నాడు. ఒక దగ్గర సినిమా ప్రమోషన్ కార్యక్రమం, ఒక దగ్గర పనికిరాని చర్చా కార్యక్రమం.. విసుగ్గా మరో చానెల్ తిప్పాడు. టి వి వార్తలు మొదలయాయి. కొంతసేపు రాజకీయాలు, ఇతర వార్తలు అయాక న్యూస్ రీడర్ సంగారెడ్డి లో జరిగిన ఒక విచిత్రం అంటూ ఏదో చెప్పసాగింది. ముగ్గురూ శ్రద్ధగా వినసాగారు.

సంగారెడ్డిలో వెలసిన శిరిడి సాయిబాబా. సంగారెడ్డి ప్రాంతంలో మహేంద్ర యోగి రూపంలో షిరిడి సాయి బాబా వెలిసాడని, భక్తులపాలిట కల్పవృక్షమై అలరిస్తున్నాడని తెలిసింది. సంతానం లేని వాళ్ళకి సంతానం, ఉద్యోగాలు లేనివారికి ఉద్యోగాలు ఇలా అనేక సమస్యలతో తనని దర్శించుకున్న వాళ్ళని కటాక్షిస్తు భక్తులను అలరిస్తున్నాడని చెప్పుకోడం కాక వందల సంఖ్యలో ప్రజలు బాబాని దర్శించుకుంటున్నారు.

బాబా వెలిసిన ప్రదేశం, తండోపతండాలుగా ఆయన్ని దర్శించుకోడానికి వెళ్తున్న ప్రజలను చూపిస్తున్నారు. లీలమ్మ భక్తిగా రెండు చేతులూ జోడించి కనిపించి, కనిపించకుండా కనిపిస్తున్న ఆ బాబాకి దణ్ణం పెట్టుకుని అంది "బాబాగారు కనిపించే దైవం ... ఒక్కసారి మనమూ దర్శించుకుందాం బాబు.. ఇలాంటి వాళ్ళు ప్రశ్నలకి జవాబులు చెప్తారు మన జానకి గురించి అడిగితె అయన చెప్తారు".

భాస్కర్ ఆశ్చర్యంగా అన్నాడు " ఇవన్నీ మీరు నమ్ముతున్నారా..? ఇలాంటి వాళ్ళు ఈ మధ్య చాలా మంది వెలుస్తున్నారు.. ఆస్తులు సంపాదించుకుని పారిపోతున్నారు. వాళ్ళేం దేవుళ్ళా అత్తయ్యగారు?" అన్నాడు.

"ఊరుకో లీలా చాదస్తం నువ్వునూ.... ఆయన నిజం బాబా అయితే అక్కడే ఎందుకు వెలుస్తాడు.. అయినా నిజంగా షిరిడి బాబా నీ ప్రశ్నకి సమాధానం చెప్పేవాడే అయితే అదిగో నువ్వు ఆ ఫోటో దగ్గర నిలబడి మా జానకి ఎక్కడుంది అని అడిగినా చెప్తాడు.." అన్నాడు ఆదినారాయణ గోడకున్న బాబా ఫోటో చూపిస్తూ.

"అబద్ధం అయితే అంతమంది జనం ఎందుకు వెళ్తారు. చూడండి ఎంతమందో.. అదిగో బాబాగారు" .. టివిలో కనిపిస్తున్న బాబా అనబడే వ్యక్తి కనిపించడంతో ఉద్వేగంగా అరిచింది.. అచ్చు షిరిడి సాయి లాగే ఉన్నారు.. ఆ కాషాయ వస్త్రాలు, ఆ తెల్ల గడ్డం, ఆ ఆకుపచ్చ తలపాగా.. ప్రశాంతమైన చిరునవ్వు రెండు చేతులూ జోడించింది.

"కాషాయ వస్త్రాలు వేసుకున్న వాళ్ళంతా యోగులు, బాబాలు అవుతారా లీలా ...?" ఆదినారాయణ కొట్టిపారేశాడు.

ఆవిడ భర్త వైపు చిరాగ్గా చూసి భాస్కర్ తో అంది "ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు? నా మాట విని ఒకసారి వెళ్లి వద్దాం బాబు.."

భాస్కర్ ఏదో చెప్పేలోగా శారద, ఆమె భర్త జనార్ధన్ వచ్చారు.

"రామ్మా శారద మంచి సమయానికి వచ్చావు" అంటూ ఆహ్వానించింది లీల.

శారద వచ్చి లీలమ్మ పక్కన కూర్చుంది, జనార్ధన్ భాస్కర్ పక్కన కూర్చున్నాడు.

"టివి లో చెప్పారా నిన్న మనం ఇచ్చి వచ్చాం కదా" అడిగాడు జనార్ధన్.

"అదే చూస్తున్నా ... నాకు ఇంకా కనిపించలేదు" అన్నాడు భాస్కర్.

అప్పుడే స్క్రోలింగ్లో కనిపించింది. జానకి అనే పేరుగల యాభై ఏళ్ల మహిళ మూడు రోజుల క్రితం మార్కెట్ కి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియక భర్త, పిల్లలు, బంధువులు ఆందోళనతో కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఆచూకి తెలిసినవారు సంప్రదించవలసిన చిరునామా... భాస్కర్ పేరు, ఫోన్ నెంబర్ , అడ్రస్ ఇచ్చారు

"అదేంటి స్క్రోలింగ్లో ఇచ్చారు.. ఫోటోతో సహా సపరేట్ గా వేస్తారనుకున్నా" అన్నాడు జనార్ధన్.

భాస్కర్ ఒక్క క్షణం ఉద్వేగంతో వణికిపోయాడు. జానకి గురించి ఇలా ప్రకటన ఇప్పించాల్సి వస్తుందని ఎన్నడన్నా ఊహించాడా. కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

ఆదినారాయణ అన్నాడు " అదంతా ఒకప్పుడు దూరదర్శన్ లో అలా ఇచ్చేవారు. ఇప్పుడు ప్రధాన వార్తలు తప్ప అన్నీ స్క్రోలింగ్ లోనే.. "

శారద అంది "ఈ ప్రైవేటు చానెల్స్ కి ఏదన్నా సెన్సేషనల్ న్యూస్ ఉంటే తప్ప ప్రాధాన్యత ఇవ్వరు."

"పోలీసులే తెలుసుకోలేకపోయారు ఈ ప్రకటన ద్వారా ఒరిగేదేముంది లేమ్మా. అదిగో ఇంతకుముందే చెప్పారు టివి లో. సంగారెడ్డిలో షిరిడి సాయి బాబాగారు స్వయంగా వెలిసారుట. ఓసారి వారిని దర్శించుకుందాం అంటే వాళ్ళు వినడంలేదు.. కనీసం నువ్వన్నా చెప్పు శారదా" అంది లీల.

"షిరిడి బాబా వెలవడం ఏంటి పిన్నిగారు? "

"అవునమ్మా ఇప్పుడే చూపించారు. జనం ప్రవాహంలా వెళ్తున్నారు."

"అదేమో కానీ నిజామాబాద్ కి కొంచెం దూరంలో  ఎక్కడో భవాని ఆలయం దగ్గర  విద్యానంద స్వామి అని వచ్చారుట.. ఆయన అమ్మవారి ఉపాసకులుట. ఆయన చాల పవర్ఫుల్ మాన్ అని, దివ్య శక్తులున్నాయని చెప్పుకుంటున్నారు. ఆయనకీ ఎలాంటి ప్రచారం లేదు.. ఏ సమస్య అయినా చిటికెలో పరిష్కరిస్తారట. ఆయన దగ్గరకు వెళ్దామా?" అంది శారద.

భాస్కర్ శారద మొహం లోకి అదోలా చూసాడు.

జనార్ధన్ కూడా అన్నాడు అవును ..." మా కజిన్ అక్కడే ఉంటాడు. వాడికేదో ప్రమోషన్ విషయంలో ఏదో  ప్రాబ్లం వస్తే వెళ్ళాడు. వాడికి ప్రమోషన్ వచ్చిందిట. అలా చాలా మందికి చాలా జరిగాయిట. పైగా ఆయన అసలు అవసరం అయితే తప్ప పూజలవి చెప్పట్ట. డబ్బులు కూడా తీసుకోడని విన్నాను. "

భాస్కర్ అతని మాటలు విని ఆలోచిస్తున్నట్టు మౌనంగా ఉండిపోయాడు.

ఆదినారాయణ కూడా జనార్ధన్ మాటలు విని “అవును నేను కూడా విన్నాను విద్యానంద స్వామి గురించి.. ఆయన చాలా ఊళ్లు తిరుగుతూ ఇక్కడికి వచ్చాడని చెప్పారు” అన్నాడు.

లీలమ్మ ఆత్రంగా అంది “ అయితే ఆయన దగ్గరకు వెళ్దాం పదండి.”

“మనిద్దరం వెళ్దాం పిన్నిగారు. వాళ్ళెందుకు” అంది శారద.

“అయితే నేను రెడీ అయి వస్తాను. నా వంట కూడా అయిపోయింది. పిల్లలు వచ్చే టైం కి తిరిగి వస్తాముగా.”

“రాలేము.. మనం వెళ్ళడానికి మూడు గంటలు పడుతుంది. అయినా ఇప్పుడు వెళ్ళినా లాభం లేదు. ఉదయమే వెళ్లిపోవాలి. ముందు ఆయన శిష్యులకి ఫోన్ చేసి అపాయింట్మెంట్ తీసుకోవాలి. “ అంది శారద.

“అదేదో తీసుకోమ్మా” వేడుకుంటున్నట్టుగా అంది.

“అలాగే.. వాసవి అపార్ట్మెంట్స్ లో నా ఫ్రెండ్ ఉంది. తను కూడా వెళ్లిందనుకుంటా తనని అడిగి ఫోన్ నెంబర్ తీసుకుంటా.” అంది శారద.

“త్వరగా తీసుకో కనీసం రేపన్నా వెళ్ళేలా చూడు” అంది లీలమ్మ.

ఆవిడ అన్నట్టే తన ఫ్రెండ్ దగ్గర ఫోన్ నెంబర్ తీసుకుని విద్యనందస్వామి పర్సనల్ సెక్రెటరీ కి ఫోన్ చేసింది శారద.

ఉదయం శివాభిషేకం, చండి హోమం ప్రతిరోజూ ఉంటాయని అవి అయాక భక్తుల సమస్యలు స్వామివారు వింటారని చెప్పారు.

మరునాడు వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. వద్దని వారించినా వినరు అని తెలిసిన భాస్కర్ మౌనంగా ఉండిపోయాడు. కాకపోతే మావగారు కూడా బయలుదేరడంతో డ్రైవర్ ని పెట్టుకుని కారులో వెళ్ళమన్నాడు.

జానకికి దూరం నుంచి ఆశ్రమం చూపించి మహాలక్ష్మి , విశాలాక్షి వెళ్ళిపోయారు.

జానకికి ఎలా లోపలికి వెళ్ళాలో అర్ధం కాలేదు. కొంచెం దూరంగా ఉండి ఆశ్రమం వైపే దృష్టి నిలిపి నిలబడింది.

అంతటా ప్రశాంతంగా ఉంది. గేటు కొంచెం తెరిచి ఉంది. ఒకళ్ళిద్దరు శిష్యులు అటు, ఇటూ తిరుగుతున్నారు. గేటు లోపల ఆవరణ మొత్తం పూల మొక్కలతో రమణీయంగా ఉంది.

జానకికి నీరసంగా ఉంది. ఆకలేస్తోంది. దుఃఖం కూడా వస్తోంది. మూడు రోజులైంది పిల్లలని, ఆయనని చూసి వాళ్ళు ఎంత కంగారు పడుతున్నారో ఏంటో.. పిల్లలు ఏడుస్తుంటారు. ముఖ్యంగా చరిత.. అది తను క్షణం కనిపించకపోతే విల, విలాడుతుంది. అలాంటిది మూడు రోజులైంది తను ఇల్లు వదిలి వచ్చి. వచ్చే ముందు ఆయన ఫోన్ నెంబర్ ఒక కాగితం మీద రాసుకుని రావాలన్న జ్ఞానం లేకపోయింది.

ఎంత తెలివి తక్కువ పని చేసింది!

ఉమాదేవిని నమ్మి తన సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశతో ఆయనకి చెప్పకుండా బయటికి వచ్చింది. ఎప్పుడన్నా ఇలా జరిగిందా? అయినా తనకి దయ్యం పట్టిందా ఉమాదేవి ఏదో చెబితే ఎవరితో ఆ విషయం చర్చించకుండా ఎందుకు నమ్మింది? కనీసం శారదకన్నా చెప్పాల్సింది కదా!

జానకికి తల పగిలిపోతున్నట్టు అనిపించింది. లోపలికి వెళ్ళాలా వద్దా అని సందేహంతో గేటు బయటే ఆగిపోయింది.

అప్పటికే పూజ అయిపోయినట్టుంది. లోపల భక్తులెవరూ లేరు. ఇప్పుడు తను వెళ్ళినా స్వామి దర్శనం లభించదు.

మళ్ళీ రేపు ఉదయం రావాలో, సాయంత్రం దర్శనం ఇస్తారో..

జానకి దృష్టి గేటు వైపు వస్తున్న శిష్యుడి వైపు మళ్ళింది. అతను గేటు మూసి గడియ వేస్తున్నాడు. జానకి వేగంగా వెళ్లి “బాబూ“ అని పిలిచింది.

అతను ప్రశ్నార్ధకంగా చూసాడు..

“స్వామి దర్శనం లభిస్తుందా?“ ఆశగా అడిగింది.

అతను తల అడ్డంగా ఊపి “రేపు ఉదయం ఎనిమిది గంటలకి రండి” అని క్లుప్తంగా చెప్పి గేటు వేసేసి, మరో మాటకి అవకాశం లేకుండా వెళ్ళిపోయాడు.

జానకి ఉసూరుమంటూ వెనక్కి తిరిగింది.

ఎక్కడికి వెళ్ళాలో అర్థం కాలేదు. నిన్న సాయంత్రం ఉమాదేవి తనని ఆ బాబా గారి దగ్గర వదిలి వెళ్ళిన దగ్గరనుంచి పిచ్చి దానిలా తిరుగుతోంది. ఇప్పుడు ఎక్కడ తల దాచుకోవాలి? ఇంటికి వెళ్ళిపోవాలి.. అక్కడ, పిల్లలు, ఆయన ఎంత ఖంగారు పడుతున్నారో.. ఎంత ఏడుస్తున్నారో.. కానీ తన పర్స్ పోయింది. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఎలా పోయిందో, ఏం జరిగిందో కూడా అర్థం కావడం లేదు.

జానకి నెమ్మదిగా నడుస్తూ వచ్చిన దారినే వెనక్కి నడిచింది. దారి గుర్తు పెట్టుకుని అమ్మవారి గుడికి వెళ్ళింది. గుడికి గేటు, తలుపులు లేవు మొండి గోడలు.. లోపలికి నడిచి వేపచెట్టు గట్టు మీద కూర్చుంది. ఆవిడకి తన మనస్థితి.. ఇప్పటి దుస్థితి తలచుకుంటే ఏడుపు వస్తోంది. ఎందుకు తను అలా ఉమాదేవిని నమ్మి బయటకు వచ్చింది అన్ని విషయాలు గిర్రున మస్తిష్కంలో తిరిగాయి.

తనలో వచ్చిన అనేక మానసిక మార్పులు తనకే వింతగా అనిపిస్తోంది. ఎంత తనని తాను కంట్రోల్ లో ఉంచుకోవాలన్నా ఏవేవో ఆలోచనలు మెదడులో కందిరీగల్లా తిరుగుతూ కుదుతున్నాయి. తను మునుపటి జానకి కాదు..

ఇదివరకు ఎంతో శాంతంగా, చిరునవ్వుతో ఉండే జానకికి ఈ మధ్య ఒక వ్యాధి పట్టుకుంది.. ఆ వ్యాధి పేరు భయం. భయం ... అనుక్షణం భయం.. దాదాపు ఏడాది నుంచి ఎందుకో తెలియని భయం..ఆ భయం అంతా చరిత విషయంలోనే.. చరిత బయటికి వెళ్తే భయం.. చరిత పక్కింటికి వెళ్తే భయం.. కాలేజ్ నుంచి అరగంట ఆలస్యంగా వస్తే భయం. అన్నిటికన్నా అసహ్యకరమైన విషయం చరిత అన్నగారితో మాట్లాడినా, తండ్రితో మాట్లాడినా వాళ్లతో చనువుగా పక్కన కూర్చున్నా భరించలేకపోతోంది.

అయిన దానికి, కానీ దానికి పిల్లలిద్దరిని కసురుకుంటోంది. భర్తతో అనవసరంగా దెబ్బలాడుతోంది.

జానకికి రెండు నెలల నుంచీ మరీ చికాకు ఎక్కువ అవుతోంది.

పదిహేను రోజుల క్రితం చరితను అన్యాయంగా తిట్టింది..

చాలా రోజుల నుంచి అందరిని అనవసరంగా కసురుకుంటున్నా ఆరోజు తనకి ఏమైందో.. ఏ దయ్యం ఆవహించిందో రాక్షసిలా ప్రవర్తించింది.. చరిత హరి పక్క, పక్కన కూర్చుని చదువుతుంటూ ఎందుకో దెబ్బలాడుకున్నారు. చరిత హరి మీద పడి వీపు మీద కొడుతూ ... ఛీట్ చేసావు అన్నా” అని అల్లరి చేస్తుంటే తను ఆవేశంతో ఒళ్ళు మర్చిపోయి అరిచింది.

“ఎందుకే అలా వాడి మీద, మీద కూర్చుంటావు. ఎడంగా కూర్చోలేవు” అని అరిచింది.

ఆవిడ అలా అరిచేసరికి అన్నా చెల్లెళ్ళు ఇద్దరూ బిత్తరపోయారు. అప్పటిదాకా వాళ్ళ అల్లరితో గోల, గోలగా ఉన్న ఇల్లు అకస్మాత్తుగా నిశ్శబ్ద గా మారిపోయింది.

“అదేంటమ్మా అన్నయ్యేగా తప్పేంటి” అంటూ తన వైపు విచిత్రంగా చూస్తూ అంది చరిత.

ఆ పిల్లకి ఏం సమాధానం చెప్పాలో తెలియక గట్టిగా “అయితే!” అని అరిచి “పో నీ గదిలో చదువుకో” అంటూ తిట్టింది.

అప్పుడే ఇంటికి వచ్చిన భాస్కర్ బిక్క మొహాలతో ఉన్న పిల్లలని, చరిత కళ్ళల్లో నీళ్ళని చూసి "ఏమైంది" అని అడిగాడు.

చరిత జరిగింది చెప్పబోయే లోపలే జానకి " నోరు మూసుకుని లోపలికి వెళ్తావా లేదా" అని మళ్ళి అరిచింది.

భాస్కర్, పిల్లలు ఆవిడ అరుపుకి ప్రాన్పడిపోయారు.

"ఏమైంది జానకీ?" అని అడుగుతున్న భాస్కర్ తో " ఏం అవలేదు.. నేనింకా బతికే ఉన్నా.. వెళ్లి కాళ్ళు చేతులు కడుక్కు రండి కాఫీ ఇస్తాను" అంటూ వంట గదిలోకి వెళ్ళబోతూ హరి వైపు చూసి "నువ్వెంటిరా? దిక్కులు చూస్తున్నావు చదువుకో" అని అరిచి లోపలికి వెళ్ళింది.

అప్పటివరకు ఆవిడ చరిత మీద అలా ఎందుకు అరుస్తోందో అర్థం కాక బిత్తరపోయి చూస్తున్నా హరి తల్లి తనని కూడా అరిచేసరికి తండ్రి వైపు చూసి లోపలికి వెళ్ళిపోయాడు మౌనంగా.

భాస్కర్ జానకి ఇచ్చిన కాఫీ కప్పు అందుకుని "అదేంటి జానకీ అన్నా, చెల్లెళ్ళు సరదాగా ఉంటే అరుస్తున్నావెందుకు అదేం తప్పు చేసింది" అన్నాడు.

"మీకేం తెలియదు ఊరుకోండి..ఒక వయసు వచ్చాక ఆడపిల్ల కుదురుగా ఉండడం నేర్చుకోవాలి. అన్నా అయినా, నాన్న అయినా చిన్న పిల్లలా అలా మీద, మీద పడి మాట్లాడడం ఎందుకు?" అని భర్తని కసిరింది.

"ఆర్ యూ మాడ్?" కోపంగా అన్నాడు భాస్కర్. భార్య అలా అన్నాచెల్లెళ్ళ మధ్య రిస్ట్రిక్షన్స్ పెట్టడం నచ్చలేదు..

"అవును నేను పిచ్చి దాన్నే సరేనా " ఉద్రేకంగా అని అక్కడినుంచి బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయి నిశ్శబ్దంగా ఏడవసాగింది.

ఆమె వెనకే వచ్చిన భాస్కర్ ఆ ఏడుపు చూసి చికాకు పడ్డాడు.." మొగుడుని కొట్టి మొరపెట్టుకున్నట్టు ఉంది నీ వాలకం. అకారణంగా పిల్లల్ని తిట్టి నువ్వేడుస్తావేం" అన్నాడు సీరియస్ గా.

అంతే కాదు చరిత కాలేజ్ నుంచి పదినిమిషాలు ఆలస్యంగా వస్తే రాక్షసిలా మీద పడి కరిచినంత పని చేస్తోంది.

"నేనెక్కడికి వెళ్తాను.. కాలేజ్ నుంచి నేరుగా ఇంటికే వస్తున్నా పది నిమిషాలు ఆలస్యం అయితే ఇంత గోల చేస్తావేంటమ్మా ఇదివరకు లేదు.. ఈ మధ్య నన్ను అయిన దానికి, కానీ దానికి తిడుతున్నావు. నీకు నేను ఇంట్లో ఉండడం ఇష్టం లేకపోతే చెప్పు హాస్టల్లో ఉంటాను" అని ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

అర్ధరాత్రిళ్లు చరిత ఒక్కతే పడుకుందని హటాత్తుగా భర్త పక్కనుంచి లేచి చరిత దగ్గరికు వెళ్లి అలా మంచం మీద ఓ పక్కకి ఒరిగి పడుకోడం మొదలు పెట్టింది.

తెల్లవారి లేచి "అదేంటమ్మా నువ్వెప్పుడు వచ్చావు నాదగ్గరకు?" అని ఆశ్చర్యంగా చరిత అడిగితే ఏం చెప్పాలో తెలియక తల వంచుకుని "ఇప్పుడే వచ్చాలే.." అంటూ అక్కడినుంచి వచ్చేస్తోంది.

ఇదంతా భరించలేని చరిత భాస్కర్ కి చెప్పింది "నేను హాస్టల్లో చేరతాను నాన్నా.. అమ్మకి నేనంటే పడడం లేదు ఈ మధ్య. "

" ఛ అదేం లేదు అమ్మకి ఆరోగ్యం బాగాలేదనుకుంటా. బలానికి టానిక్ తెస్తాను. ఒక్కతే ఇంట్లో పని చేసుకోడంతో నీరసం వచ్చి , ఆ నీరసం వల్ల కోపం వస్తోంది .. నేను మాట్లాడతాలే" అని చరితను ఓదార్చి ఆ రాత్రి జానకిని అడిగాడు.

"నీకేమైంది ఈ మధ్య? ఆరోగ్యం బాగాలేకపోతే చెప్పచ్చుగా రేపు డాక్టర్ దగ్గరకు వెళ్దామా?"

"నా ఆరోగ్యానికేం నిక్షేపంగా ఉంది.. ఊరికే అడిగింది అడిగి విసిగించకండి" అని విసుక్కుందే కాని తనలో కలుగుతున్న అనవసర భయాల గురించి మానసిక ఆందోళన గురించి, చెప్పలేకపోయింది. చెబితే ఏమంటాడో ఆమెకి తెలుసు. చెంప పగల కొట్టి మెంటల్ హాస్పిటల్ కి తీసికెళ్తా పద అంటాడు.. లేదంటే ... లేదంటే.. జానకి నిలువెల్లా వణికిపోయింది.

దేవుడా నాకేమవుతోంది.. ఎందుకిలాంటి ఆలోచనలు వస్తున్నాయి.. ఆ రాత్రంతా నిద్రలేకుండా ఆలోచిస్తూనే ఉండిపోయింది.

ఆరోజు ఉదయం నుంచి ఎందుకో తెలియని దుఃఖం. పిల్లలు ఆయన బయటికి వెళ్ళిపోయాక టివి పెట్టుకుని చూస్తూ కూర్చుంది. ఏవో సీరియల్స్ నచ్చలేదు. సినిమాలు మంచివి లేవు. ఏదో ఛానల్ తిప్పింది.

అప్పుడే వచ్చింది ఉమాదేవి. ఇంతకు ముందు అద్దెకి ఉండి వచ్చిన ఇంటి దగ్గరే ఉండేది. ఇప్పుడు శారదతో వెళ్లినట్టు ఆ రోజుల్లో ఉమాదేవి, జానకి కలిసి సినిమాలకి వెళ్తుండేవారు. కొంతకాలం అయాక ఆమె స్వభావం, పద్ధతులు నచ్చక ఆమెతో స్నేహం మానేసింది. తరవాత ఇల్లు కొనుక్కుని ఇప్పుడున్న దగ్గరకి షిఫ్ట్ అయారు. గృహప్రవేశానికి అందరితో పాటు ఉమాదేవిని కూడా పిలిచింది. ఆ అడ్రస్ గుర్తు పెట్టుకుని ఇటు వైపు వచ్చినపుడల్లా వస్తూ ఉంటుంది. ఆమె రావడం జానక్కి అసలు నచ్చలేదు.. అందులోను తను ఈ మూడ్ లో ఉండగా రావడం అసలు నచ్చలేదు. అయిష్టంగా పలకరించి కుశల ప్రశ్నలు అయాక ఇద్దరూ కూర్చుని టివి ఆన్ చేసింది. అప్పుడు చెప్తోంది న్యూస్ రీడర్ ఆ వార్త.

జానకి గభాల్న టివి ఆఫ్ చేస్తుంటే ఉమాదేవి " ఆగు .. అయ్యయ్యో .. ఈ సంఘటన మా ఇంటి దగ్గరే జరిగింది.. ఆపకు ఆన్ చేయి జానకీ" అంటూ రిమోట్ లాక్కుని వార్తలు శ్రద్ధగా వినసాగింది.

జానకి నిలువెల్లా వణికిపోతూ అక్కడినుంచి లేచి లోపలికి వెళ్ళిపోయింది.

"వార్త అయాక టివి ఆఫ్ చేసి వచ్చి అదేంటి అలా వచ్చేశావు. చాలా ఘోరం తెలుసా? ఏంటో అసలు సమాజం ఎటు పోతోందో తెలియడం లేదు. ఇవన్నీ ప్రస్తుతం జరుగుతున్నవే. మా ఇంటి పక్క అమ్మాయే. పాపం ఏదో సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తోంది. రాత్రి రెండు గంటలకి డ్యూటీ పూర్తి చేసుకుని ఆఫీస్ కాబ్ లో వస్తోంటే ఆ వెధవ కాబ్ డ్రైవర్ ..."

"ఉమా !" గట్టిగా అరిచింది జానకి.

ఉమా నిశ్చేష్టురాలై చూసింది.

జానకి రెండు చెవులూ మూసుకుంటూ వద్దు.. "నాకు చెప్పద్దు.. ఇప్పటికే భయంతో పిచ్చెక్కి పోతోంది.." అంటూ వెక్కి, వెక్కి ఏడవసాగింది.

ఆ ఏడుపు చూసి కొంతసేపు అలా నోట మాట రానట్టు ఉండిపోయిన ఉమ సానుభూతిగా జానకి భుజం మీద చేయేసి " నాకు అర్థమైంది జానకి. నువ్వు ఈ వార్తలు విని మనసు చెదిరి ఉన్నావు. నీకు ముందు కౌన్సిలింగ్ కావాలి. నాతో రా.. నిన్ను ఒక దగ్గరకి తీసుకు వెళ్తాను. సాయంత్రానికి వచ్చేయచ్చు. ఇలాగే ఉంటే పిచ్చి దానివి అవుతావు. నువ్వు సుఖంగా ఉండవు. నీ వాళ్ళని సుఖంగా ఉండనివ్వవు" అని బలవంతంగా బయటకి తీసుకు వచ్చింది.

ముందు ఉమా ఇంటికి వెళ్లి ఆయనెవరో స్వామీజీ ఫోన్ నెంబర్ అడ్రస్ తీసుకుని "ఇక్కడే దగ్గరే ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్నాట్ట .. జూబిలీ బస్ స్టేషన్ నుంచి బస్ లు ఉన్నాయి వెళ్దాం పద" అంటూ ఆటో మాట్లాడి బస్ స్టాండ్ కి తీసుకు వచ్చింది.

అక్కడి నుంచి నిజామాబాద్ వెళ్ళే దారిలో చిన్న గ్రామంలో బస్ దిగి స్వామీజీ ఆశ్రమం వెతుక్కుంటూ వెళ్లేసరికి రాత్రి అయింది.

ఎలాగో ఆశ్రమం చేరారు. స్వామీజీ దర్శనం కాకపోయినా అక్కడ ఉన్న ఇద్దరు స్త్రీలు వీళ్ళని ఆదరించి "ఇప్పుడు స్వామి ధ్యానంలో ఉంటారు.. రేపు ఉదయం దర్శనం ఇస్తారు" అని, ఆ రాత్రి అక్కడే ఉండమని చెప్పారు.

"ఇంట్లో చెప్పకుండా వచ్చాం ఉండలేము" అని ఎంత చెప్పినా "ఇంత దూరం వచ్చి స్వామి దర్శనం చేసుకోకుండా ఎలా వెళ్తాం జానకి, ఉండిపోదాం. ఫోన్ చేద్దాం మీ వాళ్ళకి అంది. ఫోన్ నెంబర్ లేదు అనేసరికి అయ్యో నా దగ్గర కూడా లేదు మీ వారి నెంబర్ ఎలా?" అంది.

వెంటనే నేను మా వారికి ఫోన్ చేసి చెప్తా మీ ఇంటికి వెళ్లి మీ వారికి కూడా చెప్పమని అంది.

అక్కడ ఉన్న స్త్రీలు కూడా "ఫర్వాలేదమ్మా ఉదయం ఎనిమిది కల్లా దర్శనం చేసుకుని వెళ్లిపోదురురుగాని. మళ్ళీ, మళ్ళీ రాలేరు కదా..స్వామిని కలుసుకోడం అదృష్టం. వదులుకోకు ఈ అవకాశం " అని నచ్చచెప్పి అక్కడే ఉంచేశారు.

కానీ, భర్త, పిల్లల మీద దిగులుతో, ఆందోళనతో రాత్రంతా నిద్ర పట్టలేదు. తెల్లవారుతుండగా నిద్ర పట్టింది. మెలకువ వచ్చేసరికి పది అయింది. బ్రష్ చేసుకోడానికి ఏమి లేవు. బట్టలు లేవు. అసలేంటి ఇలా ఉండిపోయాను. నాకేం జరుగుతోంది. ఉమాదేవి ఎక్కడ? అయోమయంగా అటూ, ఇటూ దిక్కులు చూస్తుంటే "మీతో వచ్చినావిడకి వాళ్ళ ఆయనకీ ఆరోగ్యం బాగాలేదని ఫోన్ వచ్చిందిట.. వెళ్ళిపోయింది.. మీరు స్నానం చేసి రండి స్వామిని దర్శించుకుందురు గాని" అని చెప్పింది ఒకావిడ.

"వెళ్లిపోయిందా?" ఆశ్చర్యంగా చూసింది జానకి. తనని ఒక్కదాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయిందా. ఏనాడూ వంటరిగా ఇల్లు కదలని తనని ఇదేదో ఊర్లో వదిలి పెట్టి ఉమాదేవి వెళ్లిపోయిందా. ఎందుకిలా మోసం చేసింది! జానక్కి ఓ పక్క కోపం, మరో పక్క దుఃఖం ముంచేస్తుంటే బొమ్మలా వెళ్లి స్నానం చేసి అవే బట్టలు వేసుకుంది.

ఎనిమిది గంటలకి స్వామి దర్శనం అయింది. " ఏంటమ్మా నీ సమస్య?" అని అడిగాడు. గడ్డం, జుట్టు బాగా పెరిగిపోయి ఉన్నాయి. కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లా ఉన్నాయి. ఆయన్ని చూడగానే భయం వేసింది. తన సమస్య ఏంటో, ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఉమాదేవి ఏదో కౌన్సిలింగ్ అంటూ తీసుకొచ్చింది. ఎందుకు కౌన్సిలింగ్? తన సమస్య ఏంటి? ఏమి తెలియడంలేదు. అసలు బ్రెయిన్ ఫ్రీజ్ అయినట్టుగా ఉంది ఆవిడకి.

"చెప్పు ఏంటి నీ సమస్య.. భర్త కష్టాలు పెడుతున్నాడా. అమ్మాయి పెళ్లి కావడంలేదా?"

గబ,గబా తల అడ్డంగా ఊపి " కాదు స్వామీ ఎందుకో తెలియని భయం కలుగుతోంది. ఆ భయం గురించి ఎవరికైనా చెప్పాలన్నా భయంగానే ఉంది" అంది.

ఆయన అదోలా నవ్వాడు. "భయం. ఆదనమాట సంగతి. మంచిది నువ్వు రెండు రోజులు ఇక్కడే ఉండు నీ భయం పోగొడతాను. రాజమ్మా" అని పిలిచాడు.

రాజమ్మ వచ్చింది. "ఈమెని నీ గదిలో ఉంచుకో. ఆమె భయం ఏంటో తెలుసుకో అని చెప్పి జానకి వైపు చూసి వెళ్ళు ఆమెతో ఉండు" అన్నాడు.

జానకి అయోమయంగా చూస్తూ ఆ రాజమ్మతో వెళ్ళింది. ఆమె తన గదికి తీసుకు వెళ్లి "టిఫిన్ తిన్నావా?" అంది..

మనిషి బాగా నల్లగా ఉంది. విపరీతమైన ఒళ్ళు. నల్లగా బాగా చిక్కగా ఉంగరాలు తిరిగిన జుట్టు. ఆమె నవ్వు చూస్తుంటే రోతగా ఉంది. తననే చూస్తున్న జానకిని హెచ్చరిస్తూ "టిఫిన్ తిను" అంటూ ప్లేటులో ఉప్మా తెచ్చింది.

ఆకలిగా ఉన్న జానకి గబుక్కున ప్లేట్ అందుకుని ఉప్మా తినేసింది.

"కూర్చో.. వస్తా" అంటూ రాజమ్మ గదిలోంచి బయటకు వెళ్ళింది.

జానకి కిటికిలోంచి బయటకి చూసింది. రాత్రి సరిగా గమనించలేదు. అది ఆశ్రమంలా లేదు. ఓ చిన్న పెంకుటిల్లు. చిన్న గేటు. నాలుగే అడుగులు నడిస్తే లోపలికి రావడానికి ద్వారం. చుట్టూ కాంపౌండ్ వాల్. ఎక్కడా ఒక్క పూల మొక్క కూడా లేదు. కనీసం తులసి మొక్క కూడా లేదు. రాజమ్మ కాక మరి ఇద్దరో ముగ్గురో స్త్రీలు ఉన్నారు. ఒక పదహారేళ్ళ కుర్రాడు ఉన్నాడు. ఎందుకో ఆ ఇల్లు, ఆ వాతావరణం, స్వామీజీ, రాజమ్మ ఎవరూ నచ్చలేదు జానక్కి. తనిక్కడ రెండు రోజులుండాలా. జరగనిపని. ఎలా ఉంటుంది. అవతల ఇంట్లో ఎంత గోల అవుతోందో. ఆయన తనకోసం పోలీస్ రిపోర్ట్ ఇచ్చినా ఇస్తారు. వెళ్లిపోవాలి.. ఇక్కడినుంచి వెళ్లిపోవాలి. జానకి అస్థిమితంగా అటూ, ఇటూ తిరగసాగింది.

ఉమాదేవి తనని ఇక్కడికి ఎందుకు తీసుకు వచ్చింది? చెప్పా చేయకుండా ఎందుకు వెళ్ళిపోయింది?

వీళ్ళకి, ఉమా దేవికి ఏంటి సంబంధం? అనేక రకాల ప్రశ్నలతో జానకి తల పగిలిపోతున్నట్టు అనిపించింది. పిల్లలు, భర్త. వెళ్లిపోవాలి. తను ఏమైపోయిందో అని వాళ్ళు ఎంత కంగారు పడుతున్నారో ఏంటో. జగన్మాతా… నన్ను కాపాడు.. నేను తెలివి తక్కువగా ప్రవర్తించాను.. నా భర్తకి చెప్పకుండా మొదటిసారి ఇల్లు వదిలి వచ్చాను. నన్ను క్షేమంగా ఇల్లు చేర్చు తల్లి అమ్మవారిని వేడుకుంటూ అలాగే కూర్చుంది.

ఈ ఊరు పేరేంటో. ఇక్కడ నుంచి హైదరాబాద్ వెళ్ళడం ఎట్లాగో.. అసలంటూ బస్ స్టాండ్ కి వెళ్తే అన్ని తెలుస్తాయి. కానీ పర్స్ పోయింది.. డబ్బులు లేవు.. ఎలా ఇక్కడినుంచి బయటపడాలి.

జానకి ఆలోచిస్తూ ఉండగానే భోజనం టైం అయిందని భోజనం తెచ్చి పెట్టింది రాజమ్మ. ఆకుకూర పప్పు, వంకాయ కూర, అన్నం .. తినాలని అనిపించలేదు కానీ ఆకలితో కళ్ళు తెలిపోతున్నాయి. ఇంత తిని ఇక్కడినుంచి బయట పడితే ఎలాగో అలా బస్ స్టాండ్ కి వెళ్ళచ్చు. నడిచే ఓపిక వస్తుంది.. కొద్దిగా అన్నం కలుపుకుని నోట్లో పెట్టుకుంది.. రుచిగానే ఉంది.

జానకి భోజనం చేస్తుంటే అడిగింది రాజమ్మ. "నీ భర్త ఏం చేస్తుంటాడు.?"

చెప్పింది జానకి.

"ఎంతమంది పిల్లలు"

జానకి చెప్పింది.

"నీ వయసు?"

"యాభై ఒకటి పూర్తీ అవుతుంది వచ్చే నెల."

"అంత వయసున్నట్టు లేవే. .. బాగానే ఉన్నావు.. పిట,పిటలాడుతూ ."

జానకి నోట్లో ముద్ద జారిపోయింది.. స్థాణువులా చూసింది.

"ఏంటి అట్లా చూస్తున్నావు? స్వామి నీ సమస్య తీరుస్తాడులే భయపడకు. రాత్రి ఎనిమిది గంటలకి ధ్యానం చేసాక నిన్ను పిలుస్తాడు.. అప్పుడు నీ ప్రశ్నలు వింటాడు.."

ఆమె భాషలో ఏదో లోపం. ఎక్కడా సభ్యత, సంస్కారం లేని భాష.. నవ్వులో విషం..మనిషి బాగా మదమెక్కిన దానిలా ఉంది. జానక్కి అనుమానం వచ్చింది. భయంతో ఒళ్ళు జలదరించింది.

"తిను, తిను" అంటూ రాజమ్మ అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయింది.

జానకికి ఇంక మెతుకు కూడా సయించలేదు. గభాల్న లేచి కంచం తీసి కిటికిలోంచి వంచి బయటికి మిగిలిన అన్నం వంపేసింది. గ్లాసులో నీళ్ళతో చేయి కడుక్కుని గదిలోంచి బయటికి వచ్చింది. ఒక చిన్న వరండా. వరసగా అటూ, ఇటూ రెండేసి గదులు, వరండా దాటి వెళ్తే నాలుగు మెట్లు.. దిగి నాలుగు అడుగులు నడిస్తే గేటు.

అందరూ లోపల అన్నాలు తింటున్నట్టున్నారు.

జానకి వేగంగా బయటికి నడిచింది. ఎవరూ ఊహించలేదు ఆమె వెళ్ళగలదని. అందుకే ఎవరూ చూడలేదు. జానకి ఆగకుండా రోడ్డు మీదకి వచ్చింది.

లీలమ్మ, శారద ఉదయాన్నే లేచి ఇంట్లో వాళ్ళకు వంటలు చేసిపెట్టి, ఆరున్నరకల్లా బయలుదేరారు. వాళ్ళతోపాటు వెళ్ళాలి అనుకున్న ఆదినారాయణ కొంచెం నలతగా ఉండి లేవలేకపోవడంతో ఇద్దరే వెళ్ళారు.

వాళ్ళ అజ్ఞానానికి విచారిస్తూ భాస్కర్ ఉదాసీనంగా ఉండిపోయాడు.

తనకి బాగా తెలిసిన ట్రావెల్స్ కి ఫోన్ చేసి మంచి డ్రైవర్ని పిలిపించాడు. శారద వాళ్ళ కారులో ఇద్దరు ఆడవాళ్ళు, జానకిని వెతుక్కుంటూ మరో ఊరికి వెళ్తుంటే తనది చేతకానితనమా, నిస్సహాయతా అర్ధం కాలేదు భాస్కర్ కి. కానీ వాళ్ళలా తను బాబాలను, స్వామిజిలను నమ్మి వెళ్ళడం మూర్ఖత్వమే కాదు చేతకాని తనం కూడా అనిపించింది.

స్విఫ్ట్ కారు నిజామాబాద్ బయలుదేరింది.

డ్రైవర్ కి దారి స్పష్టంగా తెలిసినా భాస్కర్ మరోసారి నాగోల్ మీదుగా ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి ఎలా వెళ్ళాలో చెప్పాడు.

అప్పటికే ట్రాఫిక్ క్రమంగా పెరుగుతూ, ప్రతి సిగ్నల్ దగ్గరా ఆగుతూ క్లాక్ టవర్ దగ్గరకు వచ్చేసరికి గంట దాటింది. “ఈ లెక్కన ఎన్నింటికి చేరుతామో” అంది లీలమ్మ.

శారద అవును అన్నట్టుగా తల పంకించి బయటికి చూడసాగింది.

గ్రీన్ లైట్ వెలిగింది. కారు ముందుకు కదిలి కొంత దూరం వెళ్లి యూ టర్న్ తీసుకుని ఎడం పక్కకి తిరిగింది.

“హమ్మయ్య ఇక్కడనుంచి పెద్దగా ట్రాఫిక్ ఉండదులెండి” అంది శారద నిట్టూరుస్తూ.

“మనం వెళ్లేసరికి స్వామివారు పూజ పూర్తి చేసుకుని భక్తులకి దర్శనం ఇస్తుంటారు కాబోలు” అంది లీలమ్మ.

శారద కూడా అదే అనుకుంది.

“పోనీలే.. ఆయన దర్శనం అయి, పిల్ల జాడ చెబితే చాలు” అందావిడ మళ్ళీ.

“చెప్తారు లెండి” ఆవిడని ఓదారుస్తూ అంది శారద.

“ఏంటో .. ఈ వయసులో ఈ దౌర్భాగ్యం ఏంటమ్మా ఖర్మ కాకపోతే ...” అంటూ జానకి చిన్నతనం దగ్గరనుంచి ఆమె స్వభావం, ఆమె సాత్వికత, ఆమె చదువు, పెళ్లి అన్ని విషయాలు చెప్పసాగింది లీలమ్మ.

శారదకి జానకి స్వభావం బాగా తెలుసు. సాత్వికురాలు, కుటుంబానికే అంకితం అయిన స్త్రీ. భర్తంటే ప్రేమ, పిల్లలంటే ప్రాణం... తనకంటూ స్వంత జీవితం అనేది లేదని వాళ్ళే తన జీవితం అని నమ్మిన అమాయకురాలు.

అయితే అనూహ్యంగా జానకి ఈ మధ్య కొంచెం పరధ్యానంగా, చికాకుగా ఉండడం తనూ గమనించింది. ఇదివరకు కొత్త సినిమా రాగానే కొత్త సినిమా వచ్చిందిటగా శారదా.. మంచి సినిమానా, వెళ్దామా అంటూ ఇంటికి వచ్చేసేది. ఇటివల తమాషాగా మారిపోయింది. తను వెడదామన్నా వద్దులే శారదా ఇంట్రస్టు లేదు అంది.. ఒక షాపింగ్, సినిమా, ఆఖరికి గుడికి కూడా ఎంతో బలవంతం చేస్తే తప్ప ఇంట్లో

నుంచి కదలని జానకి హటాత్తుగా ఎక్కడికి మాయమైపోయింది. కావాలని ఇల్లు విడిచి వెళ్ళిందా.. ఎందుకు? ఏదన్నా బలమైన కారణం ఉండాలికదా!

తార్నాక క్రాస్ రోడ్ దగ్గరకి వస్తోంది.. హటాత్తుగా శారద దృష్టి రోడ్డుకి రెండు పక్కలా పెట్టిన ఫ్లెక్సిల మీదకి పోయింది..

మహేంద్ర బాబా.. అపర షిరిడి సాయిబాబా.. అద్భుతమైన శక్తులు కలిగిన బాబాని దర్శించుకోండి.. మీ సమస్యల నుంచి సాంత్వన పొందండి.. మీ అమ్మాయి వివాహం కావడం లేదా? మీ అబ్బాయికి అమెరికా వెళ్ళడానికి వీసా రాలేదా.. మీకు సంతానం కలగలేదా.. మీ భర్త మిమ్మల్ని హింసిస్తున్నారా ... ఎలాంటి సమస్య అయినా తన దివ్య శక్తులతో చిటికెలో మాయం చేసే బాబా గారు.. సంగారెడ్డి సమీపంలోని సాయిబాబా ఆలయం ..

వెనక నుంచి గట్టిగా హరన్ మోతలకి చిరాగ్గా తల వెనక్కి తిప్పి చూసింది శారద.

వెనకాల చాలా వెహికేల్స్ ఆగి ఉన్నాయి. సిగ్నల్ పడింది కదా.. సెన్స్ ఎందుకు ఉండదు వీళ్ళకి ... ఊరికే హరన్ మోగిస్తారు.. అనుకుంటూ లీలమ్మ వైపు చూసి ఆవిడకి మహేంద్ర బాబా ఫ్లెక్సీ చూపిస్తూ అడిగింది "ఆయనేనా మీరు చెప్పిన బాబాగారు."

ఆవిడ రోడ్ మీదనుంచి ఫ్లెక్సీ ల వైపు చూసింది.. "ఆ ఆయనే... చూశావా మొహంలో ఎంత తేజస్సో" అంది భక్తిగా వెలిగిపోతున్న మొహంతో.

శారద పరీక్షగా చూసింది.. గడ్డం , కాషాయ వస్త్రాలు, మెడలో గుత్తులుగా ఉన్న హారాలు..

ఆవిడకి కనిపించిన తేజస్సు శారదకి కనిపించలేదు.

"వీరిని కూడా ఓ సారి దర్శించుకుందాం శారదా!" అందావిడ.

"అలాగే లెండి చూద్దాం విద్యానందస్వామి గారి దగ్గర పని అయాక వీలయితే ఆయన్ని కూడా దర్శించుకుందాం" అంది శారద అంతగా ఆసక్తి చూపించకుండా.

కారు మరికొద్ది సేపటికి హైవే మీదకి చేరింది.

శారదకి నెమ్మదిగా కళ్ళ మీదకి నిద్ర ఆవరించింది కళ్ళు మూసుకుంది.

క్లాస్ నిశ్శబ్దంగా ఉంది. ఇంగ్లిష్ లెక్చరర్ చెప్తున్న పాఠం వినడంలో అందరూ పూర్తిగా మునిగిపోయి ఉన్నారు.....

What is illusion... do u think that the man's experience is an illusion... no it was not illusion ... after some months have passed he realized that it was not illusion... and it was not a dream... it's real.... It's true.... ఆవిడ మధురమైన స్వరం ప్రవాహంలా సాగిపోతోంది..

మొత్తం విద్యార్థులంతా నిశబ్దంగా వింటున్నారు..

కానీ, అవంతి దృష్టి మాత్రం లెక్చర్ మీద లేదు. తన పక్కనే కూర్చున్న చరిత మీద ఉంది. మూడు రోజులనుంచి తల్లి పట్ల బెంగతో, వేదనతో , దుఖంతో దాదాపు పిచ్చిదానిలా ప్రవర్తించిన చరిత ఇవాళ ప్రశాంతంగా కనిపిస్తోంది. ఎంతో కాన్సెన్ట్రేషన్ తో లెక్చర్ వింటోంది. ఇలాంటప్పుడు తనని డిస్టర్బ్ చేస్తే చరితకి కోపం వస్తుంది. కానీ కుతూహలం అవంతిని ఆగనివ్వడం లేదు.

చరిత ఇలా ఉందంటే బహుశా ఆంటి ఇంటికి వచ్చి ఉంటుంది. హమ్మయ్య.. అవంతికి నిశ్చింతగా అనిపించింది. అసలు ఆంటీ ఎక్కడికి వెళ్లిందో చరితని అడిగితే తెలుస్తుంది. కొంచెం చరితకి దగ్గరగా జరిగింది.

"చరితా!" ఎవరూ వినకుండా సన్నని గొంతుతో పిలిచింది,

చరిత తల తిప్పి అవంతి వైపు ప్రశ్నార్ధకంగా చూసింది.

"మీ మమ్మీ ఇంటికి వచ్చిందా చరితా?" గుస గుసగా అడిగింది అవంతి.

అప్పుడప్పుడే క్లాసుల మీద, చదువు మీద ధ్యాస మళ్ళించుకుంటున్న చరిత ఉలిక్కిపడింది.

సూటిగా అవంతి వైపు చూసింది.

అవంతి కళ్ళల్లో ఆత్రుత ... భయం ...

మళ్ళీ అడిగింది... "మీ మమ్మీ వచ్చిందా.."

చరిత చూపులు ఎదురుగా ఉన్న లెక్చరర్ వైపు తిప్పుకుని నెమ్మదిగా అంది " ఇప్పుడెందుకు అడుగుతున్నావు.. అయినా చెప్తున్నా విను.. వస్తుంది... కచ్చితంగా వస్తుంది."

"అవునా! " అవంతి స్వరంలో నిశ్చింత.

"ఎక్కడికి వెళ్లిందో తెలిసిందా?"

"లేదు ... ప్లీజ్ డిస్టర్బ్ ."

అవంతి ఆశ్చర్యంగా ఇంకా ఏదో అడగబోయి సంశయంగా ఆగిపోయింది.

ఇంకా రాలేదా... వస్తుంది అని ఇంత నిశ్చింతగా ఎలా చెబుతోంది చరిత. బహుశా ఆవిడ ఎక్కడికి వెళ్లిందో తెలిసి అంకుల్ వెళ్ళారేమో తీసుకురావడానికి. ఎక్కడికి వెళ్లి ఉండచ్చు?

"అంకుల్ తీసుకు వస్తారా? "

ఈసారి అవంతి ప్రశ్నకి చరిత సమాధానం చెప్పలేదు. సీరియస్ గా లెక్చర్ వినసాగింది.

అవంతి లెక్చరర్ వైపు అసహనంగా చూసింది. ఈ క్లాసు ఎప్పుడు అయిపోతుందో.. ఈవిడ ఎప్పుడు వెళ్ళిపోతుందో ... విసుగ్గా చూడసాగింది.

పది నిమిషాల్లో క్లాస్ అయిపోయింది.

అవంతి చరితని ఆత్రంగా అడిగింది "ఆంటీ ఎక్కడికి వెళ్లారు? ఎప్పుడు వస్తారు? అసలు ఎందుకు వెళ్ళారు? చెప్పు చరితా నాకు చాలా టెన్షన్ గా ఉంది.."

చరిత అవంతి వైపు చూసి "లైబ్రరీ కి వెళ్దాం పద" అంటూ కూర్చున్న దగ్గరనుంచి లేచింది.

అవంతి ఉత్సాహంగా లేచి అనుసరించింది.

లైబ్రరీకి వెళ్ళాక చెప్పింది చరిత. "అమ్మ ఎక్కడికి వెళ్లిందో తెలియదు.. కానీ ఒక బాబా గారు అమ్మ ఎక్కడ ఉందో చెప్తారుట .. అమ్మమ్మ , శారద ఆంటీ ఆయన దగ్గరకు వెళ్ళారు.."

అవంతి ఆశ్చర్యంగా చూసింది. "బాబాగారు చెప్తారా.. ఎలా?"

"ఆయనతో అమ్మవారు మాట్లాడతారుట ... బాబా గారు అమ్మవారిని అడిగి చెప్తారు."

"నిజమా.!.." కళ్ళు పెద్దవి చేసి చూసింది అవంతి. ఆ కళ్ళల్లో నమ్మకం, అపనమ్మకం, ఆశ్చర్యం, కుతూహలం అనే అనేక రకాల భావాలు కదలాడసాగాయి. ఏం చెప్తారు..

"ఏమో! ఎక్కడికి వెళ్ళింది చెప్తారు... ఎప్పుడు వస్తుంది కూడా చెప్తారు."

"ఇంకా ఏం చెప్తారు.. అంటే మనం డాక్టర్ అవుతామా, ఇంజనీర్ అవుతామా చెప్తారా?"

చరిత చిత్రంగా చూసింది. " మనం డాక్టర్ అవాలని కదా సైన్సు తీసుకున్నాము. ఇంజనీరు ఎలా అవుతాము?"

అవంతి ఆలోచిస్తూ అంది "బాబాగారు కదా .. అమ్మవారితో మాట్లాడి మనకి ఇష్టం లేని చదువు చదవకుండా అడ్డుపడరూ.."

"నీకు మెడిసిన్ ఇష్టం లేదా?"

"లేదు ..." నిట్టూర్చి అంది అవంతి "అమ్మ ఫోర్సు చేసింది అందుకే సైన్సు తీసుకున్నాను.."

"నీకు ఏమిష్టం?"

అవంతి చరిత వైపు సూటిగా చూసి, మొహం తిప్పేసుకుని "నాకు అసలు చదువే ఇష్టం లేదు.. తొందరగా పెళ్లి చేసుకుని మా ఇంటినుంచి వెళ్ళిపోవాలని ఉంది."

చరిత ఉలిక్కి పడ్డట్టు చూసింది.. "ఎందుకు?" విస్మయంగా అడిగింది.

అవంతి మాట్లాడలేదు.. తల వంచుకుని గోళ్ళు చూసుకోసాగింది.

"ఏమైంది అవంతి ... ఎందుకు మీ ఇంట్లో నుంచి వెళ్ళిపోవాలని అనుకుంటున్నావు?" ఆప్యాయంగా అడిగింది చరిత అవంతి చేయి పట్టుకుని.

అవంతి కళ్ళ నుంచి జల, జలా రాలాయి కన్నీళ్ళు..

"అరే ఏడవకు... ఎందుకేడుస్తున్నావు? ప్లీజ్ చెప్పు అవంతీ " అవంతి కన్నీళ్ళు తుడిచింది.

"నాకు మా అమ్మంటే అసలు ఇష్టం లేదు చరితా.. అసలు మీ అమ్మ బదులు మా అమ్మ ఇంట్లోనుంచి వెళ్ళిపోతే బాగుండేది.."

చరిత నివ్వెరబోయింది.. అవంతికి పిచ్చా... అమ్మ గురించి ఇలా మాట్లడచ్చా..

అవంతి మళ్ళీ చెప్పసాగింది.. "మా అమ్మ ఎప్పుడు చూసినా ఇంట్లో గట్టి, గట్టిగా అరుస్తూ ఉంటుంది. నాన్నని, నన్ను అస్తమానం తిడుతూ ఉంటుంది.. తనేం చెబితే అదే అందరూ చేయాలి అంటుంది. అసలు మా అమ్మకి ప్రేమగా మాట్లాడడం అనేది తెలియదు.. నాకు మా అమ్మంటే అసలు ఇష్టం లేదు.. అందుకే పెళ్లి చేసుకుని అత్తారింటికి వెళ్ళిపోతా."

చరితకి అవంతి మాటలు వింటుంటే జాలేసింది..

అవంతి చేయి పట్టుకుని నెమ్మదిగా అంది " అలా అనకూడదు. అమ్మ మన మంచికోసమే చెప్తుంది ఏదైనా. కాకపోతే కొంచెం ప్రేమగా చెప్పక పోవచ్చు. అంత మాత్రాన అమ్మకి నువ్వంటే ఇష్టం ఉండకపోదుగా. మా అమ్మ వచ్చేసాక ఒకరోజు మీ ఇంటికి తీసుకు వస్తాను మీ అమ్మకి అమ్మతో నిన్ను ప్రేమగా చూడమని చెప్పిస్తాను సరేనా?"

"లేదులే మా అమ్మ ఎవరు చెప్పినా వినదు."

"తప్పకుండా వింటుంది. నీకెందుకు ఆంటిలో మార్పు నువ్వే చూస్తావుగా..పద ఇప్పుడు నెక్స్ట్ క్లాసు అటెండ్ అవుదాము."

అవంతి చున్నీతో కన్నీళ్ళు తుడుచుకుని విస్మయంగా అడిగింది " నువ్వు ఇంత ధైర్యంగా ఎలా ఉన్నావు చరితా? నిజంగా బాబాగారు మీ అమ్మ ఎక్కడ ఉందో చెప్తారా? కరెక్ట్ గా చెప్తారా?"

"బాబాగారు అంటే మామూలు బాబాగారు కాదు. షిరిడి సాయి నిజామాబాదులో వెలిసారుట. మరి షిరిడి సాయి బాబా అంటే బోలెడు మహిమలు ఉంటాయిగా. తప్పకుండా చెప్తారు.. అమ్మని తీసుకుని వస్తారు అమ్మమ్మ, ఆంటి. "

షిరిడి సాయి నిజామాబాదు లో వెలిశారా! అంటే. మళ్ళీ పుట్టారా? దేవుళ్ళకి మరణం లేదు అంటారు కదా మళ్ళీ పుట్టడం ఏంటి? పుట్టడం కాకపోతే వెలిశారు అంటే అర్థం ఏంటి? నిజంగా ఆయన ఆంటి ఎక్కడికి వెళ్ళారో చెప్తారా? నిజంగా బాబాగారికి మహిమలు ఉండి ఉంటాయా? ఇంకా ఏం చెప్తారు? అమ్మని కూడా వెళ్ళమని చెప్పాలి.. ఆవిడకి ఏం కావాలి? ఎందుకు ఎప్పుడూ కోపంగా చికాకుగా ఉంటుందో ఆయన ఏదన్నా మంత్రం వేసి అమ్మని మంచిగా చేస్తారేమో.. లేకపోతే విభూతి ఇచ్చి అమ్మ చికాకు పోగొడతారేమో..!

అవంతి మెదడంతా రకరకాల ఆలోచనలతో గజిబిజిగా అయింది.

లీలమ్మ, శారద ఆర్మూర్ లో ఉన్న విద్యానంద స్వామి ఆశ్రమం చేరేసరికి పది దాటింది. మార్చ్ నెల కావడంతో అప్పటికే ఎండ చుర్రుమంటోంది.

ఎక్కువ శ్రమ పడకుండానే ఆశ్రమం చేరుకొని, గేటు ముందు కారు ఆపాడు డ్రైవర్.

లోపలనుంచి కొందరు భక్తులు చేతిలో ప్రసాదంతో బయటికి వస్తున్నారు.

“మనం అదృష్టవంతులం. స్వామి ఇంకా దర్శనం ఇస్తున్నారు” అంది లీలమ్మ.

శారద కారు దిగి తలెత్తి గేటునుంచి లోపల ఆవరణదాకా పరిశీలించి చూసింది.

అలా చూస్తుంటేనే ఏదో తెలియని భక్తి భావం గుండెనిండా నిండిపోయింది.

లోపల చాలామంది భక్తులు ఉన్నా ఎక్కడా హడావుడి, అలజడి కనిపించడం లేదు. చాలా ప్రశాంతంగా ఉంది. సాధారణంగా ఇలాంటి చోట కనిపించే భజనలు, జయ జయధ్వానాలు లేవు. లోపలికి వెళ్ళే వాళ్ళు, బయటికి వచ్చేవాళ్ళు కూడా నిశ్శబ్దంగా వస్తున్నారు.

“రామ్మా” అంటూ లీలమ్మ గేటు దాటి ఆవరణ లోకి ప్రవేశించింది. ఆవిడ చేతిలో దారిలో కారు ఆపి కొన్న అరటిపండ్లు, పూలు ఉన్నాయి.

ఇద్దరూ వరండా మీదకి వెళ్లారు. ఇంకా హోమగుండం వెలుగుతూనే ఉంది. నిప్పు కణికలు ఎర్రగా మండుతున్నాయి. సుగంధ ద్రవ్యాల పరిమళం, సాంబ్రాణి పరిమళం అంతా వ్యాపించింది.

ఒక శిష్యుడు కాషాయరంగు ధోవతి, భుజం చుట్టూ కండువా కప్పుకుని , నుదుట విభూతి బొట్టుతో వాళ్ళ దగ్గరకు వచ్చాడు.

“చండి హోమం అయిపోయింది” అన్నాడు.

“స్వామిని దర్శించుకోడానికి వచ్చాము” అంది లీలమ్మ.

అతను గోడకి ఉన్న గడియారం చూసి “ ఇప్పుడు సమయం అయిపోయింది. మీరు తిరిగి రేపు ఉదయం రండి” అన్నాడు.

లీలమ్మ బతిమాలుతున్న స్వరంతో అంది “కాదు స్వామి మేము హైదరాబాద్ నుంచి వస్తున్నాము.. అవసరంగా స్వామిని కలవాలి. దయచేసి దర్శనం ఇప్పించండి.”

“కుదరదమ్మా. స్వామికి విశ్రాంతి సమయం అయింది” అన్నాడు అతను.

లీలమ్మ నిస్సహాయంగా శారద వైపు చూసింది. శారద నెమ్మదిగా అంది “మేము స్వామిని అవసరంగా దర్శించుకోవాలని ఎంతో కష్టపడి వచ్చాం.. ఆడవాళ్ళం. మళ్ళీ, మళ్ళీ అంత దూరం నుంచి వచ్చే అవకాశం లేదు. దయచేసి దర్శనం ఇప్పించండి.”

ఇంతలో మరో శిష్యుడు “ ఏంటి సంగతి?” అంటూ అక్కడికి వచ్చాడు.

లీలమ్మ మళ్ళి చెప్పిన విషయమే చెప్పింది.

శిష్యులు ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు “సరే ఉండండి” అంటూ ఇద్దరూ స్వామి ఉన్న గదిలోకి వెళ్ళారు.

రెండు నిమిషాల్లో తిరిగి వచ్చి “ వెళ్ళండి స్వామి రమ్మన్నారు” అన్నాడు ఒకతను.

ఇద్దరి మొహాల్లో వెలుగు వచ్చింది..

కొంచెం బెరుకుగా లోపలికి వెళ్లారు. ప్రశాంతంగా కూర్చున్న స్వామిని, ఆయన వెనక గోడకి ఉన్న నిలువెత్తు కాళికాదేవి పటాన్ని చూసి నమస్కరించారు.

స్వామి చిరునవ్వుతో తల పంకించి కూర్చోమన్నట్టుగా సైగ చేసారు.

లీలమ్మ చేతిలో ఉన్న పళ్ళు, పూలు స్వామికి కొంచెం ఎడంగా ఉన్న వెండి పళ్ళెంలో పెట్టి కొంగు భుజాల చుట్టూ కప్పుకుని చాప మీద ఒదిగి కూర్చుంది. శారద ఆవిడ పక్కనే కూర్చుంది.

“చెప్పండమ్మా” అన్నాడు స్వామి ఆదరపూర్వకంగా.

శారద లీలమ్మ వైపు చూసింది. ఆవిడ చెప్పు అన్నట్టు శారద వైపు చూసింది.

శారద “మీరే చెప్పండి” అంది సన్నగా.

ఆవిడ కొన్ని క్షణాలు మౌనంగా ఉండి చెప్పసాగింది.

ఆరోజు ఉదయం భాస్కర్ దగ్గరనుంచి ఫోన్ వచ్చిన క్షణం నుంచి మొత్తం చెప్పి అంది “అసలు మా అమ్మాయికి కష్టం అంటూ ఏమి లేదు స్వామి ... దేవుడులాంటి భర్త, రత్నాల్లాంటి పిల్లలు.. స్వంత ఇల్లు, ఆర్ధికంగా కూడా ఏ ఇబ్బంది లేదు... ఎగువ మధ్య తరగతి కుటుంబం .. మరి ఎందుకు హటాత్తుగా అలా వెళ్ళిపోయిందో మాకు అర్ధం కావడం లేదు.. అంతా అయోమయంగా ఉంది.”

ఆయన భ్రుకుటి ముడిచి “ఆవిడ వయసు ఎంతమ్మా?” అనడిగాడు.

“యాభై వచ్చిందనుకుంటా...” అంది లీల శారద వైపు చూసి.

“ఆరోగ్య సమస్యలు ఏమన్నా ఉన్నాయా..?”

“లేదు స్వామి చాలా ఆరోగ్యంగా, చలాకీగా ఉండేది. కాకపోతే ఈ మధ్య అంటే గత మూడు నాలుగు నెలలుగా ఏదో మానసికంగా బాధపడుతోంది. ఏంటి అంటే చెప్పదు ” శారద చెప్పింది. ఆయన మాట్లాడలేదు.. కళ్ళు మూసుకుని ధ్యానంలో కూర్చున్నట్టుగా ఉండిపోయాడు.

శారద, లీలమ్మ ఆయన ఏం చెప్తాడో అన్నట్టు ఊపిరి బిగపట్టి ఉద్వేగంగా చూస్తూ కూర్చున్నారు.

ఆయన కళ్ళు తెరిచి అడిగాడు.. “ఆవిడకి బాగా కావలసిన స్నేహితులు, ఆత్మీయులు ఎవరన్నా ఉన్నారా? అంటే ఎపుడన్నా వాళ్ళని కలుసుకోడానికి వెళ్ళడం? ”

శారద ఆయన మాటలు మధ్యలోనే ఆపుతూ అంది “అలాంటి వాళ్ళు ఎవరూ లేరు. మేమిద్దరమే మంచి స్నేహితులం. ఒక సినిమాకి వెళ్ళాలన్నా, ఒక షాపింగ్ వెళ్ళాలన్నా మేమే కలిసి వెళ్తుండే వాళ్ళం. ”

అలాగా అన్నట్టు తల ఊపాడు..

మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది.

లీలమ్మకి ఆ నిశ్శబ్దం భయం గొల్పుతోంది. ఆయన మొహంలో ఇంతకు ముందు చూసిన ప్రశాంతత లేదు.. ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా ఉన్నాడు.

“ఆవిడ ఫోటో ఉందా మీ దగ్గర?” అడిగాడు ఆయన..

“ఫోటోనా? “. తెల్లబోయి చూసింది లీలమ్మ. ఫోటో తీసుకు రావాలన్న ధ్యాస రాలేదు..

శారద బాగ్ లో నుంచి మొబైల్ తీస్తూ “ నా మొబైల్ లో” ఉంది అంటూ గాలరి మొత్తం వెతికి తనూ, జానకి ఉన్న ఫోటో తీసి ఆయనకి కొంచెం దగ్గరగా వెళ్లి చూపించింది.

ఆయన ఫోటో వైపు తీక్షణంగా చూసి, శిష్యుదుని పిలిచాడు.

శిష్యుడు వినయంగా లోపలికి వచ్చాడు.

“ఆయన శారదతో ఈ ఫోటో అతనికి చూపించమ్మా“ అన్నాడు.

శారద శిష్యుడికి ఫోటో చూపించింది.

అతను కొన్ని క్షణాలు అలాగే చూస్తూ ఉండి “ఈ అమ్మగారు నిన్న సాయంకాలం మన ఆశ్రమానికి వచ్చారు.. తమరి దర్శనం కావాలన్నారు... ఉదయం రమ్మని పంపించాను” అన్నాడు.

శారద, లీలమ్మ ఒక్కసారి ఉలిక్కిపడి కొంచెం గట్టిగా అరిచారు “ఇక్కడికి వచ్చిందా మా జానకి?”

స్వామి వాళ్ళని ఆందోళన పడద్దు అన్నట్టుగా చేత్తో వారిస్తూ “ భయపడకండి...ఆవిడ ఎక్కడికి వెళ్ళదు తిరిగి వస్తుంది..” అన్నాడు.

లీలమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే దగ్గుత్తికతో అంది ” ఏనాడూ భర్త తోడు లేకుండా ఎక్కడికి వెళ్ళని మనిషి స్వామి. దానికి వయసు పెరిగింది కాని ఏమి లోకజ్ఞానం లేదు. ఎలా వచ్చిందో ఇక్కడికి, ఎక్కడికి వెళ్లిందో అయోమయంగా ఉంది..” అంటూ శిష్యుడు వైపు తిరిగి చేతులు జోడిస్తూ వేడుకోలుగా అంది “నిజమేనా నాయనా? నువ్వు గుర్తు పట్టగలవా ఈవిడేనా నిన్న వచ్చింది?.. ఎక్కడికి వెళ్లిందో చెప్పగలవా?”

“లేదమ్మా ... స్వామి వారు సాయంకాలాలు దర్శనం ఇవ్వరని ఉదయం రమ్మని చెప్పాను.. ఆవిడ చాలా నీరసంగా అనిపించారు.. ఉదయమా ... ఎలా.. ఇవాళ ఎక్కడ ఉండను... నేను ఇంటికి వెళ్ళాలి అంటూ గొణుగుతూ వెళ్ళిపోయింది” అన్నాడు.

ఆవిడకి దుఃఖం పొంగుకొచ్చింది..

శారదకి కూడా భయంతో పాటుగా ఏడుపు వచ్చింది.. నిగ్రహించుకుంటూ స్వామి వైపు చూసింది.

“ఆందోళన పడకండి.. ఆమె తప్పకుండా తిరిగి ఇంటికి వస్తుంది.. ఆ తల్లిని జగజ్జనని నమ్ముకోండి“ అంటూ వెండి పళ్ళెంలో ఉన్న భస్మం కాగితం పొట్లం కట్టి ఇద్దరికీ చెరొక పొట్లం, రెండేసి అరటి పళ్ళు ఇచ్చాడు.

“మళ్ళీ మీ దగ్గరకు వస్తే మాకు సమాచారం అందించగలరా స్వామి శ్రమ అనుకోకుండా?” శారద వినయంగా అడిగింది.

“మీ చిరునామా, ఫోన్ నెంబర్ మా వాళ్ళకి ఇవ్వండి” అన్నాడు ఆయన.

“మళ్ళీ ఎప్పుడు రమ్మంటారు స్వామి?” అడిగింది లీలమ్మ.

“మీకు కబురు చేస్తాను ... వెళ్లి రండి” అన్నాడు అయన చేయెత్తి ఆశీర్వదిస్తూ ..

ఇద్దరూ శిష్యుడి వెనకాల బయటికి వచ్చారు.

అతనికి ఒక కాగితం మీద ఫోన్ నెంబర్, అడ్రస్ రాసిచ్చి “ఆవిడ వస్తే వెంటనే మాకు ఫోన్ చేయండి... ఆవిడతో మాట్లాడించండి .. ఆవిడ ఎటూ వెళ్ళకుండా మేము వచ్చిందాకా ఇక్కడే ఉంచండి” అంది శారద.

“మా ఆశ్రమంలో ఇక్కడి స్త్రీలు తప్ప పరాయి స్త్రీలు ఉండడం నిషిద్ధం అమ్మా” అన్నాడు.

“మా కోసం ఒక మూడు గంటలు ఉంచండి.. వెంటనే వస్తాం మేము.. ప్లీజ్” అంది.

అలాగే అయిష్టంగా అంగీకరించాడు అతను.

ఇద్దరూ బరువెక్కిన మనసులతో గేటు బయటికి వచ్చారు.

“మా అల్లుడికి ఒకసారి ఫోన్ చేసి ఈ విషయం చెప్పకూడదూ? ఎవరన్నా తెలిసిన వాళ్ళు ఉంటే ఈ ఊళ్లోనే ఎక్కడన్నా ఉందేమో వెతికిస్తాడు” అంది లీలమ్మ.

“రండి కారులో కూర్చుని చేద్దాం” అంది శారద.

వాళ్ళని చూడగానే దూరంగా నిలబడి సిగరెట్ కలుస్తున్న డ్రైవర్ సిగరెట్ విసిరి పడేసి వచ్చి డోర్ తీసాడు.

ఇద్దరూ కారులో కూర్చున్నాక శారద భర్తకి ఫోన్ చేసి విషయం చెప్పి, భాస్కర్ నెంబర్ తీసుకుని అతనికి కాల్ చేసింది. జరిగింది అంతా క్లుప్తంగా చెప్పింది.

భాస్కర్ ఉద్వేగంగా అడిగాడు.. “ఆశ్రమం చుట్టుపక్కల ఎక్కడన్నా ఉందేమో చూసారా?”

“లేదు.. ఇక్కడ ఆశ్రమం తప్ప దగ్గరలో ఇళ్ళు లేవు.. అంతా మైదానాలు, పొలాలు ఉన్నాయి..”

“అయ్యో. మీరు అక్కడే ఎక్కడన్నా సాయంత్రం దాకా ఉండండి. నేను బయలుదేరి వస్తాను. ఖచ్చితంగా అక్కడే ఉంటుంది. “

“ఎక్కడ ఉండాలి తెలిసిన వాళ్ళు ఎవరూ లేరే ఇక్కడ” అంది శారద..

“శారదగారు ప్లీజ్. ఏదన్నా మంచి హోటల్ చూసుకుని రూమ్ తీసుకుని రెస్ట్ తీసుకోండి. నేను వచ్చేస్తాను ఇప్పుడే బయలు దేరతా...” బతిమాలాడు భాస్కర్.

శారద లీలమ్మతో అంది “మనల్ని హోటల్ రూమ్ తీసుకుని ఆయన వచ్చిందాకా ఇక్కడే ఉండమంటున్నారు.”

“మనకేం తెలుసు ఇక్కడ?” అంటూ డ్రైవర్ ని అడిగింది “మంచి హోటల్ ఎక్కడుందో తీసుకుని వెళ్తావా బాబు?”

“నిజామాబాదు వెళ్ళాలమ్మా” అన్నాడు.

“అలాగే వెళ్దాం” అంది ఆవిడ.

శారద భాస్కర్ కి సరే అని చెప్పి ఫోన్ ఎండ్ బటన్ నొక్కింది.

కారు నిజామాబాదు వైపు బయలుదేరింది.

“ఏమన్నా జాడ తెలిసిందా?” ఆత్రంగా అడిగింది లీలమ్మ రూములోకి వచ్చిన భాస్కర్ ని.

ఉసూరుమంటూ కుర్చీలో కూర్చుని అలసటగా వెనక్కి వాలి సమాధానం చెప్పకుండా కళ్ళు మూసుకున్నాడు భాస్కర్.

శారద అతని వాలకం చూసి నొసలు ముడిచి సందేహంగా లీలమ్మ వైపు చూసింది.

లీలమ్మ బేలగా చూసింది.. జానకి జాడ తెలియలేదు అని అతని వాలకమే చెబుతోంది. తెలిసి ఉంటే ఇలా నీరసంగా, నిస్పృహగా ఎందుకుంటాడు? అతని కళ్ళల్లో వెలుగు, నడకలో ఉత్సాహం ఉండేది అనుకుంది.

ముందు రోజు నిజామాబాద్ వచ్చి ఆర్మూర్ లో బాబా దర్శనం చేసుకున్నాక జానకి అక్కడికి వచ్చి వెళ్ళిందన్న విషయం శిష్యుల ద్వారా తెలుసుకున్నాక తప్పకుండా జానకిని కలుసుకుంటాం అని, జానకితో పాటే హైదరాబాద్ వెళ్తామని ఆశించిన లీలమ్మ, శారద భాస్కర్ వినతిని మన్నించి నిజామాబాదు లో ఒక మంచి హోటల్ లో రూమ్ తీసుకుని భాస్కర్ కోసం ఎదురు చూసారు.

భాస్కర్ వెంటనే బయలుదేరాలనుకున్నా అనుకోకుండా ఆఫీస్ నుంచి ఫోన్ రావడంతో ఆఫీస్ కి వెళ్ళి అర్జెంటు పని అటెండ్ అయి, బాస్ దగ్గర పర్మిషన్ తీసుకుని వచ్చేసరికి సాయంత్రం అయింది. వెంటనే పోలీస్ స్టేషన్ కి వెళ్లి కంప్లయింట్ చేసాడు. ఆ కంప్లయింట్

తీసుకున్న ఇనస్పెక్టర్ భాస్కర్ని  మరునాడు ఉదయం రమ్మన్నాడు. ఉదయం త్వరగా నిద్ర లేచి వెళ్ళాడు.. వెళ్ళిన వాడు సుమారు రెండు గంటల తరవాత రావడం, అది కూడా సర్వశక్తులు ఉడిగిపోయిన వాడిలా రావడంతో వాళ్లకి ఏమి అర్ధం  కాలేదు. అతనలా సర్వం కోల్పోయినవాడిలా రావడంతో లీలమ్మకి గుండెల్లో గునపాలతో గుచ్చుతున్న బాధ కలుగుతోంది.

ఆవిడకి చూస్తుండగానే దుఃఖం ఉబికి వచ్చింది. గబుక్కున సోఫాలో కూలబడి రెండు చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగింది.

ఆ హటాత్ సంఘటనకి శారద స్థాణువు అయింది.

భాస్కర్ కూడా ఉలిక్కిపడినట్టుగా చూసాడు.

ఏం  జరిగింది అన్నట్టు శారద వైపు చూసాడు.

శారద సమాధానం చెప్పకుండా లీలమ్మ పక్కన కూర్చుని బొంగురుపోయిన గొంతుతో అంది “బాధపడకండి... ఇంతలోకే ఇంత నిరాశ పడితే ఎలా?”

భాస్కర్ అర్ధం అయిందన్నట్టు తల తిప్పేసుకుని సోఫాలోంచి లేచి విండో దగ్గరకి వెళ్లి రోడ్డు వైపు చూస్తూ ఉండిపోయాడు.

“నిరాశ కాక ఏంటమ్మా? బాబాగారి దయవల్ల జానకి తప్పకుండా కనిపిస్తుందని కొండంత ఆశతో వచ్చాను.. కాని, కానీ ... “ వెక్కిళ్ళు అడ్డుపడగా ఆగిపోయింది ఆవిడ.

“కనిపిస్తుంది.. తప్పకుండ కనిపిస్తుంది... బెంబేలు పడకండి” ఆవిడ వీపు మీద ఓదార్పుగా రాస్తూ అంది శారద.

భాస్కర్ కిటికీ దగ్గరనుంచి కదిలి వాళ్ళవైపు వచ్చాడు. కొన్ని క్షణాలు తలవంచుకుని నిలబడి గుండెల్లోంచి వస్తున్న నిట్టూర్పు అణచుకుంటూ “ పదండి వెళ్ళిపోదాం ఇక్కడ ఉండి  చేసేదేం లేదు” అన్నాడు.

శారద అయోమయంగా చూసింది... అంటే..అంటే.. జానకి ఇంక కనిపించదని నిర్దారించుకున్నాడా? ఎవరన్నా చెప్పారా? నిన్న సాయంత్రం వచ్చిన జానకి అప్పుడే ఎక్కడికి వెళ్లి ఉంటుంది.. బాబాగారి శిష్యులు చూసింది నిజంగా జానకినేనా ! జానకి  ఎందుకు ఆశ్రమం కి వెళ్ళింది? బాబాగారిని ఎందుకు కలవాలి అనుకుంది? ఏంటి జానకికి ఉన్న సమస్య? అసలు భాస్కర్ పోలీస్ రిపోర్ట్ ఇచ్చాడా? ఆశ్రమానికి కూడా వెళ్ళలేదా జానకి? వాళ్ళు కూడా ఫోన్ చేయలేదు..

“ మీరు అసలు రిపోర్ట్ ఇచ్చారా?”  అడిగింది భాస్కర్ ని చూస్తూ.

భాస్కర్ తల తిప్పకుండా ఏటో చూస్తూ అన్నాడు “ ఇచ్చాను.. వాళ్ళు ఇన్వెస్ట్ గేటు చేస్తా అన్నారు ఏదన్న తెలిస్తే ఫోన్ చేస్తాము అన్నారు.. మనం ఇక్కడ ఉండి  చేయగలిగింది ఏమి లేదు.  వాళ్ళు ఫోన్ చేస్తే నేను వస్తాను.. ఎంత దూరం ఉందని!”

లీలమ్మ కళ్ళు తుడుచుకుంటూ అంది “ నిజమేలే ఇక్కడ ఉండి ఏం చేస్తాం .. పదండి వెళ్ళిపోదాం..”

శారద ఇంక ఏమి మాట్లాడలేదు.

మరి కాసేపట్లో కారు హైదరాబాద్ వైపు బయలు దేరింది.

జానకిని భార్య, అల్లుడు వెంట తీసుకుని వస్తారని ఎంతో ఆశతో ఎదురు చూసిన ఆదినారాయణ  వేలాడుతున్న మొహాలతో వచ్చిన వాళ్ళని చూసి కుప్పకూలిపోయాడు.

గుమ్మంలోనే ఎదురు వచ్చి కూతురికోసం అటూ, ఇటూ ఆశగా వెతుకుతూ , కనిపించక తన వైపు ప్రశ్నార్ధకంగా చూస్తున్న ఆయనకీ ఏమని చెప్పాలో తెలియక " నేను వెళ్తాను పిన్నిగారు, మళ్ళీ  వస్తాను పాపం ఆయన ఏం తిన్నారో,  ఏంటో " అంటూ ఇంటికి వెళ్ళిపోయింది.

భాస్కర్ తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయాడు.

భర్తవైపు నిరాశగా చూసింది లీలమ్మ. ఆవిడ చూపుల అర్థం తెలుసుకున్న ఆదినారాయణ సోఫాలో కుప్పకూలిపోయాడు.

రెండు చేతులతో తల పట్టుకుని కూర్చున్న భర్త దగ్గరకు వచ్చి ఆయనని వాటేసుకుని భోరుమంది లీలమ్మ.

అప్పుడే కాలేజ్ నుంచి వచ్చిన చరిత, హరి ఆ దృశ్యం చూసి అవాక్కైనట్టు నిలబడిపోయారు.

ఆవిడ ఏడుపు వినిపించి గదిలోంచి బయటకు వచ్చిన భాస్కర్ ఆ దృశ్యానికి సమాధానం చెప్పలేనివాడిలా కిటికీ దగ్గరకు వెళ్లి, శూన్యంలోకి చూస్తూ మౌనంగా ఉండిపోయాడు.

భుజాన బాగ్, చేతిలో లంచ్ టోట్ తో బిక్కచచ్చిపోయి గుమ్మంలోనే నిలబడిపోయిన ఆ పిల్లలని అలా చూస్తుంటే ఎవరికీ నోట మాట రాలేదు.

ఇద్దరిలో చరితే ముందు తేరుకుని బాగ్ భుజం మీద నుంచి కిందకి జార్చి వేగంగా అమ్మమ్మ దగ్గరకి వెళ్లి "అమ్మమ్మా.. ఏమైంది.. అమ్మ కనిపించలేదా.. బాబాగారు అమ్మ ఎక్కడకి వెళ్లిందో చెప్పలేదా? చెప్పు అమ్మమ్మా" అంటూ ఆవిడని కుదిపేయసాగింది.

ఆవిడ చరితను దగ్గరకు తీసుకుని "ఇంక అమ్మ లేదు తల్లి... నీకు అమ్మ లేదు నాకు కూతురు లేదు" అంటూ వెక్కి, వెక్కి ఏడవసాగింది.

ఆ మాటతో హరి గట్టిగా అరిచాడు నో అంటూ.

భాస్కర్ ఉలిక్కిపడి చూసి కిటికీ దగ్గరనుంచి కదిలాడు.

హరి ఏడుస్తూ తండ్రి దగ్గరకి వచ్చి "నిజమా డాడి ... అమ్మ ఇంక రాదా చెప్పు డాడి" అని అడుగుతూ ఆయన గుండెల మీద వాలిపోయాడు.

భాస్కర్ కి ఒక్క క్షణం ఏమి అర్థం కాలేదు.. లీలమ్మని కౌగలించుకుని ఏడుస్తున్న చరితను, హరిని ఆదినారాయణను వరసగా చూసాడు. నెమ్మదిగా తనని తాను సంబాళించుకుంటూ గట్టిగా ఒక నిట్టూర్పు విడిచి ఒక్కసారిగా ఆవేశంగా అరిచాడు. "అందరూ ఏడుపు ఆపుతారా.."

ఆ అరుపుకి అందరూ నిశ్శబ్దంగా అయారు. ఆదినారాయణ అల్లుడి వైపు చూసి "ఏంటి బాబు ఏం జరిగింది?" అన్నాడు.

"ఏమి జరగలేదు. అందుకే అందరిని ఏడ్పు ఆపమన్నాను.. ఎవరు చావలేదు ... జానకి వస్తుంది.. తప్పకుండా వస్తుంది.. వెళ్ళండి ఎవరిపని వాళ్ళు చేసుకోండి.. చరితా వెళ్ళు ... వెళ్లి ఫ్రెష్ అప్ అవు.. హరీ ఆ బాగ్స్ తీసి లోపల పెట్టి డ్రెస్ మార్చుకుని రా.. అత్తయ్యగారు నాకు బాగా తలనొప్పిగా ఉంది కాఫీ ఇస్తారా .." అంటూ సెంటర్ టేబుల్ మీద ఉన్న రిమోట్ తీసుకుని సోఫాలో కూర్చుని టి వి ఆన్ చేసాడు.

అతని వింత ప్రవర్తనకి అందరూ విస్తుబోతూ అతను చెప్పిన పనులు చేయడానికి కదిలారు.

ఆదినారాయణ అల్లుడి ప్రవర్తనలో అర్థాలు వెతుకుతూ దుఃఖం మర్చిపోయి భాస్కర్ కేసి నిశ్చలంగా చూడసాగాడు.

భాస్కర్ గంభీరంగా ఉన్నా అతని మొహంలో దాచినా దాగని వేదన కళ్ళ చివర, బిగించిన దవడల మీద తారాడుతుంటే ఒక్క ఛానల్ మీద కూడా ధ్యాస పెట్టకుండా చానల్స్ మొత్తం గబగబా మార్చేస్తున్నాడు.

ఆయన తదేకంగా అల్లుడి మొహంలోకి చూస్తున్నవాడల్లా గబుక్కున టి.వి మీదకి దృష్టి సారించాడు.

భాస్కర్ కూడా ఛానల్ మార్చినవాడు కూడా తిరిగి రివర్స్ వెళ్లి ముందు వచ్చిన ఛానల్ పెట్టాడు.

వార్తలు.... షిరిడి సాయిబాబాని అంటూ, సమాజంలో ఉన్న దుర్మార్గాలనే కాక, వ్యక్తిగత సమస్యలకు కూడా పరిష్కారం చూపిస్తానని, ప్రజలంతా కష్టాలు, కన్నీళ్ళు లేకుండా బతకాలన్నదే తన ఆశయం అని, రామ రాజ్య స్థాపనే తన లక్ష్యం అని ప్రజలని నమ్మించి దారుణంగా మోసం చేస్తున్న మహేంద్ర బాబా అరెస్ట్.

ఈ రోజు అర్ధరాత్రి అనూహ్యంగా వచ్చిన ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ కాల్ తో మెదక్, సంగారెడ్డి మధ్యలో ఉన్న ఒక గ్రామంలో సుమారు నెల రోజుల క్రితం డేరాలు వేసుకుని తనే షిరిడి సాయిని అని ప్రజలని నమ్మిస్తూ, ఆధ్యాత్మికత ముసుగులో అవినీతి కార్యక్రమాలు చేస్తున్న మహేంద్ర బాబా నిజ స్వరూపం బయట పెట్టి అరెస్ట్ కి కారణం అయిన ఇరవై ఏళ్ల యువతి ధైర్యసాహసాలను చూసి అచ్చెరువందుతున్న ప్రజలు.

ఇంతకాలం ప్రజలు తమ శారీరక, మానసిక సమస్యలతో బాబాని దర్శించుకుని మహిమల పేరుతో బాబా చేసిన బ్లాకు మాజిక్ నమ్మి అనేక విధాలుగా మోసపోవడం కాక యువతులు, మధ్య తరగతి మహిళలను ధ్యానం పేరుతో ఏకాంతంగా తీసుకెళ్ళి తన గదిలో బంధించి వాళ్ళపైన అత్యాచారం జరిపినట్టు ఆధారాలు లభించడంతో బాబాని అరెస్ట్ చేసారు.

అసలు ఎవరు ఈ మహేంద్ర బాబా? ఎక్కడినుంచి వచ్చాడు? ఈయన వెనక ఉన్న అదృశ్య శక్తులు ఏవి? బాబా వెనక రాజకీయ నాయకుల అండ, దండ ఉన్నాయా ఇత్యాది విషయాల పై పోలీసులు విచారణ జరుపుతున్నారు..

భాస్కర్ చివాల్న లేచి బయటకు వెళ్తుంటే తెల్లబోయి చూడసాగాడు ఆదినారాయణ. ఆయనకీ ఏం జరుగుతుందో అర్ధం కాలేదు.. నిలువెల్లా వణికిపోతూ లీలా అని కీచుగా అరిచి విరుచుకు పడిపోయాడు.

రెండు కప్పుల్లో కాఫీ తీసుకుని వచ్చిన లీల భర్త సోఫాలో వెనక్కి పడిపోయి కళ్ళు తెలవేయడం, అల్లుడు సోఫాలో లేకపోవడంతో ఏం జరిగిందో అర్ధం కాక ట్రే టేబుల్ మీద పెట్టి భర్త పక్కన కూర్చుని ఏవండి, ఏవండి అని ఆదుర్దాగా పిలవసాగింది.

బట్టలు మార్చుకుని వచ్చిన హరి, చరిత అమ్మమ్మ కంగారు, తాతగారు పడి ఉండడం చూసి గాభరాగా వాళ్ళ దగ్గరకు వచ్చి "ఏమైంది అమ్మమ్మా?" అని అడిగారు.

ఆవిడ ఏడుపు గొంతుతో " ఏమోరా తండ్రి.. నేను కాఫీ తెచ్చేసరికి మీనాన్న ఏటో వెళ్ళాడు.. ఈయన ఇక్కడ ఇలా పడిపోయారు.. ఈ ఇంటికి ఏదో శని పట్టిందిరా.." అని గొల్లుమంది.

హరి, చరిత ఒకరినొకరు బేలగా చూసుకున్నారు.

హరి వేగంగా వెళ్లి గ్లాసుతో నీళ్ళు తీసుకొచ్చి తాతగారి మీద చల్లుతూ "తాతయ్యా" అని పిలిచాడు.

ఆయన రెండు పిలుపులకి నెమ్మదిగా కళ్ళు తెరిచి హరి వైపు చూసి "మీ నాన్న .. మీ నాన్న" అన్నాడు.

"నాన్న లేరు బయటికి వెళ్ళారు తాతయ్యా.. ఏం కావాలి?" మృదువుగా అడిగాడు హరి.

ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే టివి వైపు చూపించి "బాబా ... అమ్మ .. బాబా అరెస్ట్... అమ్మ బాబా దగ్గరకు" అంటూ పొడిపొడిగా మాట్లాడసాగాడు.

హరికి ఆయన ఎం చెబుతున్నాడో తెలుసుకునే శక్తి లేదు. అతని వయసుకి కొన్ని వార్తలు ఆకళింపు చేసుకునే శక్తి లేదు.. అందుకే ఆయన టివి వైపు చూపిస్తూ మాట్లాడుతున్న పొడి మాటలు అర్ధం కాక అమ్మమ్మ వైపు నిస్సహాయంగా చూస్తూ నాకు అర్ధం కావడం లేదు అమ్మమ్మ అన్నాడు.

చరిత తను అవగాహన చేసుకున్నంతవరకు నెమ్మదిగా అంది "అమ్మ ఎక్కడుందో బాబాగారు చెప్తా అన్నారుకదా చెప్పలేదా అని అడుగుతున్నారు".

లీలమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ అంది "బాబాలు, స్వామిజిలు అమ్మని తేలేరు నాన్న .. ఆ భగవంతుడే అమ్మని మన దగ్గరకు పంపించాలి..అంతే .. "

భర్త దగ్గరగా జరిగి ఆయన భుజం పట్టుకుని లేవదీసి "ఆ కాఫీ కప్పు ఇలా ఇవ్వుతల్లి" అంది చరితతో.

చరిత కాఫీ కప్పు ఇచ్చింది. ఆవిడ ఆయన నోటికి కాఫీ అందించి " తాగండి.. కొంచెం ప్రాణం కుదుట పడుతుంది" అంది.

ఆయన ఆవిడ చేతిలో కప్పు అందుకుని సరిగా కూర్చుని నెమ్మదిగా కాఫీ తాగుతోంటే ఆవిడ లేచి పిల్లలిద్దరిని భుజం పట్టుకుని డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకువెళ్ళి కూర్చోబెట్టి ఇద్దరికీ స్నాక్స్ ఇచ్చింది,

చరిత తినకుండా ఆవిడ మొహంలోకి చూస్తూ " అమ్మ కనిపించలేదా అమ్మమ్మా?" అని అడిగింది జాలిగా.

ఆవిడ చరితను గుండెలకు హత్తుకుని "వస్తుందమ్మా తప్పకుండ వస్తుంది.. ఆ దేవుడు మనకి అన్యాయం చేయడు" అంది.

గంపెడాశతో తల్లి వస్తుందని, తను వెళ్ళేసరికి ఆవిడ ఇంట్లో చిరునవ్వులు చిందిస్తూ ఉంటుందని ఇంటికి వచ్చిన చరిత ప్రస్తుతం ఆ పరిసరాల్లో నాట్యం చేస్తున్న విషాదం భరించలేక ఆవిడ గుండెల్లో ఒదిగిపోయి కుమిలి, కుమిలి ఏడవసాగింది.

అవంతి పడుకుందన్న మాటే కాని నిద్రపట్టడం లేదు..

ఆలోచనలు.. ఆలోచనలు.. నిజంగానే చరిత వాళ్ళ అమ్మ తిరిగి వస్తుందా?.. చచ్చిపోలేదా.. బాబాగారు చెబితే వచ్చేస్తుందా? బాబాగారికి చాలా మహిమలున్నాయా! చరిత వాళ్ళ అమ్మ ఎక్కడికి వెళ్ళిందో , ఎప్పుడు వస్తుందో ఆయనకి ఎలా తెలుస్తుంది! అసలు మహిమ అంటే ఏంటి? ఎలా వస్తుంది? అవంతికి తను చూసిన కొన్ని డిస్నీ సినిమాల్లో విచ్ లు, ఈవిల్ పవర్స్ గుర్తొచ్చాయి. అంతేకాదు టి.విలో చూసిన మాయాబజార్ , పాతాళభైరవి సినిమాలు గుర్తొచ్చాయి.

భలే తమాషాగా ఉంటాయి... మాయాబజార్ లో బోలెడన్ని లడ్లు, కజ్జికాయలు, పాయసం అన్నీ వచ్చేస్తాయి. అదేదో ఒక సినిమాలో మాయం అయిపోయిన వాళ్ళు భస్మం లో కనిపిస్తారు. మాయ అంటే మాజిక్... ఎస్ మాజిక్ ...

అయితే బాబాగారికి అలాంటి మాజిక్ తెలుసనమాట.

ఆ మాజిక్ తో ఏమైనా చేయచ్చు..

అమ్మని మంచి అమ్మగా మార్చగలరా..

అవును అమ్మని మంచిదానిగా మారుస్తారేమో అడగాలి. బాబాగారిని కలవాలి. ఎక్కడుంటారు బాబాగారు? ఎలా వెళ్ళాలి? చరితని అడిగితే.. అవును అడగాలి. బాబాగారి దగ్గరకు ఎలా వెళ్ళాలో చరితని అడిగి తను అక్కడికి వెళ్ళాలి.. తెల్లని, పెద్ద గడ్డంతో పద్మాసనంలో కూర్చున్న బాబా ఆయన ఎదురుగా కూర్చుని తను ప్రశ్నలడుగుతున్నట్టు ఆయన తన తల మీద ప్రేమగా నిమిరి ఏదో చెబుతున్నట్టు అనేక దృశ్యాలు కదులుతుంటే మెల్లగా కళ్ళు మూసుకుంది.

మరునాడు స్కూల్ కి త్వరగా వెళ్ళింది అవంతి. అప్పటికి చరిత ఇంకా రాలేదు.

చరిత కోసం ఎదురు చూస్తూ కారిడార్ లో పిట్టగోడ ఎక్కి కూర్చుంది.

ఒక్కొక్కరే వస్తున్నారు.. కొంతసేపటికి మొత్తం విద్యార్థిని, విద్యార్థులతో నిండిపోయింది.

ఫస్ట్ పిరియడ్ టైం అయింది.

చరిత ఇంకా రాలేదు. అవంతి అసహనంగా ఎదురుచూస్తోంది.

అప్పుడే గేటులోకి వచ్చిన బండి మీద నుంచి దిగిన నిషా తండ్రికి బై చెప్పి క్లాసులు మొదలైందేమోననే హడావుడితో పరుగులు పెడుతూ వచ్చి అందరూ క్లాస్స్ కి వెళ్ళిపోయినా తను వెళ్ళకుండా గోడ మీద కూర్చున్న అవంతి వైపు ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది ఏంటి అవంతీ ఇక్కడ కూర్చున్నావేం ...

అవంతి గేటు నుంచి దృష్టి తిప్పకుండా అంది చరిత కోసం చూస్తున్న.

చరిత ఇంకా రాలేదా..!?

లేదు..

అవునా ఇంత లేట్ గా రాదు తను.. ఈ పాటికి వచ్చేయాలి.. ఇంకా రాలేదంటే బహుశా ఇవాళ రాదేమో.

అవంతి చివ్వున తల తిప్పి నిషా వైపు చూసింది.

“ఎందుకు రాదు... వాళ్ళమ్మ వచ్చేసిందా..?” ఆత్రంగా అడిగింది.

“వాళ్ళమ్మ వస్తుందని నీకు చెప్పిందా?” చిత్రంగా చూసింది నిషా.

అవంతి ఒక్క గెంతులో గోడ దిగి నిషా దగ్గరగా నడిచి “అవును చెప్పింది.. బాబాగారు రప్పిస్తా అన్నారుట.”

“వాట్?” అవంతిని పిచ్చిదాన్ని చూసినట్టు చూసింది నిషా.” బాబాగారు... హూ ఈజ్ బాబా?” అవంతి కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ అడిగింది.

అవంతి ఆ చూపుకి కలవరపడి అటూ, ఇటూ బిత్తరగా చూసింది.

“బాబా ఎవరు అవంతీ?” మళ్ళీ అడిగింది నిషా.

అవంతి నిషా కళ్ళల్లోకి లోతుగా చూస్తూ “నీకు విచ్ తెలుసుకదా  స్నో వైట్ , స్లీపింగ్ బ్యూటీ ఇలాంటి చాలా మూవీస్ లో మనం చూసాం.. గుర్తుందా! కొన్ని ఈవిల్ పవర్స్ ఉన్న వాళ్ళని కూడా బ్రేవ్ మూవీలో చూశాం .. అలాంటి  మెజిషియన్ని తెలుగులో బాబా అంటారు. ఆ బాబా మాజిక్ చేసి  చరిత వాళ్ళ అమ్మగారు ఎక్కడ ఉన్నారో చేప్తారుట.. చరిత వాళ్ళ అమ్మమ్మ, ఆంటీ బాబా దగ్గరకు వెళ్లారు నిన్న.. వాళ్ళు తప్పకుండా చరితా వాళ్ళ అమ్మను తీసుకుని వస్తారు అని చెప్పింది. అయితే ఖచ్చితంగా వచ్చి ఉంటారు.. అందుకే తను కాలేజ్ కి రాలేదు. చూసావా బాబాగారు ఎంత గ్రేట్.!” మెరిసే కళ్ళతో చెప్తున్న అవంతికేసి అపరిచిత వ్యక్తిని చూసినట్టు చూడసాగింది నిషా.

దీనికి మెంటలా!  ఏం మాట్లాడుతోంది.. కాసేపు విచ్ అంటుంది. కాసేపు మెజిషియన్ అంటుంది. కాసేపు ఈవిల్ అంటుంది. కాసేపు బాబా అంటుంది.. ఏం మాట్లాడుతోంది. నాన్సెన్స్..

విసుగ్గా మొహం పెట్టి అంది“ ఆర్ యూ మాడ్ అవంతీ! వాట్ నాన్సెన్స్ ఆర్ యూ టాకింగ్. డోంట్ బిహేవ్ లైక్ స్టుపిడ్. ” పద క్లాస్ కి వెళదాం.

అవంతి నిషా మొహంలో భావాలు, స్వరంలో సీరియస్ నెస్ పట్టించుకోకుండా పద అంటూ క్లాస్ వైపు నడిచింది.

క్లాస్ కి వెళ్ళిందన్నమాటే కానీ అవంతి ఆలోచనలు, మనసు చరిత వాళ్ళ అమ్మ చుట్టూ తిరగసాగింది.

ఆంటీ వచ్చేసి ఉంటుంది. ఇన్నిరోజులు అమ్మని మిస్ అయినందుకు ఇవాళ చరిత కాలేజ్ కి రాకుండా వాళ్ళ అమ్మతో స్పెండ్ చేస్తున్నది కాబోలు. బాబాగారికి ఎలా తెలిసింది ఆవిడ ఎక్కడ ఉందో! అసలు ఎక్కడికి వెళ్ళింది? బహుశా వాళ్ళ ఊరు వెళ్ళిందేమో!.

అనవసరంగా అందరూ కంగారు పడ్డారు. అమ్మ అయితే చాలా బాడ్ గా మాట్లాడింది. ఎవరితోటో లేచిపోయి ఉంటుంది. సిగ్గులేనిది ఈ వయసులో అంది.. అంటే ఏంటి? అసలు లేచిపోడం అంటే ఏంటి?

అవంతి నిషా వైపు చూసింది. లెక్చరర్ చెప్తున్న పాఠం వినడంలో పూర్తిగా లీనమైంది.

అసలు ఆవిడ ఏం చెప్తోందో.. అది ఏ సబ్జెక్టు ఏమి తెలియలేదు అవంతికి.. ఏ మాత్రం ఏకాగ్రత చూపించలేకపోతోంది. అవంతి మనసంతా బాబా చుట్టూ తిరుగుతోంది. అర్జెంటుగా బాబాని చూడాలని ఉంది. కాకపోతే ఆయన దగ్గరకు ఎలా వెళ్ళాలో తెలియదు.. చరితను అడిగి తెలుసుకుందామంటే తను కాలేజ్ కే రాలేదు.

అవునూ ఇంతకీ ఆవిడ ఇంటికి వచ్చినట్టేనా. ఎక్కడికి వెళ్ళింది?

అవంతి మళ్ళీ నిషా వైపు చూసింది. అప్పుడే క్లాస్ అయిపోయింది. లెక్చరర్ వెళ్ళిపోయింది. అవంతి నిషా అని పిలిచింది.

నిషా "ఏంటి" అన్నట్టు చూసింది.

" లేచిపోడం అంటే ఏంటి?"

"ఓ మై గాడ్ ... నీకు ఏమైంది.. పిచ్చి, పిచ్చి మాటలు మాట్లాడుతున్నావు.. నీకు తెలుసుకదా నాకు తెలుగు సరిగా రాదు.. నువ్వు చెప్పే తెలుగు వర్డ్స్ అసలు అర్థం కావడం లేదు.. కెన్ యూ ప్లీజ్ స్టాప్ దిస్ కైండ్ ఆఫ్ వల్గర్ లాంగ్వేజ్... " అసహనంగా అరిచినట్టు అంది.

ఆమె పక్కన కూర్చున్న అమ్మాయి ఆ అరుపుకి వాళ్ళ వైపు చూసి" వాట్ హాపెండ్?" అంది.

నిషా కళ్ళు అదోలా తిప్పుతూ స్వరంలో చిరాకు వ్యక్తం చేస్తూ " అవంతీ ప్లీజ్ యూ సిట్ సమ్ అదర్ ప్లేస్... ప్లీజ్" అంది.

చిన్నబుచ్చుకున్న మొహంతో అవంతి తన బాగ్ తీసుకుని వెనక బెంచి లోకి వెళ్లి కూర్చుంది.

అక్కడ కూడా ఆలోచనలతో అశాంతిగా కూర్చున్న అవంతి లంచ్ అవగానే బాగ్ తీసుకుని గేటు వైపు నడిచింది.

అవంతి కాలేజ్ నుంచి నేరుగా ఇంటికెళ్ళిపోయింది.

అప్పుడే పని ముగించుకుని టి విలో సీరియల్ చూస్తూ పడుకున్న జాహ్నవి కూతురు అలా ఎటూ కాని టైం లో కాలేజ్ నుంచి ఎందుకు వచ్చిందా అని అర్థం కాక తెల్లబోయి చూసింది అవంతిని.

“కాలేజ్ లేదా?” అడిగింది.

“ఉంది ..నేను వచ్చేశాను ...” అంటూ బాగ్ కుర్చీలో పడేసి బాత్రూం వైపు వెళ్ళింది అవంతి.

జాహ్నవికి వెర్రి కోపం వచ్చింది. దీనికి రోజు, రోజుకి నిర్లక్ష్యం పెరిగిపోతోంది. అసలెందుకు కాలేజ్ ఎగ్గొట్టి వచ్చింది. పైగా అడిగిన దానికి సరిగా సమాధానం కూడా ఇవ్వకుండా. ఎంత ధైర్యం! దీనికేదో పిచ్చిపట్టింది. అనుకుంటూ అవంతి బాత్రూం లోనుంచి రాగానే అడిగింది విసురుగా “ ఎందుకు వచ్చావు..? ఏం ఉద్ధరించాలి నువ్విప్పుడు..?”

అవంతి మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్లి డబ్బాలు వెతికి మిక్సర్ ప్లేటులో పోసుకుని వచ్చి టి వి ఎదురుగా కూర్చుంది.

జాహ్నవి కోపంగా అడిగింది “ఏంటే నీ నిర్లక్ష్యం.. ఎందుకంత పొగరు! కాలేజ్ ఎందుకు ఎగ్గొట్టావు ? అడుగుతుంటే చెప్పవేం..”

“చరిత రాలేదు.. అందుకే నాకూ ఉండబుద్ధి కాలేదు.”

“ఏంటి? ” జాహ్నవికి కోపం తారాస్థాయికి చేరింది.. అవంతిని రెక్కపుచ్చుకుని లేపి “అదేవతో కాలేజ్ కి రాకపోతే నువ్వు కూడా మానేస్తావా... వెళ్ళు.. కాలేజ్ కి వెళ్ళు..” అంది లాగుతూ.

అవంతి బలవంతంగా విడిపించుకుని "ఇప్పుడు క్లాసులు కూడా లేవు.. నాకు ఉండాలని అనిపించలేదు వచ్చేసాను.. ఇంక వెళ్ళను" అంది.

జాహ్నవి మండిపడుతూ అంది "అసలు అదెందుకు రాలేదు?"

"వాళ్ళమ్మ రిటర్న్ వచ్చింది."

"ఏంటి?" జాహ్నవి నమ్మలేనిదానిలా చూసింది.. రిటర్న్ వచ్చిందా.. నిజంగానా

"నిజమే ... బాబాగారు ఆవిడ ఎక్కడికి వెళ్ళారో వాళ్ళ అమ్మకి అదే చరిత వాళ్ళ అమ్మమ్మకి చెప్పారుట.. ఆవిడ వెళ్లి తీసుకు వచ్చింది."

జాహ్నవి వెర్రిదానిలా చూసింది.. "నీకేదన్నా పిచ్చెక్కిందా.. పిచ్చి వాగుడు నువ్వూను. లేచిపోయిన ఆవిడ రావడం ఏంటి?"

అవంతి కోపంగా అరిచింది "ఇంకోసారి అలా అనకు.. ఆవిడ చాలా మంచిది. నీలాగా కాదు. ఆవిడ బాబాగారి దగ్గరకు వెళ్ళింది.. మంచి అమ్మ కావాలని.. నువ్వు కూడా వెళ్లిరా మంచిదానివి అవుతావు" అంటూ విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

జాహ్నవి స్థాణువులా నిలబడిపోయింది. బాబా ఎవరు? ఆయన మంచి అమ్మగా చేయడం ఏంటి? దీనికి ఏమైంది..

టివి లో వచ్చే చెత్త సీరియల్స్ చూడడం తప్ప ఏనాడూ వార్తాచానెల్ చూడడం, వార్తాపత్రిక చదవడం అలవాటు లేని జాహ్నవికి బాబా గురించి తెలియదన్న విషయం అవంతికి తెలిస్తే పరిస్థితి ఇంకోలా ఉండేది.

❦❦❦

**జానకి కళ్ళు** తెరిచింది. ఆవిడకి తను ఎక్కడ ఉందో ఏమి అర్థం కాలేదు. ఒకసారి రెప్పలు రెప,రెపలాడించి నాలుగు వైపులా చూసింది. తెల్లటి గోడలు, మధ్యలో మంచం మీద తను.. గిర,గిరా తిరుగుతున్న తెల్లటి సీలింగ్ ఫ్యాన్ ...

నెమ్మదిగా చూపులు తిప్పింది. పక్కనే స్టూల్ మీద కూర్చుని తన వైపు ఆదుర్దాగా చూస్తున్నాడు ఒక పాతికేళ్ళ కుర్రాడు.

"ఎలా ఉన్నారమ్మా ?" తన వైపు చూసిన జానకి వైపు కొంచెం ఒంగి అడిగాడు.

"ఎవరు బాబు నువ్వు? నేనెక్కడున్నాను?"

"కంగారు పడకండి.. ఇది నా క్లినిక్. నా పేరు డాక్టర్ కిరణ్... మీరు రోడ్ మీద పడిపోతే నేను నా క్లినిక్ కి తీసుకు వచ్చాను" అని అంటూ ఆవిడ చేతికి ఉన్న సిరంజి తీసాడు.

జానకి తన చేతివైపు చూసి ఏంటది? అంది.

సిరంజి... మీకు సెలైన్ ఎక్కించాల్సి వచ్చింది.

సేలైనా ... ఎందుకు..

కిరణ్ స్టూల్ మీదనుంచి లేచి ఖాళీ అయిన సెలైన్ బాటిల్ స్టాండ్ మీద వేళ్ళాడేసి స్టాండ్ మంచం పక్కనుంచి కొంచెం ఎడంగా జరిపాడు.

అదేమీ గమనించని దానిలా జానకి కలవరంగా అటూ, ఇటూ చూస్తూ " బాబాగారి ఆశ్రమం ఎక్కడ? నేను వారిని కలవాలి.. చాలా అవసరం" అంది.

కిరణ్ తల తిప్పి ఆవిడ వైపు ఆశ్చర్యంగా చూసి అన్నాడు "బాబా ఎవరు?"

"అయ్యో.. బాబాగారు నాయనా నేను ఆయనని చూడాలి.. ఆ విషయం అడగాలి... ఎక్కడ ఆయన? నన్ను వెంటనే అక్కడికి తీసుకువెళ్ళు. " మంచం మీద నుంచి లేవబోయి తూలిపోతున్న జానకిని భుజాలు పట్టుకుని ఆపుతూ లేవకండి.. బాగా నీరసంగా ఉన్నారు.. పడిపోతారు" అన్నాడు కిరణ్.

"లేదు ... ఆయన మళ్ళీ ధ్యానంలోకి వెళ్ళిపోతారు.. ఒక్కసారి నేను ఆయనని చూడాలి.. నన్ను వెళ్ళనివ్వండి" జానకి అతని చేతులు నెట్టేస్తూ అంది .

కిరణ్ ఆవిడ భుజాల మీదనుంచి చేయి తీయకుండా మూసి ఉన్న డోర్ వైపు చూసి కొంచెం గట్టిగా "సిస్టర్" అని పిలిచాడు.

వెంటనే గది బయట తలుపు పక్కనే టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చున్న నర్స్ గబుక్కున లేచి లోపలికి వచ్చింది.

కిరణ్ దగ్గరకి రమ్మని తల ఊపి సైగ చేసి, ఆమె దగ్గరగా రాగానే "ఈవిడని పట్టుకోండి" అన్నాడు.

సిస్టర్ అతని పక్కకు వచ్చి జానకి భుజాలు పట్టుకుని ఆవిడని జాగ్రత్తగా పడుకోబెట్టి అంది "మీరు విశ్రాంతి తీసుకోండమ్మా ... పడుకోండి.."

"లేదు, లేదు నేను బాబాగారిని కలవాలి... ఎంతో ఆశతో వచ్చాను వారిని కలవాలని...నా దురదృష్టం అన్నీ ఆటంకాలే ఎదురవుతున్నాయి.. ఎలాగైనా సరే ఇవాళ కలవాలి.. నన్ను వెళ్ళనివ్వండి" అని ఉన్మాదిలా అరుస్తూ నర్స్ చేతులనుంచి విదిపించుకోడానికి పెనుగులాడుతుంటే అతి కష్టం మీద నర్స్ ఆవిడని పట్టుకుంటే డా. కిరణ్ ఇంజక్షన్ చేసాడు.

జానకి నెమ్మదిగా వెనక్కి తలగడ మీదకి జారుతూ మూతలు పడుతున్న కళ్ళతో "నేను బాబాగారిని కలవాలి, కలవాలి...." అంటూ నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది.

కిరణ్ ఆవిడ వైపు చూస్తూ " పాపం ... పెద్దింటి స్త్రీలా ఉంది.. ఎక్కడుంటారో , వాళ్ళ వాళ్ళెవరో ఆవిడ నిద్రలేచి కొంచెం శాంతించాక నెమ్మదిగా అడిగి తెలుసుకోండి..." అన్నాడు నర్స్ తో..

"అలాగే" అంది నర్స్ వినయంగా.

కిరణ్ గదిలో నుంచి బయటికి వెళ్తుంటే నర్స్ అతని వెనకే వెళ్ళి జానకి పడుకున్న గది తలుపులు నెమ్మదిగా మూసింది.

దాదాపు రెండు గంటల తరవాత జానకికి మెలకువ వచ్చింది. గట్టిగా మూలుగుతూ కళ్ళు తెరిచింది.

గదిలో ఎవరు కనిపించలేదు..

జానకి లేవబోయింది. కానీ లేవలేకపోయింది. దాహంతో గొంతు ఎండిపోతోంది.. కడుపులో పేగులు మెలిపెడుతున్నట్టుగా ఉంది.. ఆవిడకి మగతగా ఉంది.

"ఎవరక్కడ?" గట్టిగా అన్నాననుకుంది ... కానీ గొంతు పెగిలి మాట బయటకి రాలేదు.

మళ్ళీ అరిచింది..

ఈ సారి కీచుగా వినిపించింది ఆవిడకి తన స్వరం తనకే.

గభాల్న తలుపు తోసుకుని నర్స్ లోపలికి వచ్చింది.

"ఏం కావాలమ్మా..." మృదువుగా అడిగింది.

"ఎవరు నువ్వు.. నన్నిక్కడికి ఎవరు తీసుకువచ్చారు" అడిగింది జానకి.

"చెప్తాను... మీకు కాఫీ ఇవ్వమంటారా" మళ్ళీ అడిగింది నర్స్.

"నాకేం వద్దు.. నన్ను ఇక్కడినుంచి పంపించండి" అరిచింది జానకి.

"అలాగే పంపిస్తాను.. మీరు నీరసంగా ఉన్నారు కొంచెం కాఫీ తాగండి."

"వద్దన్నానా.. " గట్టిగా అరిచింది జానకి శక్తి కూడదీసుకుని.

నర్స్ బిత్తరపోయి నిలబడింది. అప్పుడే డా. కిరణ్ లోపలికి వచ్చాడు.. జానకి వాలకం చూసి బెదిరిపోతూ నిలబడిన నర్స్ వైపు చూసి "మీరు వెళ్ళండి నేను చూసుకుంటా" అంటూ నర్స్ ని బయటికి పంపించి మంచం పక్కన ఉన్న స్టూల్ మీద కూర్చున్నాడు.

"ఎలా ఉన్నరమ్మా ?" ఆప్యాయంగా అడిగాడు.

"మీరెవరు నేనెక్కడున్నాను?" అడిగింది.

"కంగారు పడకండి.. ఇది నా క్లినిక్. నా పేరు డాక్టర్ కిరణ్... మీరు రోడ్ మీద పడిపోతే నేను నా క్లినిక్ కి తీసుకు వచ్చాను" అని అంటూ అతను స్టూల్ మీద నుంచి లేచి కొంచెం దూరంగా ఉన్న కాబినెట్ దగ్గరకు వెళ్లి దాని మీద ఉన్న ఫ్లాస్క్ లో నుంచి కాఫీ కప్పులో పోసి తీసుకుని వచ్చి ' కొంచెం కాఫీ తాగండి బాగా నీరసంగా ఉన్నారు" అన్నాడు.

జానకి అతని మాటలు విని ఆశ్చర్యంగా చూస్తూ తన మీద ఉన్న తెల్లటి దుప్పటి తొలగించి నెమ్మదిగా లేచి కూర్చుంది. తల దిమ్ముగా అనిపించింది. తలగడలు రెండు సరి చేసి ఆవిడ వీపు మీద ఎడం చేయి ఆసరాగా ఆనించి ఆవిడ తలగడలను ఆనుకుని కూర్చోడానికి సహాయం చేసాడు. కుడి చేత్తో కాఫీ కప్పు అందించాడు.

ఆవిడ అతను అందించిన కాఫీ కప్పు అందుకుని "ఎక్కడ పడిపోయాను నేను?" అని అడిగింది.

"ఆర్మూరు వెంకటేశ్వర స్వామి గుడికి సమీపంలో రోడ్ మీద పడిపోయారు. మా ఇల్లు ఆర్మూరులో.. నా క్లినిక్ నిజామాబాదులో.. నేను క్లినిక్ కి వస్తుంటే నా కారు కింద పడబోయారు.. అదృష్టం బాగుండి సడెన్ బ్రేక్ వేసి ఇక్కడికి తీసుకువచ్చాను. ఇప్పుడు మీరున్నది నా క్లినిక్. మీరు బాగా నీరసంగా ఉంటే సెలైన్ ఎక్కించాను."

జానకి కాఫీ తాగడం ఆపి అతని మొహంలోకి ఆశ్చర్యంగా చూసి, వెంటనే చూపులు మంచం పక్క తల వైపు కొంచెం ఎడంగా ఉన్న సెలైన్ స్టాండ్ కేసి తిప్పి చూసింది.

"మీ పేరేంటమ్మా... ఎక్కడ ఉంటారు మీరు?" మృదువుగా అడిగాడు డాక్టర్ కిరణ్.

జానకి కళ్ళు మూసుకుంది. రెండు కళ్ళనుండి బోట,బొటా కన్నీళ్ళు కారాయి.

"ఎందుకమ్మా బాధ పడుతున్నారు.. మీకెవరూ లేరా.?"

జానకికి దుఃఖం ఉధృతం అయింది..

"అయ్యయ్యో ఏడవకండి.. మీకు ఏం పర్వాలేదు..మా ఇంట్లో మీరు ఉండచ్చు.. మా అమ్మలాగే మీరు కూడా ... అమ్మ ప్రస్తుతం లేదు.. ఆస్ట్రేలియా వెళ్ళింది మా చెల్లెలి దగ్గరకి. త్వరలో వస్తుంది." ఆవిడని ఓదారుస్తూ అన్నాడు.

ఆవిడ వెక్కుతూ అంది " నాకు అందరూ ఉన్నారు బాబు.. లేకేం ,... కానీ నేనే ఎందుకో ఇలా వచ్చాను.. అసలు ఏం జరుగుతోందో నాకు అర్థం కావడం లేదు. నీకు బాబాగారి ఆశ్రమం తెలుసా.. నన్ను ఒక్కసారి అక్కడికి తీసుకు వెళ్ళు.. అయన దర్శనం అయాక మా ఇంటికి వెళ్ళాలి..ఎలాగైనా నాకీ సాయం చేసి పుణ్యం కట్టుకో నాయనా నీ మేలు మర్చిపోను .."

"మీ వాళ్ళు ఎక్కడ ఉంటారు.. ఫోన్ నెంబర్ ఇవ్వండి ఫోన్ చేస్తాను."

"అయ్యో నాకా మాత్రం ఆలోచన ఉంది ఉంటే ఈ కష్టాలు ఎందుకు పడతాను.. ఏనాడూ వంటరిగా ఇల్లు కదలని దాన్ని.. ఆవిడని నమ్మి వచ్చాను. ఎందుకు వచ్చానో అర్థం కావడం లేదు.. ఇంటిదగ్గర పిల్లలు, ఆయన ఎంత కంగారు పడుతున్నారో, ఏం జరుగుతోందో అంతా అయోమయంగా ఉంది. ఏదెలా ఉన్నా బాబాగారిని మాత్రం ఒక్కసారి దర్శించుకోవాలి.. అప్పుడే నాకు మనశాంతి."

"పోనీ మీ వాళ్ళు ఎక్కడ ఉంటారో చెప్పండి."

"మాది హైదరాబాదు బాబు, కొత్త పేట దగ్గర వాసవి కాలనీలో మా ఇల్లు.. నాకు ఇంటి నెంబర్ గుర్తు లేదు కానీ అష్టలక్షి గుడి దగ్గర.. నన్ను హైదరాబాద్ బస్ ఎక్కిస్తే నేను వెళ్ళిపోగలను."

"అసలు మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు.. ఎలా వచ్చారు?"

జానకి చెంగుతో కళ్ళు తుడుచుకుని దీర్ఘంగా నిట్టూర్చి చెప్పసాగింది.

"ఈ మధ్య ఎందుకో తెలియదు నా మనసులో ఏదో ఆందోళన..ఏదో దిగులు, భయం... ఎంత ప్రయత్నించినా ఆ భయం నుంచి బయటపడలేకపోతున్నాను. నాకు తెలిసిన ఒకావిడ నా బాధ చూసి, నా భయం చూసి ఎవరో బాబాగారు నా సమస్యకి పరిష్కారం చెప్పి నా భయాలను పోగొడతారు అని చెప్పి ఎక్కడికో తీసుకు వెళ్ళింది. మేము వెళ్ళిన రోజు ఆ బాబాగారు నాకు ఏదో ఉపదేశం ఇస్తానని చెప్పి ఆ రోజు వారి ఆశ్రమంలో ఉండమన్నారు.. నేను ఇంట్లో చెప్పకుండా వచ్చాను అని ఇంటికి వెళ్ళాలి అని ఎంత చెప్పినా ఆవిడ వచ్చాము కదా ఒకేసారి ఉపదేశం తీసుకుని వెళ్దాము అని బలవంతంగా ఆ రాత్రి అక్కడ ఉన్నేసింది. తెల్లారి లేచేసరికి ఆవిడ ఏదో అవసరమైన పని ఉందని వెళ్ళిపోయింది అని చెప్పారు అక్కడ ఉన్న వాళ్ళు. నేను ఒక్కదాన్ని ఉన్నానే కానీ నాకెందుకో ఆ వాతావరణం, మనుషులు నచ్చలేదు.. భయం వేసింది. ఇంటికి వెళ్లి పోదాం అని అక్కడనుంచి బయటకు వచ్చాను కానీ అది ఏ ఊరో, ఏ బస్ ఎక్కాలో అసలు బస్ స్టాండ్ ఎక్కడో తెలియలేదు. ఇంతలో నలుగురు ఆడవాళ్ళు నిజామాబాదు లో షిరిడి బాబాగారు వెలిసారని ఆయన దర్శనానికి వెళ్తున్నాం అని జీపులో వెళ్ళడం కనిపించింది. ఆ క్షణంలో ఎందుకో నేను ఆయనని కలిస్తే బాగుండు అనిపించి వాళ్ళని బతిమాలి అదే జీపులో ఈ ఊరికి వచ్చాను. బాగా తిరిగి, తిరిగి ఉన్నానేమో అలసటగా అనిపించి దారిలో ఉన్న దేవాలయంలో కాళ్ళు, చేతులు కడుక్కుని కొంచెం విశ్రాంతి తీసుకుని వెళ్దాము అన్నాను. వాళ్ళు రామని చెప్పి నన్ను ఆలయం దగ్గర దింపి వాళ్ళంతా వెళ్ళిపోయారు..

నేను కాళ్ళు, చేతులు కడుక్కుని, అక్కడ ప్రసాదం తిని కొంచెం విశ్రాంతిగా కూర్చున్నాక అక్కడ ఉన్న ఇద్దరు స్త్రీలను ఆశ్రమం దారి అడిగి తెలుసుకుని వెళ్లేసరికి బాబాగారు భక్తులకి దర్శనం ఇవ్వడం అయిపోయి విశ్రాంతి మందిరంలోకి వెళ్లి పోయారని మరునాడు రమ్మని చెప్పారు శిష్యులు. ఉసూరుమంటూ వెనక్కి తిరిగాను.. ఎటు వెళ్ళాలో తెలియక అలా నడుస్తూ వెళ్తుంటే కళ్ళు తిరిగాయి. ఇదిగో ఇప్పుడే కళ్ళు తెరిచాను."

అతను ఆశ్చర్యంగా చూశాడు .

"అసలు బాబాగారి దగ్గరకు ఎందుకు వెళ్లారు. మీకసలు ఎందుకంత భయం వేసింది.."

"తెలియదు.. నా భయం అంతా నా కూతురు గురించే.. అది ఇంట్లో నుంచి బయటకి కాలు పెట్టిందంటే చాలు వణికిపోతున్నాను. ఎక్కడికి వెళ్ళద్దు, ఇంట్లోనే ఉండు అని చెప్పడం సమంజసం కాదు.. కానీ అది వెళ్ళిన దగ్గర నుంచి ఇంటికి వచ్చిందాకా భయం.. ఎన్నో సార్లు మా వారికి చెప్పాను దానికి ఒక సెక్యూరిటీ గా ఎవరినన్నా ఏర్పాటు చేయమని. "

"సెక్యూరిటీ నా..? " విచిత్రంగా చూసాడు.

"అవును.. లేకపోతె బయటకు వెళ్ళిన ఆడపిల్లలకు రక్షణ ఉందా ఈ సమాజంలో.. ఆడపిల్లలు చదువుల పేరిట, ఉద్యోగాల పేరిట బయటకు వెళ్ళాక తప్పదు ... కానీ వెళ్ళిన దగ్గర నుంచి ఇంటికి చేరిందాకా వాళ్ళు క్షేమంగా వస్తారా లేదా అని తల్లి, తండ్రులకి టెన్షన్.. అందుకే పిల్లలకి ఎవరినన్నా సెక్యూరిటీ గా వాళ్ళ వెనకాల పంపించాలి అని చెప్తాను ఆయనకి. నా మాటలు ఆయనకీ పిచ్చి వాగుడులా అనిపిస్తాయి."

"అదేంటండి ఎంత మంది అమ్మాయిలు వంటరిగా విదేశాలు వెళ్ళి చదువుకోడం లేదు, ఉద్యోగాలు చేయడం లేదు... ఉద్యోగ రీత్యా ట్రైనింగ్ లు అని, ప్రాజెక్ట్ లు అని ఎక్కడెక్కడికో వెళ్ళి ఉద్యోగాలు చేస్తున్నారు.. "

"అదే నాకూ అర్థం కావడం లేదు.. ఎలా వాళ్ళంతా వెళ్తున్నారు.. పెద్ద వాళ్ళు ఎలా పంపిస్తున్నారు భయం లేకుండా అనిపిస్తుంది."

"ఇంతకీ బాబాగారి దగ్గరకు ఎందుకు వెళ్ళాలి అనుకున్నారు.? "

ఆవిడ దీర్ఘంగా శ్వాస తీసుకుని అంది " ఆయన దగ్గర మహిమలు ఉంటాయి. ఏదన్న మంత్రించిన తాయెత్తు ఇస్తే దాని ప్రభావంతో నా కూతురుని ఎలాంటి దుష్ట శక్తులు అపకారం చేయకుండా నా బిడ్డని నేను కాపాడుకోవచ్చు.. అందుకే తాయెత్తు కోసం వెళ్ళాలి అనుకున్నాను. అలాగే నాలో ఉన్న భయాలు పోవాలంటే మంత్రించిన విభూతి కూడా ఇస్తారట. ఏంటో నా దురదృష్టం నేను బాబాగారిని కలవలేకపోయాను.

అతను జాలిగా చూసాడు. "అవన్నీ బాబాగారు చేయగలరని అనుకుంటున్నారా.? "

"మరి ఎవరు చేస్తారు బాబు.. బాబా అంటే దేవుడికి ప్రతినిధి.. దేవుడు దిగి వచ్చి మన గోడు వింటాడా. నేను ఎన్ని గంటలు మౌనంగా కూర్చుని నా బాధ చెప్పుకున్నా కొంత కూడా నాకు ఊరటనివ్వలేదు ఆ దేవుడు.. ఆ భయాలు, శంకలు నన్ను ప్రతి క్షణం చిత్రవధ చేస్తుంటే ఎవరికీ నా బాధ చెప్పుకోలేక, నేను సంతోషంగా ఉండక ఇంట్లో వాళ్ళని సంతోషంగా ఉంచలేక నరక యాతన పడుతున్నాను. నాకి మనో వ్యధ నుంచి ఎవరు విముక్తి ప్రసాదించగలరు! ఒక్క బాబాగారు తప్ప.."

ఎంత అమాయకత్వం..! ఇలాంటి వాళ్ళు ఉండబట్టే కదా ఇంతమంది బాబాలు బతుకుతున్నారు.. ఎన్ని వందలమంది బాబాలు మోసగాళ్ళు అని బయట పడ్డా ఇంకా, ఇంకా వీళ్ళు నమ్ముతూనే ఉంటారా.. గడ్డాలు పెంచి, కాషాయం కట్టిన వాళ్ళంతా స్వామిజిలు... బాబాలా..వీళ్ళకి ఏమైనా అతీంద్రియ శక్తులు ఉంటాయా. పిల్లలు లేని వాళ్ళకి సంతానం కలగచేస్తామంటారు.. పెళ్ళిళ్ళు కానీ వాళ్ళకి పెళ్లి చేస్తామంటారు.. పేదవాళ్ళని ధనవంతులు చేస్తామంటారు.. విద్యార్థులు చదవకపోయినా మెరిట్ లో పాస్ అయేలా చేస్తాము అంటారు.. ఇలా అనేక అసాధ్యాలను సుసాధ్యాలు చేస్తామంటారు.. ఎలా సాధ్యం.. ఏ ధైర్యంతో ఇలాంటి అబద్ధాలు చెప్తారు..

జానకి మళ్ళీ అంది "నా భయాలకి తగినట్టు ఏ పేపర్ చదివినా ఇవే వార్తలు, ఏ చానెల్ చూసిన ఇదే గొడవ... ఏ కథ చదివినా సినిమా చూసినా ఇదే ...ఇదే.. ఇదే... నాకు పిచ్చేక్కిపోతుంది.. నిద్ర కూడా పట్టదు.."

కిరణ్ చిన్నగా నవ్వి అన్నాడు.. "అమ్మా .. ఈ ప్రపంచం ఇలాగే ఉంటుంది.. దిన్ని మనం మార్చలేము. మన జాగ్రత్తలో మనం ఉంటూ ఆ దైవాన్ని నమ్ముకుంటే చాలదా చెప్పండి.."

జానకి వణికిపోతూ అంది "అలా అనకు బాబు.. మారాలి ఈ సమాజం మారాలి.. ఆడపిల్లలు నిర్భయంగా, నిశ్చింతగా ఏ సమయంలో అయినా, ఎక్కడికైనా వెళ్ళగలిగే పరిస్థితులు రావాలి.. అందుకోసం నేను ఎంతమంది బాబాల దగ్గరకు అయినా వెళ్తాను.. ఎన్ని పూజలు చేయమన్నా చేస్తాను."

కిరణ్ నవ్వాడు.. పసిపిల్లను చూసి నవ్వినట్టు నవ్వాడు.

"అమ్మా.. సమాజంలో మార్పు రావాలంటే ముందు మనిషి మనస్తత్వంలో, ఆలోచనల్లో మార్పు రావాలి.. మానవత్వపు విలువలు అర్థం కావాలి. మనిషి అంటే ఏంటో, ఎలా ఉండాలో ఎవరికీ వాళ్ళు తెలుసుకోవాలి. తోటి మనిషిని గౌరవించే హృదయ సంస్కారం కావాలి. అవి లేని వాళ్ళకి బాబాగార్లు ఇచ్చే విభూతి వలన, తాయెత్తుల వలన వస్తుందా? అయినా మీరు ముందు మీలో ఉన్న అనవసర భయాలను వదిలించుకోండి. అమ్మాయికి ధైర్యం ఇవ్వాల్సిన మీరే ఇలా వార్తలు విని, చదివి భయపడితే ఎలా? మెడిటేషన్ చేసుకోండి.. మీ ఇంటికి దగ్గరగా ఉండే గుడికి వెళ్లి ప్రశాంతంగా దేవుడి ముందు కూర్చోండి. నిజానికి మీలో ఉన్నది భయం కాదు.. సైకలాజికల్ ప్రాబ్లం ఉన్నట్టు అనిపిస్తోంది. అనవసరమైన భయానికి కారణం మీ శారీరక రుగ్మత .. ముందు దానికి చికిత్స చేయించుకోండి.. నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను చెప్తారా..?"

"ముందు నన్ను బాబాగారి దగ్గరకు తీసుకు వెళ్ళు, తరవాత నువ్వు ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం చెప్తాను" వేడుకోలుగా అంది.

కిరణ్ కొన్ని క్షణాలు ఆలోచించి అన్నాడు "సరే! ముందు మీకు ఇడ్లి తెప్పించి ఇస్తాను తినండి.. ఒక గంట విశ్రాంతి తీసుకుంటే ఒక కేసు ఉంది అది అటెండ్ అయి వస్తాను....సరేనా ..? "

ఆవిడ మొహం వికసించింది.." నా తండ్రే.. ఆ దేవుడు నిన్ను చల్లగా చూడాలి బాబు" అంది చేయెత్తి దీవిస్తూ.

కిరణ్ బెల్ నొక్కి నర్స్ ని పిలిచాడు. తెల్లని బట్టల్లో ఉన్న నర్స్ రాగానే " ఈ మేడంకి ఏం కావాలో అడిగి తెప్పించి ఇవ్వండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

జానకి తన దగ్గరకు వచ్చి " అమ్మా ఏం కావాలి మీకు?" అని ప్రేమగా అడుగుతుంటే జానకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చరిత, హరి గుర్తొచ్చి మనసు కెలికినట్టు అయింది.. నన్ను ఏ దయ్యం ఆవహించింది. ఏమవుతోంది నాకు.. అని ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయింది.

ఆవిడ సమాధానం చెప్పక పోడంతో నర్సు ఆవిడ వైపు కొంచెం వొంగి మళ్ళి అడిగింది.

జానకి కళ్ళు తుడుచుకుని " ఇడ్లి చాలమ్మా.." అని ఒక్క క్షణం అలోచించి "ఇంకో కప్పు కాఫీ కూడా కావాలి" అంది.

"విశ్రాంతి తీసుకోండి ... పది నిమిషాల్లో వస్తాను" అంటూ గదిలోంచి వెళ్ళిపోయింది.

జానకి తలగడ మీదకి వాలి ఆలోచనలో మునిగిపోయింది.

భాస్కర్ ఇనస్పెక్టర్ ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. అతని మొహంలో కనిపిస్తున్న ఆందోళన గుర్తించిన ఇనస్పెక్టర్ శాంతంగా అన్నాడు. " మీరు టెన్షన్ పడకండి.. నేను మరి కాసేపట్లో మెదక్ స్టేషన్ కి కాల్ చేస్తాను. ఇప్పుడు చాలా బిజీగా ఉంది ఫోన్ అక్కడ.. అయినా మీ మిసెస్ పెద్దావిడ కదా.. ఆవిడ ఒకవేళ బాబాల దగ్గరకు వెళ్ళినా ఆవిడను ఎవరు ఏం చేస్తారు.. మీరు అనవసరంగా కంగారు పడుతున్నారు అనిపిస్తోంది.. ఆవిడ బాబా దగ్గరకు వెళ్లి ఉండరు.. ఏదో జరిగింది.. మీరన్నట్టు మొదటిసారి ఇల్లు కదిలి వెళ్లారు కాబట్టి రూట్ తెలియక ఎక్కడికన్నా వెళ్ళారేమో!"

భాస్కర్ అసహనంగా తలాడిస్తూ "అలా వెళ్ళినా ఈ పాటికి ఎక్కడో అక్కడ కనిపించాలి కదా.. మీడియా వాళ్ళు డేగ కళ్ళతో ఇలాంటి సంఘటనలు వెతుకుతూ పట్టుకుంటున్నారు.. మీరు కూడా దాదాపు అన్ని పోలీస్ స్టేషన్ లలో చెప్పారు.. ఆవిడ ఫోటో కూడా ఇచ్చారు.. పైగా నిన్న మేము వెళ్ళిన బాబా గారి దగ్గరకు తను వెళ్లిందని అక్కడ శిష్యులు చెప్పారని చెప్పింది మా అత్తగారు.. " అన్నాడు.

"ఇప్పుడు అరెస్ట్ అయింది ఆయన కాదు.. ఆయన మీద ఇప్పటివరకు ఎలాంటి కంప్లైంట్స్ లేవు. ఇతను మెదక్ చుట్టు పక్కల ఎక్కడో విలేజ్ లో డేరా వేసుకుని ఉన్నాడు.. సుమారు రెండు వందల మంది శిష్యులు ఉన్నారట ఆడా, మగా అందరూ కలిపి. ఇతని కథ చాలా

పెద్దది.. తెలుగు టివి సీరియల్ లా వేలకొద్ది ఎపిసోడ్ లు ఉన్నాయి.. ఒక్కొక్కటే బయటకి వస్తుంది.. " ఇన్స్పెక్టర్ ఫోన్ మోగడంతో చెప్పడం ఆపి ఫోన్ తీసుకున్నాడు.

భాస్కర్ మనసంతా వేదనతో, భయంతో నిండిపోయి ఉంది..

ఏవిటో ఈ బాబాలేంటో ... ఊహించని ఈ ఉపద్రవం ఏంటో.. హాయిగా, ప్రశాంతంగా సాగిపోతున్న నదిలో పెద్ద, పెద్ద బండరాళ్ళను పడేసి, చిందర, వందర అయిన ప్రవాహం లా అయింది ఇల్లు.. ఒక పక్క పిల్లలు తల్లడిల్లిపోతున్నారు.. మరో పక్క అత్తగారు, మావగారు, ఇంకా రాలేదా జానకి, ఇంకా రాలేదా మీ ఆవిడ అని ప్రశ్నలతో ఉక్కిరి,బిక్కిరి చేస్తున్న స్నేహితులు, బంధువులు..

ఇన్స్పెక్టర్ ఫోన్ మాట్లాడడం పూర్తీ చేసి అన్నాడు " భాస్కర్ గారు నేను కంట్రోల్ రూమ్ కి వెళ్ళాలి.. ఒక మీటింగ్ ఉంది.. మీరు టెన్షన్ పడకండి..నేను ఒకసారి నిజామాబాదు కి ఫోన్ చేసి మా వాళ్ళకి చెప్తాను.. నా ఫ్రెండ్ శ్రీకాంత్ అని సర్కిల్ ఇన్స్పెక్టర్.. చాలా సిన్సియర్ ఆఫీసర్.. తను మీ మిసెస్ గురించి ఎంక్వయిరీ చేస్తాడు.. డోంట్ worry.. ఎవెరి థింగ్ will be ఫైన్ ...వన్ ఆర్ టు డేస్ లో ఆవిడ తప్పక వస్తారు.. బిలివ్ మీ "

భాస్కర్ మౌనంగా లేచి నిలబడి అతనికి షేక్ హ్యాండ్ ఇస్తూ నీరసంగా నవ్వి బయటకి నడిచాడు.

కిరణ్ జానకిని భుజాలు పట్టుకుని నెమ్మదిగా నడిపించి పోర్టికోలో ఉన్న కార్ దగ్గరకు తీసుకు వచ్చి బాక్ డోర్ తెరిచి "కూర్చోండి" అన్నాడు.

జానకి నెమ్మదిగా సీటులో కొంచెం వొంగి కూర్చుంది.

"రిలాక్స్ అవండి.. పక్కనే పిల్లో ఉంది పక్కకి తిరిగి పడుకోవచ్చు. మీకు ఇంజక్షన్ చేసాను .. నిద్ర పట్టచ్చు.." అన్నాడు కిరణ్.

"ఆశ్రమం దగ్గరకు వెళ్ళాక లేపుతావుగా" అంది జానకి.

"అలాగే తప్పకుండా.. పడుకోండి" అంటూ డోర్ వేసి తను డ్రైవింగ్ సీటులోకి వెళ్ళి కూర్చుని స్టార్ట్ చేసాడు.

జానకి సరిగా సర్దుకుని కూర్చుని సీటులో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది.

కారు హైదరాబాద్ వెళ్ళే రోడ్ వైపు తిప్పుతూ ఈవిడని భర్త దగ్గరకు చేర్చాలి.. she నీడ్స్ సైకలాజికల్ ట్రీట్ మెంట్ అనుకున్నాడు డా.కిరణ్, సైకియాట్రిస్ట్.

ఎర్రబడిన కళ్ళతో, రేగిన జుట్టు, చెమటతో తడిసిన షర్టు... అలసిపోయి ఇల్లు చేరాడు భాస్కర్.

అత్తగారు, మావగారు కూర్చుని టివి చూస్తున్నారు. ఒక వార్తా ఛానల్ లో మహేంద్ర బాబాని గురించి అతనిని ఆశ్రయించి వెళ్ళి, అతని ఉచ్చులో చిక్కుకుని బయటకు వచ్చిన కొందరు యువతీ, యువకులతో, ఒక సామాజిక కార్యకర్తతో, ఒక మనస్తత్వ శాస్త్ర వేత్తతో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

భాస్కర్ తన గదిలోకి వెళ్ళబోతున్నవాడు ఆసక్తిగా ఆగిపోయాడు.

భాస్కర్ రాకతో టివి మీద నుంచి ఏకాగ్రత పోయి అతని వైపు చూసిన లీలమ్మ అతని వాలకం చూసి గాభరాగా అడిగింది "ఏమయిందయ్యా.. అలా ఉన్నావేం?"

ఆవిడ మాటకి ఆదినారాయణ కూడా టివి మీదనుంచి దృష్టి తిప్పి అల్లుడివైపు చూసాడు.

ఎన్నో రోజులుగా లంఖణాలు చేసిన వాడిలా ఉన్న భాస్కర్ని చూడగానే ఆయన గుండె తరుక్కుపోయింది. అలా ఉన్నావేం అంటే ఏం సమాధానం చెప్తాడు.. అలాగే ఉంటాడు అనుకుంటూ తన వైపు నడచి వచ్చి తన పక్కన కూర్చున్న భాస్కర్ భుజం మీద ఓదార్పుగా చేయి వేసాడు.

భాస్కర్ సమాధానంగా ఆయన చేతిమీద తన చేయి వేసి పర్వాలేదు అన్నట్టు మెత్తగా నొక్కి వదిలేసాడు.

"ఎవరు వీళ్ళంతా" అడిగాడు టివి వైపు చూస్తూ..

"వీళ్ళంతా రక, రకాల సమస్యలతో బాబాగారిని ఆశ్రయించి వెళ్లి మోసపోయిన వాళ్ళుట.. ఈ ఛానల్ వాళ్ళకి అలవాటేగా ప్రతి ఇష్యూ కి చెత్త, చెత్త చర్చలు పెట్టడం" అన్నాడు ఆదినారాయణ.

"ఏం చెప్తున్నారు... ఏది రిమోట్ ... ఇలా ఇవ్వండి వాల్యుం పెంచుదాం" అంటూ ఆదినారాయణ కూర్చున్న హ్యాండ్ రెస్ట్ మీద ఉన్న రిమోట్ వైపు చేయి చాచాడు భాస్కర్.

ఆదినారాయణ రిమోట్ భాస్కర్ చేతికి ఇచ్చాడు.

భాస్కర్ టివి వాల్యుం పెంచుతూ "అత్తయ్యగారు కొంచెం తలనొప్పిగా ఉంది కాఫీ ఇస్తారా" అన్నాడు.

"నువ్వు భోజనం చేయలేదు ..." నసిగింది లీలమ్మ.

"ఇప్పుడేం భోజనం ఆరు దాటింది.. కాఫీ ఇవ్వండి రాత్రికి ఏకంగా భోంచేస్తాను" అన్నాడు.

లీలమ్మ చేసేది లేక లేచి వంటగదిలోకి వెళ్ళిపోయింది.

ఈ నాలుగు రోజుల నుంచి ఇంట్లో ఎవరూ కడుపునిండా తినడం లేదు, కంటి నిండా నిద్ర పోడం లేదు. ఇంట్లో ఉన్న నలుగురి కోసం బలవంతంగా ఏదో ఇంత అన్నం, పప్పు వండుతోంది కాని ఆవిడకి మెతుకు మింగుడుపడడం లేదు.

తన సంగతి ఎలా ఉన్నా అటు పిల్లలు, ఇటు అల్లుడుని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. ఆవిడ గుండెల్ని చీల్చుకుంటూ వచ్చింది ఒక నిట్టూర్పు.

ఫ్రిడ్జ్ లోనించి పాల గిన్నె తీసి స్టవ్ మీద పెట్టి ఉదయం కాఫీ కలపగా మిగిలిన డికాషన్ మరో స్టవ్ మీద వేడి చేసింది.

పండంటి సంసారం ఇలా చేసావేంటి దేవుడా.. నా కూతురు ఎక్కడికి వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది.. తనంతట తనే వెళ్ళిందా... ఎవరన్నా బలవంతంగా ఏదన్నా భ్రమ పెట్టి తీసుకు వెళ్ళారా... ఎక్కడికి వెళ్ళినా క్షేమంగా ఇంటికి వచ్చేయాలని దీవించు తండ్రి..

భగవంతుడిని వేడుకుంటూ పొంగుతున్న పాలగిన్నె దించి కాఫీ కలిపింది.

రెండు కప్పుల్లో పోసి తీసుకుని వెళ్లి అల్లుడికి, భర్తకి ఇచ్చింది.

ఆవిడ ఇచ్చిన కాఫీ కప్పు అందుకుంటూ "పిల్లలేరి" అడిగాడు భాస్కర్.

"అలా శారద గారింటికి వెళ్లారు.. వాళ్ళు ఏడుస్తూ కూర్చుంటే శారద వచ్చి తీసుకుని వెళ్ళింది." అంది లీలమ్మ.

అతను ఏం మాట్లాడకుండా టివి చూడడంలో మునిగాడు.

" మీరు బాబాగారి దగ్గరకు ఎందుకు వెళ్లారు?" యాంకర్ ఒక యువకుడిని అడిగాడు.

ఆ యువకుడు ముందు కొంచెం మొహమాట పడి చెప్పసాగాడు. "నేను ఒకమ్మాయిని లవ్ చేసిన సార్.. ఆమె నాతో మంచిగనే ఉంటది కానీ మ్యారేజ్ చేసుకుందామంటే మా ఇంట్లో ఒప్పుకోరు, వద్దు అంటది..

"ఎప్పటినుంచి మీ ఇద్దరి ఎఫైర్ నడుస్తోంది?" యాంకర్ మళ్ళి అడిగాడు..

"రెండు సమస్త్రాలు అయితుంది సార్ ..."

"రెండు సమస్రాలు అంటే టూ ఇయర్సా..."

" అవును సార్ .."

" అప్పటినుంచి ఆ అమ్మాయి కూడా నిన్ను ప్రేమిస్తోందా."

" అవును సార్ "

" ప్రేమిస్తున్నా కానీ పెళ్లి వద్దు అంటుందా.."

" లే సార్ .. ఐ లవ్ యూ ఇంకా చెప్పలే.. కానీ బండి మీద తిరుగుడు, మూవీస్ పోవుడు, హోటల్స్ అన్ని నడుస్తున్నయి.."

" మీరిద్దరూ ఒకరికొకరు ఎలా పరిచయం?"

" సేం కాలేజ్ ల ఇంటర్ చదువుతున్నం ..మా ఇండ్లు కూడా..."

" మీ ఇద్దరి మధ్యా సినిమాలు షికార్లేనా ఇంకా ఏమన్నా ఉందా?"

" అదే సార్ చెప్పిన కద మారేజ్ చేసుకుందమునుకుంటున్న"

" నువ్వు అనుకుంటున్నావు కానీ ఆ అమ్మాయి అనుకోడం లేదు అవునా...కానీ నీతో తిరుగుతోంది.. మీ ఇద్దరి మధ్యా శారీరక సంబంధం ఉందా"

"అది, అది..." అతను ఇబ్బందిగా అందరి మొహాల వైపు చూసి నీళ్ళు నమలసాగాడు.

యాంకర్ కి తను వేసిన ప్రశ్నకి అతని నుంచి వచ్చే సమాధానం పూర్తిగా వినే సహనం లేనట్టు అతని మాట పూర్తి కాకుండానే మరో ప్రశ్న అడుగుతుంటే భాస్కర్ కి చిరాకు వేసింది. ఆ కుర్రాడు కూడా తెల్లమొహం వేసాడు యాంకర్ ప్రశ్నకి.

"సో నువ్వు సిన్సియర్ గా ఉన్నా ఆ అమ్మాయి లైట్ తీసుకుంది .. అవునా. అంటూ ప్రేక్షకులతో ఇదీ విషయం ... నేటి సమాజంలో ఆడపిల్లలు ప్రేమని ఫాన్సీ గా తీసుకుంటున్నారు.. ప్రేమంటే షికార్లు, సినిమాలు, గిఫ్ట్ లు అనే ఒక వ్యామోహంలో ఉన్నారు.. ఎందుకిలా జరుగుతోంది... నేటి తరం యువతీ, యువకుల్లో ప్రేమ పట్ల సరైన అవగాహన లేకపోడానికి కారణం ఏంటి? ప్రేమ పవిత్రమైనది.. ప్రేమంటే అమృతం లాంటిది.. ప్రేమ ఎంత గొప్పదో తెలుసుకుందాం.. ఈ విషయం ప్రముఖ సైకాలజిస్ట్ డా. పాపయ్య గారిని అడిగి తెలుసుకుందాం.. పాపయ్య గారు విన్నారు కదా ఇప్పుడు ఈ యువకుడు చెప్పిన విషయం .. ఇతని ప్రేమ వ్యవహారంలో ఆ అమ్మాయి తప్పుందా...ఇతని తప్పుందా? పూర్తిగా వ్యక్తిగతమైన ప్రేమ వ్యవహారంలో బాబాగారి ప్రమేయం ఎందుకు ఉండాలి.. ఇతను బాబాగారిని ఎందుకు కలవడానికి వెళ్ళాడు.."

భాస్కర్ అసహనంగా చానెల్ మారుస్తూ వీడి బొంద .. వెధవ భేతాళ ప్రశ్నలు వీడూను అని విసుక్కున్నాడు.

మరో చానెల్ లో కూడా బాబా విషయమే చర్చ జరుగుతోంది. బాబాగారి రాసలీలలు అనే కాప్షన్ తో యాంకర్ వెనకాల ఒక బ్యానేర్ కనిపిస్తోంది. యాంకర్ కి అటూ, ఇటూ ఇద్దరేసి అమ్మాయిలు కూర్చున్నారు. యాంకర్ అడుగుతున్నాడు.

" మీరు ఆశ్రమానికి ఎప్పుడు వెళ్ళారు? ఎందుకు వెళ్ళారు?"

ఆ అమ్మాయి కన్నీళ్ళు తుడుచుకుంటూ " మా అత్తగారు నన్ను టార్చర్ పెడుతున్నది.. మా నాన్న కట్నం ఇవ్వలేనని పెళ్ళికి ముందే చెప్పాడు.. అప్పుడు మాకు కట్నం ముఖ్యం కాదు.. మీ అమ్మాయి నచ్చింది.. చాలు అన్నారు.. ఇప్పుడు రోజు మీ నాన్న కట్నం ఇవ్వలేని చవట...నీకు కనీసం ఉద్యోగం అయినా లేదు.. నయాపైస లేకుండా వచ్చావు మా ఇంటికి... బాగా తిని బలిసిపోతున్నావు .. నీకు పెరుగెందుకు

అంటూ పల్చటి మజ్జిగ పోస్తుంది.. మా ఆయన నాకోసం పూలు తెస్తే నీ మొహానికి పూలు కూడానా అంటూ లాగేసుకుంటుంది.. మా ఆయనకి చెప్తే నేనేం చేయను అన్నాడు.. అందుకే బాబా దగ్గరకు వెళ్లాను.”

“అలాగా వెళ్తే ఏమన్నారు బాబాగారు?”

“నేనున్నాకదా నీ సమస్య వారం రోజుల్లో తీర్చేస్తా.. ఈ వారం రోజులు నువ్వు మా ఆశ్రమంలో ఉండు .. మా శిష్యులు ఏం చెప్తే అది చేయి అన్నారు..”

“మీరు ఉన్నారా..”

ఆమె కళ్ళల్లో భయం ... “ ముందు ఉండద్దు అనుకున్నాను. కానీ నా కష్టాలు గట్టెక్కుతాయని ఆశ కలిగి మా అమ్మగారింటికి వెళ్తున్నాను అని మా అత్తగారికి, మా ఆయనకీ చెప్పి ఆశ్రమానికి వెళ్లాను.”

“ఏం జరిగింది ఆశ్రమంలో.”

ఆమె గభాల్న ఏడవడం మొదలు పెట్టింది..

“చెప్పండి ఏం జరిగింది” ముద్దాయిని లాయర్ అడిగినట్టు గద్దించి అడిగాడు యాంకర్.

ఆమె వెక్కుతూ చెప్పసాగింది “ రాత్రి ఎనిమిది వరకూ భజన సాగింది. ఎనిమిది అయాక ప్రసాదం అంటూ కొంచెం పులిహోర పెట్టారు.. తిన్నాక ఇంక పడుకోండి ఉదయం నాలుగింటికే భజన మొదలు అవుతుంది అంటూ నన్ను, నాతొ ఉన్న ఇదిగో ఈ అమ్మాయిని” అంటూ తన పక్కన కూర్చున్న అమ్మాయిని చూపించింది.

“ మీరెందుకు వెళ్ళారు” ఆమెని అడిగాడు .

“మా పిల్లలు చెప్పిన మాట వినడం లేదు.. ఇరవై నాలుగు గంటలూ వీడియో లు చూస్తూ ఉంటారు.. చదువుకో మంటే కోపం.. కాసేపు బయటకు వెళ్లి ఆడుకో అంటే కోపం.. నాకు ఇద్దరు పిల్లలు, బాబు, పాపా .. పాపని నాకు ఇంట్లో హెల్ప్ చేయమంటే కోపం.. మాఆయన అసలు ఏమి పట్టించుకోడు. అందుకే నా బాధ బాబాగారికి చెబితే పిల్లలకి ఏదన్నా తాయెత్తు ఇస్తారేమో అని వెళ్ళాను.”

“మంత్రాలకు చింతకాయలూ రాలతాయా.. ఇది నేటి ప్రశ్న ..” అని గట్టిగా ప్రేక్షకులతో అని మళ్ళీ అడిగాడు “ఆ గదిలోకి వెళ్ళాక ఏం జరిగింది?”

“ ఆ గదిలో, ఆ గదిలో ...” అంటూ తల వంచుకుంది ఆవిడ..

“ మీరు చెప్పండి ఏం జరిగింది.. జరగరానిది జరిగిందా..”

“అది చాలా పెద్ద పడక గది.. దానిలో మధ్యలో పెద్ద పందిరి మంచం ... మంచం మీద బాబాగారు .. ఆయన పక్క ఇద్దరు అమ్మాయిలూ అర్ధ నగ్నంగా కూర్చుని ఆయనకీ గాజు గ్లాస్ లో విస్కీ పోసి ఇస్తున్నారు.. ఆయన వాళ్లతో అసభ్యంగా ప్రవర్తిస్తూ తాగుతున్నారు.. మేమిద్దరం అది చూసి భయంతో గదిలోంచి పరిగెత్తుకుంటూ బయటకి వచ్చాం.. మమ్మల్ని పట్టుకోడానికి ఇద్దరు శిశ్యులు మా వెనకే వచ్చారు.. ఆ క్షణంలో మాకు పిచ్చి బలం వచ్చింది. చాలా వేగంగా పరిగెత్తి రోడ్ మీదకి వచ్చాము. ఆ రాత్రి ఇంటికి వెళ్ళలేము.. ఎక్కడ ఉండలేము.. భయం..భయం .. నేరుగా పోలీస్ స్టేషన్ కి వెళ్ళాము..”

“అసభ్యంగా అంటే ఎలా ... వాళ్ళ మీద చేయి వేసి కూర్చున్నారా... లేక ఇంకా దగ్గరగా..”

భాస్కర్ మండి పడుతూ రిమోట్ విసిరేసి అన్నాడు “రాను, రానూ మీడియా చండాలంగా తయారవుతోంది. ప్రతి ఇష్యూ లో బూతు చూడడం అలవాటు అయింది.. ఇవి చానల్స్ కాదు.. బ్రోతల్ హౌస్ లు” అంటూ విసురుగా లేచి లోపలికి వెళ్లి పోయాడు.

అతని ఆవేశం చూసిన లీలమ్మ వణికిపోయింది. కింద పడిన రిమోట్ తీసి టివి ఆఫ్ చేసింది. ఆదినారాయణ సోఫాలో కాళ్ళు చాపుకుని పడుకున్నాడు.

కిరణ్ కారు కొత్త పేట చేరింది. బాగా రద్దీగా ఉంది. మెట్రో కన్స్ట్రక్షన్ వల్ల కాబోలు ట్రాఫిక్ జాం అయింది. వాహనాల రణగొణధ్వనులతో , హారన్ మోతలతో పిచ్చేక్కిపోయేలా ఉంది.

జానకికి మెలకు వచ్చింది..కళ్ళు తెరిచి కిటికిలోంచి చూస్తూ “ఎక్కడికి వచ్చాం” అంది.

కిరణ్కి కొంచెం భయం వేసింది.. బాబాగారి దగ్గరకు అని చెప్పి తీసుకు వచ్చాడు.. హైదరాబాద్ చేరిందాకా మూడు గంటల సేపు నిద్రపోడానికి చాలా తక్కువ డోస్ మత్తు మందు ఇచ్చాడు. ఇప్పుడు హైదరాబాద్ అంటే గొడవ చేయదు కదా ...అనుకుంటూ తొణక్కుండా అన్నాడు “హైదరాబాద్ .. మీ ఇంటికి వెళ్తున్నాము .. ఇప్పుడు మీరే నాకు రూట్ చెప్పాలి.”

అనూహ్యంగా జానకి” హైదరాబాదా” అంటూ వెర్రి ఆనందంతో అరిచింది.

హమ్మయ్య అనుకున్నాడు కిరణ్ “అవునండి” అన్నాడు.

జానకి మనసు పురివిప్పిన నెమలిలా అయింది. “మా ఇంటికా? ఎక్కడ? ఎక్కడికి వచ్చాం... అవును వెళ్ళాలి... నా పిల్లలని చూడాలి.. నా చరిత ఎలా ఉందొ.. ఏం చేస్తోందో.. ఆయన ఎలా ఉన్నారో ... వెళ్ళాలి” అంది ఉద్వేగంగా..

కిరణ్ రిలాక్స్ అయి నవ్వుకుని “ఇప్పుడు చెప్పండి అష్టలక్షి గుడి దగ్గరకు వచ్చాం .. మీ ఇల్లు ఎక్కడ?” అన్నాడు.

అప్పుడు దాదాపు తొమ్మిది దాటుతోంది.

గుడి తలుపులు అప్పుడే మూసినట్టున్నారు. భక్తులు నలుగురైదుగురు గుడి మెట్ల మీద కూర్చుని చల్లగాలి ఆస్వాదిస్తున్నారు. భక్తుల చెప్పులు భద్రంగా చూసే చిన్న వ్యాపారస్తులు చిల్లర లేక్కపెట్టుకుంటున్నారు .

గుడి ప్రధాన ద్వారం ముందు నుంచి కారు వెళ్తోంటే జానకి విండో వైపు జరిగి “ముందు ఈ గ్లాస్ దించు బాబు” అంది.

కిరణ్ గ్లాస్ దించాడు.. ఆవిడ విండో లోంచి తొంగి చూస్తూ “ఆ, ఆ ఇటే .. ఎడం పక్కకి తిప్పు” అని అరిచింది.

ఆ క్షణం ఆవిడ తను బాబాగారిని కలుసుకోకుండా వచ్చాను అన్న విషయం మర్చిపోయింది.. ఎంతో కాలంగా తన ఇంటికి, భర్త, పిల్లలకి దూరంగా ఉండి ఇప్పుడే వాళ్ళని చూడబోతున్నానన్న ఆనందం, ఉద్వేగం ఆపుకోలేకపోతోంది.. ఒళ్ళంతా పులకించిపోతోంది.. అష్టలక్షి గుడి గోపురం, ఆ పరిసరాలు, తను భర్తతో, పిల్లలతో కలిసి ఎక్కిన మెట్లు కనుమరుగు అవుతోంటే వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ ఇల్లు సమీపించగానే గట్టిగా అరిచింది “ఇదే మా ఇల్లు.. అయ్యో... ఆపు బాబు ఆపు ...”

కారు ఆగింది.

అప్పుడే శారద ఇంట్లోనే డిన్నర్ చేసి ఇంటికి తిరిగి వస్తున్న చరిత, హరి గేటు ముందు కారు ఆగడం చూసి ఎవరో వచ్చారు మనింటికి అనుకుంటూ గబ, గబా వచ్చారు.. కిరణ్ కారు దిగి, బ్యాక్ డోర్ తిరిచాడు. గభాల్న దిగబోయిన జానకి తూలిపడబోయింది. చటుక్కున ఆవిడని పట్టుకుని దిగడానికి సాయం చేసాడు.

స్ట్రీట్ లైట్ వెలుగులో తల్లిని గుర్తించిన చరిత, హరి ఒకేసారి గట్టిగా అరిచారు.. “అమ్మ ... అమ్మా..” పరిగెత్తుకుంటూ వచ్చి అమ్మా అంటూ ఏడుస్తూ ఆవిడని చుట్టేశారు.

జానకి దుఖంతో వణికిపోతూ గొంతులోంచి మాటరాక వెక్కి, వెక్కి ఏడుస్తూ పిల్లలని దగ్గరకు తీసుకుంది.

కిరణ్ కి కళ్ళు చెమ్మగిల్లాయి.

అప్పుడే పిల్లలు ఇంకా రాలేదు అనుకుంటూ వీధి గుమ్మంలోకి వచ్చిన లీలమ్మ గేటు ముందు ఆగి ఉన్న కారు, అక్కడ హడావుడి, పిల్లలు ఎవరినో కౌగలించుకుని ఉండడం అదంతా చూసి కళ్ళద్దాలు సరి చేసుకుంటూ " ఏవండి ఇలా రండి త్వరగా" అంటూ భర్తని పిలిచింది.

"ఆ, ఆ వస్తున్నా" అంటూ సోఫాలోంచి ఆదినారాయణ లేచి వచ్చేలోగా పిల్లలిద్దరూ చెరో వైపు పట్టుకుని నడిపిస్తూ జానకిని లోపలికి తీసుకు వచ్చారు. ఇంట్లో అడుగు పెట్టిన జానకి ఎదురుగ గుమ్మంలో ఉన్న తల్లిని చూసి అమ్మా అంటూ పిల్లలని విడిపించుకుని ఆవిడ గుండెల మీద వాలిపోయి బావురుమంది.

నిర్ఘాంతపోయి నిలబడిన లీలమ్మ అమ్మమ్మ అమ్మ అమ్మ వచ్చింది అన్న పిల్లల మాటతో స్పృహ వచ్చిన దానిలా అమ్మా జానకి అంటూ కూతుర్ని గట్టిగా కౌగలించుకుంది. అప్పుడే అటు వచ్చిన ఆదినారాయణ జానకీ అంటూ గట్టిగా అరిచాడు.

తన ఆ గదిలో పడుకుని అస్థిమితంగా మంచం మీద దొర్లుతున్న భాస్కర్ జానకి అన్నా ఆదినారాయణ కేకకి గభాల్న బయటకి వచ్చాడు.

అక్కడి దృశ్యం చూసి స్తంభించిపోయాడు.

***

పిల్లలిద్దరూ చెరో భుజం మీదా వాలిపోయి ఉన్నారు.. జానకి ఇద్దరినీ చెరో చేత్తో దగ్గరకి తీసుకుని తల్లి భుజం మీద తలపెట్టుకుని ఏడుస్తోంది. ఆదినారాయణ దుఃఖం దిగమింగుకుంటూ జానకి తల మీద ఓదార్పుగా రాస్తున్నాడు.

భాస్కర్ తన కళ్ళను తానే నమ్మలేనట్టు అడుగులో అడుగు వేస్తూ వాళ్ళ దగ్గరగా వచ్చి ఒక్కో అక్షరం కూడబలుక్కుంటూ "జా ...న....కీ" అన్నాడు.

నాదస్వరం విన్నట్టుగా జానకి ఒక్కసారిగా అందరినీ వదిలి భాస్కర్ ని చూస్తూ "ఏవండి" అంటూ గట్టిగా అరిచింది.

భాస్కర్ చేష్టలుడిగిపోయిన వాడిలా స్తంభించి పోయాడు.

నోటినుంచి ఒక్క మాట కూడా రాలేదు..

జానకి గబుక్కున అతని గుండెల మీద వాలిపోయింది.

భాస్కర్ శిలలా నిలబడిపోయాడు.

పిల్లలిద్దరూ తల్లి వెనకాలే వెళ్లి ఆమె మళ్ళీ ఎక్కడికన్నా వెళ్ళిపోతుందేమో అన్నట్టుగా మీద చేతులు వేసి నిలబడుతున్నారు.. ఇప్పుడూ అలాగే ఆమె భుజాల మీద చేతులు వేసి నిలబడి పోయారు.

అదంతా చూస్తూ అయోమయంగా నిలబడిపోయిన అపరిచితుడు కిరణ్ ని అప్పుడే చూసాడు ఆదినారాయణ. ఇతనేగా తన కూతుర్ని ఇంటికి చేర్చిన దేవుడు అనుకుంటూ..

"మీరు...?" ప్రశ్నార్థకంగా చూసాడు.

కిరణ్ నోటినుంచి మెల్లగా వచ్చాయి మాటలు.

"నా పేరు డాక్టర్ కిరణ్. నాకు కొంచెం వాటర్ ఇస్తే ఏం జరిగిందో చెప్తాను" అన్నాడు.

ఆ మాటలకి స్పృహలోకి వచ్చిన లీలమ్మ తన తప్పు తెలుసుకుని, " అయ్యో పాపం ఇతన్ని పట్టించుకోలేదు" అనుకుంటూ "రండి అందరూ లోపలికి పదండి.." అని పిల్లలిద్దరిని పిలుస్తూ లోపలికి నడిచింది.

ఆదినారాయణ "రా నాయనా కూర్చో" అంటూ కిరణ్ కి సోఫా చూపించి "లీలా అబ్బాయికి మంచి నీళ్ళు ఇవ్వు" అన్నాడు.

ఆవిడ మంచి నీళ్ళు తేవడానికి లోపలి వెళ్ళింది.

భాస్కర్ జానకి భుజం చుట్టూ చేతులేసి లోపలికి నడిపిస్తూ "వెళ్ళు జానకీ ఫ్రెష్ అయి రా" అన్నాడు.

"వెళ్ళను.. నాకు భయం వేస్తోంది.. మిమ్మల్ని వదిలి క్షణం కూడా వదలను" అంది జానకీ మరింతగా అతన్ని అల్లుకుపోతూ.

"వచ్చేశావుగా .. భయం లేదు వెళ్ళు.." ఆమెని నడిపిస్తూ లోపలికి తీసుకు వచ్చాడు.

కిరణ్ వాళ్ళందరినీ చూస్తూ ఇంతమంచి కుటుంబం! ఇంత ప్రేమానురాగాలు ఇవన్నీ వదిలి ఈవిడ ఎందుకు బయటకి వచ్చింది.. ఏం కావాలి ఈవిడకి అని ఆశ్చర్యంగా అనుకున్నాడు.

లీలమ్మ మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది. భాస్కర్ బలవంతం మీద జానకి ఫ్రెష్ అవడానికి బాత్రూం వైపు వెళ్ళింది. పిల్లల్ని దగ్గరకు తీసుకుని అన్నాడు భాస్కర్ "మీరు వెళ్లి పడుకోండి నాన్నా.. అమ్మ వచ్చిందిగా ఇంక ఎక్కడికీ వెళ్ళదు.. ఇప్పుడు అమ్మ కూడా విశ్రాంతి తీసుకుంటుంది వెళ్ళండి. "

పిల్లలిద్దరూ అయిష్టంగానే వాళ్ళ, వాళ్ళ గదిలోకి వెళ్ళిపోయారు.

భాస్కర్ కిరణ్ పక్కకి వచ్చి కూర్చుని "నా పేరు భాస్కర్" అన్నాడు అతనికి షేక్ హ్యాండ్ ఇచ్చి.

కిరణ్ జరిగిందంతా చెప్పసాగాడు. అంతా విన్న భాస్కర్ నిశ్చేష్టుడయాడు.. బాబా కోసం నిజామాబాదు వెళ్ళిందా. జానకి పెళ్లి అయి తన వేలు పట్టుకుని వచ్చిన దగ్గర నుంచి తను లేకుండా ఎక్కడికి వెళ్ళని జానకి ఒక్కతీ నిజామాబాదు వరకూ వెళ్ళిందా!? ఎవరు జానకిని అక్కడికి తీసుకు వెళ్ళిన స్త్రీ..!?

ఆదినారాయణ, లీలమ్మ కూడా అతను చెప్పింది విని విస్తుబోయారు.

జానకిని బాబా దగ్గరకు వెళ్ళడానికి ప్రేరేపించిన విషయం ఏంటి? చరిత విషయంలో అంత భయపడడానికి కారణం ఏంటి? చరిత కొంపతీసి ఏదన్నా ప్రేమ వ్యవహారంలో పడిందా.. ఆ విషయం తెలిసి జానకీ కంగారు పడిందా.

కంగారు పడితే పడచ్చు కాక ఆ విషయం భర్తకి చెప్పచ్చు.. తనకి ఫోన్ చేసి చెప్పచ్చు..

"ఇంకా ఏమన్నా చెప్పిందా బాబూ మా అమ్మాయి?" అడిగాడు ఆదినారాయణ.

"ఆవిడ చెప్పింది మీకు చెప్పాను, కాకపోతే ఆవిడ మాటల వల్ల నాకు తెలిసింది ఏంటంటే సమాజంలో ఆడపిల్లల పట్ల జరుగుతున్న అరాచకాలు, అత్యాచారాలు ఇవన్నీ వార్తల్లో చూసి ఆవిడ మానసికంగా చాలా ఆందోళనకి గురి అవుతున్నారు. ఇలాంటి కేసు నా దగ్గరకి రెండేళ్ళ క్రితం వచ్చింది.. ఆవిడ కూడా ఇలాగే భయపడి కూతురుని ఎక్కడికీ పంపించకుండా చదువు కూడా లేకుండా ఇంట్లో ఒక విదంగా నిర్భందించి ఆ అమ్మాయిని టార్చర్ పెట్టింది. భర్త, కూతురు ఎంతగా నచ్చ చెప్పినా వినేది కాదు.. వాళ్ళు ఇంక విసిగిపోయి ఆవిడని నా దగ్గరకు తీసుకువచ్చారు. ఇప్పుడు ఆవిడ కొంచెం మానసికంగా నిలదొక్కుకుంది. మీకు అభ్యంతరం లేకపోతె జానకి గారికి నేను ట్రీట్ మెంట్ ఇస్తాను. ఆవిడ తప్పకుండా కోలుకుంటారు. కొంత మంది అయితే ఇవే ఆలోచనలతో ట్రాన్స్ లో ఉన్నాట్టే ఉంటారు.. ఈవిడ బెటర్ .. అప్పటివరకూ బాబా గారిని కలుసుకుంటే గాని ఇంటికి వెళ్ళను అన్న మనిషి మీ లొకేషన్ కి రాగానే పిల్లలు, పిల్లలు అంటూ బాబా ధ్యాస నుంచి బయట పడ్డారు."

అతని మాటలు వింటుంటే భాస్కర్ కి ఇటీవల కొంత కాలంగా జానకి ప్రవర్తనలో వచ్చిన మార్పులు, చరిత పట్ల ఆవిడ ప్రవర్తించిన విధానం కళ్ళ ముందు కదిలింది.

ఇదనమాట జానకి జబ్బు..

గబుక్కున కిరణ్ చేతులు పట్టుకుని “మీ ఋణం ఉంచుకోను డాక్టర్.. జానకిని మామూలు మనిషిని చేయండి” అన్నాడు.

కిరణ్ నవ్వి “నా వృత్తే కదండీ.. నాకేం కష్టం లేదు.. డోంట్ వర్రీ.. మీరు చాలా లక్కీ .. ఆవిడ సేఫ్ గా వచ్చారు. ఈ బాబాలు, స్వామీజీలు దగ్గరకు వెళ్ళిన స్త్రీలు ఏ వయసు వాళ్ళు అయినా వాళ్ళ శిబిరాల నుంచి బయట పడడం అసాధ్యం.. రక,రకాలుగా వాళ్ళని వాడుకుంటూ దొంగ బాబాలు, స్వామీజీలు చేస్తున్న దారుణాలు అనేకం.. ఎంత మంది వెధవలు పట్టుపడినా ఇంకా, ఇంకా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు ఈ బాబాలు..”

“అమ్మో! నిజంగానే మేము అదృష్టవంతులం బాబూ.. ఎన్ని వార్తలు టి వి లో చూడడం లేదు..దేవుడా!” లీలమ్మ గోడకున్న వెంకటేశ్వరస్వామి పటానికి రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టింది.

“తన మనసులో చెలరేగే భయాలు ఒక్కసారి నాకు చెప్పి ఉంటె ఏం చేయాలో నేనే ఆలోచించేవాడిని.. నేనెప్పుడూ తనకి ఏ విషయంలో కూడా ఎలాంటి అభ్యంతరాలు పెట్టలేదు. డాక్టర్ కి చూపించేవాడినో, తన నమ్మకాలు, విశ్వాసాలని గౌరవించి బాబాల దగ్గరకే తీసుకువెళ్ళేవాడినో ... ఏదో ఒక పరిష్కారం చూపించేవాడిని.. ఎందుకు జానకి ఇలాంటి పని చేసింది?” బాధగా అన్నాడు భాస్కర్.

సానుభూతిగా చూసాడు కిరణ్.

“అంతా అయోమయంగా ఉంది. శారదతో ఎంతో సన్నిహితంగా ఉండే జానకి కనీసం ఆవిడకి కూడా చెప్పకుండా ఎందుకిలా చేసింది.. అసలు తనకి ఈ బాబాల సలహా ఇచ్చి, వెంట తీసుకు వెళ్ళింది ఎవరు? అటు శారదకి , ఇటూ నాకు చెప్పకుండా అలా ఎలా వెళ్ళింది? ఇదంతా ఖర్మ అనుకోవాలా.. ఏమనుకోవాలి?”

అతని స్వరంలో వినిపిస్తున్న ఆవేదన హృదయాన్ని మెలిపెడుతుంటే అల్లుడి మీద ప్రేమ గుండెనిండా నిండిపోయింది ఆదినారాయణకి. నెమ్మదిగా అతని వీపు మీద చేయి వేసి నిమురుతూ “అయిపోయిందిగా బాధపడకు.. జానకి చేసిన పూజలే తనని కాపాడాయి దుష్టశక్తుల బారిన పడకుండా.. లేకపోతె ఆ గుర్మీత్ బాబా గాడి లాంటి బాబా అయితే ఎంత ఘోరం జరిగేది” అన్నాడు.

“ఒక్క గుర్మీత్ రాం కాదండి.. మొత్తం దేశంలో కరడుగట్టిన క్రిమినల్స్ గా పది మంది బాబాలు బయటపడ్డారు. చాలా భయంకరంగా పెరిగిపోతున్నారు బాబాలు.. బయట క్రిమినల్స్ కన్నా ఈ డెన్ క్రిమినల్స్ ఎక్కువైపోయారు. ఒకళ్ళా ఇద్దరా..బాబా రాంపాల్ , ఇచ్చాదరి బాబా , నిత్యానంద స్వామి, నిర్మల్ బాబా, ఓం స్వామి , సచ్చిదానందన గిరి .. స్వామి అసీమానంద్ , బాబా రాం రహీం, నారాయణ సాయి, రాధేమా ... ఆశారం బాపు అసలు ఈయన చూపులే భయంకరంగా ఉంటాయి. గుర్మీత్ రాం.. వీడి గురించి ఎన్ని కథలు.. ఎకరాలకి ఎకరాలు ప్రభుత్వ భూమి స్వాహా చేసాడు.

సంత్ ఆశారం బాబా .. వీడి డెన్ లో ఐదుగురు మహిళల శవాలు కనిపించాయి.. ఒక మైనర్ బాలిక .. వీడి ఆశ్రమం , ఆశ్రమం కాదులెండి.. అదొక డెన్ ... పోలీసులు దాడి చేస్తే తన శిష్యుల తో ఒక కంచె కట్టించాడుట. ఒక ఎస్ ఐ వీడి శిష్యులు చంపేశారు. వీడికి 22 ఏళ్ళు జైలు శిక్ష వేసారు.

జై గురుదేవ్ .. మధురలో ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నాడు. వీడి స్థలాలే నాలుగు వేల కోట్లుట..

ఇంక నిత్యానంద స్వామి వాడి రాసలీలలు.. ఆరుగురు ఆడవాళ్ళతో ఉన్నప్పుడు అరెస్ట్ చేసారు.

వీళ్ళంతా భక్తి పేరుతొ చేసిన ఘోరాలు, నేరాలు, స్కాం లు.. మైగాడ్ చెప్పుకుంటూ పోతే ఎపిసోడ్ లకు, ఎపిసోడ్ లు ... ఈ చెత్త ప్రైవేట్ చానల్స్ వాళ్ళు పనికిమాలిన సీరియల్స్ వేలకి వేలు ఎపిసోడ్ లుగా తీసే బదులు, ఇలాంటి కథలు తీస్తే జానకీ గారిలాంటి

అమాయకస్త్రీలు ఇలా బాబాలు అంటూ ప్రతి సమస్యకి వాళ్ళ దగ్గరకి పరిష్కారం కోసం వెళ్లరు.. ముఖ్యంగా ఆడవాళ్లే ఈ బాబాలను పెంచి పోషిస్తున్నారు.. వీళ్ళ బేలతనం, భయాలు..” ఆవేశంగా చెప్పుకు పోతున్న కిరణ్ జానకి రావడంతో ఆపేసాడు.

అతను చెప్తున్న బాబాల చరిత్ర వింటూ భయంతో వణికిపోయింది లీలమ్మ. జానకి నేరుగా వచ్చి తల్లి పక్కన కూర్చుంది.

“మీరు విశ్రాంతి తీసుకోండి” అన్నాడు కిరణ్ జానకి వైపు చూసి.

జానకి నీరసంగా నవ్వింది. “ఇంక నా వాళ్ళ దగ్గరకి వచ్చాను నిశ్చింత” అంది.

భాస్కర్ వైపు చూసి “నేను ఒక ప్రిస్క్రిప్షన్ రాసిస్తాను.. రేపటి నుంచీ ఆ మేడిసన్ వాడండి..షి విల్ బి ఆల్రైట్ .. ఇదిగో నా కార్డ్” అంటూ జేబులోంచి పర్స్ తీసి అందులో నుంచి తన విజిటింగ్ కార్డ్ తీసి ఇచ్చాడు.

భాస్కర్ కృతజ్ఞతగా అందుకుని థాంక్స్ అన్నాడు.

కిరణ్ లేచి నిలబడి “నేను సెలవు తీసుకుంటాను సార్” అన్నాడు.

వెంటనే భాస్కర్ అతని చేయి పట్టుకుని కూర్చోబెడుతూ “ఎక్కడికి వెళ్తారు ఇంత రాత్రివేళ.. ఉండండి భోజనం చేసి ఇక్కడే ఉండి ఉదయం వెళ్ళండి” అన్నాడు.

“అవును బాబూ మిమ్మల్ని ఇలా పంపడం మాకు ధర్మం కాదు” అన్నాడు ఆదినారాయణ.

జానకి అతని వైపు చూస్తూ నీరసంగా అంది “పాపం ఇతను నన్ను ఆదుకుని తన హాస్పిటల్ కి తీసుకువెళ్ళాడు నాన్నా.. ఏ జన్మలో రుణానుబంధమో .. అమ్మా అని నోరారా పిలిచాడు.”

“ఇంకేం అమ్మ కోసం ఉండిపో బాబూ .. ఈ రాత్రి ఇక్కడ విశ్రాంతి తీసుకుని ఉదయమే వెళ్ళు” అంది లీలమ్మ కూడా.

అందరూ అంత ఆప్యాయంగా చెప్తుంటే కిరణ్ కి వెళ్లాలని అనిపించలేదు. ఈ కుటుంబంతో తనకి ఎంతో కాలంగా ఒక అనుబంధం ఏదో ఉన్నట్టు అనిపించింది.

“అమ్మా అందరికి భోజనం సంగతి చూడు” అన్నాడు భాస్కర్.

“అలాగే నాన్నా...” అంటూ చాలారోజుల తరవాత రెట్టించిన ఉత్సాహంతో లేచి వంట గది వైపు వెళ్ళింది లీలమ్మ.

“మీరు ఫ్రెష్ అవండి” అన్నాడు భాస్కర్.

కిరణ్ లేచాడు. భాస్కర్ అతనికి టవల్ ఇవ్వడానికి తను కూడా లేచి కిరణ్ వెనకాల వెళ్ళాడు.

జానకి కూర్చున్న దగ్గరనుంచి లేచి తండ్రి పక్కకి వచ్చి ఆయన ఒడిలో తలపెట్టుకుని పడుకుంది.

ఆదినారాయణ ఆవిడ తల మీద చేయి వేసి నిమురుతూ “దేవుడులాంటి భర్త.. ఎన్ని పూజలు చేస్తే లభిస్తాడు.. అతనుండగా నీకేం లోటని బాబాలను ఆశ్రయించి వెళ్లావు తల్లి?” అన్నాడు.

జానకి చివ్వున లేచి కూర్చుని “ఎంతపని జరిగింది నాన్నా..అంత దూరం వెళ్లి బాబాగారిని కలుసుకోకుండా వచ్చాను. అయ్యో.. వెళ్ళాలి నాన్నా.. బాబాగారిని కలవాలి.. ఆయనకీ బోలెడు మహిమలున్నాయిట.. నాన్నా! తీసికెళ్ళవూ.” అంది ఆయనవైపు ప్రాధేయపూర్వకంగా చూస్తూ.

ఆయన స్థాణువులా చూసాడు..

జానకి బాబాల ప్రలోభంలో ఎలా పడింది? ఆయన మెదడులో మొదటసారిగా మెదిలిన ఆ ప్రశ్న ఆయనని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే నిరుత్తరుడై ఆమెనే చూస్తూ ఉండిపోయాడు..

అర్ధరాత్రి.. పన్నెండు దాటింది. జానకి ఇంటికి వచ్చేసింది అన్న ఆనందంతో ఇంటిల్లిపాదీ హాయిగా నిద్రపోతున్నారు. భాస్కర్ కి మాత్రం ఎంత ప్రయత్నించినా నిద్రరావడం లేదు. జానకి తిరిగి రావడం ఆనందంగా ఉన్నా, ఆమె మానసిక స్థితి చూస్తుంటే మళ్ళీ ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం తెస్తుందో అని భయంగా ఉంది.. ఆమె ఏ మాత్రం కదిలినా ఆందోళనతో నిండిపోతోంది మనసు. కిరణ్ చెప్పిన విషయం తలచుకుంటే భయంతో వణుకు పుడుతోంది.

ప్రపంచంలో ఎన్నో జరుగుతున్నాయి. వాటిని సీరియస్ గా తీసుకోడం తనకి ఆపాదించుకుని మానసిక క్షోభ అనుభవించడం ఎంతవరకు సమంజసం!

జానకి మానసికంగా అంత బలహీనురాలా!

ఈ సంగతి తనకి ఎప్పుడూ అనిపించలేదు. ఏదో ఆందోళన పడుతోంది అనుకున్నాడే గానీ ఇంత వ్యాకులతతో ఉందని అనుకోలేదు.

చరితని ఊరికే తన అనుమానాలతో వేధిస్తోందని చిరాకుపడ్డాడే కాని జానకి పడే ఆవేదన అర్థం చేసుకోలేదు.

ఏ మాత్రం అర్థం చేసుకుని ఉన్నా ముందే ఆమెకి కౌన్సిలింగ్ ఇప్పించేవాడు.

జానకి బాబాల దగ్గరకు వెళ్ళే పరిస్థితే వచ్చేది కాదు..అసలు జానకికి అలా వెళ్ళాలన్న ఆలోచన ఉందని కూడా తనకి తెలియకపోడం దురదృష్టం.

అదృష్టం బాగుండి కిరణ్ లాంటి మంచి వ్యక్తి దృష్టిలో పడింది కానీ ఇంకేదన్నా అయి ఉంటె!.

భాస్కర్ గుండె వేగంగా కొట్టుకుంది కొన్ని క్షణాలు.

పక్కన పడుకున్న జానకీ వైపు చూసాడు.

మానసికంగా, శారీరకంగా బాగా అలసిపోయిందేమో ఆదమరచి నిద్రపోతోంది.

బెడ్ లైట్ వెలుగు పల్చగా ఆమె మీద పడుతోంది. ఆమె ఎడమ చేయి మడిచి తలకింద పెట్టుకుని ఎడమవైపు ఒత్తిగిలి కుడి చేయి భాస్కర్ పొట్టమీద వేసి నిశ్చింతగా నిద్రపోతోంది.

ఫ్యాన్ గాలికి ముంగురులు నుదుటి మీద పడుతున్నాయి. తెలుపు, నలుపు కలగలిసిన ఆ ముంగురులు సున్నితంగా పైకి తోసి పసిపిల్లలా నిద్రపోతోన్న ఆమె వైపు జాలిగా చూసాడు.

ఏమైంది జానక్కి? ఎందుకిలా అయింది. కళ్ళకింద నల్లగా కమిలినట్టు అయింది. ఎప్పుడూ రెండువైపులా చెంపల మీద పసుపు, కళ్ళనిండా కాటుక, నుదుట కుంకుమతో కళ, కళలాడుతూ కనిపించే జానకి వడలిపోయి ఉంది.

గుండెల్ని చీల్చుకుంటూ వచ్చింది నిట్టూర్పు.

ఎంత నిశ్చింతగా నిద్రపోతోంది! ఇలా ఇంత హాయిగా పడుకుని చాలాకాలమైంది.

అర్ధరాత్రిళ్లు లేచి చరిత గదిలో పడుకునేది. లేదంటే హాల్లో సోఫాలో కూర్చుని ఆలోచిస్తూ ఉండేది. నాలుగు కూడా కాకుండా స్నానం చేసి పూజ చేసుకునేది. “పడుకో జానకి అప్పుడే ఎందుకు లేచావు” అని అడిగితే నిద్ర రావడం లేదు అని ముక్తసరిగా చెప్పేది. గత కొద్ది నెలలుగా ఏదో మనోవ్యాధితో బాధపడుతోంది అనుకున్నాడే కానీ అది ఇలాంటి ఉపద్రవానికి నాంది పలుకుతుందని అనుకోలేదు.

ఎంత ప్రమాదం తప్పింది!

ఎలా జానకిని మళ్ళీ మామూలు మనిషి చేసుకోవాలి?

కిరణ్ ఏవో మందులు రాసాడు. మందులు వాడాల్సినంత పరిస్థితి ఎలా కలిగింది? జానకికి ఏం తక్కువ అయిందని డిప్రెషన్! కిరణ్ తో మళ్ళీ ఒకసారి వివరంగా మాట్లాడితే!

అందరి ఎదురుగా అతను చెప్పేది సరిగా వినలేదు..

వివరంగా ఏమీ అడగలేదు.

కిరణ్ తో మాట్లాడి ఈమె సమస్యకి శాశ్వత పరిష్కారం ఉందేమో తెలుసుకుంటే!

భాస్కర్ నెమ్మదిగా జానకి చేయి తన పొట్ట మీద నుంచి తప్పించాడు.

ఆమెకి నిద్రాభంగం కలక్కుండా అతి జాగ్రత్తగా కొంచెం ఎడంగా జరిగి ఆమె వైపు చూసాడు. గాడంగా నిద్రపోతోంది. సన్నగా గురక వినిపిస్తోంది. శబ్దం చేయకుండా మంచం దిగి నెమ్మదిగా తలుపులు తీసుకుని గదిలోంచి బయటకు వచ్చాడు.

గెస్ట్ రూమ్ వేరే లేకపోడంతో చరిత లీలమ్మ గారి దగ్గర పడుకుంది.. పిల్లల గదిలో హరి, కిరణ్ పడుకున్నారు.

భాస్కర్కి ఆ సమయంలో కిరణ్ ని డిస్టర్బ్ చేయడం సంస్కారం కాదుకదా అనిపించింది. కానీ ఏదో తెలియని భయం స్థిమితంగా ఉండనీయలేదు.

అస్థిమితంగా, రెస్ట్ లెస్ గా అనిపిస్తోంది.

కాసేపు మూసి ఉన్న పిల్లల గది తలుపుల దగ్గర తచ్చాడి వెనక్కి హాలు వైపు నడిచాడు. టి వి ఆన్ లో ఉంది.

"ఎవరు చూస్తున్నారు?" ఆశ్చర్యంగా ముందుకు నడిచాడు. సోఫాలో కిరణ్.

భాస్కర్ ని చూడగానే గబుక్కున లేచి "సారీ నిద్ర పట్టడం లేదు కొత్త ప్లేస్ కదా అందుకే.." అంటూ ఇబ్బందిగా చూసాడు.

భాస్కర్ తేలిగ్గా నవ్వాడు.

హమ్మయ్య పడుకున్నాడేమో లేపడం సభ్యత కాదనుకున్నాడు. అతను మెలకువగా ఉండడంతో రిలీఫ్ గా అనిపించింది. " నాకూ నిద్ర పట్టడం లేదు... పదండి అలా రోడ్డు మీదకి వెళ్దాం" అన్నాడు.

ష్యూర్ అంటూ లేచి నిలబడి టి వి ఆఫ్ చేసాడు కిరణ్.

ఇద్దరూ బయటకి నడిచారు. భాస్కర్ బయటనుంచి గడియవేసి తాళం వేసాడు. నెమ్మదిగా నడక ప్రారంభించారు. కాలనీ నిశ్శబ్దంగా ఉంది. అందరూ ఎవరిళ్ళల్లో వాళ్ళు వెచ్చగా గాఢ నిద్రలో ఉన్నారు. యాభై ఫర్లాంగులు నడిస్తే మెయిన్ రోడ్ వస్తుంది.

రోడ్డు మొదట్లో చిన్న కాఫీ హోటల్ ఉంది.. అక్కడ కొంతమంది కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ టీ తాగుతున్నారు. అప్పుడప్పుడూ ఒకటీ, అరా కార్లు, మోటార్ సైకిల్స్ వెళ్తున్నాయి.

"టీ తాగుదామా?" అడిగాడు భాస్కర్.

" హైదరాబాద్ వచ్చాక చాయ్ తాగకుండా ఎలా సార్?" నవ్వాడు కిరణ్.

ఇద్దరూ లోపలి వెళ్లి ఒక టేబుల్ దగ్గర కూర్చున్నారు.

పదహారేళ్ళ కుర్రాడు రెండు కప్పుల్లో టీ తీసుకొచ్చి పెట్టాడు. ఒక కప్పు అందుకుని ఎదురుగా ఉన్న రోడ్డు మీదకి దృష్టి పోనిస్తూ "అర్ధరాత్రి వేళ వేడి, వేడి చాయ్ తాగుతుంటే బాగుంటుంది కదూ" అన్నాడు భాస్కర్.

"అవును సార్... ఇలాంటి అనుభూతులు మాకు చాల తక్కువగా కలుగుతుంటాయి.. ఉదయం నుంచి రాత్రి వరకూ పేషంట్లతో బిజీగా గడుస్తుంది.. ఇంటికి వెళ్ళగానే నిద్ర ముంచుకు వస్తుంది." అన్నాడు కిరణ్.

“మీరు సైకియాట్రిస్ట్ అన్నారు ... అందరు డాక్టర్స్ లాగే మీకూ చాలా మంది పేషంట్స్ ఉంటారా?” కొంచెం ఆసక్తిగా అడిగాడు భాస్కర్.

“ఇదివరకు ఏమో నాకు తెలియదు కానీ, గత పదేళ్లుగా మానసిక రుగ్మతతో బాధపడేవాళ్ళు ఎక్కువైనారు. ముఖ్యంగా మహిళలు విపరీతమైన డిప్రెషన్ తో బాధపడుతున్న వాళ్ళు వస్తుంటారు. “

“అలాగా.. ఎంచేత? “

“ఇది అని ఒక కారణం కాదు సార్.. చాలామంది భర్తలతో బాధలు పడేవాళ్ళు, పిల్లల మీద బెంగ పెట్టుకునేవాళ్ళు, జీవితంలో సుఖం లేని వాళ్ళు, కొంతమంది కాలేజ్ స్టూడెంట్స్... విపరీతమైన స్ట్రెస్ తో డిప్రెషన్ లోకి వెళ్లిపోతుంటారు..మీకో సంగతి తెలుసా! ఇలాంటి వాళ్ళే బాబాలను, జ్యోతిష్కులను ఎక్కువగా నమ్ముతుంటారు. ఏ జబ్బు అయినా వెంటనే తగ్గదు కదా.. మందులు వాడుతుండాలి. మెడిటేషన్ లాంటివి చేయాలి..కానీ వాళ్ళకి మంత్రం వేసినట్టు మాయం అవాలి. అలా అవకపోతే డాక్టర్స్ మీద నమ్మకం ఉండదు. బాబాలను నమ్ముతారు.. వీళ్ళ బలహీనతలు కనిపెట్టి బాబాలు మోసాలు చేస్తుంటారు. “

భాస్కర్ గుండె దడదడలాడింది.

మౌనంగా టీ తాగుతూ చుట్టూ పరికించి చూసాడు.

అక్కడ ఉన్న మిగతావాళ్ళు కొంచెం గట్టిగానే రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. వీళ్లిద్దరివైపు  వైపు ఒక చూపు విసిరి మళ్ళీ  వాళ్ళ చర్చల్లో మునిగిపోయారు.

“కిరణ్! నా భార్య సమస్య ఏంటి? ఆవిడ డిప్రెషన్ లోకి వెళ్ళడానికి కారణం ఏంటి?” అడిగాడు భాస్కర్.

కిరణ్ టీ కొంచెం, కొంచెం సిప్ చేస్తూ నెమ్మదిగా అన్నాడు.

“సర్ ఆవిడ మాత్రమే కాదు.. నా దగ్గరకి మీ భార్య వంటి వారి కేసులు ఇటీవల చాల వస్తున్నాయి. ఆడపిల్లలున్న ప్రతి తల్లి చెప్పలేని ఆందోళనతో బాధపడుతోంది. కారణం రోజు,రోజుకీ ప్రపంచంలో పెరిగిపోతున్న దారుణాలు.. వార్తాపత్రికల్లో వార్తలు చదవడం భయంతో వణికిపోడం.. ఇలాంటి ఆడవాళ్ళు ముందుగా నమ్మేది బాబాలను. వాళ్ళు  మాత్రమే తమ బాధ విని అర్థం చేసుకుంటారన్న మూఢ నమ్మకం.

“ఇంట్లో వాళ్ళకి చెప్పుకోరు. చెప్పినా వారికి కలిగే భయాలు, అనుమానాలు ఎవరు అర్థం చేసుకుంటారు.  అలా అర్థం చేసుకుని ధైర్యం చెప్పేవాళ్ళు చాలా అరుదు. అసలు ఎవరికీ చెప్తారు.. పిల్లలకి చెప్పలేరు. అత్తగారు వింటారా.. వినరు.. భర్తకి చెపితే  వినడు.. విన్నా భార్య తెలివితక్కువది అనో, భయస్తురాలు అనో, అనుమానం మనిషి అనో కొట్టిపారేస్తాడు. ఇంక ఎవరికీ చెప్పుకుంటారు!

వీళ్ళ బలహీనతలు కనిపెట్టే వాళ్ళు  మేము స్వాములం, బాబాలం, మాకు  మాయలు, మంత్రాలూ తెలుసు అంటూ,  ఇదిగో ఈ పూజ చేస్తే మీ సమస్య తీరుతుంది అని, లేదా ఈ తాయెత్తు కట్టుకుంటే మీ అమ్మాయికి ఏమి కాదు అనో చెప్పి వీళ్ళ దగ్గర డబ్బు దోచుకోడం చేస్తున్నారు. “

“మన దురదృష్టం ఏంటంటే కొందరు వి ఐ పి బాబాలుంటారు.. వాళ్ళని ప్రభుత్వమే పెంచి పోషిస్తుంది. వాళ్ళకి ఆశ్రమాలు పెట్టుకోమని వేలకి వేల ఎకరాలు ఇస్తుంది.  వాళ్ళు చేసే అక్రమాలకూ, అరాచకాలకు కాపు కాస్తుంది.. వాళ్ళని రక్షిస్తుంది. సామాన్యులు ఎవరైనా వాళ్ళ నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తే ఆలా చేసిన వాళ్ళని అరెస్టు చేస్తుంది. ఇదండీ మన సమాజం. ఎంతమంది నిజస్వరూపాలు బయటపడినా నమ్మేవాళ్ళు నమ్మక మానడం లేదు. అన్నిటికన్నా విచారకరమైన విషయం ఇటీవల దృశ్య మాధ్యమాల్లో వాళ్ళ ప్రకటనలు, ప్రచారాలు కూడా ఉధృతం అవుతున్నాయి. మీ పేరుకి , మీ నక్షత్రానికి ఈ రాయి, ఈ రప్ప చాలా మంచిది.. పచ్చలు వేసుకోండి, రత్నాలు

వేసుకోండి, కెంపులు, ఇలా అనేక రకాల వ్యాపారవేత్తలు కూడా మానవ బలహీనతలని కాష్ చేసుకుంటూ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. వీటిని అరికట్టాలి.. ”

భాస్కర్ నిట్టూర్చాడు. నిజమే అరికట్టాలి.. కానీ ఎలా?ఎవరు అరికడతారు! పిల్లి మేడలో గంట కట్టేదెవరు?

ఇతను చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం. జానకిలాంటి అమాయకులు నమ్మినంతకాలం దొంగ బాబాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ ఉంటారు. ఎవరో, ఎక్కడో వాళ్ళ నిజస్వరూపం బయటపెట్టినా ప్రజల కన్నీళ్లు తుడవడానికి వాళ్ళని అరెస్ట్ చేయడం అనే డ్రామా ఆడి తిరిగి వాళ్ళ కార్యకలాపాలు యధేచ్ఛగా సాగనిస్తారు. అండ, దండ ఉంటె మోసాలు చేయడానికి భయం ఎందుకు?

“నా వైఫ్ కి ఏదన్నా ట్రీట్మెంట్ అవసరమా? కౌన్సిలింగ్ ఇస్తారా..?”

“రాత్రి నేను ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం ఒక నెల రోజులు ఆ మందులు వాడండి. ఆవిడ మందులు వాడుతున్నంత కాలం ఎక్కువ సేపు నిద్రపోతారు.. కంగారు పడకండి. ఆవిడని మీరు కానీ, మీ వాళ్ళు కానీ ఎవరైనా సరే కనిపెడుతూ ఉండాలి. లేకపోతే ఆవిడ మళ్ళీ వెళ్ళిపోయే ప్రమాదం ఉంది ..”

ఆ మాటతో ఉలిక్కిపడ్డాడు భాస్కర్. తను అనుకునేది నిజం.. జానకిని కనిపెట్టి ఉండాలి. ప్రస్తుతం ఆవిడ మానసిక స్థితి సరిగా లేదు.. తనకి ఏం కావాలో స్పష్టమైన అవగాహన లేదు.

“ఎప్పటినుంచి మొదలు పెట్టమంటారు?” అడిగాడు.

“రేపే స్టార్ట్ చేయండి సార్.”

రేపే స్టార్ట్ చేయాలి. జానకి తన జానకి మతి తప్పి ప్రవర్తిస్తోంది. అందుకు ఆమెని మత్తులో ఉంచాలి. భాస్కర్ కి దుఃఖం తన్నుకు వచ్చింది.

భాస్కర్ పరిస్థితికి జాలేసింది కిరణ్ కి. ఎంత మంచివాడు. ఇంత మంచి భర్త, మంచి కుటుంబం ఉన్న జానకిగారి లాంటి వాళ్ళు ఇలాంటి దౌర్భాగ్య స్థితికి రావడానికి కారణం ఎవరు? రోజు, రోజుకి ఈ సమాజంలో పెరిగిపోతున్న అనిశ్చితి .. అభద్రత... మూడేళ్ళ పిల్ల దగ్గరనుంచి ఆడపిల్ల కనిపిస్తే చాలు పశువుల్లా మీదపడిపోతున్నారు.

జీవితం అంటే కామం అనే నిర్ణయానికి వచ్చారు. కామానికి ఉచ్చం, నీచం, వయసు, వావి తారతమ్యాలు లేవు, నీతి, నియమం, ధర్మం , సిగ్గు ఏమి లేవు..మనిషి కీ పశువుకీ తేడాలేకుండా పోతోంది.

“పదండి వెళ్దాం ... మళ్ళీ మీరు ఉదయాన్నే వెళ్ళాలేమో కదా.. బాగా లేట్ అయింది” అంటూ లేచాడు భాస్కర్.

కిరణ్ కూడా లేచి అతడిని అనుసరించాడు.

లీలమ్మ త్వరగా లేచి పిల్లలని కాలేజ్ కి పంపించింది. భాస్కర్ ఆఫీస్ కి వెళ్ళలేదు. జానకి లేచాక పరిస్థితి ఎలా ఉంటుందో అనే భయంతో న్యూస్ పేపర్ చదువుకుంటూ ఇంట్లోనే ఉండిపోయాడు.

ఆదినారాయణ స్నానం చేసి గుడికి వెళ్ళాడు.

జానకి వచ్చిందన్న విషయం తెలిసి శారద ఆత్రంగా వచ్చింది.

“ఏది పిన్నిగారూ! జానకి లేచిందా?” అడిగింది వస్తూనే అటు,ఇటూ తొంగి చూస్తూ.

“పడుకుందమ్మా ఇంకా లేవలేదు” అంది లీలమ్మ.

“ఎక్కడికి వెళ్ళిందిట...?” అడిగింది శారద.

అప్పుడే స్నానం చేసి వచ్చిన కిరణ్ వైపు చూస్తూ "ఇదుగో ఈ అబ్బాయి తీసుకువచ్చాడు" అంది లీలమ్మ.

శారద అతని వైపు ఆశ్చర్యంగా చూసింది.

ఆవిడ చూపులు ఇబ్బందిగా ఎదుర్కుంటూ అటూ, ఇటూ తచ్చాడి భాస్కర్ పక్కకి వెళ్లి కూర్చున్నాడు.

శారద భాస్కర్ దగ్గరకి వచ్చి ఎక్కడికి వెళ్ళింది అని అడిగింది. భాస్కర్ ఒకసారి శారద వైపు, కిరణ్ వైపు చూసి జరిగిన విషయం క్లుప్తంగా చెప్పాడు. అంతా విని శారద నోరెళ్ళబెట్టి కూర్చుండిపోయింది.

"మీరు ఒక సాయం చేయాలి" అన్నాడు భాస్కర్.

"చెప్పండి" అంది శారద.

"జానకిని ఇక్కడినుంచి ముందు ఒక బాబా దగ్గరకి తీసుకువెళ్ళిన ఫ్రెండ్ ఎవరో తెలుసుకోవాలి" అన్నాడు.

శారద ఆలోచిస్తూ అంది "మొన్న అంటే నిన్న గాక మొన్న మన కాలనీలోనే వెనక వీధిలో ఉండే ఉమాదేవిని అరెస్ట్ చేసారు పోలీసులు ... ఎందుకు అని నేను ఆరా తీస్తే తెలిసింది ఆవిడకి ఒక స్మగ్లింగ్ ముఠాతో సంబంధాలు ఉన్నాయట. వాళ్లతో చేతులు కలిపి ఏవేవో వెధవపనులు చాలా చేసిందిట. ఆ ముఠా నాయకుడు ఒక దొంగ బాబా ... ఆయనని కూడా అరెస్టు చేసారు. మీరు చూడలేదా ఆ న్యూస్" అడిగింది ఆశ్చర్యంగా.

భాస్కర్ కిరణ్ వైపు చూసాడు. కిరణ్ ప్రశ్నార్థకంగా శారద వైపు చూసాడు. భాస్కర్ కి గుర్తొచ్చింది మొన్న రాత్రేగా ఒక బాబా లీలలు బయటపడ్డాయని వార్తలు చూపిస్తూ కొందరిని చాలా అసహ్యంగా ఇంటర్వ్యూ చేసారు కొన్ని చానెల్స్ వాళ్ళు..

"అంటే జానకి ఆయన దగ్గరకు వెళ్ళిందా? ఐ మీన్ ఉమాదేవి జానకిని అక్కడికి తీసుకువెళ్ళి ఉంటుందా?"

"కచ్చితంగా"...అంది శారద.

"మరి జానకి అక్కడి నుంచి ఎలా బయటపడింది?" బుర్ర గోక్కున్నాడు భాస్కర్.

ఎంత ఆలోచించినా అతనికి అర్థం కాలేదు. రాత్రి జానకి కలగాపులగంగా ఏదేదో చెప్పింది.. కానీ అప్పటి కండిషన్ లో తనేమి వినలేదు. జానకిని క్షేమంగా చూస్తున్నానన్న ఆనందం తప్ప ఇంక వేరే ఆలోచన, ధ్యాస లేకపోయింది.

అప్పుడే జానకి నిద్రలేచి హాల్లోకి వచ్చింది.

"అమ్మా, నాన్నా" అని పిలుస్తూ వంటగదివైపు వెళ్తున్న 'జానకి జానకీ' అనే శారద పిలుపు విని శారద వైపు చూసి శారదా.. నువ్వా.. అంటూ గబా,గబా శారద దగ్గరకి వచ్చింది. "ఎలా ఉన్నావు జానకీ.. ఎక్కడికి వెళ్లావు?" అంది శారద జానకి చేయి పట్టుకుని.

"నేనెక్కడికి వెళ్లాను..ఎక్కడికీ వెళ్ళలేదు.. ఏదో దారి తప్పి రెండు రోజులు అటూ, ఇటూ తిరిగాను అంతే."
తేలిగ్గా అంటున్న జానకి వైపు తెల్లబోయి చూసింది శారద.

సుధాకర్, అవంతి ఐస్క్రీం పార్లర్ లో కూర్చున్నారు.

అవంతి తల వంచుకుని స్పూన్ తో ఐస్క్రీం మెల్లగా తింటోంది. సుధాకర్ ఆ పిల్లనే గమనిస్తూ కూర్చున్నాడు.

అతని మస్తిష్కం నిండా అవంతి ని గురించిన ఆలోచనలు ముసురుకుని ఉన్నాయి. మనసులో విపరీతమైన ఆందోళన నిండిపోయి ఉంది.

ఎందుకిలా బిహేవ్ చేస్తోంది అవంతి.

ఎందుకు రాను, రానూ తల్లిని ఓ శత్రువులా చూస్తోంది.

ఎవరి తప్పు? జాహ్నవిదా ? అవంతిదా!

జాహ్నవి కూడా మరీ రాక్షసంగా ప్రవర్తిస్తోంది.

కొంచెం కూడా సున్నితత్వం లేదు. పోనీ తనతో ఎలా ఉన్నా ఇప్పుడు వచ్చిన నష్టం ఏమి లేదు. కానీ ఆడపిల్ల అవంతితో అంత హార్ష్ గా ప్రవర్తించడం దేనికి? అందుకే అవంతి ఇలా రెక్ లెస్ గా తయారైందా? అవంతిని ఎవరు ప్రభావితం చేస్తున్నారు! తన క్లాస్ మేట్స్ ఎవరన్నా అవంతి మనసు పాడు చేస్తున్నారా. ఒక్కసారన్నా జాహ్నవి అవంతి కాలేజ్ కి వెళ్లి తన ఫ్రెండ్స్ ఎలాంటి వాళ్ళు ఉన్నారు? కాలేజ్ లో ఎలా ప్రవర్తిస్తోంది? ఎలా చదువుతోంది? తన బిహేవియర్ ఎలా ఉంటోంది అని తెలుసుకోదు.. ఎంత సేపు తన గొడవే కానీ జాహ్నవికి పిల్లల మీద శ్రద్ధ ఎలా చూపించాలో తెలియదు.. వాళ్ళు తన అభీష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే తిట్టడం, విసుక్కోడం, కసురుకోడం తెలుసు.. దగ్గర కూర్చోబెట్టుకుని వాళ్లకి ఏం కావాలో బుజ్జగించి తెలుసుకుని తదనుగుణంగా వ్యవహరించడం అసలు తెలియదు.

పిల్లల సైకాలజీ తెలుసుకుని ప్రవర్తించాలి. ఆ విషయం జాహ్నవికి ఎందుకు అర్ధం కాదు.

సుధాకర్ సన్నగా నిట్టూర్చాడు.

అవంతి ఐస్ క్రీం తినడం పూర్తి అయింది.

“ఇంకా తింటావా” అడిగాడు సుధాకర్.

తల ఊపింది తింటా అన్నట్టు.

బేరర్ ని పిలిచి ఇంకో ఐస్ క్రీం ఆర్డర్ చేసాడు. ఈ లోగా మాటలు కలుపుతూ “అవంతీ “! పిలిచాడు.

అవంతి అతని మొహంలోకి చూసింది.

“నీకేమైంది ?” అడిగాడు.

అవంతి కాసేపు ఏం మాట్లాడలేదు. తల తిప్పుకుని ఎటో చూడసాగింది.

“చెప్పమ్మా.. చదువు నిర్లక్ష్యం చేస్తున్నావు.. కాలేజికి వెళ్ళడం లేదు.. ఏదో అనవసర విషయాలు ఆలోచిస్తావు. అమ్మతో గోదావపడుతుంటావు.. చెప్పు తల్లి.. నీకేం కావాలి? ఎందుకలా చేస్తున్నావు?” నచ్చచెబుతున్నట్టుగా అన్నాడు ..

“నేను అమ్మతో ఊరికే గొడవపడుతున్నానా? అమ్మ ఎంత టార్చర్ పెడుతోందో తెలుసా?” కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరుగుతోంటే అంది అవంతి.

“అయ్యయ్యో. నేనేం అనలేదురా నిన్ను.. ఏడవకు. ఊరికే అడిగాను. ఎందుకు తిడుతుంది అమ్మ నిన్ను? నువ్వేం చేసావు?” ఓ పక్క ఓదారుస్తూనే విషయం రాబట్టే ప్రయత్నం చేసాడు సుధాకర్.

“నాకు అమ్మ నచ్చలేదు. ఎప్పుడూ చరిత వాళ్ళ అమ్మని తిడుతుంటుంది.. ఆంటీ చాలా మంచిది. చరితను ఎప్పుడూ ఏమి అనదు. అమ్మ నన్ను ప్రతి దానికి తిడుతూ ఉంటుంది. నాకు అసలు ఇంట్లో ఉండడమే ఇష్టం లేదు.” చెంపల మీద జారిన కన్నీళ్లు చున్నీతో తుడుచుకుంది.

సుధాకర్ తుళ్ళిపడ్డాడు. కంగారుగా అన్నాడు “తప్పు అవంతీ! అలా అనకూడదు. ఇల్లన్నాక ఇలాంటి గొడవలు అందరికీ ఉంటాయి. అంతమాత్రాన ఇంట్లో ఉండడం ఇష్టం లేదు అనచ్చా?”

"అవును డాడీ నాకు అసలు ఇంట్లో ఉండడమే ఇష్టం లేదు. అమ్మ ఎప్పుడూ ఎవరో ఒకళ్ళని తిడుతూ ఉంటుంది. అసలు ప్రశాంతంగా ఉండనివ్వదు.. ఎందుకసలు ఆవిడ అట్లా అందరిని తిడుతూ ఉంటుంది. అమ్మకేదో మెంటల్ ప్రాబ్లెం ఉంది.. బాబాగారి దగ్గరకు తీసుకువెళ్ళచ్చు గా.." సీరియస్ గా అంది అవంతి.

సుధాకర్ ప్రాన్పడిపోయాడు. అవంతి .. ఇంకా పద్దేనిదేళ్ళు కూడా నిండని ఈ అమ్మాయి నోటి నుంచి ఇలాంటి మాటలా.. ఇలాంటి ఆలోచన వచ్చిందంటే ఆ పసిమనసు ఎంత బాధపడి ఉంటుంది! అలా అవడానికి కారణం ఏమై ఉంటుంది? జాహ్నవి తన పట్ల చూపిస్తున్న నిరాదరణా!? అలా అయితే, అవంతి విషయంలో తను శ్రద్ధ తీసుకోవాలి ధ్రుఢంగా నిశ్చయించుకున్నాడు.

"సరే అమ్మకి నేను చెప్తాను. నువ్వు అమ్మ మాటలు పట్టించుకోకు. రేపటి నుంచీ శ్రద్ధగా కాలేజ్ కి వెళ్తూ బాగా చదువుకోవాలి సరేనా." మృదువుగా అన్నాడు.

అవంతి మౌనంగా ఉండిపోయింది. సుధాకర్ అనుమానంగా చూస్తూ అన్నాడు "సరేనా?"

అవంతి నెమ్మదిగా అంది "చరిత వాళ్ళ అమ్మగారి లాగా అవాలి అమ్మ. "

"అలాగే" నవ్వాడు.

ఇంతలో ఐస్ క్రీం రావడంతో అవంతి తినడంలో మునిగిపోయింది.

చరిత ఎవరో సుధాకర్ కి తెలియదు. వాళ్ళ అమ్మ కూడా తెలియదు. జాహ్నవికైనా తెలుసో, లేదో.. ఈ పిల్లని అంతగా ప్రభావితం చేసిన ఆవిడని ఒకసారి చూస్తే బాగుండు. వీలయితే అప్పుడప్పుడు అవంతిని వాళ్ళింటికి పంపించి ఆవిడతో కౌన్సిలింగ్ ఇప్పించవచ్చు. సుధాకర్ ఆలోచనలు సాగిపోతున్నాయి.

అవంతి స్వరం వినిపించింది. "డాడీ! మనింటికి చరిత వాళ్ళ అమ్మగారిని పిలుద్దామా? ఆవిడని చూసి అమ్మ బుద్ధి తెచ్చుకుంటుంది." ఆ స్వరంలో వినిపించిన కసికి అతను నిశ్చేష్టుడై చూసాడు.

అవంతిని ఇలా వదలకూడదు మరోసారి అనుకుంటూ "వాళ్ళింటికి వెళదాం పద. నీకు తెలుసా వాళ్ళిల్లు?" అన్నాడు.

"రెండు సార్లు వెళ్లాను కానీ గుర్తు పట్టలేను.. రేపు కాలేజ్ నుంచి చరితతో కలిసి వెళ్దాం నువ్వు మా కాలేజ్ దగ్గరకు వచ్చెయ్" అంది.

"సరే పద ఇంటికి వెళ్దాం" అంటూ లేచాడు సుధాకర్.

అవంతి కూడా లేచి అతడిని అనుసరించింది.

రాత్రి పదకొండు అయింది.

అవంతి, సిద్ధూ వాళ్ళ గదిలో గాఢ నిద్రలో ఉన్నారు.

సుధాకర్ హాలుకి ఆనుకుని ఉన్న బాల్కనీలో నిలబడి సిగరెట్ కాలుస్తున్నాడు.

జాహ్నవి టి వి లో ఆఖరి సీరియల్ చూసి టి వి ఆఫ్ చేసి బెడ్ రూమ్ లోకి వెళ్ళబోతూ సుధాకర్ బాల్కనీలో నిలబడి ఉండడం చూసి అతని దగ్గరకు నడిచింది.

"ఏంటి ఇక్కడ నిలబడ్డారు?" వంకరగా అడిగింది.

ఆ అడిగిన తీరుకి సుధాకర్ కి సమాధానం చెప్పాలనిపించలేదు. మౌనంగా రోడ్డు వైపు చూస్తూ ఉండిపోయాడు.

జాహ్నవి అతను ఎటు చూస్తున్నాడో గమనిస్తూ తన చూపులు కూడా రోడ్డు వైపు తిప్పింది.

అప్పటికే జనసంచారం బాగా తగ్గింది. అడపా,దడపా కార్లు, మోటార్ సైకిళ్ళు , ఆటోలు తిరుగుతున్నాయి. రోడ్డుకి అవతల పక్క ఫుట్ పాట్ మీద ఇద్దరు బిచ్చగాళ్ళు గుడ్డలు పరుచుకుని పడుకున్నారు. షాపులన్నీ మూసేశారు. రోడ్డు చివర ఉన్న ఒక నర్సింగ్ హోమ్ తెరిచే ఉంటుంది.

మెయిన్ రోడ్డు నుంచి కొంచెం లోపలికి వస్తే ఒకే లైన్ లో కొన్ని అపార్ట్ మెంట్స్ కనిపిస్తాయి.. వాటి ఎదురుగా కొన్ని షాపులు, ఒక నర్సింగ్ హోమ్, దాని పక్కనే ఒక మెడికల్ షాప్ ఉంటాయి. ఆ రెండు పగలు రాత్రి తెరిచే ఉంటాయి. పగలు జనం బాగానే తిరుగుతుంటారు కానీ రాత్రి పది దాటాక అంతగా ఎవరూ తిరగరు. ప్రశాంతంగా ఉంటుంది.

"పడుకుందాం వస్తావా?" అంది విసుగ్గా జాహ్నవి.

సుధాకర్ కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా ఉండి అన్నాడు "జాహ్నవీ! అవంతితో నువ్వు ఒక తల్లిలా ప్రవర్తించడం ఎప్పుడు నేర్చుకుంటావు? "

జాహ్నవి నొసలు చిట్లించి అసహనంగా చూసింది.. "వాట్ డు యూ మీన్ ? నేనిప్పుడు తల్లిలా కాక ఎలా ఉన్నాను?"

"ఆ విషయం దాన్నే అడుగు.."

"అంటే! ఏంటి నీ ఉద్దేశం?" తోక తొక్కిన తాచు అయింది.

"అరవకు ఇది అర్ధరాత్రి... అందరూ వింటారు.. నువ్వు నీ హార్ష్ బిహేవియర్ మార్చుకోకపోతే అవంతిని పోగొట్టుకుంటావు జాహ్నవీ.." అన్నాడు సుధాకర్.

జాహ్నవి విసురుగా అతని చేయి పట్టుకుని బెడ్ రూమ్ లోకి లాక్కొచ్చి తలుపేసి "చెప్పు ... ఇప్పుడు చెప్పు.. ఏంటి? నేనేం చేసాను దాన్ని .... కొట్టానా.. చంపానా.. హింస పెట్టానా? చెప్పు.." గట్టిగా నిలదీస్తూ అంది.

సుధాకర్ ఆమె వైపు గంభీరంగా చూసాడు. "జాహ్నవీ! నీకు భగవంతుడు అన్నీ ఇచ్చాడు కానీ, సున్నితత్వం, వివేకం ఇవ్వలేదు. అందుకే నీకు అవంతి అర్ధం కావడం లేదు. కనీసం చెప్తే వినే సంస్కారం కూడా దేవుడు నీకు ఇవ్వలేదు. అవంతి చిన్న పిల్ల . టెండరింగ్ ఏజ్. ఈ వయసులో దాని మనసు చాలా సున్నితంగా ఉంటుంది. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూస్తుంది. మంచి అయినా, చెడు అయినా దాని రియాక్షన్ చాలా తీవ్రంగా ఉంటుంది. నువ్వు ఒక నియంతలా ప్రవర్తిస్తూ తల్లి, కూతుళ్ళ మధ్య ఉండే సున్నితమైన బంధాన్ని తెగిపోయేలా చేస్తున్నావు."

"అంటే! అంటే! అది నన్ను, నాతో బంధాన్ని తెంచుకుని వెళ్ళిపోతుందా!? అది తప్పు చేస్తే తిట్టే అధికారం నాకు లేదా?" విరుచుకు పడింది జాహ్నవి.

సుధాకర్ కి ఆవిడ మూర్ఖత్వం చూస్తుంటే అసహ్యం వేసింది. చెప్పేది వినిపించుకోకుండా అదే ధోరణిలో ప్రవర్తిస్తున్న ఈమెని ఏమనాలి? ఎలా చెప్పాలి ఈమెకి? చెప్పకపోతే జీవితాలు చిందర,వందర అయిపోతాయి. చెప్తే రభస ... ఏం చేయాలో, ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో అర్ధం కాలేదు సుధాకర్ కి.

"అసలు అది కాదు మీరే.. మీరే దాన్ని రెచ్చగొడుతున్నారు. నా మీద ఉన్న కోపం, కసి దాని ద్వారా తీర్చుకోవాలి అనుకుంటున్నారు. చూడండి ఇప్పుడే చెప్తున్నా.. ఈ ఇంట్లో నేనుండాలి అంటే నా పెత్తనం మాత్రమే ఉండాలి.. అందరూ నా మాట వినాలి.. నాకు అనుకూలంగా నడుచుకోవాలి. అలా కాకపోతే చెప్పండి ఏం చేయాలో తేల్చుకుంటాను."

సుధాకర్ కి ఒళ్ళు మండిపోయింది. లాగిపెట్టి ఆమెని ఎడా, పెడా చెంపలు వాయించాలనిపించింది. కానీ ఆ తరవాత ఏం జరుగుతుందో అతను ఊహించగలడు. అందుకే బలవంతంగా తనని తానూ కంట్రోల్ చేసుకుంటూ "నువ్వు మూర్ఖురాలివి అని తెలిసి కూడా నీకు ఏదో చెప్పేసి నిన్ను, రాత్రికి రాత్రి మార్చేయాలని అనుకోడం నా బుద్ధిలేని తనం. నీ ఇష్టం వచ్చినట్టు నువ్వు చేసుకో. నా కూతుర్ని ఎలా పెంచాలో, దానికి ఏం ఇవ్వాలో నాకు తెలుసు.. నేను చూసుకుంటా" విసురుగా తలగడ తీసుకుని తలుపు తీసుకుని హాల్లోకి వెళ్ళిపోయాడు.

జాహ్నవి బుసలు కొడుతూ తలుపు ధడాల్న వేసుకుని మంచం పైన వాలిపోయింది.

ఎంత తలుపులు వేసుకున్నా జాహ్నవి స్వరం నిద్రలో ఉన్న అవంతిని లేపిందని, ఆ పిల్ల కళ్ళు తెరుచుకుని జరుగుతున్నది అలా చూస్తూ ఉందని ఇద్దరికీ తెలియలేదు.

అవంతి గుండె దడ, దడలాడసాగింది. అమ్మ మారదు అనుకుంది నిశ్చయంగా.

పాపం నాన్న! తండ్రి మీద జాలితో నిండిపోయింది ఆ పిల్ల హృదయం.

అమ్మకి ఎవరన్నా ఒకరు పనిష్మెంట్ ఇస్తే బాగుండు. తనని బాధ పెట్టినా పర్వాలేదు. కానీ ఎప్పుడూ నాన్నని పురుగులా తీసేస్తూ, నానా మాటలు అంటూ ఆయన బాధ పడుతుంటే కనీసం సారీ అయినా చెప్పదే! అసలు అమ్మ మనసు అంత కఠినంగా ఎలా ఉంది?

అమ్మ కొంచెం తగ్గి ఉండడం అంటూ జరిగితే అది వీడితోటే . అంత జరుగుతున్నా ఏమి పట్టనట్టు హాయిగా నిద్ర పోతున్న సిద్ధూ వైపు చూసింది.

అమ్మా, వీడూ ఒకటి, నాన్న తను ఒకటి.. అసలు నాన్న, తను వేరే ఫ్లాట్ తీసుకుని వెళ్ళిపోతే ఎలా ఉంటుంది! హాయిగా ఉంటుంది.

అవును నాన్నని అడగాలి. రేపే ఇద్దరం కలిసి వెళ్లి ఒక ఫ్లాట్ రెంట్ కి దొరుకుతుందేమో వెతకాలి.

అసలు నాన్న ఈ అమ్మని వదిలేసి వేరే పెళ్లి చేసుకుంటే బాగుండు.

అవంతి ఆలోచనలు పరి,పరి విధాలా సాగిపోతున్నాయి.

వెళ్లిపోవాలి. అమ్మకి తను వెళ్ళిపోతే ఎలా ఉంటుందో! ఎలా ఉంటుంది? చాలా హాయిగా ఉంటుంది.

ఉండకూడదు. అమ్మ హాయిగా ఉండకూడదు.. బాధపడాలి.

అమ్మ బాధపడాలంటే ఎలా? ఏం చేస్తే అమ్మ బాధపడుతుంది.

నువ్వు మాకు అక్కర్లేదు అని చెప్తే బాధపడుతుందేమో..!

అమ్మని నలుగురి ముందు అవమానిస్తే బాధపడుతుందేమో.. అంత ధైర్యం ఎవరికుంది!

ఇవన్నీ కాదు తను ఒక్కతే అమ్మకి కనిపించకుండా వెళ్లిపోవాలి.

అవును తనే కొన్ని రోజులు అమ్మకి కనిపించకుండా వెళ్లిపోవాలి..

ఎలా? ఎక్కడికి వెళ్ళాలి?

అవంతి అలా ఆలోచిస్తూ ఎప్పటికో కళ్ళు మూసుకుంది.

**ఉమాదేవిని** అరెస్టు చేసాక ఆ కాలనీ వార్తల్లోకి ఎక్కి సంచలనం సృష్టించింది.

తరచూ పోలీసులు వచ్చి చుట్టు పక్కల ఉంటున్న ఇళ్ళ వాళ్ళందరినీ ఆవిడ గురించి వాకబు చేస్తున్నారు.

ఈ పరంపరలోనే జానకీ గురించి ఆ నోటా, ఈ నోటా కాలనీ అంతా తెలిసిపోయింది.

జానకీ తిరిగి వచ్చిందని కేసు విత్ డ్రా చేసుకున్నాడు భాస్కర్ .. కానీ వివరాలు చెప్పలేదు పోలీసులకి.

ఒకరోజు పోలీసులు ఇంటికి వచ్చారు.

అప్పటికి భాస్కర్ ఇంకా ఆఫీస్ కి వెళ్ళలేదు. లీలమ్మ, ఆదినారాయణ కూడా ఉన్నారు. జానకి పూర్తిగా స్థిమితపడకపోడంతో లీలమ్మే ఇంట్లో మొత్తం చూసుకుంటోంది. పిల్లలకి కారేజీ ఇచ్చి కాలేజ్ కి పంపించి, పూజ చేసుకుంటోంది ఆవిడ. ఆదినారాయణ వార్తాపత్రిక చదువుకుంటున్నాడు. భాస్కర్ టి వి చూస్తున్నాడు. జానకి స్నానానికి వెళ్ళింది.

వాకిట్లో పోలీసు వాన్ ఆగింది.

భాస్కర్ గమనించలేదు. కానీ ఆదినారాయణ శబ్దానికి పేపర్ లోంచి తలెత్తి చూసాడు.

పోలీసు వాన్ ఆగడం, గేటు తీసుకుని ఇనస్పెక్టర్, ఆయన వెనకాల ఒక కానిస్టేబుల్ లోపలికి రావడం చూసి “భాస్కర్ పోలీసులు” అన్నాడు కొంచెం కంగారుగా.

భాస్కర్ గుబుక్కున టివి ఆఫ్ చేసి లేచి నిలబడ్డాడు.

ఇన్ స్పెక్టర్ గుమ్మం దగ్గర నుంచి “హలో సార్ లోపలికి రావచ్చా” అన్నాడు.

“రండి, రండి” చేయి చాచి షేక్ హ్యాండ్ ఇస్తూ ఆహ్వానించాడు భాస్కర్.

ఇన్ స్పెక్టర్ తో పాటు కానిస్టేబుల్ కూడా లోపలికి వచ్చాడు.

భాస్కర్ సోఫా చూపించి తనూ కూర్చున్నాడు.

కానిస్టేబుల్ నిలబడి ఉన్నాడు. ఇన్స్పెక్టర్ కూర్చున్నాడు.

“చెప్పండి” మర్యాదగా అన్నాడు భాస్కర్.

“ఎలా ఉన్నారు మీ మిసెస్ ?” అడిగాడు ఇన్స్పెక్టర్ .

“బాగానే ఉందండి. మీరు చాలా కోపరేట్ చేసారు థాంక్స్” అన్నాడు భాస్కర్.

“ ఆవిడ ఎక్కడికి వెళ్ళారో చెప్పారా “

భాస్కర్ మాట్లాడలేదు. “సారీ సర్ మీకు ఇబ్బంది కలగచేస్తున్నాను. మీ బాధ నేను అర్థం చేసుకోగలను. కాకపోతే, మీ కాలనీలోనే ఉండే ఉమాదేవి అనే మహిళ మీ మిసెస్ ని మోసం చేసి ఎవరో బాబా దగ్గరకు తీసుకు వెళ్లిందని తెలిసింది. మీకు తెలిసే ఉండచ్చు. ఆవిడను అరెస్ట్ చేసాము.“

“అవును విన్నాను” తలూపాడు భాస్కర్.

“ఆవిడ విషయంలో కొన్ని వివరాలు కావాలి. మీ మిసెస్ ని అడిగి తెలుసుకోవాలనుకుంటున్నాను.”

“మాకు అసలు ఆవిడ పరిచయం లేదండి” మొహమాటంగా అన్నాడు భాస్కర్.

“ మగవాళ్ళకన్నా, ఆడవాళ్ళకు చుట్టూ పక్కల వాళ్ళతో స్నేహాలు ఉంటాయి. మీ మిసెస్ కి, ఆవిడకీ ఉన్న పరిచయం, వాళ్ళిద్దరూ ఎక్కడికి వెళ్ళారు ? ఈ విషయాలు తెలుసుకోవాలి. నేను మీ మిసెస్ తో మాట్లడచ్చా! “

భాస్కర్ ఇబ్బందిగా చూసాడు.

“అయిపోయిందేదో అయిపోయింది. మా అమ్మాయి ఆరోగ్యం బాగాలేదు ఇన్స్పెక్టర్ గారు. ఇంక ఆ విషయాలు తనని అడక్కపోతే బాగుంటుంది.. అన్యదా భావించకండి.” అన్నాడు ఆదినారాయణ.

"క్షమించండి సార్. ఆవిడ చెప్పే విషయాలు మాకు చాలా ఇంపార్టెంట్. నేను ఆవిడని ఇబ్బంది పెట్టను. ప్లీజ్ సహకరించండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

అప్పుడే జానకి స్నానం చేసి రెడీ అయి వచ్చింది.

ఇనస్పెక్టర్ ని చూడగానే భ్రుకుటి ముడివేసి భర్త దగ్గరగా వచ్చి కొంచెం కలవరంగా అడిగింది "ఏమైందండీ?"

ఇనస్పెక్టర్ జానకికి నమస్కరించి "ఐదు నిమిషాలు కూర్చుంటారా మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

జానకి భాస్కర్ వైపు చూసింది.

భాస్కర్ కొంచెం జరిగి తన పక్కన చూపిస్తూ కూర్చో అన్నాడు.

జానకి బిడియంగా కూర్చుంది.

"అమ్మా మీకు ఉమాదేవి బాగా తెలుసా?" అడిగాడు ఇనస్పెక్టర్ ..

ఉమాదేవి పేరు వినగానే జానకి మొహంలో రంగులు మారాయి. కోపంగా అంది "పాపిష్టిది నన్ను మోసం చేసింది. బాబా గారి దగ్గరకు తీసుకువెళ్తానని చెప్పి ఎక్కడికో తీసుకువెళ్ళి నన్నక్కడ వంటరిగా వదిలేసి వెళ్ళిపోయింది."

"ఆవిడని అరెస్ట్ చేసాము" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఎందుకు?" ఆశ్చర్యంగా చూసింది. నిజానికి ఆ విషయం జానక్కి తెలియకుండా జాగ్రత్త పడ్డాడు భాస్కర్. తెలిస్తే ఈవిడ ఎలా రియాక్ట్ అవుతుందో తెలియదు.. అసలు వాళ్ళ ఇద్దరి పరిచయం ఎంతో తెలియదు.. ఆవిడ గురించి తనతో జానకీ ఏమి చెప్పలేదు.. చాలా అస్పష్టంగా ఏదో చెప్పింది.. ఆ విషయాలు పదే, పదే అడిగి రచ్చ చేసుకోడం ఇష్టం లేక కిరణ్ ఇచ్చిన సలహా పాటిస్తూ, రెగ్యులర్ గా అతను ఇచ్చిన మందులు వాడుతూ ఆవిడని జాగ్రత్తగా కాపాడుకుంటున్నాడు. ఇప్పుడు ఇనస్పెక్టర్ వచ్చి తిరిగి ఆ విషయాలు అడగడం నచ్చలేదు అతనికి.

"ఆవిడ గురించి చాలా ఉందమ్మా చెప్పాలంటే.. ఒక్క విషయం చెప్పండి. మిమ్మల్ని ఆవిడ ఎందుకు బాబాగారి దగ్గరకు తీసుకువెళ్ళింది? మీరిద్దరూ ఎక్కడికి వెళ్ళారు. ఎంత దూరం వెళ్ళారు. ఆవిడ మిమ్మల్ని ఎందుకు అక్కడ వదిలి వెళ్ళింది." జానకి మొహంలోకి చూస్తూ అడిగాడు.

జానకి ఆలోచిస్తూ అంది "నాకు గుర్తులేదండి. అదేదో ఆశ్రమం అంది కానీ అక్కడ బాబాగారు లేరు. ఎవరో ఉన్నారు. ఎవరో నాకు గుర్తు రావడం లేదు. "

"ప్రయత్నించండి. గుర్తు తెచ్చుకుని చెప్పండి మీరు చెప్పే విషయాలు మాకు చాలా కీలకం. మా దర్యాప్తుకి చాలా ఉపకరిస్తాయి. మీరిద్దరూ కలిసి ఎక్కడికి వెళ్ళారు? అక్కడ ఎవరు ఉన్నారు? ఎంతమంది ఉన్నారు? ఆవిడకి వాళ్ళతో ఎలాంటి సంబంధాలున్నాయి."

జానకి అయోమయంగా చూస్తూ అంది "నాకేం గుర్తు లేదండి. నేను బాబాగారిని కలవాలి అనుకున్నాను. ఆవిడ బంధువులనుకుంటా.. వెడదాము అంది బస్సు లో వెళ్ళాము. ఎక్కడో దిగాము.. ఆ ఊరు పేరు నాకు తెలియదు."

"ఎందుకు? మీరు బాబాగారిని కలవాలని అనుకున్నారు..మీకు బాబాల మీద నమ్మకమా"

" బాబాలంటే దేవుళ్ళే కదండీ. మా అమ్మాయి జాతకం అడిగి, దానికి ఏదన్నా తాయెత్తు తీసుకుందామని అనుకున్నాను. కానీ, అంతా గందరగోళం అయింది."

"గందరగోళమా.. ఏమైంది?" ఆసక్తిగా అడిగాడు ఇన్స్పెక్టర్ .

జానకి భాస్కర్ వైపు చూసింది.

ఆమె చూపులో నిస్సహాయత గమనించిన భాస్కర్ జానకితో మృదువుగా “ లోపలికి వెళ్లి కాఫీ తీసుకురా జానకి” అన్నాడు.

జానకి లేచి వెళ్ళింది. ఆదినారాయణ ఊపిరి పీల్చుకున్నాడు.

భాస్కర్ ఇనస్పెక్టర్ వైపు చూసి “క్షమించండి.. మీకు కావాల్సిన వివరాలు నేను ఇస్తాను.. ప్రస్తుతం నా మిసెస్ మెంటల్ స్టేటస్ సరిగా లేదు.. తనకి ట్రీట్ మెంట్ అవుతోంది. దయచేసి తనని ఏమి అడక్కండి” అన్నాడు.

“ఓకె ఓకే. అర్ధమైంది. కానీ ఇది చాలా సీరియస్ కేసు. మీకు తెలుసు కదా ఈ దొంగ బాబాల కేసులు విపరీతం అవుతున్నాయి. డేరా బాబా కేసు ఎంత పెద్దదో అందరికీ తెలుసు. అది జనాలు మర్చిపోనే లేదు. ఈ మధ్యే కీసర దగ్గర ఒక కేసు వచ్చింది. పిల్లలకి అనారోగ్యం అనో, అమ్మాయి పెళ్లి కుదరడం లేదు అనో, వీసా రాలేదనో ఆడవాళ్ళంతా ఈ బాబాల దగ్గరకు వెళ్తారు. వాళ్ళ బలహీనత కనిపెట్టి రకరకాలుగా మోసాలు చేస్తున్నారు.

కొందరు యువతులకు మాయమాటలు చెప్పి వాళ్ళని బలవంతంగా ఆశ్రమాల్లో చేర్చి సన్యాసులుగా మర్చి లైంగికంగా వాడుకుంటున్నారు. మళ్ళీ ఆ ఆశ్రమాలకి బ్రాంచెస్ కూడా ఉంటాయి. అమ్మాయిలను అక్కడికీ, ఇక్కడికీ మారుస్తారు. ఈ మధ్య ఒకావిడ తన కూతురుని బలవంతంగా ఆశ్రమంలో చేర్చారని తన కూతురుని ఎలాగైనా బయటకి తీసుకురావాలని మాకు రిపోర్ట్ చేసింది.

మేము దర్యాప్తు చేస్తే నిజాలు బయటకి వచ్చాయి. ఆ ఆశ్రమంలో చేయని నేరాలు లేవు. స్మగ్లింగ్, డ్రగ్స్, అమ్మాయిలను వాడుకోవడం దారుణాలు.

ఇలాంటి ఆశ్రమాలు మన రాష్ట్రంలోనే బోలెడు ఉన్నాయి. మాకు సమాచారం తెలిస్తే మేము దాడి చేసి పట్టుకోవచ్చు. కానీ కొందరు తెలిసినా మాకు చెప్పడం లేదు.. వాళ్ళని ఆశ్రమంలో వాళ్ళు భయపెట్టి, బ్లాక్ మెయిల్ చేసి నిజాలు బయటకి రాకుండా చేస్తున్నారు.”

భాస్కర్ నవ్వాడు“మీరు ఏమి అనుకోకండి. ఇప్పటిదాకా పట్టుబడిన వాళ్ళ మీద ఏం చర్యలు తీసుకున్నారు మీరు. డేరా బాబా మీద ఎలాంటి చర్య తీసుకున్నారో ఇప్పటిదాకా తెలియలేదు. “

ఇనస్పెక్టర్ తల పంకిస్తూ అన్నాడు.. “సర్ కేసు మా దగ్గరకు వస్తే దర్యాప్తు చేసి రిపోర్ట్ పై అధికారులకి ఇవ్వడం వరకే మా బాధ్యత.. డేరా బాబా కేసులో ఎంత మంది ప్రముఖులు ఇన్వాల్వ్ అయి ఉన్నారో తెలుసుగా. అలాంటి వాళ్ళని కాపాడే వాళ్ళు చాలా మంది ఉంటారు.. మనం నిమిత్త మాత్రులం.”

జానకి కాఫీ కలుపుతుంటే అడిగింది లీలమ్మ “ఆయన నిన్ను ఏం అడిగాడు?”

జానకి కాఫీ కప్పుల్లో పోస్తూ అంది “అదే ఆవిడ లేదూ ఉమాదేవి ఆవిడ గురించి అడుగుతున్నాడమ్మా..”

“మనకేం తెలుస్తాయి ఊళ్ళో వాళ్ళ విషయాలు?” అంది ఆవిడ.

“అదే అన్నాను” అంది జానకి కాఫీ ట్రే తీసుకుని వెళ్తూ.

లీలమ్మ నిట్టూర్చింది.

జానకి చేతిలో ట్రే అందుకుని అందరికీ భాస్కర్ కప్పులు అందించాడు.

జానకిని లోపలికి వెళ్ళు అన్నట్టుగా సైగ చేసాడు ఆదినారాయణ .

జానకి వెళ్ళిపోయింది.

"మరి అలాంటి వాళ్ళ మీద చర్యలు తీసుకోకుండా మీరు ఎంత మంది బండారాలు బయట పెట్టి ప్రయోజనం ఏంటి ఇనస్పెక్టర్ గారు?" అడిగాడు ఆదినారాయణ.

ఇన్స్పెక్టర్ చిరునవ్వు నవ్వాడు. "సార్ మనిషికి వైద్యం లేని జబ్బు వచ్చిందని తెలిస్తే వైద్యం చేయించడం మానేస్తారా?" అడిగాడు.

ఆదినారాయణ తెలివైన వాడివే అన్నట్టు చూసాడు.

"సమాజానికి వచ్చింది ఇప్పుడు చాలా పెద్ద జబ్బు...మనం అలా బయటకి వెళ్దాం రండి" అన్నాడు ఇనస్పెక్టర్ కాఫీ తాగి కప్పు టేబుల్ మీద పెట్టి భాస్కర్తో ..

"అలాగే" అంటూ లేచాడు భాస్కర్.

కానిస్టేబుల్ డ్రైవ్ చేస్తుంటే పోలీసు వాన్ లో ఇన్సపెక్టర్ పక్కన కూర్చుని వెళ్తున్న భాస్కర్ వైపు చూసి కంగారుగా అడిగింది జానకి ఆదినారాయణ ని" నాన్నా ఆయన్ని ఎక్కడికి తీసుకువెళ్తున్నారు? "

"ఎక్కడికి లేదమ్మా. ఊరికే అలా వెళ్తున్నారు కంగారు పడకు" అన్నాడాయన.

లీలమ్మ ఆయన వైపు అనుమానంగా చూసింది.

ఆయన ఏమి లేదు అన్నట్టు సైగ చేసాడు.

దారిలో ఉమాదేవి గురించి చెప్తూ అన్నాడు ఇన్సపెక్టర్ "ఆవిడ గురించి ఎవరిని అడిగినా అసాంఘిక శక్తులతో ఆమెకి ఉన్న పరిచయాల గురించి కథలు, కథలుగా చెప్తున్నారు మీ కాలనీ వాళ్ళు. అంతగా తెలిస్తే ఇంతకాలం ఎందుకు మాకు రిపోర్ట్ చేయలేదో అర్థం కావడం లేదు. ఆమెకి, ఆమె భర్తకి కూడా స్మగ్లింగ్ ముఠాతో సంబంధాలు ఉన్నాయట , ఆమె భర్త కూడా ఒక ముఠాలో సభ్యుడని చెప్పారు. మేము ఎంక్వైరీ చేస్తే తెలిసింది. వాళ్ళు పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపూర్ నుంచి దాదాపు పదేళ్ళ క్రితం హైదరాబాద్ వచ్చారు. వాళ్లకి పిల్లలు లేరు. వాళ్ళది స్వంత ఇల్లు అని చెప్పిన ఇల్లు వాళ్ళది కాదు. ఒక ముటా సభ్యుడిది. "

భాస్కర్ ఆశ్చర్యంగా చూసాడు.

"మా కాలనీలో ఇంత దారుణాలు జరిగాయా?"

"చాలా చోట్ల జరుగుతున్నాయి సార్ . వైట్ కాలర్ నేరాలు ఇలాంటి మంచి ఫామిలీస్ ఉన్న చోటే జరుగుతున్నాయి. పెద్ద, పెద్ద అపార్ట్ మెంట్స్ లో చుట్టు పక్కల వాళ్లకి తెలియను కూడా తెలియడంలేదు కొన్ని చోట్ల. ఆ మధ్య ఒకే అపార్ట్ మెంట్ లో హత్య జరిగి వారం అయాక తెలిసింది అదికూడా శవం కుళ్లిపోయి దుర్వాసన వస్తుంటే పక్క వాళ్ళు కంప్లైంట్ చేసారు."

భాస్కర్ ఒక్కసారిగా కంపించి పోయాడు.

నెమ్మదిగా అన్నాడు. "నా మిసెస్ ఎందుకు ఇలా చేసిందో తెలియడం లేదు ఇన్సపెక్టర్. తన ఆలోచన అంతా మా అమ్మాయి గురించే. పిల్లని చదువు మానిపించామనేది. ఎందుకు అంటే బయటకి వెళ్తే ఎవరన్నా ఎమన్నా చేస్తారేమో అనేది. ప్రతి దానికీ దాన్ని తిట్టేది.. అసలు కొంత కాలంగా ఆవిడ ప్రవర్తనతో నాకు మతిపోతోంది. ఆవిడను కాపాడి ఇంటికి తీసుకువచ్చిన కుర్రాడు నా అదృష్టం కొద్దీ సైకియాట్రిస్ట్ ... అతనే ఆవిడకి ట్రీట్ మెంట్ ఇస్తున్నాడు."

అదంతా విన్న ఇన్సపెక్టర్ నిట్టూర్చి "ఆవిడకే కాదు సార్ ఆడపిల్లలున్న ప్రతి వాళ్ళు భయపడుతున్నారు. అసలు ఒక్కో వార్త వింటుంటే మాకే ఒళ్ళు జలదరిస్తుంది. అసలు ఈ సమాజం ఇలా ఎందుకు అయింది అనిపిస్తుంది. ఎన్ని రకాల మోసాలు! ఎన్ని రకాల దారుణాలు! నీతి, నిజాయితీ, సిగ్గు, శరం, అసలు ఏమీ లేకుండా పోతున్నాయి జనాల్లో."

అతని స్వరంలో వినిపిస్తున్న ఆవేదనకీ వచలితుడై చూసాడు భాస్కర్.

“సరే. మీరు సమయం చూసి ఆవిడని వివరంగా ఏం జరిగిందో అడిగి తెలుసుకోండి. ఆవిడ స్టేట్ మెంట్ మాకు చాలా కీలకం. ఎందుకంటే ఆవిడ ఒక్కరే ఉమాదేవితో డైరెక్ట్ గా ఇల్లాంటి అనుభవం పొందినది. మీ కాలనీలో ఎవరూ ఆవిడని నమ్మేవారు కాదు అని చెప్పారు. “

“అలాగా. ఇదంతా మా ఖర్మ . బాధగా అన్నాడు భాస్కర్.

పోలీస్ స్టేషన్ దగ్గర పడుతుంటే భాస్కర్ అడిగాడు నేను స్టేషన్ కి రావాలా..

లేదు అవసరం లేదు. సారీ ఏదో మాట్లాడుతూ ఇక్కడిదాకా తీసుకు వచ్చాను, మిమ్మల్ని ఆఫీస్ దగ్గర డ్రాప్ చేస్తాడు మా కానిస్టేబుల్ నేనిక్కడ దిగిపోతాను అన్నాడు ఇన్స్పెక్టర్ .

వద్దండి పోలీస్ వాన్ లో వస్తే మా వాళ్ళంతా కంగారు పడతారు నేను ఆటోలో వెళ్ళిపోతాను అంటూ భాస్కర్ దిగి సెలవు తీసుకున్నాడు.

రాత్రి సమయం. సుమారు పదకొండు అయి ఉంటుంది.

జూబిలీ హిల్స్ రోడ్ నెంబరు 12 నిర్మానుష్యంగా ఉంది. ఒకటీ, అరా కార్లు వెళ్తున్నాయి.

బాగా ధనవంతుల ఇళ్ళు ... ముందు అందమైన లాన్ విశాలమైన భవనాలు. ఎంతో అందంగా ఉన్నాయి.

అదొక మూడంతస్తుల భవనం ...

బి ఎం డబ్ల్యు కారు వచ్చి గేటు ముందు ఆగింది. వాచ్ మాన్ గేటు తీసాడు. కారు నెమ్మదిగా లోపలికి వెళ్లి పోర్టికో సమీపించింది.

రెండో అంతస్తులో ఒక గది కిటికీ లో నుంచి లైటు వెలిగింది.

కారు పోర్టికోలో పార్క్ చేసిన వ్యక్తి ప్రధాన ద్వారం వైపు నుంచి కాకుండా వెనక్కి నడిచాడు.

కొన్ని నిమిషాల తరవాత రెండో అంతస్తులో లైటు ఆర్పేసినట్టు చీకటి అలుముకుంది.

వాచ్ మాన్ అదేమీ పట్టించుకోకుండా తన గదిలోకి వెళ్ళిపోయి స్టూల్ మీద కూర్చుని తిరిగి కునికిపాట్లు పడసాగాడు.

లైటు వెలిగి, ఆరిన గదిలో ఇద్దరూ వ్యక్తుల మధ్య సంభాషణ జరుగుతోంది. ఆ ఇద్దరిలో ఒకరు స్త్రీ, మరొకరు అంతకు ముందే కారు పార్క్ చేసి వెళ్ళిన వ్యక్తీ.

“ఎందుకు ఆలస్యం అయింది?”

“ప్రతిరోజూ అడుగుతావేం.”

“ఏ రోజు కూడా నువ్వు సమాధానం చెప్పలేదు. అందుకే అడుగుతున్నా . ఇవాళన్నా చెప్పు ఎక్కడికి వెళ్లి వస్తున్నావు?”

“నీకు తెలుసు అయినా అడుగుతున్నావు ఎందుకు రభస చేస్తావు?”

“ఓ అంటే నా అనుమానం నిజమే అనమాట.. చెప్పు ఎందుకు వెళ్తున్నావు.. నీకు నేనేం తక్కువ చేసాను... నాకేం తక్కువ అయింది... నేను అందంగా లేనా... చదువుకోలేదా..”

“శ్రేష్టా ! నీకు అన్నీ తెలిసి అడగద్దు ప్లీజ్. నాకు, స్వప్నకి ఉన్న అనుబంధం నీకు చెప్పినా అర్ధం కాదు. మేము కేవలం ప్రేమికులం కాదు. మేము భార్యాభర్తలం.“

“అలాంటప్పుడు నన్నెందుకు చేసుకున్నావు.”

"మీ నాన్న నిన్ను బలవంతంగా నాకు అంటకట్టాడు సరేనా" అతనీసారి కొంచెం గట్టిగా అరిచాడు.

"అంటగట్టాడా.. అంటే... అంటే... బలవంతంగా చేసుకున్నావా. పెళ్లి అయాక ఎలా చేసుకున్నావు? నాన్న అంట గడితే ఎలా ఒప్పుకున్నావు.. నాకు కథలు చెప్తున్నావా... నువ్వు నన్ను నా ఆస్తి కోసం చేసుకున్నావు కదూ! చెప్పు..."

"వదులు నీకేం పిచ్చి పట్టిందా..."

"వదలను.. ఇవాళ ఆటో, ఇటో తేలాల్సిందే.. చెప్పు.. దాన్ని వదులుతావా ! లేదా! "

"వదులు శ్రేష్టా. అర్ధరాత్రి ఈ రభస ఏంటి? ఉదయం మాట్లాడుకుందాం."

"ఉదయం. నాకు ఈ రాత్రి తెల్లవారదు ... తెల్లవారకూడదు.. నేను చచ్చిపోతాను.. నేను చచ్చిపోతాను."

"ఏయ్ పిచ్చి పట్టిందా" చెళ్ళు, చెళ్ళున శబ్దం ....

భళ్ళున ఏదో కింద పడి విరిగిన శబ్దం ...

**గోరువెచ్చని** కిరణాలు కళ్ళ మీద పడుతుంటే బద్ధకంగా కళ్ళు తెరిచి వాల్ క్లోక్ వైపు చూసాడు ఇనస్పెక్టర్ శశి. ఆరు నలభై చూపిస్తోంది గడియారం.

అబ్బా! ఉసూరు మన్నాడు ... అప్పుడే తెల్లవారింది.. రాత్రి ఇంటికి వచ్చి, స్నానం చేసి, భోజనం చేసి పడుకునే సరికి పన్నెండు దాటింది. శరీరం, మెదడు కూడా బాగా అలసిపోయింది. అప్పుడే లేవాలని లేదు..

జయంతి లోపలికి వచ్చింది.. బెడ్ మీద అసహనంగా కదుల్తున్న భర్త వైపు చూసి అతనికి దగ్గరగా వస్తూ చిరునవ్వుతో అంది " ఏంటి ఇవాళ దొరగారు ఇంకా పవళింపు సేవలో ఉన్నారు."

ఆమె చేయి పట్టుకుని గట్టిగా దగ్గరకు లాక్కున్నాడు. తూలి గుండెల మీద పడింది. ఆ విసురికి ఆమె పెద్ద జడ అతని మెడ చుట్టూ పడింది.

ఆ జడ అందుకుని కొసలు వేలితో చుడుతూ "ఎప్పుడో ఈ జడతో నాకు ఉరి వేస్తావు" అన్నాడు.

"ఛ ఊరుకోండి..." ముద్దుగా విసుక్కుని "లేవండి ఇవాళ బ్రేక్ ఫాస్ట్ పెసరట్టు" అంది అతని చెంప మీద సున్నితంగా రాస్తూ.

"ఊహు లేవాలని లేదు...ఇవాళ హాలీడే .... హాయిగా రోజంతా రొమాంటిక్ గా గడిపేద్దాం" అన్నాడు జడ వదిలి ఆమెని దగ్గరగా లాక్కుంటూ.

అప్పుడే మంచం పక్కన ఉన్న బల్ల మీది ఫోన్ మోగింది..

జయంతి ఫక్కున నవ్వింది...

"ఎందుకు నవ్వుతావు? ఫోన్ మోగినా, ప్రపంచం మునిగిపోయినా కదిలేది లేదు" అన్నాడు.

"సరే అదీ చూద్దాం" అంది జయంతి అతని కౌగిట్లో కరిగిపోతూ..

ఫోన్ ఆగకుండా మోగుతోంది. అసహనంగా చూసాడు శశి ." అబ్బా... విసిరి బయట పారెయ్" విసుగ్గా అన్నాడు.

"అలాగే" అతని చేతులు వదిలించుకుని లేవబోయింది..

ఫోన్ శబ్దం ఆగిపోయింది. హమ్మయ్య అంటూ మళ్ళీ దగ్గరకు లాక్కున్నాడు.

ఫోన్ మళ్ళీ రింగ్ అయింది. అతని చేతులు అప్రయత్నంగా సడలించాడు.

జయంతి లేచి ఫోన్ తీసి అతని చేతికి ఇచ్చింది.

విసుగ్గా డిస్ కనెక్ట్ చేయబోతూ డాక్టర్ ప్రద్యుమ్న కాలింగ్ అని స్క్రోల్ అవడం చూసి "అరె ప్రద్యుమ్నా! ఇప్పుడు" అనుకుంటూ వాల్ క్లాక్ చూస్తూ ఆన్సర్ బటన్ నొక్కాడు.

"హాయ్ డాక్టర్ సాబ్ .... గుడ్ మార్నింగ్ ... ఏంటి విశేషం పొద్దున్నే ఫోన్ చేసావు?" హుషారుగా అడిగాడు.

"శశి.... అర్జెంటు గా ఇంటికి వస్తావా? "

అతని స్వరంలో వినిపిస్తున్న కంగారుకి ఆశ్చర్య పడుతూ "ఏమైంది ఎనీ థింగ్ రాంగ్ ?" అడిగాడు శశి.

"ప్లీజ్ శశీ ... వచ్చాక మాట్లాడుకుందాం త్వరగా రా" ప్రాధేయపూర్వకంగా అన్నాడు ప్రద్యుమ్న.

"ఓకే, ఓకే వస్తాను" అంటూ ఫోన్ డిస్ కనెక్ట్ చేసి భార్య వైపు చూసి "నేను వెళ్ళాలి జయా... "అన్నాడు.

"ఏమైంది డాక్టర్ గారికి?" అడిగింది జయంతి.

"ఏమో ... హి ఈజ్ నెర్వస్ ... నా టవల్ ఇచ్చి బ్రేక్ ఫాస్ట్ సంగతి చూడు" అంటూ వాష్ బేసిన్ దగ్గరకు వెళ్లి చన్నీళ్ళతో మొహం కడుక్కున్నాడు.

జయంతి అతనికి టవల్ అందించి వంట గదిలోకి వెళ్ళిపోయింది.

శశి బాత్ రూమ్ వైపు వెళ్ళాడు.

సరిగ్గా అరగంటలో స్నానం చేసి రెడీ అయి జయంతి పెట్టిన ఉప్మా తిని, జూబిలీ హిల్స్ బయలుదేరాడు.

అతను వెళ్లేసరికి డాక్టర్ ప్రద్యుమ్న హాల్లో సోఫాలో దిగాలుగా కూర్చుని ఉన్నాడు. అతనింకా నైట్ డ్రెస్ లోనే ఉన్నాడు. గడ్డం కొద్దిగా పెరిగి ఉంది. బయటకు రావడానికి సందేహిస్తున్న కన్నీరు కంటి చివర ఘనీభవించి ఉంది.

శశిని చూడగానే గబుక్కున లేచి దగ్గరగా నడిచి అతని చేయందుకుని " నేను చాలా ప్రమాదంలో ఉన్నాను శశీ ....ప్లీజ్ సేవ్ మీ" అన్నాడు.

అతని స్వరంలో భయంతో కూడిన సన్న వణుకు స్పష్టంగా గమనించాడు శశి.

"ఏం జరిగింది? ముందు నువ్వు రిలాక్స్ అవు" అంటూ అతన్ని అలాగే పట్టుకుని సోఫా దగ్గరకు నడిపించి సోఫాలో కూర్చోబెట్టి పక్కనే కూర్చున్నాడు.

"శ్రేష్ఠ కనిపించడం లేదు..."

"వాట్ ?" తెల్లబోతూ చూసాడు శశి...

"అవును ... నేను నిద్ర లేచి చూసేసరికి శ్రేష్ఠ కనిపించలేదు.."

"అంత పొద్దున్నే ఎక్కడికి వెళ్ళింది?"

"అదే తెలియక నీకు కాల్ చేసాను."

"అసలేం జరిగింది?"

ప్రద్యుమ్న ఆ ప్రశ్నకి కొన్ని క్షణాలు మౌనంగా ఉండి నెమ్మదిగా అన్నాడు... "రాత్రి చాలా పెద్ద గొడవ జరిగింది.."

శశి నొసలు ముడేశాడు... "ఎందుకు?"

"ఎందుకేంటి శశీ... కొత్త విషయం అన్నట్టు అడుగుతున్నావు.. మా పెళ్లి అయిన మూడో రోజు నుంచే మా మధ్య వార్ మొదలైంది.. నీకు ఆల్రెడీ చెప్పానుగా"

"అవును చెప్పావు కానీ, ఇంకా అలాగే ఉన్నారా?"

ప్రద్యుమ్న నిట్టూర్చి చెప్పసాగాడు. " నీకు తెలుసుగా! శ్రేష్టని పెళ్లి చేసుకోడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు.. కేవలం మావయ్య బలవంతం మీద చేసుకున్నాను. చిన్నప్పటి నుంచీ ఆయన, అత్తయ్య నన్ను ఎంతో ప్రేమగా పెంచారు. ఇంతటి వాడిని చేసారు. వాళ్ళు నాకు చేసిన సహాయానికి కృతజ్ఞతతో చేసుకున్నాను. నాకు మొదటి నుంచీ శ్రేష్ఠ స్వభావం నచ్చదు.. షి ఈజ్ ఇగోఇస్ట్ .. వాళ్ళ నాన్నగారినే కేర్ చేయదు. నన్ను మాత్రం కేర్ చేస్తుందని ఎలా అనుకుంటాను. కానీ ఆయన నన్ను బతిమాలారు.. తన స్వభావం తెలిసే నిన్ను ప్రాధేయపడుతున్నాను ప్రద్యూ.. నా కోసం ఒప్పుకో అని నా చేతులు పట్టుకుని బతిమాలారు. వాళ్ళ అమ్మగారు కూడా దానికి ఆవేశం తప్ప ఆలోచన లేదు ... తను అనుకున్నదే జరగాలి. ఎవరు చెప్పినా వినదు. ఇలాంటి స్వభావంతో ఎవరు మాత్రం సర్దుకుపోగలరు? నువ్వంటే మొదటి నుంచీ దాన్ని చూస్తున్నావు.. తన సంగతి నీకు తెలుసు .. పైగా వివేకవంతుడివి" అంటూ కన్నీళ్లు పెట్టుకోడంతో కాదనలేకపోయాను. నా నిస్సహాయత నా జీవితాన్ని, అటు పల్లవి జీవితాన్ని నాశనం చేసింది.."

ప్రద్యుమ్న గొంతు దుఖంతో మూగబోయినట్టు అయింది. కంటి చివర్ల నుంచి జారిన కన్నీటి బొట్టు వేలికొసలతో తుడుచుకుని తిరిగి చెప్పసాగాడు.

"నీకు తెలుసుగా శశీ! పల్లవి నన్ను ఎంత ప్రేమించిందో. ఇప్పటికీ అదే ప్రేమ. తను నేను లేకుండా బతకలేదు. తను లేకుండా నేనూ బతకలేను. అయినా పరిస్థితులకి తలవంచి శ్రేష్ట మేడలో తాళి కట్టాను. అప్పటి నుంచి నా ప్రేమని మర్చిపోయి శ్రేష్టకి న్యాయం చేయడానికి శాయశక్తులా ప్రయత్నించాను. భవిషత్తులో తెలిస్తే నేను తనని మోసం చేసానని అనుకుంటుందని మొదటి రాత్రే నిజాయితీగా నా ప్రేమ విషయం చెప్పాను. అదే నేను చేసిన తప్పు అయింది. అప్పటి నుంచీ నేను ఎంతగా సహించినా మాటలతో చిత్రవధ చేసింది. అదిగాక కాజువల్ గా అడిగినట్టు అడిగి పల్లవి డీటెయిల్స్ తెలుసుకుని, పల్లవి దగ్గరకు వెళ్లి నోటికి వచ్చినట్టు తిట్టి ఉన్నపళంగా ఊరు వదిలి దూరంగా వెళ్ళు లేకపోతే చంపేస్తాను అంటూ బెదిరించింది. పల్లవి నాకు చెప్పి ఎంత ఏడ్చిందో తెలుసా? ఎక్కడికి వెళ్తుంది? తను పుట్టిన ఊరు, కన్నవాళ్ళు, ఉద్యోగం అన్నీ వదిలి ఎక్కడికి వెళ్తుంది?

నేను శ్రేష్టకి చిన్నపిల్లకి చెప్పినట్టు చెప్పాను. మన జీవితంలోకి పల్లవి రాదు.. తన గురించి మనం ఆలోచించద్దు... జరిగింది మర్చిపోదాం అని ఎంతో చెప్పాను.

కానీ మూర్ఖురాలు నా సహనాన్ని పరీక్షించింది. నేను కూర్చుంటే తప్పు, నిలబడితే తప్పు... హాస్పిటల్ కి వెళ్తే తప్పు... ఓ గాడ్ నరకం అనుభవించాను. ఆఖరికి తెగించాను. పల్లవితో చనువుగా ఉన్నట్టు నటిస్తే అయినా మారుతుందని అనుకున్నాను. పల్లవి కూడా నా కాపురం బాగుపడాలని తన పరువు గురించి కూడా ఆలోచించ కుండా నాకు సహకరించింది.

ఇదంతా వాళ్ళ నాన్నగారికి కూడా తెలుసు.. అయినా శ్రేష్ఠ మారలేదు. నాలో సహనం చచ్చిపోయింది. నా వల్ల కాదని, ఇలా బతికే కన్నా విడిపోదాం మంచిదని , శ్రేష్టకి విడాకులు ఇస్తానని చెప్పాను. విడాకులు తీసుకుని దాన్ని లీగల్గా భార్యని చేసుకుంటావా చచ్చినా విడాకులకి ఒప్పుకోను అంది.

అప్పటి నుంచీ ప్రతి రోజూ, ప్రతి క్షణం నాకు జీవితం నరకం అయింది. మావయ్య, అత్తయ్య కూడా శ్రేష్ఠ ప్రవర్తనతో విసిగిపోయారు.

ఆఖరికి రాత్రి నన్ను నిలదీసింది. దాన్ని వదలకపోతే చచ్చిపోతా అని బెదిరించింది. ఎంతగానో చెప్పాను అంతా నటన అనీ... తనని మార్చుకోడానికి అలా చేసానని.. పల్లవి మంచిదని, పెళ్లి కావాల్సిన పిల్ల తన జీవితం నాశనం చేయద్దని బతిమాలాను. నన్ను ఇష్టం వచ్చినట్టు కొట్టింది. మా పెనుగులాటలో ఫ్లవర్ వేజ్ పగిలింది.. అది తనకి ఎంతో ఇష్టమైన వాజ్ ... అంతే ఉన్మాదిలా మారింది. నేను బలవంతంగా

తప్పించుకుని నా గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాను. ఆ టెన్షన్ తో చాలా సేపు డ్రింక్ చేస్తూ కూర్చున్నాను. బాగా లేట్ గా పడుకున్నాను. తిరిగి లేచేసరికి తన బెడ్ ఖాళీగా ఉంది. ఇల్లంతా వెతికాను. వాళ్ళ నాన్నగారికి కాల్ చేసాను. నీకు చేసాను. అయోమయంగా ఉంది శశీ.. భయంతో నా మెదడు నరాలు తెగిపోతాయేమో అనిపిస్తోంది. “

రెండు చేతులతో తల పట్టుకున్నాడు ప్రద్యుమ్న ...

అంతా విన్న శశి దీర్ఘంగా శ్వాస విడిచి ఓదార్పుగా అన్నాడు “టెన్షన్ పడకు నేను చూస్తాను. ఎక్కడికి వెళ్తుంది.. ఏ ఫ్రెండ్ ఇంటికో వెళ్లి ఉంటుంది నిన్ను బెదిరించడానికి... లెటర్ ఏదన్నా రాసి పెట్టి వెళ్ళిందా?”

“ఏమో నేను చూడలేదు” అమాయకంగా అన్నాడు..

శశికి జాలేసింది.. “పద తన రూమ్ కి వెడదాం” అన్నాడు.

ఇద్దరూ కలిసి మొదటి అంతస్తులో ఉన్న శ్రేష్ఠ రూమ్ కి వెళ్ళారు.

విశాలంగా ఉంది బెడ్ రూమ్. రాత్రి పెనుగులాటలో విరిగిన ఫ్లవర్ వాజ్ తీసి క్లీన్ చేసినట్టుంది పనమ్మాయి. క్వీన్ బెడ్ అందమైన బెడ్ షీట్, మెత్తటి నాలుగు పిల్లోస్. కిటికీలకి పల్చటి తెరలు. ఓ పక్క నగిషీలు చెక్కిన రోజ్ వుడ్ సోఫాసెట్. ఒక మూల రోజ్ వుడ్ బల్ల మీద పాలరాతి కృష్ణ విగ్రహం. దాని మీద నక్షత్రాలు జరీ వర్క్ చేసిన లేత పసుపు రంగు వస్త్రం. గోడకి ఖరీదైన పెయింటింగ్. ఆధునికంగా, కళాత్మకంగా ఉంది.

“మంచి అభిరుచి” అన్నాడు శశి.

“అభిరుచి మంచిదే... బుద్దే “ విరక్తిగా అన్నాడు ప్రద్యుమ్న.

అతని భుజం మీద తట్టాడు శశి.

“నీ రూమ్ ఎక్కడ?” అడిగాడు.

“కింద “

“ఎందుకలా?”

“ఎందుకేముంది? పల్లవితో నాకే సంబంధం లేదు... ఇంక ఉండదు అని చెప్పినా వినకుండా అదే విషయం ప్రతిక్షణం తీసుకొచ్చి దాన్ని నువ్వు పూర్తిగా వదిలేసావని ప్రూఫ్ తీసుకురా అని నన్ను దగ్గరికి రానివ్వలేదు.. అప్పుడే నా పడక గెస్ట్ రూమ్ కి మార్చుకున్నా అప్పటి నుంచీ అక్కడే. “

సానుభూతిగా చూసాడు శశి.

ప్రద్యుమ్న శ్రేష్ఠ తండ్రి వాసుదేవరావు గారి చెల్లెలి కొడుకు. ఆయన చెల్లెలు భర్త ఆమెని చిత్ర హింసలు పెట్టే వాడు. ఆమె కొడుక్కి రెండేళ్ళు వచ్చినప్పుడు ఆ బాధలు పడలేక నిద్రమాత్రలు మింగి చనిపోగా, వాసుదేవరావు ఆమె భర్తని అరెస్ట్ చేయించి ప్రద్యుమ్నని తనతో తీసుకుని వచ్చి అతన్ని చదివించి, డాక్టర్ చేసాడు.

ఆ హక్కుతోటే ప్రద్యుమ్నకి చిన్నప్పటినుంచి మొండిగా, పెంకేగా తయారైన శ్రేష్టని అతనికే ఇచ్చి పెళ్లి చేసాడు ఆయన.

ప్రద్యుమ్న, శశి బి ఎస్సీ లో క్లాస్ మేట్స్.. ఇద్దరికీ స్వల్ప కాలంలోనే మంచి స్నేహం కుదిరింది. ప్రద్యుమ్న నెమ్మదస్తుడు. తెలివైనవాడు. ఆ తెలివి తేటలతోటే ఎం బి బి ఎస్ లో ఫ్రీ సీట్ తెచ్చుకున్నాడు. శశికి చిన్నప్పటి నుంచి పోలీస్ అవాలని కోరిక దానికి తగ్గట్టే కృషి చేసి మొదటి సారికే పరీక్షల్లో నెగ్గి ఇన్స్పెక్టర్ గా తన ప్రస్థానం ప్రారంభించడం కాక ఆ వృత్తిలో చేరిన అతి కొద్ది కాలానికే నిజాయితీ పరుడు, ఆదర్శాలున్న

వాడు, నేరస్తులను పట్టుకోడంలో నేర్పరి అని పేరు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం అతను సివిల్స్ కి ప్రిపేర్ అవుతున్నాడు. వృత్తులు వేరైనా ఇద్దరూ విడిపోలేదు. తరచూ కాకపోయినా అప్పుడప్పుడు కలుస్తూ ఉంటారు. ప్రద్యుమ్న పెళ్ళప్పుడు శశి ట్రైనింగ్ లో ఉండడంతో పెళ్ళికి వెళ్ళలేకపోయాడు. శశి పెళ్ళికి ప్రద్యుమ్న వెళ్ళాడు. కానీ శ్రేష్ఠ వెళ్ళలేదు. ఇద్దరూ జీవితాల్లో స్థిరపడి కూడా రెండేళ్ళు అవుతోంది..

శశిది అన్యోన్య దాంపత్యం. జయంతి డిగ్రీ పూర్తి చేసింది. మంచి కుటుంబానికి చెందిన అమ్మాయి. సంప్రదాయాలను గౌరవించే సంస్కారవంతురాలు. భర్త అంటే ప్రాణం.

శశి కి బాధగా అనిపించింది.ప్రద్యుమ్న వైవాహిక జీవితం అంత సుఖంగా లేదని చూచాయగా తెలిసినా మరీ ఇంత దారుణంగా ఉందని అతను ఊహించలేదు. ప్రద్యుమ్న నోటినుంచి ఇప్పుడా విషయాలు వింటుంటే ఉత్తముడైన అతనికి ఇలాంటి అమ్మాయిని ఎందుకు భార్యగా చేసాడు అనిపిస్తోంది.

"శశీ పోలీస్ రిపోర్ట్ ఇస్తే పరువు పోతుందని ఆలోచిస్తున్నా... నాకేం తోచకుండా ఉంది" అన్నాడు ప్రద్యుమ్న.

"వద్దొద్దు .... నువ్వేం రిపోర్ట్ చేయకు. ముందు నిన్ను వేసేస్తారు. తప్పు ఎవరిదీ అయినా లా స్త్రీలకే అనుకూలంగా ఉంది. భర్తనే నేరస్తుడిగా అనుమానిస్తుంది.. మంచిపని చేసావు నాకు ఫోన్ చేసి.. ఇంతకీ మీ మావయ్య ఎక్కడ?" అడిగాడు శశి.

"వస్తామని అన్నారు ... ఎనీ టైం రావచ్చు.. "

బయట కారు ఆగిన శబ్దం వినిపించింది.

"అరుగొ వచ్చారు" అన్నాడు.

వాసుదేవరావు, ఆయన భార్య రుక్మిణి లోపలికి వచ్చారు.

శశిని చూస్తూనే ఆయన అతని దగ్గరగా వచ్చి కరచాలనం చేసి ప్రద్యుమ్న వైపు చూసాడు.

ప్రద్యుమ్న తలవంచుకుని అన్నాడు "సారీ మావయ్యా.."

ఆయన దీర్ఘంగా నిట్టూర్చి అతని భుజం తట్టాడు.

రుక్మిణి నేరుగా వంట గదిలోకి వెళ్ళింది.. అక్కడ వంటావిడ రమణమ్మ, పనమ్మాయి దుర్గ ఉన్నారు. ఆవిడని చూడగానే ఇద్దరూ భయంగా చేస్తున్న పని ఆపి నమస్కరించారు.

ఆవిడ వాళ్ళని సూటిగా చూస్తూ "ఏం చేస్తున్నారు?" అని అడిగింది.

"బాబుగారికి ఆమ్లెట్ వేయడానికి ఉల్లిపాయ తరిగానమ్మా" అంది దుర్గ.

ఆవిడ అక్కడినుంచి పైకి కూతురు గదిలోకి వెళ్ళింది. గదంతా కలయ తిరిగి టీపాయ్ మీద ఫ్లవర్ వెజ్ లేకపోవడం గమనించింది. ఎందుకో ఆ గదిలో ఆవిడకి ఏదో అపశ్రుతి కనిపించింది. అపారమైన అనుభవంతో అక్కడ పెద్ద గొడవ జరిగిందని పసిగట్టింది.

అక్కడ నుంచి కిందకి వచ్చింది. అప్పటికే వాసుదేవరావుకి, ప్రద్యుమ్నకి భయం లేదని, నిశ్చింతగా ఉండమని చెప్పి శశి వెళ్ళిపోయాడు.

ఆవిడ ప్రద్యుమ్న దగ్గరకు వెళ్ళి సూటిగా అతని మొహంలోకి చూస్తూ "రాత్రి గొడవ పడ్డారా?" అడిగింది. అతను మౌనంగా ఉండిపోయాడు.

"నిన్ను అనాధగా వదిలేయకుండా ఇంటికి తీసుకువచ్చి, ప్రయోజకుడిని చేసి, కూతురిని ఇచ్చినందుకు మాకు మంచి ఉపకారం చేశావయ్యా" అంది నిష్ఠూరంగా.

"అత్తయ్యా ...." ఆవిడ చేయి అడ్డు పెట్టి మాట్లడద్దు అన్నట్టు సైగ చేసింది.

భర్త వైపు తిరిగి "మనం ఇక్కడెందుకు? వెళ్లిపోదాం పదండి... కన్నాం, పెంచాం... ఇతనికి కట్టబెట్టాం... దాని రాతని కనలేదు కదా... పదండి" అంటూనే రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి, వెక్కి ఏడుస్తూ సోఫాలో కూలబడింది.

వాసుదేవరావు ఆమె భుజం చుట్టూ చేయి వేసి దగ్గరకు తీసుకుని ఓదారుస్తూ "ఊరుకో రుక్మిణీ... వాడి తప్పేం ఉంది! నీకు తెలుసు, నాకు తెలుసు మనమ్మాయి మూర్ఖత్వం. వాడినెందుకు నిందిస్తావు. వాడికి చేతనైనంత వరకూ మార్చుకోడానికి ప్రయత్నం చేశాడు. అది మన కళ్ళతో మనం చూసాం. నీ దుఃఖంలో విచక్షణ కోల్పోకు. ఇప్పుడు మనం వెళ్ళిపోతే ఒక్కడు ఎలా ఉండగలడు? శ్రేష్ఠ ఎక్కడికీ వెళ్ళదు.. వచ్చేస్తుంది.. ఏదో ఆవేశంలో ఏదన్నా ఊరు వెళ్లి ఉంటుంది.. వంటరిగా వెళ్ళలేని పిల్ల కాదుగా!?" అన్నాడు.

ఆవిడ కళ్ళు తుడుచుకుని "అసలు దాని సంగతి తెలిసి ఎందుకు అంత గొడవ పడ్డావు. తెగేదాకా లాగద్దన్న తెలివి నీకు లేదా?" అంది కోపంగా.

"నేను చాలా సేపు నచ్చ చెప్పానత్తయ్యా. ఉన్మాదిలా ప్రవర్తించింది" నిస్సహాయంగా అన్నాడు.

"నిజం చెప్పు నా కూతురి అమాయకత్వంతో ఆదుకున్నావు కదూ! ఆ పల్లవితో నీకేం సంబంధం లేకపోతే దానికి నువ్వంటే ఎందుకంత ఇష్టం? పెళ్ళికాని పిల్ల నీతో చనువుగా ఎందుకుంది?"

ఆవిడ అలా నిలదీస్తుంటే ప్రద్యుమ్న నిశ్చేష్టుడై చూసాడు..

వాసుదేవరావు భార్య వాలకం చూసి పరిస్థితి విషమిస్తోందని గ్రహించి ఆవిడని బలవంతగా తీసుకుని లోపలికి వెళ్ళాడు.

ప్రద్యుమ్న స్థాణువులా నిలబడిపోయాడు.

జానకి నెమ్మదిగా కోలుకుంటోంది. కిరణ్ మధ్య, మధ్య వచ్చి ఆవిడ కండిషన్ పరీక్షిస్తున్నాడు. ఇప్పుడు మందుల డోస్ కూడా తగ్గించాడు. నెమ్మదిగా ఆడపిల్లలకి చదువు ఎంత అవసరమో, వాళ్ళు ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడాల్సిన ఆవశ్యకత, ఆడపిల్లలు ఎలా వాళ్ళని వాళ్ళు రక్షించుకోవాలి వగైరా విషయాల్లో ఆవిడకి కౌన్సిలింగ్ ఇవ్వసాగాడు. చరితను దగ్గర కూర్చోబెట్టి, తనని ఎవరన్నా టీజ్ చేసినా, తన పైన దాడి చేసినా ఆమె ఏం చేస్తుందో ఆమె చేతే చెప్పించాడు.

చరిత కూడా ధైర్యంగా, ధృఢంగా చెప్పింది తల్లికి. "నా గురించి నువ్వు అసలు భయపడద్దమ్మా... నాకు తెలుసు ఎవరన్నా నా జోలికి వస్తే ఏం చేయాలో నాకు బాగా తెలుసు. నా దగ్గర షీ టీం ఫోన్ నెంబర్ ఉంది. అంతే కాదు నేను, నా ఫ్రెండ్స్ కలిసి వాడు ఎంత చెడ్డవాడైనా చితగ్గొట్టేస్తాం ..."

ఆవిడ కళ్ళ నీళ్ళు పెట్టుకుని "నువ్వు ఆడపిల్లవే" అంది..

"ముందు నువ్వు ఆ ఫీలింగ్ వదిలేయ్. ఆడపిల్ల తలచుకుంటే మగాళ్ళ కన్నా ధైర్యంగా ఎదుర్కోగలదు ఆపద వస్తే" అంది.

భాస్కర్ కూతురిలో కొత్త కోణం చూస్తూ ఆమె మాటలు ముగ్ధుడై విన్నాడు.

జానకితో అన్నాడు "జానకీ! కాలం మారిపోయింది. ఆడపిల్లలు ఇప్పుడు మిస్సైల్స్ లాగా దూసుకుపోతున్నారు. వాళ్ళ పురోగతి ఎవరూ ఆపలేరు.. ఎన్ని అపాయాలు వస్తాయో అన్ని ఉపాయాలూ ఉంటాయి. కాలం ఎవరికోసం ఆగిపోదు. అనవసరమైన భయాలతో నీ ఆరోగ్యం పాడుచేసుకుంటున్నావు. చూడు ఇంట్లో అందరికి కూడా మనశ్శాంతి పోయింది. పిల్లలిద్దరూ ఏ క్షణంలో ఎం చేస్తావో నువ్వు అన్నట్టు బిక్కు, బిక్కు మంటూ ఉంటున్నారు. చూడు కిరణ్ని చూడు ఎంత మంచి కుర్రాడో! అసలు నువ్వు ఎవరివని నిన్ను తీసుకొచ్చి నాకు అప్పగించి, నీకు ఉచితంగా వైద్యం చేస్తున్నాడు. ఎక్కడో నిజామాబాదు నుంచి ఇలా పదిరోజులకోసారి వచ్చి నిన్ను చూసే అవసరం అతనికేం ఉంది!

చెడు, మంచి అనేవి ఆడ, మగ అందరిలో ఉంటాయి.. అందర్నీ చెడ్డవాళ్ళగా జమ కట్టకూడదు. ఆడదేగా ఆ ఉమాదేవి.. నిన్ను మోసం చేయలేదూ “ మెత్త, మెత్తగా మందలించాడు.

“అమ్మా..! మీకు ఏ వార్త అయితే ఎక్కువ భయాన్ని, ఆందోళనని కలగ  చేస్తుందో ఆ వార్త పదే, పదే చూడండి. ఒక్కసారి చూసి వదలకండి. ఆ వార్త విషయంలో పోలీసులు చేస్తున్న దర్యాప్తు కూడా తెలుసుకోండి. నేరస్తులని ఎలా పట్టుకున్నారో తెలుసుకోండి. వాళ్లకి శిక్ష పడిందా, లేదా ఎలాంటి శిక్ష పడింది మొదలైన విషయాలు మీ వారిని అడిగి వారితో తరచూ చర్చించండి. నెమ్మదిగా మీకో అవగాహన వస్తుంది. మీలో మీకు తెలియకుండానే భయం పోతుంది. మీరే కొన్ని పరిష్కారాలు కూడా సూచించ గలుగుతారు.”  మృదువుగా చెప్తున్న కిరణ్ వైపు ఆప్యాయంగా చూసింది జానకి.

❦❦❦

**శశి, ప్రద్యుమ్న,** ఒక రెస్టారెంట్ లో కూర్చున్నారు.

గడ్డం, పెరిగి జబ్బు పడిన వాడిలా ఉన్న ప్రద్యుమ్న వైపు చూసి నిట్టూర్చాడు శశి.

ఆరోజుకి శ్రేష్ట వెళ్ళిపోయి వారం రోజులైంది. ఈ విషయం బయటకి పొక్కకుండా అతి జాగ్రత్తగా కేసు డీల్ చేస్తున్నాడు శశి. ఏ మాత్రం బయటకి వచ్చినా మీడియా చిలవలు, పలవలు చేసి కుటుంబసభ్యులను నిద్రపోనీకుండా చేస్తుంది. ప్రతి రోజూ , ప్రతి క్షణం “సార్ శ్రేష్ఠ గారి కేసు ఏమైంది? ప్రద్యుమ్న గారే హత్య చేసి పారిపోయిందని కథ చెబుతున్నారట కదా! మీరిద్దరూ ఫ్రెండ్స్ అంట కదా.. అందుకే ఆయనని మీరు సేవ్ చేయడానికి కేసు క్లోజ్ చేస్తున్నారట కదా... “ ఇలాంటి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తారు తనని.

ఇటీవలి కాలంలో దాదాపు ఇలాంటి కేసులు ఎన్నో. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహేతర సంబంధాల కేసులు. సంసారాలు విచ్చిన్నం అయిన కేసులు. తల తిరిగిపోతోంది ఒక్కో కేసు చదువుతుంటే.

ఎందుకిలా జరుగుతోంది? ఎంతో బలంగా, పవిత్రంగా, నూరేళ్ళ పంట గా భాసించాల్సిన వైవాహిక జీవితాలు ఎందుకు ఇలా అతి తక్కువ కాలంలోనే విచ్చిన్నం అవుతున్నాయి. ఎవరిలో లోపం ఉంది!

తెల్లవారి లేస్తే ఇలాంటి కేసులు ఎన్నో. భార్య మీద అనుమానంతో భార్యని చంపేసే భర్తలు. అక్రమసంబంధాలకు బానిసలై ప్రియుడితో కలిసి భర్తను చంపేసే భార్యలు.  ఓ పక్క కలిసి ఉంటూనే వివాహేతర సంబంధాలు కొనసాగిస్తూ, బద్ధశత్రువుల్లా బతికే వాళ్ళు.. ఎందుకిలా?

సంసారాల్లో ఈ అలజడికి ఏంటి కారణం? చదువు విజ్ఞానాన్ని పెంచాలి. ఆ విజ్ఞానం సంస్కారాన్ని పెంచాలి. ఆ సంస్కారం విజ్ఞతని పెంచాలి. కానీ ఉన్నత చదువులు చదువుకున్న వాళ్ళు కూడా ఎందుకు వివేకాన్నిమర్చిపోయి కేవలం ఉద్వేగాలు, ఆవేశాలు, ఉద్రేకాలకు లోనవుతూ క్షణికొద్రేకంలో విచక్షణారహితంగా ప్రవర్తిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తమవే కాదు, పిల్లల జీవితాలు కూడా నాశనం చేస్తున్నారు. లోపం ఎక్కడుంది?

“శశీ!” ప్రద్యుమ్న పిలుపుతో ఆలోచనల నుంచి తెప్పరిల్లి అతని వైపు చూసాడు.

అంతులేని బాధ ప్రతిఫలిస్తున్న కళ్ళతో చూస్తున్నాడు.  మావగారు ప్రద్యుమ్నని నమ్మినా అత్తగారు మాత్రం నమ్మలేదు. నువ్వే నా కూతురిని ఏదో చేసావు అని ప్రతి క్షణం చిత్రవధ చేస్తోంది మాటలతో.  శ్రేష్ఠ ఎక్కడికి వెళ్ళింది? ఎందుకు అలా చేసింది అనే బాధతో  పాటు అత్తగారి మాటలు కూడా అతనికి నరకాన్ని చూపిస్తున్నాయి. ఏదో మొక్కుబడిగా క్లినిక్ కి వెళ్లి వస్తున్నాడు. ముఖ్యమైన కేసులుంటే పల్లవే చూసుకుంటోంది.

శశి పరీక్షగా తన మొహంలోకి అలా చూస్తూ ఉండిపోతుంటే కలవరపడుతూ  తల వంచుకుని టేబుల్ మీద వేలితో సున్నాలు చుడుతూ మౌనంగా ఉండిపోయాడు.

"చెప్పు ప్రద్యూ .." మృదువుగా అన్నాడు శశి.

"నాకు ఒక అనుమానం ..."

"చెప్పు"

"అదీ, అదీ ...." ఒక్కో అక్షరం కూడబలుక్కుంటూ అన్నాడు "శ్రేష్టకి ఒక ఫ్రెండ్ ఉన్నాడు. బహుశా అతని దగ్గరకు ఏమన్నా వెళ్లి ఉంటుందంటావా ..?"

భ్రుకుటి ముడుస్తూ అన్నాడు శశి "శ్రేష్టకి ఫ్రెండ్... యు మీన్..?"

తల అడ్డంగా ఆడిస్తూ అన్నాడు.. "మామూలు ఫ్రెండ్ అనే అనుకుంటున్నా .. కానీ, బాగా ఆత్మీయంగా , చనువుగా ఉంటాడు. "

"ఎక్కడుంటాడు తెలుసా ..."

"కృష్ణా నగర్ లో ఉంటాడనుకుంటా.."

"ఫోన్ నెంబర్?"

"తెలియదు"

"నీకు పరిచయం లేదా "

"పరిచయం ఉంది స్నేహం లేదు. ఒకసారి పరిచయం చేసింది నా బెస్ట్ ఫ్రెండ్ అని."

"నువ్వు ఎప్పుడూ మాట్లాడలేదా?"

"లేదు ... ఆ అవకాశం రాలేదు.. "

"ఇల్లు తెలుసా?."

ప్రద్యుమ్న తలవంచుకుని తెలుసన్నట్టు ఊపాడు.

"వెళ్దాం పద ...." బేరర్ బిల్ తేవడంతో కాష్ పెట్టేసి లేచాడు శశి. ప్రద్యుమ్న కూడా లేచాడు.

ఇద్దరూ కారులో యూసఫ్ గూడా మీదుగా కృష్ణానగర్ చేరారు.

ఇంకా పది గజాలు ఉండగానే చూపించాడు ప్రద్యుమ్న. "అదిగో ఆ అపార్ట్ మెంట్ లో సెకండ్ ఫ్లోర్ "

కారు అపార్ట్ మెంట్ దగ్గరకు పోనిచ్చాడు శశి. విజిటర్ పార్కింగ్ ప్లేస్ లో పార్క్ చేసి ఇద్దరూ లిఫ్ట్ వైపు నడిచారు.

"నేను పైకి రానులే శశీ నువ్వు వెళ్ళు... శ్రేష్ఠ ఉంటె నచ్చ చెప్పి తీసుకురా" అన్నాడు ప్రద్యుమ్న .

"ఎందుకు రావు ? మీ ఇద్దరి మధ్యా గొడవ జరిగిందా?"

ప్రద్యుమ్న మొహం పక్కకి తిప్పుకుని అన్నాడు. " నాకు శ్రేష్ఠ అంటే ఇష్టం లేకున్నా పెళ్లి అయినదగ్గర నుంచి తను నాది అనే ఫీలింగ్ వల్లనేమో ఒక విధమైన పోసెసివ్ నెస్ వచ్చింది. ఇతను తరచుగా రావడం ఇద్దరూ ఇంట్లో నేను ఉన్నా ఆ ధ్యాస లేకుండా ఒళ్ళు మరిచిపోయి కబుర్లు చెప్పుకోడం భరించలేకపోయాను. ఒకరోజు అతను వెళ్లిపోతుంటే ఫాలో అయి, సెల్లార్ లో పట్టుకుని ఇంకోసారి మా ఇంటికి రావద్దని వార్నింగ్ ఇచ్చాను. అతను ఏదో చెప్పబోతుంటే కూడా వినకుండా స్ట్రాంగ్ గా హెచ్చరించాను. ఆ తరవాత అతను రావడం మానేశాడు. "

"ఇదంతా జరిగి ఎంత కాలమైంది?"

"సుమారు నెల ..."

"ఎందుకు ఇన్నిరోజులు చెప్పలేదు? వాళ్ళిద్దరి మధ్యా ఎఫైర్ ఉంటే శ్రేష్ఠ రావడానికి ఒప్పుకోకపోవచ్చుగా అప్పుడేం చేద్దాం ?"

ప్రద్యుమ్న మొహం మాడిపోయింది. కంపిస్తున్న స్వరంతో అడిగాడు “ ఒప్పుకోదా?”

శశికి అతన్ని చూస్తుంటే జాలేసింది. ఇష్టం లేకుండా పెళ్లి మావగారి బలవంతం మీద చేసుకున్నా కొంతకాలం నుంచి సహవాసం చేస్తున్నందుకో, తాళి కట్టి తన స్వంతం చేసుకున్నందుకో ఇప్పుడు అతను శ్రేష్ఠతో మామూలుగా బతకాలని అనుకుంటున్నాడు. కానీ ఇద్దరి మధ్యా ఏర్పడ్డ అపోహలు ఒక గోడని కట్టాయి. నిజానికి ఆ గోడ పెద్ద బలంగా ఏం లేదు. వారి, వారి ఉద్యోగాలు, అహాలు వదులుకుంటే ఆ గోడ కూలిపోడానికి ఎంతో సమయం పట్టదు.. కాకపోతే పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలి అనే సందేహం లాంటిదే వీళ్ళల్లో కూడా ఉంది. ఆ గోడ ఇప్పుడు ఎవరు కూలగొట్టాలి?

తల పంకించాడు శశి. “సరే నువ్వు కారులో కూర్చో నేను వెళ్లి వస్తాను” అన్నాడు కార్ కీస్ ప్రద్యుమ్న చేతికిస్తూ.

ప్రద్యుమ్న కీస్ తీసుకుని వేగంగా కారు దగ్గరకు వెళ్ళాడు. శశి లిఫ్ట్ లో సెకండ్ ఫ్లోర్ వెళ్ళాడు. ఎదురెదురుగా రెండు ఫ్లాట్స్ ఉన్నాయి. ఈ రెంటిలో అతను ఉండేది ఎక్కడ? ఆలోచిస్తూ నిలబడి పోయాడు. అపుడే ఒక ఫ్లాట్ తలుపులు తెరుచుకుని దాదాపు ప్రద్యుమ్న వయసే ఉన్న కుర్రాడు బయటికి వచ్చాడు.

తలుపు చప్పుడవడంతో శశి తలతిప్పి చూసాడు. కారిడార్ లో అనుమానాస్పదంగా నిలబడ్డ శశి వైపు అనుమానంగా చూస్తూ “ఎవరు కావాలి ?” అడిగాడు.

అతనలా అడిగేసరికి కొంచెం ఇబ్బంది పడ్డాడు శశి. అలా కారిడార్ లో నిలబడితే ఎవరికైనా తప్పకుండా అనుమానం వస్తుంది.. పైగా తను యూనిఫాం లో కూడా లేదు. ఎలా? ఏమని చెప్పాలి?

తను శ్రేష్ఠ ఫ్రెండ్ పేరు తెలుసుకోలేదని గుర్తొచ్చింది శశికి. అయినా తడబాటు కనపడకుండా నోటికి వచ్చిన పేరు ప్రస్తావిస్తూ “ఇక్కడ అనిరుద్ అని ఎవరన్నా ఉన్నారా?” అడిగాడు.

“నేనే అనిరుద్ మీరెవరు” అడిగాడు అతను.

“మీరు ...?” గొంతులో వెలక్కాయ దిగినట్టు అయింది శశికి .

“అనిరుద్ ... సాఫ్టవేర్ ఇంజనీర్ మేనేజర్ ఇన్ ఇన్ఫోసిస్ “

శశికి ఏం చెప్పాలో తెలియలేదు. తను చీకట్లో వేసిన బాణం ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది. కానీ, దాన్ని ఎలా తీయాలో తెలియడంలేదు. ఆ యువకుడిని చూస్తుంటే చాలా అందంగానే కాదు బాగా చదువుకున్న పెద్ద ఆఫీసర్లా ఉన్నాడు. మాటలో, మనిషిలో కూడా ఒక విధమైన హుందాతనం, తేజస్సు కనిపిస్తున్నాయి. స్వరంలో మంచి సంస్కారం తొంగి చూస్తోంది.

“సార్ ఏంటి ఆలోచిస్తున్నారు..?” చిరునవ్వుతో అడిగాడు అతను.

“అది ... అది నాకు కావాల్సిన అనిరుద్ ...”

ఇంతలో అతని మొబైల్ మోగడంతో “జస్ట్ ఏ మినిట్” అంటూ కాల్ తీసుకుని మెట్ల వైపు వెళ్ళాడు.

“హలో ... ఎవరూ... శ్రేష్టా... ఎక్కడినుంచి మాట్లాడుతున్నావు?”

శశి శ్రేష్ఠ పేరు చెవిని పడగానే శశి అలర్ట్ గా అయాడు. చెవులు రిక్కించి నిశ్శబ్దంగా వినసాగాడు.

“ ఏంటి నాకేం వినపడడం లేదు. ఎందుకంత నెమ్మదిగా మాట్లాడుతున్నావు? ఎక్కడున్నావు? ఏంటి? ఆ, ఆ తెలుసు... అవునా ... పిచ్చా అక్కడికెందుకు వెళ్లావు? ప్రద్యుమ్న కి తెలుసా నువ్వు అక్కడికి వెళ్ళావని? ఏంటి చెప్పకుండా వెళ్ళావా? అసలేం చేస్తున్నావు? నేనెలా రాను? అది పెద్ద డెన్ అని విన్నాను... నేను రాగలనా? మైగాడ్ శ్రేష్టా.. యు డిడ్ మిస్టేక్ ...ఇప్పుడెలా .. నేను పోలీస్ హెల్ప్ తీసుకుని రావాలి..

ప్రద్యుమ్న కి చెప్పకపోతే ఎలా? నో, నో చెప్పాలి. ఏదన్నా అయితే ఎంత డేంజర్!? తప్పు చేశావు. ప్లీజ్  నువ్వు ఫోన్ పెట్టేయి నేను ఏం చేయాలో, ఎలా చేయాలో ఆలోచిస్తాను." అతను ఫోన్ కట్ చేసి మ్లానమైన మొహంతో శశి దగ్గరకు వచ్చి "చెప్పండి ఏం కావాలి మీకు? నేను ఇప్పుడు అర్జంట్ గా వెళ్ళాలి ... వాట్ కెన్ ఐ డూ ఫర్ యు? " అన్నాడు.

శశి స్వరం కొంచెం కఠినంగా మార్చి " నువ్వే కావాలి" అన్నాడు .

అతను విచిత్రంగా శశి మొహంలోకి చూస్తూ ... "వాట్?" అన్నాడు .

"ఎస్ .... శ్రేష్ఠ ఎక్కడుంది?" అడిగాడు శశి.

"శ్రేష్ఠ ! ..." ఆశ్చర్యంగా అన్నాడు  "తను మీకెలా తెలుసు?"

"ముందు నా ప్రశ్నకి సమాధానం చెప్పు.."

"తనింట్లో తనుంది అనుకున్నా ఫోన్ కాల్ రాకముందు... ఇప్పుడే తెలిసింది తను ఒక ప్రమాదకరమైన చోట ఉంది అని ..."

శశి స్వరంలో  సడన్ గా మార్పు వచ్చింది " ప్రమాదకరమైన చోటా...ఎక్కడ?"

" మీకు సుర్విత సింగ్ గురించి ఏమన్నా తెలుసా?".

" తెలుసు ఎందుకు? ఏమైంది? అతనితో నీకేంటి సంబంధం?"

"  నాన్సెన్స్ నాకు వాడితో సంబంధం ఏంటి? మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి. శ్రేష్ఠ ఇప్పుడు  వాడి వలలో చిక్కుకుందట. నాకు దొంగతనంగా ఫోన్ చేసింది. నన్ను రమ్మంది. నువ్వెందుకు అక్కడికి వెళ్లావు అంటే సరిగా ఏం చెప్పడం లేదు. అసలు నాకు సరిగా వినపడడం లేదు కూడా. కానీ వాళ్ళాయన తో ఏదో గొడవ అయిందని అక్కడికి వెళ్లానని చెప్పింది మాత్రం కొంచెం వినిపించింది. వైఫ్ అండ్ హజ్బెండ్ మధ్య సిల్లీ గొడవలు నాచురల్. ఆ మాత్రానికి అక్కడికి వెళ్ళడం ఏంటో  నాకేం అర్ధం కావడం లేదు. నాకు అది ఎక్కడుందో తెలియదు. పోలీస్ రిపోర్ట్ చేయాలి. ముందు నేను తన హజ్బెండ్ తో మాట్లాడాలి. ప్లీజ్ నన్ను వెళ్ళనివ్వండి. అయినా మీరెవరు. నాకీ నిర్బంధం ఏంటి?" కొంచెం కోపంగా అన్నాడు అనిరుద్ .

అతని మాటల్లో నిజాయితీ,  మొహం లో టెన్షన్ చూసిన శశికి అతన్ని తను అకారణంగా అనుమానిస్తున్నాను అనిపించింది. ఇతను చెడ్డవాడు కాదు.. ఉన్నతమైన చదువే కాదు ఉన్నతమైన వ్యక్తిత్వం తొణికిసలాడుతోంది ఇతని మొహం లో.. చాలా మంచి యువకుడు. మంచి ఫ్రెండ్ ... అనవసరంగా ప్రద్యుమ్న తొందర పడ్డాడు అనుకున్నాడు.

మొబైల్ లో నెంబర్ డయల్ చేస్తున్న ఆ యువకుడి అందమైన మొహంలోకి చూస్తూ సౌమ్యంగా పిలిచాడు "అనిరుద్ ..."  అతను శశి మొహంలోకి చిరాగ్గా చూసాడు.

"అయాం  ఏ ఎస్ పి శశిధర్" అన్నాడు చేయి చాస్తూ..

అతని కళ్ళు విప్పారి మెరుపు దూసుకొచ్చింది..  షేక్ హ్యాండ్ ఇచ్చి "సర్ ... ఎక్కడో చూసాను అనుకుంటున్నాను. మిమ్మల్ని టి వి లో చూసాననుకుంటా ఒకటి, రెండు సార్లు.. వెరీ హాపీ టు  సి యూ" అన్నాడు.

"నేను ఇప్పుడు మీరు చెప్పిన శ్రేష్ఠ విషయంలోనే మీ దగ్గరకి ఎంక్వైరీ కి వచ్చాను. "

"నా దగ్గర ఎంక్వైరీ కా ...?" అయోమయంగా చూసాడు.

శశి అతని భుజం మీద చేయేసి "మీ ఇంట్లోకి వెళదామా?"  అన్నాడు.

అతను కొంచెం తడబడి "రండి" అంటూ కాలింగ్ బెల్ నొక్కాడు. రెండు క్షణాల తరవాత యాభై ఏళ్ల స్త్రీ వచ్చి తలుపు తీసింది.

"రండి" అంటూ లోపలికి దారి తీసాడు.

"మా మదర్" పరిచయం చేసాడు. ఆవిడ నమస్కరించింది.

తెల్లగా నుదుట విభూతి పెట్టుకుని, ఒక హ్యాండ్ లూం చీర కట్టుకుంది. మెడలో రెండు పేటల బంగారు గొలుసు చేతులకి రెండేసి గాజులు తప్ప ఎలాంటి అలంకారం, ఆభరణాలు లేకుండా సింపుల్ గా ఉన్న ఆమెని చూడగానే గౌరవ భావం కలుగుతుంది.

"కూర్చోండి" అంటూ సోఫా చూపించి ఆవిడ లోపలికీ వెళ్ళింది.

"చెప్పండి సార్.. ఏం జరిగిందసలు...?" అన్నాడు అనిరుద్ శశి పక్కనే కూర్చుని.

శశి శ్రేష్ఠ ఇంట్లోంచి వెళ్ళిపోడం అందుకు దారి తీసిన కారణం చెప్పి. "సారీ అనిరుద్ నిన్ను అపార్ధం చేసుకున్నాను. నా అదృష్టం బాగుంది ఇప్పుడే ఆ ఫోన్ రావడం చాలా హెల్ప్ చేసింది."

"అదృష్టం మీది కాదు సార్ నాది. లేకుంటే మీరు నన్ను తీసుకెళ్ళి ఇంటరాగేట్ చేసేవారు. నా భవిష్యత్తు మట్టి కొట్టుకుపోయేది. నేనే దిక్కు అయిన అమ్మ చచ్చిపోయేది అన్నాడు." అలా అంటున్నప్పుడు పెదవుల మీద చిరునవ్వు, కళ్ళల్లో చెమరింపు చూసిన శశి మనసు పశ్చాత్తాపంతో క్రుంగినట్టు అయింది. ప్రద్యుమ్న మీద కోపం వచ్చింది.

అతని చేయి తన చేయిలోకి తీసుకుని ప్రేమగా నొక్కి అన్నాడు. "ఇప్పుడు మనం తక్షణం ఆ డెన్కి వెళ్ళాలి. మీరు కూడా వస్తారా?"

"అయ్యో తప్పకుండా వస్తా సార్. మీరున్నారుగా అండగా" అన్నాడు.

"నేనే కాదు ప్రద్యుమ్న కూడా ఉన్నాడు కింద కారులో"

"ప్రద్యుమ్నా..?" అతని మొహంలో రంగులు మారాయి. అయిష్టంగా మొహం పెట్టాడు. "అయితే నేనెందుకు?" అన్నాడు.

శశి నవ్వి " మీరు ఎందుకలా అంటున్నారో నాకు తెలుసు. ప్రద్యుమ్న చెప్పాడు. టేక్ ఇట్ ఈజీ. ఇదంతా మానవ , ఇంకా చెప్పాలంటే మగవాడి బలహీనత. ఇప్పుడు మనం ఫ్రెండ్స్. ముగ్గురం కలిసి శ్రేష్టని రక్షించాలి. అదే మన బాధ్యత" అన్నాడు.

అనిరుద్ కూడా నవ్వి "రండి వెడదాం" అంటూ "అమ్మా తలుపెసుకో బయటికి వెళ్తున్నాను" అని కొంచెం గట్టిగా చెప్పాడు.

ఆవిడ బయటికి వచ్చి "అదేంటి అతనికి కొంచెం కాఫీ అయినా ఇవ్వకుండా తీసుకుని వెళ్తున్నావు" అన్నది.

"లేదమ్మా నాకేం వద్దు.. చాలా పని ఉంది వెళ్ళాలి" అన్నాడు శశి.

ఆవిడ ఏదో అనే లోపల అనిరుద్ "లేదమ్మా చాలా ఇంపార్టెనట్ పని ... వెళ్ళాలి" అంటూ బయటకి నడిచాడు. శశి అనుసరించాడు. వెనకాల ఆవిడ తలుపు వేసుకున్న చప్పుడు వినిపించింది శశికి.

కారులో ఉన్న ప్రద్యుమ్న శశితో వస్తున్న అనిరుద్ ని చూసి మొహం మాడ్చుకున్నాడు. ఇతడిని ఎందుకు తీసుకువస్తున్నాడు? ఇంటరాగేషన్ కోసమా? ఒక్క క్షణం అసూయతో నిండిన ఆ హృదయం ఆనంద తాండవం చేసింది. అనిరుద్ మంచివాడు, సంస్కారవంతుడు, ఉన్నత విద్యావంతుడు, తన భార్యకి మంచి స్నేహితుడు మాత్రమె అని ప్రద్యుమ్న అంతరాత్మకు తెలిసినా తనకన్నా ఎన్నో రెట్లు అందగాడైన అతని పట్ల అసూయ కూడా విపరీతంగా ఉంది. ఆ అసూయతోటే అతను ఇంటికి వస్తుంటే రగిలిపోయాడు. ఆ అసూయ తోటే ఆరోజు అతడిని వెంబడించి అకారణంగా విషం కక్కాడు.

"ప్రద్యుమ్నా! శ్రేష్ఠ ఆచూకీ తెలిసింది" అన్నాడు శశి.

ఆ మాటతో అనిరుద్ మీద అనుమానంతో ఉన్న ప్రద్యుమ్న ఊహించని రీతిలో గబుక్కున కారు దిగి డోర్ విసురుగా కాలితో వెనక్కి తన్ని అనిరుద్ మీదకి వస్తూ "చూసావా? నేను చెప్పానా.. వీడే ... వీడే నా భార్యని మాయ మాటలతో మోసం చేసి కిడ్నాప్ చేసాడని అన్నానా

!” అంటూ అనిరుద్ షర్ట్ కాలర్ పట్టుకోబోతుండగా శశి విసురుగా అతన్ని వెనక్కి లాగి “ఆర్ యు మాడ్? నేను చెప్పానా అతను కిడ్నాప్ చేసాడని ..డోంట్ బి ఫూలిష్” అన్నాడు కోపంగా..

అనిరుద్ విచిత్రంగా ప్రద్యుమ్నాను చూస్తూ ఉండిపోయాడు. శశి అనిరుద్ కి సారీ చెప్పి వెనక డోర్ తీసి “కూర్చో” అన్నాడు.

అనిరుద్ ఏదో చెప్పబోయి శశి చూపుల్లో కనిపిస్తున్న స్నేహభావం చూసి మౌనంగా కారెక్కాడు.

ప్రద్యుమ్న బుసకొడుతూ ముందు సీటులో శశి పక్కన కూర్చున్నాడు. శశి కారు పోనిచ్చాడు.

కారు కొంత దూరం వెళ్ళాక శశి మృదువుగా అన్నాడు “ప్రద్యుమ్నా! నువ్వు అనవసరంగా అనిరుద్ ని అపార్థం చేసుకున్నావు.. శ్రేష్ఠ వెళ్ళిపోయిన సంగతి కూడా అతనికి తెలియదు. శ్రేష్ఠ ఇప్పుడు ఎక్కడుందో చెప్తే నీ గుండె ఆగిపోతుంది “

“ఏ ఎక్కడుంది?” కంగారుగా అన్నాడు ప్రద్యుమ్న.

“సుర్విత్ సింగ్ డెన్ లో...”

“వాట్!! అంటే .... ఆ మధ్య పెద్ద సంచలనం కలిగించిన బాబా ... స్మగ్లింగ్, దోపిడీలు, ఆడవాళ్ళను దౌర్జన్యంగా తన ఆశ్రమంలో దాచేసి బలవంతంగా అనుభవించడం? వాడేనా..?” వణుకుతున్న స్వరంతో అడిగాడు.

“ఎస్ వాడే..”

ప్రద్యుమ్న సీటులో వెనక్కి ఒరిగిపోయాడు.

“ప్రద్యుమ్నా...” కంగారుగా పిలిచాడు శశి.

ప్రద్యుమ్న పలకలేదు..

“ప్రద్యుమ్నా...” వెనక సీటు నుంచి ఒంగి ప్రద్యుమ్న భుజం తడుతూ పిలిచాడు అనిరుద్ .

ప్రద్యుమ్న గాజుకళ్ళతో శశి వైపు చూసి దుఖంతో కంపిస్తున్న స్వరంతో “శ్రేష్ఠ ఎందుకిలా చేసింది...నేనేం తప్పు చేశాను ? పోయి, పోయి పులి గుహలో తలదాచుకునేంత అపకారం చేయలేదు శశీ.. నేనేం చేయలేదు “ అన్నాడు.

“ప్లీజ్. నువ్వు టెన్షన్ పడకు. నేనున్నాగా . శ్రేష్టని సేఫ్ గా తీసుకు వస్తాను. ఆమె కూడా చదువుకుంది. తెలివైనది. ధైర్యస్తురాలు. తనని తను రక్షించుకోగలదు. ముందు మనం స్టేషన్ కి వెళ్లి వాడి డెన్ మీద రెయిడ్ చేయించడానికి ఏర్పాట్లు చేయాలి. ఇది అంత సులువు కాదు. వాడికి చాలా ఉన్నాయి ఇలాంటివి. తను ఎక్కడ ఉందో తెలియాలి. అనిరుద్ శ్రేష్ఠ ఎక్కడినుంచి ఫోన్ చేసింది ?”

“తన మొబైల్ నుంచే సార్..”

“ఒకసారి తనకి కాల్ చేయగలవా..?”

“ట్రై చేస్తూనే ఉన్నాను స్విచ్ ఆఫ్ అని వస్తోంది. “

“అంటే! ఫోన్ చేయడానికి కూడా తనకి అవకాశం లేదు.. ఎలాగో సమయం, స్థలం చూసుకుని చేసి ఉంటుంది..”

“శశీ! శ్రేష్ఠ ని కాపాడు... ప్లీజ్ ... శ్రేష్టని కాపాడు..” చిన్నపిల్లాడిలా ఏడ్వసాగాడు ప్రద్యుమ్న.

కారు డ్రైవ్ చేస్తూనే ఎడం చేత్తో అతని భుజం తట్టి “రిలాక్స్. రిలాక్స్ ... ముందు మీ అత్తగారికి, మావగారికి ఎలా చెప్పాలో ఆలోచించు. నువ్వే ఇలా డల్ అయితే ఎలా?” అన్నాడు శశి.

“ప్రద్యుమ్నా.. టెన్షన్ పడకు.. ఇంత మందిమి ఉన్నాం. తప్పకుండా శ్రేష్టని కాపాడుకుందాం” అన్నాడు అనిరుద్ ప్రద్యుమ్న భుజం మీద చేయి వేసి ఓదార్పుగా.

ప్రద్యుమ్న అతని చేయి మీద తన చేయి వేసి నొక్కాడు.

ఆ స్పర్శలో క్షమించు అనిరుద్ అనే భావన కనిపించింది అతనికి. తను కూడా ప్రేమగా నొక్కాడు.

కారు స్టేషన్ చేరింది.

**జానకి,** శారద కూర్చుని చిక్కుడు కాయల వలుస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. ఇప్పుడు జానని ఇదివరకులా పరధ్యానంగా ఉండడం లేదు. పనులన్నీ చురుగ్గా చేసుకుంటోంది. పిల్లలిద్దరూ కాలేజి నుంచి రాగానే ఆరోజు ఏం జరిగింది? కాలేజ్ లో ఏం చెప్పారు? మొదలైన విషయాలన్నీ ఆసక్తిగా అడిగి తెలుసుకుంటోంది. భాస్కర్ తో కూడా మునుపటిలా సరదాగా మాట్లాడుతోంది. లీలమ్మ, ఆదినారాయణ దంపతులు కూతురు మామూలు మనుషుల్లో పడడం చూసి తృప్తిగా, ఆనందంగా తిరిగి వాళ్ల ఊరు వెళ్ళిపోయారు.

"ఆ ఉమాదేవి దొరికిందా శారదా? ఆవిడ గురించి ఏమన్నా తెలిసిందా?" ఆచూకీ అడిగింది జానకి హఠాత్తుగా ..

"ఆవిడ ఎప్పుడో ఈ ఊరు వదిలి వెళ్ళిపోయి, వేరే ఊళ్ళో వేరే అవతారం ఎత్తి ఉంటుంది. మోసాలు చేసి బతకడానికి అలవాటు పడ్డ వాళ్లకి ఒక ఊరు, ఒక ఇల్లు, ఒక రూపం ఉంటాయా జానకీ!" అంది శారద.

జానక్కి ఉవ్వెత్తున కోపం ముంచుకు వచ్చింది. "ఎంత మారు వేషం వేసినా తెలియదా? మాట తీరో, నడకో ఏదో ఒక ప్రత్యేకమైన గుర్తు ఉండదా.. మన పోలీసులు అంత లక్షణంగా పని చేస్తున్నారు. ఎంత మోసం ! అయినా ఒక ఆడది అయి ఉండీ మోసాలు చేస్తూ బతకడానికి సిగ్గుండక్కర్లా .."

జానకి ఆవేశం చూసి ఆమెని చల్లబరచే స్వరంతో అంది శారద "మోసాలకి ఆడా, మగా తేడా ఏముందిలే జానకీ.. ఈ రోజుల్లో మోసం చేయడం, దౌర్జన్యం చేయడం, దొంగతనం చేయడం చాలా మామూలు అయింది. కలియుగం కదా.. ఏదో ఒకరోజు పాపం పండుతుంది... పట్టుబడతారు."

"ఈ లోపల నాలాంటి తెలివితక్కువ వాళ్ళు ఎంతమంది బలి అవుతారో..ఎన్ని జీవితాలు నాశనం అవుతాయో!" అలా అంటున్నప్పుడు జానకి స్వరం దుఖంతో కపించింది.

శారదకి కొంచెం భయం వేసింది.. ఇప్పుడిప్పుడే మామూలు మనిషి అవుతున్న జానకి మళ్ళీ ఆ జ్ఞాపకాల్లోకి వెళ్లిందంటే ప్రమాదం .. అనుకుంటూ టి వి ఆన్ చేయనా ఇప్పుడు మంచి సీరియల్ వస్తుంది అంది.

"సీరియల్ వద్దులే ఉన్న మతి పోతుంది ... ఏదన్నా మంచి పాత సినిమా వస్తుందేమో ఈటివి సినిమా పెట్టు" అంది జానకి.

శారద లేచి రిమోట్ తీసుకుని టి వి ఆన్ చేసింది. జానకి వలిచిన చిక్కుడుకాయలు కవర్ లో వేసి తీసుకుని వెళ్లి ఫ్రిడ్జ్ లో పెట్టి వంటగదిలోకి వెళ్ళింది.

శారద టి వి ఆన్ చేయగానే ఏదో న్యూస్ చానెల్ వచ్చింది. చానెల్ మార్చబోతూ ఏదో చర్చా కార్యక్రమం కనిపించడంతో కొంచెం శ్రద్ధగా చూడసాగింది.

ఇద్దరు సామాజిక కార్యకర్తలు, వారిలో ఒకరు తరచూ వార్తల్లో కనిపించే మహిళా సంఘం అధ్యక్షురాలు, ఒకావిడ ఉద్యమకారిణి , యాంకర్, ఒక లేడీ లాయర్ కూర్చుని ఉన్నారు. యాంకర్ అడుగుతున్నాడు ... "ఇటీవల దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో రకరకాల బాబాలు వెలుస్తున్నారు. వాళ్ళంతా అనేక రకాల దోపిడీలు చేస్తూ ముఖ్యంగా మహిళల బలహీనతలని కాష్ చేసుకుంటూ వాళ్ళని తమ మాయలతో, ఇంద్రజాలంతో మోసగిస్తున్నారని మనకి తెలుసు. ఎంత మంది బాబాలు పట్టుబడి వాళ్ళ గుట్టు రట్టయినా ఇంకా ప్రజలు ముఖ్యంగా మహిళలు

ఈ బాబాలను నమ్ముతున్నారు. ఒక విధంగా మహిళలే దొంగ బాబాలను ప్రోత్సహిస్తున్నారు అని అందరూ అంటున్నారు మీరేం చెప్తారు ఈ విషయంలో ".

ఈ ప్రస్తావన జానకి దగ్గర తేకూడదు అనుకున్న శారద ఆ చర్చ వినాలని ఎంత కుతూహలంగా ఉన్నా చానెల్ మార్చేయబోతుండగా జానకి లోపలినించి వేగంగా వచ్చి "ఏంటది.. బాబాల మీద చర్చా..?" అంటూ ఆసక్తిగా చూడడంతో శారద రిమోట్ పక్కన పెట్టేసింది.

"ఉండు స్టవ్ మీద టీ పెట్టాను తెస్తాను" అంటూ జానకి తిరిగి లోపలికి వెళ్లి రెండు కప్పుల్లో టీ పోసుకుని వచ్చింది.

మహిళా సంఘం అధ్యక్షురాలు ఆవేశంగా అంటోంది. "కేవలం స్త్రీలే ఈ బాబాలను పోషిస్తున్నారని అంటే నేనొప్పుకోను. రాజకీయ నాయకులు, సినిమా తారలు, వ్యాపారస్తులు  పెంచి పోషించిన తరవాతే మహిళలు బాబాలను నమ్మడం మొదలు పెట్టారు. ఏ రాజకీయ నాయకుడి అండ లేకపోతే ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి ఆశ్రమాలు కడతారు. ఎవరి అండా లేకపోతే విదేశాల్లోని నేరస్తులతో చేతులు కలిపి స్మగ్లింగ్ , డ్రగ్స్ వ్యాపారాలు ఎలా  విస్తరించుకుంటూ పోతారు. గడ్డాలు పెంచి, కాషాయాలు ధరించి మేము  మహాత్ములం, మాకు మహిమలున్నాయి అని చెప్పుకోగానే ముందు వాళ్ళని ఆశ్రయించేది ఎవరు? వచ్చే ఎలక్షన్స్ లో మేము గెలుస్తామా? మా పార్టీ అధికారంలోకి వస్తుందా? అని కొందరు, నా సినిమా బాగా ఆడుతుందా? నేను నెంబర్ వన్ హీరో అవుతానా? నేనే నెంబర్ వన్ డైరెక్టర్ అవుతానా? కొందరు.. కొత్త వ్యాపారం మొదలు పెడుతున్నాను అది  సజావుగా సాగి పోటీ లేకుండా నా వ్యాపారం అభివృద్ధి చేయాలంటే ఏ పూజ చేయాలి? అని కొందరు బాబాలను దర్శించుకుని  ఫలానా బాబా వారి దయవల్ల నాకు మేలు జరిగింది అని ప్రచారం ఇవ్వబట్టే కదా సామాన్యులు నమ్మేది... వాళ్ళ దగ్గరకు వెళ్ళేది.. మీరు ఎలా మహిళలే బాబాలను పోషిస్తున్నారని ఆరోపిస్తున్నారు"

"మీరన్నది నిజమే. రాజకీయ నాయకుల అండ లేకపోతే ఆధ్యాత్మికత పేరిట ఇన్ని చీకటి వ్యాపారాలు చేయరు. కానీ పేరు, డబ్బు, పలుకుబడి ఉన్నవారు మోసపోయే అవకాశం తక్కువ. కానీ స్త్రీలకు ఇలాంటి బాబాల వలన ప్రమాదం జరుగుతోందని వారి చీకటి వ్యాపారాలలో ఆడపిల్లల బలిదానం అతి ముఖ్యమైనది అన్న వార్తలు చూస్తూ కూడా ఎందుకు స్త్రీలు వెళ్తారు?" రెట్టించాడు యాంకర్.

ఉద్యమకారిణి అందుకుంది. "స్త్రీల కు అనేక సమస్యలు. ఇంటా  బయటా వత్తిళ్ళు.. సమస్యలు.. బాధలు, కష్టాలు, కన్నీళ్లు ... ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా ఎంతో వేదన అనుభవిస్తుంటారు. భర్తకి ఏదన్నా చెప్పుకోవాలన్నా సమస్య భర్త నుంచే వస్తుంటే ఎవరికీ చెప్పుకుంటారు. ఎంతో మంది భర్తలు భార్యలను ఇంకా బానిసలుగానే చూస్తున్నారు. భార్య అంటే మనసున్న మనిషి అని గుర్తించే మగవాళ్ళు ఎంత మంది ఉన్నారు. పిల్లలు చెప్పిన మాట వినరు. ఇలా అనేక సమస్యలతో మానసికంగా నలిగిపోతూ ఏదో ఉపశమనం లభిస్తుంది అనే ఆశతో స్వామీజీలను, బాబాలను, జ్యోతిష్కులను సంప్రదిస్తారు. అయితే ఇలాంటి వాళ్ళు ఉన్నారు వాళ్ళు మా సమస్య తీరుస్తారు అని మహిళలకు ఎలా తెలుస్తోంది? మీ మీడియా ప్రచారం వల్ల కాదా. తెల్లవారి లేచి టి వి ఆన్ చేస్తే ఒక భక్తీ కార్యక్రమం లేదు, ఒక సినిమా లేదు, ఒక సీరియల్ లేదు.. ఆ, పక్కా, ఈ పక్కా, కింద స్క్రోలింగ్ లో ఎంత మంది ఇలాంటి వాళ్ళ గురించి మీరు ప్రచారం చేయడం లేదు. వాళ్ళు దొంగలని, స్మగ్లర్ లు అని, వాళ్ళంతా మోసగాళ్ళని వార్తల్లో చెప్పేది మీరే, డబ్బు కోసం వాళ్ళ గురించి ప్రచారం చేసేది మీరే.. ఎందుకు చేస్తున్నారు సార్..?"

యాంకర్ నవ్వుతూ " దీన్నేనా మేడం ఉరుమురిమి మంగలం మీద పడింది అని అంటారు" అన్నాడు.

"చూసారా మిమ్మల్ని అంటే మీకెంత కోపం వచ్చిందో" అంది ఆవిడ..

"అబ్బే కోపం లేదు..." అని లాయర్ ని అడిగాడు. "అమ్మా! భారతదేశంలో హిందువులు అటు దేవుడిని, ఇటు ఇప్పుడు మనం చెప్పుకుంటున్నా బాబాలను కూడా ఎక్కువగా నమ్ముతారు ఎందుకంటారు.. అలాగే కొందరు అయ్యప్ప దీక్షలని, కొందరు ఆంజనేయస్వామి దీక్ష అని, కొందరు భవానీ దీక్ష అని ఇలా రక,రకాలుగా దీక్షలు పూని పూజలు చేస్తుంటారు.. ఇవి మూఢనమ్మకాలు కదా.. వీటి గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

జానకి ఊపిరి బిగబట్టి ఆవిడ సమాధానం కోసం చూడసాగింది.

"ఇతనికి బుద్ధి లేదు... ఇలాంటి ప్రశ్నలు వేసి మాట వైషమ్యాలను ప్రోత్సహించడం కదా" అంది శారద చికాగ్గా..

"అలా ఎందుకనుకోవాలి? అన్ని మతాల్లోనూ ఏవో కొన్ని మూఢనమ్మకాలు ఉంటాయి. కేవలం హిందూమతంలోనే మూఢనమ్మకాలు నమ్మకాలు ఉండవు.. నేను ఇదివరకు చాలా సార్లు చూసాను టివి లో. మన బాబాల లాగానే కొందరు పాస్టర్లు కూడా అవినీతి కార్యక్రమాలు చేయడం, విదేశాల నుంచి వస్తున్న నిధులు మింగేయడం , అమ్మాయిలను ట్రాప్ చేయడం లాంటివి చేసారని వార్తలు ఎన్నో విన్నాను" అంది జానకి.

ఇంతలో సరిగ్గా అదే విషయం లాయర్ మాట్లాడడం ప్రారంభించడంతో ఇద్దరూ వాదన ఆపి ఆవిడ మాటలు వినసాగారు.

"మీరు చెప్పిన మూఢనమ్మకాలు కేవలం హిందూమతంలోనే ఉన్నాయని అంటే నేను ఒప్పుకోను. మానవ సహజమైన బలహీనతలు అన్ని మతాలవారిలో ఉంటాయి. ఎవరూ కోరికలకు, ఆశలకు దురాశాలకు, ప్రలోభాలకు, అన్నిటికీ మించి విశ్వాసాలకు అతీతులు కారు. కాకపోతే హిందూమతం లో కొంత అధికంగా ఉందని మాత్రం చెప్తాను. అందుకు కారణం ఉంది. మనది భారతదేశం వేదాలు పుట్టిన దేశం, రామాయణ, భారత, భాగవత ఇతిహాసాలు, ఎందఱో యోగులు ఈ గడ్డ మీద పుట్టారు..వాల్మీకి , వ్యాసుడు, విశ్వామిత్రుడు, అగస్త్యుడు, వశిష్టుడు వంటి అనేక మంది మహర్షులు నడిచిన భూమి, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద లాంటి మహాత్ములు నడయాడిన భూమి.. భారతదేశ జాతీయ జీవనానికి హిందూ ధర్మం ప్రాణంవాయువు. వేదాలు మానవ జీవన శైలిని నిర్దేశించిన శాసనాలు. ఈ దేశంలో అధికశాతం హిందూ ధర్మాన్ని అనుసరించే తరతరాలుగా సాగుతోంది. దేవతలను పూజిస్తాం, యోగులను పూజిస్తాం., చెట్లను, పుట్టలను, పాముని, పశువులని పూజించే సంస్కృతీ మనది. పూజ అంటే ఏమి లేదు. మన మనసులో ఉన్న గౌరవాభిమానాలను, ప్రేమను వ్యక్తపరచే ఒక విధానం. తల్లి,తండ్రులను, గురువులను పూజిస్తాం. ఇది మూఢనమ్మకం అనగలరా! ఇదంతా ఎప్పటినుంచో అనూచానంగా వస్తోంది. ఇందులో ఒకళ్ళు ఎగతాళి చేయడానికి, విమర్శించడానికి ఎవరికీ హక్కులేదు. ఎవరి మతాన్ని వారు గౌరవించుకోవచ్చు, ఎవరి నమ్మకాలను, విశ్వాసాలను ఎవరికీ వారు పాటించవచ్చు.

కానీ ఇతర మతాలను, మత గ్రంధాలను విమర్శించే హక్కు ఎవరికీ లేదు. ఈ మధ్య హిందూ మతాన్ని విమర్శించడం ఫాషన్ అయిపోయింది. మళ్ళీ ఆ విమర్శించే వాళ్ళు పాటించేది హిందూ సంప్రదాయాలనే. ఇది దారుణం కాదా? ఇలాంటప్పుడు తన మతాన్ని తను నిలబెట్టుకునే కర్తవ్యం హిందువుది కాదా? తన ధర్మాన్ని, తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవలసిన బాధ్యత హిందువులకి లేదా? దీనికి ఉద్యమాలు , విప్లవాలు కాదు కావాల్సింది. ఏది మంచి, ఏది చెడు అని ప్రాక్టికల్ గా తెలియచేయాలన్న ప్రయత్నం.

దేశ అస్తిత్వం కాపాడుకోడం మన ధర్మం. ఇప్పటికే మన దేశం పరాయి వారి చేతుల్లోకి వెళ్ళిపోతోంది. మన ధర్మం, మన సంస్కృతీ, సంప్రదాయాలు హేళనకు గురి అవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మన హిందూ దేశాన్ని మనదిగా నిలబెట్టుకోడానికి, కాపాడుకోడానికి కృషి చేయాల్సిన పరిస్థితి వచ్చింది. మన ధర్మాలు, మన ఇతిహాసాలు ఇతర మతాల వారి దృష్టిలో పుక్కిటి పురాణాలుగా చిత్రించబడుతూ

హాస్యాస్పదంగా మారుతున్నాయి. ఈ ఘర్షణలో కొందరు హిందువులు తమ మతం యొక్క గొప్పతనాన్ని చాటడానికి రక,రకాల దీక్షలు చేపడుతున్నారు. యాత్రలు చేస్తున్నారు. ఇది ఒక రకమైన నిశ్శబ్ద పోరాటం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అవసరం కూడా.

ఇక బాబాలు, స్వామీజీలు విషయానికి వస్తే అది ఒక రకమైన ఎన్నటికీ నయం కాని మానసిక వ్యాధి. నార్మల్ మనిషిగా కాక ఏదో ఒక అసాధారణ పద్దతిలో జీవించాలన్న కాంక్ష..తను చేస్తున్నది తప్పు అని తెలిసినా ఆ తప్పు చేయడం, అందులో తనకి అండగా, సపోర్ట్ గ మరి కొంతమందిని ఆ తప్పుల సుడిగుండంలో పడేయడం కేవలం హిందూ మతంలోనే జరుగుతున్నది అని అంటే నేను ఒప్పుకోను. మనకి తెలియని నిగూఢమైన రహస్యాలు ఎన్నో భూగర్భాల్లో నిక్షిప్తం అయి ఉన్నాయి. పైకి ప్రజాసేవ అని, మత ప్రవక్తలమని చెబుతూ పేరు గాంచిన వారు ఎందరో చేసిన పాపకార్యాలు ఇటీవల మన సోషల్ మీడియా బయట పెట్టింది. వాటి గురించి ఏమనరేం ఎవరూ. నిజానికి ప్రజలని మోసం చేయడం, సమాజంలో శాంతిని కొల్లగొట్టడం, ప్రజల నమ్మకాలను తమకి అనుకూలంగా వాడుకుని ప్రజలని పిచ్చి వాళ్ళని చేయడం, పూజలు, శాంతులు అంటూ అమాయకులను దోచుకోడం ఇవన్నీ నేరాలే. ఈ నేరాలను నేరాలుగా పరిగణించి అది ఎవరైనా, ఏ మతం వారైనా ఇలాంటి వాళ్లకి శిక్ష వేసేటప్పుడు ఇంకోసారి అలాంటి నీచులను నమ్మకూడదు అన్న రియలైజేషన్ ప్రజల్లో కలిగేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రభుత్వమే కుల, మత భేదాలు సృష్టిస్తూ, వారి ఓటు బాంక్ కోసం పరమతాల వారికి కొమ్ముకాయడం కన్నా దిగజారుడుతనం ఇంకోటి లేదనే అనిపిస్తుంది. ఇంక సామాన్యుల మాటేమిటి?"

ఆవిడ ఆవేశంతో మాట్లాడుతుంటే యాంకర్ తో సహా అందరూ నిరుత్తరులై ఉండిపోడం చూసిన జానకి ఉత్సాహంగా చప్పట్లు చరిచింది.

"అమ్మా ... ఇప్పుడు లాయర్ గారు చెప్పింది విన్నాం ... దీన్ని బట్టి సమస్య అనేది ప్రధానంగా ఎక్కడి నుంచి మొదలైందో మనకి అర్థం అయింది. దీనికి పరిష్కారం ఏమిటి? ఏం చేస్తే సమాజంలో అన్ని వైపులా చెలరేగుతున్న విషజ్వాలలు చల్లారి సమాజం ఆరోగ్యంగా ఉంటుందో మీరు చెప్తారా?"

ఉద్యమకారిణి అంది "ఈ అంశం పైన ఉద్యమాలు రావాలి.. "

మహిళా సంఘం అధ్యక్షురాలు అంది "అందరూ సంప్రదాయాల మీద తిరుగుబాటు చేయాలి.. ఈ సైన్స్ యుగంలో కూడా ఆచారాలు , సంప్రదాయాలు అంటూ దేవుళ్ళను, బాబాలను, పూజలు, పునస్కారాలు ఇదంతా ఫూలిష్ నెస్.."

లాయర్ నెమ్మదిగా అంది "మళ్ళీ సంప్రదాయాల మీద పడుతున్నారు. ఇప్పటివరకూ చెప్పింది అదే కదా... ఏ సంప్రదాయం ఏం చెప్పింది.. అది మన జీవితానికి ఎంతవరకు ఉపయోగపడుతుంది.. ఈ సమాజానికి ఏది మంచి చేస్తుంది అని ఆలోచించడం విజ్ఞత. చదువు, సంస్కారం , ఆలోచించే మెదడు ఉన్న ప్రతివాళ్ళు మేమేం చేస్తున్నాం? ఎందుకిలా చేస్తున్నాం? అని ఆలోచించి తమ ఆలోచనా దృక్పథంలో, ప్రవర్తనలో, మాటల్లో మార్పులు చేసుకుని పౌరులుగా తమ బాధ్యతని గుర్తెరిగి మసలుకోవాలి. అన్ని సమస్యలు తప్పక సమసిపోతాయి. ముఖ్యంగా నోరు అదుపులో పెట్టుకోవాలి.. ఆత్మస్తుతి, పరనింద హర్షణీయం కాదు."

"ఎంత బాగా చెప్తోంది ఆవిడ" అంది జానకి అభినందనగా.

"చదువుకున్న మహిళా.. లాయర్ .. ఆవిడ ఒక బాధ్యతగల పౌరురాలిగా ఏం మాట్లాడాలి.. ఎంత మాట్లాడాలి అంతే మాట్లాడింది" అంది శారద.

"కానీ దొంగ వెధవలని కూకటి వేళ్ళతో సహా పెకిలించి పారేయాలి శారదా" అంది జానకి.

"కలుపు మొక్కలు పీకేసినా కొద్దీ మొలుస్తూనే ఉంటాయి.. కాకపోతే ఆరంభంలోనే వాటిని గుర్తించి పీకేస్తుంటే చేలు ఆరోగ్యంగా, పచ్చగా ఉంటాయి. "

శారద మాటలకి అప్రయత్నంగా తలూపుతూ ఏవో ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది జానకి.

అప్పటికే సమయం ఐదు దాటుతుంటే "ఇంక వెళ్తాను జానకీ. అనవసరంగా ఆలోచించకు. మనం ఆ పంజరంలో నుంచి బయటపడ్డాం. అయిపోయింది. మిగతాది ప్రభుత్వం బాధ్యత. వస్తా మరి" అంటూ లేచిన శారదకి సరే అని చెప్పి జానకి అలా సోఫాలో నిస్త్రాణగా కూర్చుండిపోయింది.

నిజంగా తను చేసిన పూజలే తనని కాపాడాయా.. లేకుంటే ఒక భయంకరమైన పరిస్థితి నుంచి ఎలా బయట పడగలిగింది! తను ఎలాగో బయటపడింది కానీ అమాయకురాళ్ళు అయిన ఎంత మంది ఆడపిల్లలు ఆ నికృష్టుల గుహలలో చిక్కుకుని ఎన్ని కష్టాలు పడుతున్నారో! వాళ్ళని ఎవరు కాపాడతారు. ఎలా కాపాడతారు. ప్రతి వాళ్ళు మాకెందుకులే అనుకుంటే ఈ సమాజంలో ఉన్న ఇలాంటి చీదపురుగులని ఏరిపారేసేదెవరు:?

జానకి ఆలోచనల్లో ఉండగానే చరిత కాలేజీ నుంచి వచ్చింది. చెప్పులు వదిలి గబగబా జానకి దగ్గరకు వచ్చి ఒడిలో వాలిపోయి వెక్కి, వెక్కి ఏడవసాగింది.

జానకి కంగారుగా అడిగింది "ఏమైంది తల్లి ... ఎందుకేడుస్తున్నావు? ఏం జరిగింది?"

"అమ్మా... మరి, మరి .." మాటలు పెగలక మళ్ళీ వెక్కిళ్ళు పెట్టసాగింది..

జానక్కి కంగారు ఎక్కువైంది. కూతురిని బలవంతంగా లేవదీసి "చెప్పమ్మా ఏం జరిగింది.. చెప్పకుండా ఏడిస్తే ఎలా" అంది.

"నా క్లాస్ మేట్ అవంతి. అవంతి కనిపించడం లేదు. ఎటు వెళ్ళిందో తెలియడం లేదు " బావురుమంది చరిత.

జానకి ఆ మాటకి మ్రాన్పడిపోయింది. కొన్ని క్షణాలు మాటరాక శిలలా ఉండిపోయి మెల్లగా గొంతు పగలదీసుకుని అడిగింది ఎవరు చెప్పారు...

" నాలుగు రోజుల నుంచి కాలేజి కి రావడం లేదమ్మా. జ్వరం ఏదన్నా వచ్చిందేమో అని మేము కూడా పట్టించుకోలేదు. ఇవాళ వాళ్ళ నాన్న మా కాలేజ్ కి వచ్చి మమ్మల్ని అడిగారు అవంతి కాలేజ్ కి వచ్చిందా అని. మేము ఆశ్చర్యపోయి అదేంటి ... నాలుగు రోజుల నుంచి రావడం లేదుకదా? అన్నాము.

ఆయన పాపం ఏడుపు ఎంతగానో ఆపుకోడానికి ట్రై చేసారు కానీ, ఆపుకోలేకపోయారు. నాలుగు రోజుల క్రితం వాళ్ళమ్మ దాన్ని కొట్టారుట ... దాంతో బాగా జ్వరం వచ్చిందిట.. నిన్న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదుట.. ఇంట్లో తన గదిలో పడుకుందేమో అని ఎవరూ పట్టించుకోలేదుట. సాయంత్రం అంకుల్ ఆఫీస్ నుంచి ఇంటికి త్వరగా వెళ్ళారుట .. వెళ్ళగానే అవంతి జ్వరం తగ్గిందా అని చూడడానికి గదిలోకి వెళ్ళారుట.. గదిలో కనిపించలేదుట.. ఆంటీని అడిగితే గదిలోనే ఉందికదా ... పడుకుంది అన్నారుట. ఇల్లంతా వెతికినా కనిపించలేదుట. రాత్రి కూడా చూసారుట. ఉదయం మా కాలేజ్ కి వచ్చారు అంకుల్ ...." వెక్కి, వెక్కి ఏడుస్తూ చెప్పింది చరిత.

"అదేంటే ...ఇంట్లో పిల్ల వాళ్ళమ్మకి తెలియకుండా ఎక్కడికి వెళ్తుంది? వెళ్ళేటప్పుడు ఆవిడ చూడదా?"

"ఆవిడ అవంతి పడుకుంది కదా అని మధ్యాహ్నం ఏదో షాపింగ్ కి వెళ్ళిందిటమ్మా"

"చోద్యంగా ఉంది. రాగానే అయినా చూసుకోవద్దూ ఆవిడ? పైగా జ్వరం వచ్చిన పిల్ల.. అలా ఎలా ఊరుకుంది. అయినా అసలు ఎందుకు కొట్టిందిట? ఎదిగిన ఆడపిల్లను కొట్టడం ఏంటి? ఆవిడకి మతిపోయిందా?"

"వాళ్ళమ్మ మంచిది కాదు. రాక్షసి... వాళ్ళ నాన్నని కూడా టార్చర్ పెడుతుందని మాకు ఇదివరకు చాలాసార్లు చెప్పింది అవంతి. మేము నమ్మలేదు. పాపం దానికి చెప్పుకోడానికి కూడా ఎవరూ లేకుండా మేమే దాన్ని నిర్లక్ష్యం చేసాము. అది ఏం చెప్పబోయినా వినేవాళ్ళం కాదు. చాలా తప్పు చేసాం" రెండు చేతుల్లో మొహం దాచుకుని ఏడవసాగింది చరిత.

జానక్కి జాలేసింది. చరితను గుండెలకు హత్తుకుని ఓదారుస్తూ "ఏడవకు తల్లి. నాన్న రానీ చెప్దాము. అంకుల్ దగ్గరకు పంపిద్దాము ఏదన్నా సాయం కావాలంటే చేస్తారు నాన్న సరేనా బాధపడకు. ఎక్కడికీ వెళ్ళదులే. వస్తుంది " అంది.

"నాకు భయంగా ఉందమ్మా. పాపం అది చాలా ఇన్నోసెంట్. ఏమి తెలియదు.. "

"ఏం కాదు నా మాట విను లే లేచి వెళ్లి మొహం కడుక్కో.." బలవంతంగా లేవ దీసింది జానకి.

ఆవిడ బలవంతం మీద లేచి మొహం కడుక్కుని వచ్చింది చరిత.

ఆ పిల్లకు ధైర్యం చెప్పిందే కానీ, జానకి మనసులో భయం చీకటిలా ముసురుకుంది.

ఎక్కడికి వెళ్లి ఉంటుంది. ఏ అమ్మమ్మ గారింటికో, మేనవావ ఇంటికో వెళ్లి ఉండకూడదా!?

లేక ఇంట్లోనే ఎక్కడన్నా దాక్కుందా?

వాళ్ళిల్లు పాలెస్ కాదుగా ఎక్కడ దాక్కుంటుంది!

మరి ఎక్కడికి వెళ్ళింది.. అయినా ఆవిడ ఆ పిల్ల ఇంట్లోంచి వెళ్ళిపోయేంత హింసించి ఉంటుందా.. సొంత తల్లి కాదా... కొంపదీసి సవతి తల్లి కాదు కదా..

చరిత మొహం కడుక్కుని వచ్చేసరికి లేచి వెళ్లి ఆ పిల్లకి మిక్స్చర్ పెట్టింది.

"వద్దమ్మా" అంది చరిత..

"తిను తల్లి.. నువ్వు తిండి మానేస్తే వస్తుందా?"బలవంతం చేసింది జానకి.

తల్లి తృప్తి కోసం కెలికింది కానీ తినలేకపోయింది చరిత.

అవంతి అమాయకమైన మొహం కళ్ళ ముందు కనిపిస్తోంది. పాపం దానికి అన్ని కష్టాలున్నాయని వాళ్ళ నాన్న చెప్పిందాకా తెలియలేదు. రోజూ ఏదో చెప్పడానికి పక్కన వచ్చి కూర్చోగానే డిస్టర్బ్ చేస్తోందని సీటు మారేది తను. ఎంత హర్ట్ అయి ఉంటుందో...

ఎలా ఇప్పుడు ? ఎక్కడికి వెళ్లిందో...అసలే జ్వరం ... సరిగా తిండి కూడా తినలేదు అని చెప్పరు అంకుల్ ... నీరసంతో ఎక్కడన్నా పడిపోయి ఉంటుందా.. ఏదన్నా యాక్సిడెంట్ అయి ఉంటుందా! దేవుడా మా అవంతి క్షేమంగా ఇంటికి రావాలి... సారీ దేవుడా నేను దాన్ని బాధ పెట్టాను సారీ ..

ఉబికి, ఉబికి దుఃఖం రాసాగింది.

బయట బండి ఆగిన చప్పుడు కావడంతో గుబుక్కున లేచి లోపలికి వస్తున్న భాస్కర్ దగ్గరకు పరిగెత్తుకుని వెళ్ళింది.

తన గుండెల మీద వాలిపోయి బావురుమన్న చరితను చూసి కంగారుగా అడిగాడు ఏమైంది ... ఎందుకేడుస్తున్నావు?

జానకి జరిగిన విషయం చెప్పింది.

అంతా విన్న భాస్కర్ " అరెరే ... పాపం... పద వాళ్ళింటికి వెళ్దాం" అన్నాడు చరిత కన్నీళ్లు తుడుస్తూ.

"కాలేజ్ నుంచి వచ్చిన దగ్గర నుంచి ఒకటే ఏడుపు ..." అంది జానకి.

"ఏడవకు తల్లి... నీకు వాళ్ళిల్లు తెలుసా?" అడిగాడు.

తెలుసన్నట్టు తల ఊపింది.

"పద వెడదాం " అన్నాడు.

"ఉండండి కాఫీ ఇస్తాను తాగి వెళ్ళండి.. నేను కూడా వస్తాను" అంది జానకి.

సరే అంటూ వాష్ వేసిన్ దగ్గరకు వెళ్లి మొహం కడుక్కున్నాడు భాస్కర్.

సరిగా పది నిమిషాల్లో ముగ్గురూ అవంతి ఇంటివైపు బయలుదేరారు.

వాళ్ళు వెళ్లేసరికి మూసి ఉన్న ఫ్లాట్ తలుపుల వెనకనుంచి బిగ్గరగా మాటలు వినిపిస్తున్నాయి. కొన్ని క్షణాలు విన్నాక కానీ అర్ధం కాలేదు లోపల ఏదో ఘర్షణ జరుగుతోందని. కాలింగ్ బెల్ కొట్టబోయి ఆగిపోయాడు భాస్కర్.

చరిత నెమ్మదిగా అంది "అవంతి వాళ్ళ అమ్మ ఎప్పుడూ గొడవ పడుతూనే ఉంటుంది.. ఫర్వాలేదు బెల్ కొట్టు నాన్నా .."

"బాగుండదేమో రాంగ్ టైం లో వచ్చాము" అన్నాడు .

"ఏం కాదులే" అంది చరిత.

"కొట్టండి కనీసం ఎవరో వచ్చారని గొడవన్నా ఆపుతారు" అంది జానకి.

భాస్కర్ బెల్ నొక్కాడు. ఒక్కసారి లోపల నిశ్శబ్దం అలుముకున్నట్టుగా శబ్దం రాలేదు.

రెండు నిమిషాల తరవాత తలుపు తెరుచుకుంది. సుధాకర్ వచ్చిన వాళ్ళు ఎవరా అన్నట్టు భ్రుకుటి ముడి వేసాడు .. చరిత అతని ముందుకు నడిచి "అంకుల్ మా డాడీ , మమ్మీ" అంది .

"ఓ సారీ, సారీ రండి" అంటూ పక్కకి తొలిగాడు.

"సారీ ... చరిత చెప్పింది... పాప ...." అంటూ మాట్లాడబోతున్న భాస్కర్ మాటకి మధ్యలో అడ్డువస్తూ సుధాకర్ అన్నాడు.. "అదే తెలియక టెన్షన్ గా ఉన్నాను సార్.. పోలీస్ రిపోర్ట్ ఇచ్చాను.. టివి లో కూడా స్క్రోలింగ్ వేయించాలని అనుకుంటున్నా.."

" ఎప్పుడు వెళ్ళింది?" అడిగాడు భాస్కర్.

"నిన్న మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదు.. "

జాహ్నవి లోపలినుంచి విసురుగా వచ్చి అంది "మీరంతా వచ్చి పరామర్శించడానికి నా కూతురు చచ్చిపోలేదండి ... బతికే ఉంది.. "

ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు ఆ మాటలకి.

ముందుగా తేరుకున్న సుధాకర్ తీవ్రంగా అన్నాడు "నీకు ఈ జన్మకి బుద్ధి రాదా? ఛీ.. నన్ను పశువుని చేస్తున్నావు.. "

జాహ్నవి మళ్ళీ అదే తీవ్రత తో ఏదో అనబోతుంటే గబుక్కున జానకి ఆమెని చేయి పట్టుకుని లోపలికి లాక్కు వెళ్ళింది.

జాహ్నవి విసురుగా విడిపించుకుని "దీనికంతటికీ ఆయనే కారణం ... నా మీద దాని మనసులో విషం కక్కాడు. అందుకే దానికి నేనంటే లెక్క లేకుండా అయింది. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతుందా.. నన్ను పట్టుకుని నువ్వు చచ్చిపో అంది మీకు తెలుసా?" అంది.

"ఎవరు కారణం, ఏంటి కారణం అనేవి తరవాత సావకాశంగా చర్చించుకోవచ్చు. ముందు కర్తవ్యం ఆలోచించండి" అంది.

"ఆలోచించడానికి ఏం ఉంది పేపర్ కి ఎక్కి, మీడియాకి వెళ్లి బతుకులు బయటపడేసుకోడం తప్ప" అంది కసిగా.

జానక్కి అసహ్యం వేసింది. మూర్ఖురాలు ఈవిడ అనుకుంది.

భాస్కర్ స్వరం వినిపించింది. "జానకీ మేము బయటకు వెళ్తున్నాం, నేను వచ్చాక మనం ఇంటికి వెడదాం . అందాకా నువ్వు, చరిత ఇక్కడే ఉండండి."

అలాగే అంది జానకి.

**జానకి** మనసంతా ఆందోళనతో నిండిపోయింది. పద్దెనిమిదేళ్ళ అవంతి ఎక్కడికి వెళ్ళింది? అసలే రోజులు బాగాలేవు. ఆడపిల్లలకి భద్రత కరువైంది. ఆ పిల్లకి ఏ ప్రమాదం సంభవించలేదు కదా! అదేం మనిషి జాహ్నవి. సొంత కూతురు మీద కూడా ద్వేషం ఉంటుందా ఏ తల్లికైనా.

అయినా ఆ పిల్ల ఏ ధైర్యంతో ఇంట్లోంచి వెళ్ళిపోయింది. తల్లి సరిగా లేకపోయినా, తండ్రి ఎంతో ప్రేమగా చూసుకుంటున్నాడు కదా! తెల్లవారితే టి వి ల్లో అనేక దారుణాలు చూపిస్తున్నారు కొంచెమన్నా భయం లేకపోతే ఎలా?

అవంతి ఎక్కడ ఉందో  ఎలాగైనా ఆ పిల్లని రక్షించాలి. కానీ ఎలా? ఎలా రక్షించాలి?

జానకి మనసులో అదే ఆలోచన.. రాత్రంతా నిద్ర లేకుండా ఆలోచిస్తూనే ఉంది.

మధ్యలో లేచి చరిత పక్కకి వెళ్లి పడుకుంది. నిద్రపోతున్న చరిత మొహంలోకి చూస్తూ ఉండిపోయింది. ఆడపిల్లల మనసు సున్నితం ... వీళ్ళకి ఏ మాత్రం ప్రేమలో లోటు జరిగినా తట్టుకోలేరు. వీళ్ళని ప్రేమగానే కాదు, జాగ్రత్తగా పెంచాలి. మనిషి ఎక్కడ ఉన్నా దృష్టి వాళ్ళమీద వేసి ఉంచాలి. ఈ విషయం జాహ్నవికి ఎవరూ చెప్పలేదా?

ఆవిడ పిల్లలని, భర్తని  చాలా అన్యమనస్కంగా పంపించింది.  పిల్లలు ఎప్పుడన్నా బ్రేక్ ఫాస్ట్ గా  బ్రెడ్డు టోస్ట్ చేసుకుని తింటాము అని చెప్పినా బ్రెడ్ కడుపు నిండుతుందా! పాడా! పెసరట్టు చేసాను తినండి. చక్కగా ఇడ్లి, సాంబారు చేసాను తినండి అంటూ రక రకాల టిఫిన్లు  చేసి పెట్టె జానకి ఆరోజు ఏం చేయడానికి మనస్కరించక బ్రేక్ ఫాస్ట్ గా అందరిని సేరియల్ తినమని చెప్పి,  చపాతీ, కూర బాక్స్ లలో ఇచ్చి పంపించింది.

చాలా సేపు పూజలో కూర్చుంది కానీ ఎప్పటిలా శ్లోకాలు, సహస్రనామాలు చదవలేదు. మౌనంగా ఓ తపస్సులో కూర్చున్నట్టు ఒక గంట సేపు పూజగదిలో కూర్చుని బయటకి వచ్చింది. ఏమి తినాలనిపించలేదు.

అవంతి ఎక్కడికి వెళ్ళింది. తనని మోసం చేసినట్టు ఆ పిల్లని కూడా ఎవరన్నా మోసం చేసి ఏ బాబా దగ్గరకో తీసుకుని వెళ్ళలేదు కదా! తనంటే పెద్దది. ఎలాగోలా బయటపడింది దేవుడి దయవల్ల. చిన్నపిల్ల, అమాయకురాలు ఆ పిల్లని ఎవరన్నా ఏమన్నా చేస్తే!? ఆవిడ వణికిపోయింది.

ముందురోజు సాయంత్రం భాస్కర్, సుధాకర్ వెళ్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి టి వి లో ప్రకటన ఇచ్చి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. వాళ్ళు వచ్చిందాకా చరిత, జానకి జాహ్నవిని కనిపెట్టుకుని అక్కడే ఉన్నారు. అవంతి కనిపించడం లేదన్న బాధతో జాహ్నవి ఏమన్నా అఘాయిత్యం చేసుకుంటుందేమో లేక ఏడుస్తూ కూర్చుంటుందేమో అనుకున్నారు కానీ ఏమి పట్టనట్టు కనీసం ఇంట్లో ఇద్దరు అపరిచితులు ఉన్నారన్న స్పృహ కూడా లేకుండా వాట్స్ అప్ లో వీడియోలు చూసుకుంటూ కూర్చుంది.

మంచినీళ్ళు తాగుతారా అని కానీ, టీ ఇవ్వడం కానీ ఏది లేదు. ఆవిడ మొహంలో వీళ్ళు  పనీ, పాట లేకుండా వచ్చి కూర్చున్నారు అన్న అభిప్రాయం కనిపించింది. భాస్కర్ వచ్చిందాకా ముళ్ళమీద కూర్చుని అతను వచ్చాక ఇంటికి వచ్చేశారు.

ఇంటికి రాగానే అంది జానకి భాస్కర్ తో “ఆవిడ నాకు నచ్చలేదండీ.. “

“పాపం సుధాకర్ ఆవిడ వల్ల ఎంత నరకం అనుభవిస్తున్నాడో నిన్న అతని మాటల ద్వారా అర్థమైంది జానకీ. అనుకూలవతి అయిన భార్య లేకపోతే మగవాడి జీవితం నరకం ... మంచి వాడు కాబట్టి ఆవిడను భరిస్తున్నాడు అనిపిస్తోంది. ఇంకొకళ్ళు ఎవరన్నా అయితే ఎప్పుడో ఆవిడని వదిలి వెళ్ళిపోయే వాళ్ళు అనిపించింది అతని మాటలు వింటుంటే.”  అన్నాడు భాస్కర్.

"కానీ పాపం ఆడపిల్ల ఎక్కడికి వెళ్లిందో ఏంటో ఆవిడకి చీమ కుట్టినట్టు లేదేంటి" అంది.

చరిత కూడా "అవునమ్మా అందుకే అది ఎప్పుడూ దిగులుగా ఉండేది. మమ్మల్ని ఎప్పుడూ అడుగుతుండేది మీ అమ్మ నిన్ను ప్రేమగా చూసుకుంటుందా అంటూ క్లాసులో అందరినీ అడుగుతుండేది. కొన్నాళ్ళు దీనికేమన్నా మెంటలా ఇలా అడుగుతుంది అనుకునేవాళ్ళం ... తరవాత ఒకరోజు చెప్పింది వాళ్ళమ్మ గురించి. అప్పుడు నాతో అంది కూడా 'నేనెప్పుడన్నా మీ ఇంటికి వచ్చేస్తా చరితా.. రానిస్తారా' అని ... నేనే తిట్టాను అట్లాంటి పిచ్చి పనులు చేయకు అని" బాధగా అంది.

ఆ అమ్మాయి స్వరంలో వేదన ధ్వనించి గబుక్కున కూతురిని దగ్గరకు తీసుకుంది జానకి. బాధపడకు ఎక్కడికి వెళ్తుంది.. వాళ్ళ అమ్మమ్మ గారింటికి వెళ్ళిందేమో ..అంది.

"వాళ్ళు ఈ ఊళ్ళో ఉండరు. రాజమండ్రిలో ఉంటారు. పాపం దానికి ఏమి తెలియదు.. రైలు ఎక్కడం కూడా తెలియదు."చమర్చిన కళ్ళు తుడుచుకుంది చరిత.

సుధాకర్ మనసు ద్రవించింది. ఎలాగైనా ఆ అమ్మాయి ఎక్కడుందో తెలుసుకోవాలి అనుకున్నాడు.

"పాపం తల్లి ప్రేమ కోసం తపించిపోయినట్టుంది" సానుభూతిగా అంది జానకి.

"నువ్వు అనవసరంగా టెన్షన్ పడకు జానకీ! తప్పకుండ తిరిగి వస్తుంది. స్టేషన్ లో కంప్లయింట్ ఇచ్చాము నిన్న. అలాగే టి వి లో కూడా స్క్రోలింగ్ వేయమని రాసి ఇచ్చి వచ్చాము. వస్తుంది మంచి రేటింగ్స్ ఉన్న రెండు చానెల్స్ లో ఇచ్చాము. రెండూ కూడా న్యూస్ చానెల్స్. బహుశా రాత్రి నుంచే స్టార్ట్ చేసి ఉంటారు స్క్రోలింగ్. తప్పకుండ అవంతి తిరిగి వస్తుంది క్షేమంగా" అన్నాడు భాస్కర్.

ఎంతో నమ్మకంతో చెప్పాడు కాని భాస్కర్ మనసులో కూడా ప్రస్తుత సామాజిక పరిస్థితి తలచుకుంటుంటే ఆపాదమస్తకం వణికిపోతోంది. కాలేజి, ఇల్లు తప్ప మరో చోటికి వంటరిగా వెళ్ళడం తెలియని ఆ పిల్ల ఎక్కడికి వెళ్లి ఉంటుంది..

భార్యా, భర్తలు ఇద్దరూ కూడా ఒకరికి తెలియకుండా ఒకరు ఆ విషయమే ఆలోచిస్తూ రాత్రి నిద్రపోలేదు.

జానకి కాఫీ కప్పుతో వచ్చి సోఫాలో కూర్చుని టి వి ఆన్ చేసింది. కానీ ఏ ఒక్క కార్యక్రమంమీదా ఏకాగ్రత కుదరలేదు. ఆవిడకి తను ఆరోజు బాబాని కలుసుకోవాలనుకోడం, చరిత విషయంలో తను పడుతున్న ఆందోళనకి ఆయన ఏదన్నా ఉపశమనం కలగచేస్తాడని అనుకోడం గుర్తొస్తోంది.

ఇంత పెద్ద దాన్ని నేనే ఎంత తెలివితక్కువగా ఆలోచించాను. కొంచెం వివేకంతో అలోచించి ఉంటే ఎంత బాగుండేది! భాస్కర్ లాంటి ఆదునిక భావాలున్న వ్యక్తికి భార్య అయి ఎంత చాదస్తంగా, మూర్ఖంగా ప్రవర్తించాను! జానకి మనసులో తను చాలా పెద్ద తప్పు చేసానన్న బాధ ముల్లులా గుచ్చుకోసాగింది. మూడు రోజుల పాటు ఇంటిల్లి పాదీ ఎంత క్షోభ అనుభవించి ఉంటారో అనిపిస్తోంది ఇప్పుడు. అవంతి సంఘటన తనకి ఆపాదించుకుని జానకి పశ్చాత్తాపంతో తల్లడిల్ల సాగింది. తను చేసిన తప్పు ఇంకెవరూ చేయకుండా ఏదన్నా చేయాలి అనిపించసాగింది. ఏం చేయాలి?.

శారద తో కలిసి టి వి లో బాబాల మీద జరిగిన చర్చ గుర్తుకొస్తోంది. పదే, పదే వాళ్ళ మాటలు చెవుల్లో గుర్రున తిరగసాగాయి.

మనోఫలకం మీద ఆ సంఘటనలు అన్నీ ఒకదాని తరవాత ఒకటిగా అలా కదలసాగాయి. ఇటీవల జానకి చాలా వరకు తేరుకుంది కనక మందులు ఇంక అవసరం లేదని కిరణ్ ఎక్కువ రావడం లేదు.

కిరణ్ గుర్తుకురాగానే ఆవిడకి దుఖం వచ్చింది.

ఏ జన్మ ఋణానుబంధమో ఆ యువకుడు తనని దేవుడులా ఆదుకున్నాడు. మనోవ్యాధితో చచ్చిపోతుందేమో అనుకున్న తనని బతికించాడు. పునర్జన్మ పొందిన ఈ జానకి వలన ఎవరికన్నా ఏదన్నా మంచి జరగాలి. ఏం చేయడం?

జానకి లేచి టేబుల్ మీద పెట్టిన మొబైల్ తీసుకుంది. ఈ మధ్యే భాస్కర్ ఆవిడకి మొబైల్ కొనిచ్చాడు. హరి అది వాడడం నేర్పించి, వాట్సప్ కూడా ఇన్‌స్టాల్ చేసిచ్చాడు. అప్పుడప్పుడు హరే ఏవో తనకి ఫ్రెండ్స్ పంపిన వీడియోలు పంపిస్తూ ఆవిడకి కొంచెం అలవాటు చేసాడు.

అందులో సేవ్ చేసిన శారద నెంబర్ డయల్ చేసింది.

శారద వెంటనే ఫోన్ ఆన్సర్ చేసింది.

"ఇప్పుడే నీతోటే మాట్లాడాలనుకుని ఫోన్ తీసుకున్నాను జానకీ! ఏం చేస్తున్నావు?" అడిగింది.

"మనసేం బాగాలేదు శారదా.. ఒకసారి ఇంటికి రాగలవా" అడిగింది జానకి.

"ఇప్పుడే వస్తాను" అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసి, అదే చీరతో బయలుదేరింది. చెప్పులేసుకుని తాళం వేసి జానకి ఇంటివైపు నడిచింది.

శారద కోసం చూస్తూ కూర్చున్న జానకి మనసులో తిరిగి ఆలోచనలు ముసరసాగాయి.

అవంతిని నేను ఎలా రక్షించగలను? నేనేదన్నా చేయగలనా? ఒక్కసారి తనని ఉమాదేవి తీసుకు వెళ్ళిన ప్రదేశం కళ్ళల్లో నిలుపుకోడానికి ప్రయత్నం చేసింది. అవంతిని అలా ఎవరూ తీసికెళ్ళలేదు కదా! అదే జరిగితే కచ్చితంగా తనని తీసుకుని వెళ్ళిన దగ్గరకే వెళ్లి ఉండచ్చు. భాస్కర్ ని తీసుకుని తను అక్కడికి వెళ్తే ఆ ప్రదేశం గుర్తుపట్టగలదా!

ఈ ఉమాదేవి ఎక్కడుందో కొంపతీసి ఆ ఉమాదేవి అవంతిని కలుసుకోలేదు కదా.. భయంతో ముచ్చెమటలు పట్టేసాయి. అప్పుడే లోపలికి అడుగుపెట్టిన శారద జానకి వాలకం చూసి కంగారుగా అడిగింది "ఏంటి జానకీ! ఏమైంది అలా ఉన్నావేం ?"

జానకి తేరుకుని " ఏం లేదులే రా" అంటూ ఆమెని ఆహ్వానించింది.

"టిఫిన్ చేసావా?" అడిగింది శారద .

"లేదు శారదా ! మనసేం బాగాలేదు." అంది జానకి.

"అయ్యో! మనసు బాగాలేకపోతే టిఫిన్ మానేస్తావా? ఏం జరిగింది ?"

జానకి శారద అలా అడిగిన వెంటనే జరిగిందంతా చెప్పేసి "చాలా భయంగా ఉంది శారదా.. ఆ పిల్ల ఎక్కడికి వెళ్లిందో!? ఎవరన్నా బంధువుల ఇంటికి వెళితే బాధ లేదు. కానీ ఉమాదేవి లాంటి వాళ్ళు ఎవరన్నా కలిసి నన్ను తీసికెళ్ళినట్టు ఏ దొంగ బాబా ఆశ్రమానికో తీసుకుని వెళ్తే ఆ పిల్ల బతుకు ఏమై పోతుంది!"

శారద తేలిగ్గా అంది " ఏదో కొన్ని సంఘటనలు జరిగాయని అన్నీ అలాగే జరుగుతాయా? ఆ పిల్లకి ఏదన్నా లవ్ ఎఫైర్ ఉందేమో! ఈ రోజుల్లో పదమూడేళ్ళ పిల్లలు కూడా ప్రేమించేయడం, లేచిపోవడం లాంటివి చేస్తున్నారు. ఎన్ని చూడడం లేదు.. ఎన్ని చదవడం లేదు!"

"ఛీ ఛీ అలాంటిదేం లేదు.. ఆ పిల్ల చాలా అమాయకురాలుట చరిత చెప్పింది" అంది జానకి.

"అసలు నిజం తెలిసిందాకా అందరూ అమాయకులే. సరేలే దీనికోసం నువ్వెందుకు టిఫిన్ తినకుండా మనసు పాడుచేసుకుని కూర్చున్నావు. రా, రా ఏదన్నా తిందువుగాని. ఏం చేశావు ఇవాళ?" అంటూ కిచెన్ వైపు నడిచింది శారద చనువుగా.

"ఏం చేయలేదు. వాళ్ళు ముగ్గురూ కార్న్ ఫ్లేక్స్ తిన్నారు" అంది జానకి తను కూడా లేచి.

"మంచిదానివే తిండి తినకుండా ఇదేం పని. ఎక్కడికి వెళ్ళదులే ఈ పాటికి ఇంటికి వచ్చే ఉంటుంది" అని పాలు బౌల్ లో పోసి కార్న్ ఫ్లేక్స్ కోసం అలమర తీసింది. శారదకి ఆ వంట గదిలో ఏది ఎక్కడ ఉందో బాగా తెలుసు. అప్పుడప్పుడు సరదాగా జానకి, శారద కలిసి

కొత్తరకాల వంటలు చేయడం, జానకి ఆ మధ్య అలా ఇంట్లోంచి వెళ్ళినపుడు కూడా రెండు, మూడు సార్లు వంట చేయడంతో ఏ డబ్బాలో ఏముందో తెలుసు. అందుకే చనువుగా డబ్బా తీసి పాలలో ఫ్లేక్స్ వేసి జానకి చేతికిచ్చి

"తిను. అన్నీ సర్దుకుంటాయి. ఈ మధ్య ఏవిటో మనుషులకి భావోద్వేగాలు బాగా ఎక్కువ అవుతున్నాయి. మా కజిన్ ఫ్రెండ్ ఎవరో శ్రేష్ఠ ట. మొగుడితో దెబ్బలాడి ఇంట్లోంచి వెళ్ళిపోయిందిట. వెధవ్వేషాలు కాకపోతే చీటికి, మాటికి ఇల్లు వదిలి ఏ ధైర్యంతో వెళ్ళిపోతారు ఈ పిల్లలు" అంది శారద చిరాకు పడుతూ.

అప్పుడే జానకి ఫోన్ మోగింది. జానకి గబుక్కున లేచి వెళ్లి ఫోన్ తీసుకుంది. అవతల నుంచి భాస్కర్ స్వరం వినిపించింది " జానకీ అవంతి ఇంటికి వచ్చిందిట. వాళ్ళింటి దగ్గర గుళ్ళో ఉంటే ఎవరో చూసి తీసికెళ్ళి పోలీసులకి అప్పగించబోతే ఆ పిల్ల భయపడి, వద్దు ఇంటికి వెళ్తాను అందిట. వాళ్ళు ఇంటి దగ్గర దింపారుట. నువ్వు ప్రశాంతంగా ఉండు" అన్నాడు

"హమ్మయ్య." ఊపిరి పీల్చుకుంది జానకి. "వాళ్ళకెలా తెలుసు టివిలో చూసారా ఆ పిల్ల ఫోటో" అడిగింది.

"అనుకుంటా నాకు వివరాలు తెలియవు. సుధాకర్ ఫోన్ చేసి చెప్పగానే నీకు చేసాను. సరేలే ఉంటాను. టిఫిన్ తిన్నావా?" అడిగాడు.

"ఆ, తింటున్నా" అంది జానకి కొంచెం ఉల్లాసంగా.

"సరే ఊరికే టెన్షన్ పడకు." అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసాడు.

"హమ్మయ్య అవంతి ఇంటికి వెళ్ళిందిట శారదా" అంది.

"పోనీలే చెప్పాగా క్షేమంగా ఉంటుందని" అంది శారద.

జానకి తినడం పూర్తి అయాక ఇద్దరూ కలిసి వంట చేసారు.

చాలాసేపు ఇద్దరి మధ్యా ప్రస్తుత సమాజంలో జరిగే అనేక విషయాల మీద ఆసక్తి కరమైన చర్చ జరిగింది.

జానకి సాలోచనగా అంది. "శారదా.. మనం ఏదన్నా చేద్దామా?"

శారద విస్తుబోయి చూసింది. "ఏం చేద్దాం ...మనమేం చేయగలం?"

"ఎందుకు చేయలేం? మొన్న మనం టి వి లో చర్చ చూసాం కదా! అందులో ఒకావిడ సోషల్ వర్కర్ వచ్చింది. ఆవిడని చూస్తుంటే, ఆవిడ మాటలు వింటుంటే నాకు ఆవిడలో నిజాయితీ కనిపించలేదు.. ఏదో కీర్తి కోసం, టి వి లో పేపర్ ల లో పేరు కోసం ఏదో సోషల్ వర్క్ అని పేరు పెట్టుకుంది కానీ నిజంగా ఆవిడ నిస్సహాయులైన స్త్రీలకు ఏదో సేవ చేస్తోందని అనుకోను. మనమే ఒక సంస్థ పెట్టి నిజమైన సేవలు చేయచ్చు కదా.."

శారద వింతగా చూసింది జానకి వైపు అదే జానకా.. వేరే కొత్త జానకి మాట్లాడుతోందా! టివి సీరియల్ లో లాగా ఎవరన్నా జానకిలా ప్లాస్టిక్ సర్జరీ చేసుకుని వచ్చారా.. జానకి ...ఇల్లు, భర్త, పిల్లలు ఇది తప్ప మరోలోకం లేని జానకి, ఒక సినిమా చూసినా బాగుంది, బాగాలేదు అని తప్ప ఎందుకు బాగాలేదు, ఎందుకు బాగుంది అని విశ్లేషించలేని జానకి సంస్థ పెడుతుందా?

ఒక సంస్థ అది కూడా సామాజిక సంస్థ పెట్టడం అది మెయింటెయిన్ చేయడం అంటే అనుకున్నంత సులువా!? ఎక్కడ ఒక అన్యాయం జరిగినా ధర్నాలు చేయాలి. వాళ్ళ దగ్గరకు వెళ్ళాలి మాట్లాడాలి, రక,రకాల మనుషులు, మనస్తత్వాలు, తిట్టే వాళ్ళు, అభాండాలు వేసేవాళ్ళు. ఉపన్యాసాలు ఇవ్వాలి. లా అండ్ ఆర్డర్ తెలిసి ఉండాలి. పోలీసులతో మాట్లాడాలి. ఇంకా మాట్లాడితే ఉద్యమాలు చేయాలి. ఇదంతా సాధ్యమేనా? అన్నిటికన్నా అతి ముఖ్యమైనది ఆర్థిక పుష్టి .. అదెలా సమకూర్చుకోగలదు? ఒక సంస్థ ప్రారంభించాలంటే కనీసం ఒక పది మంది అయినా ఉండాలి. మాన్ పవర్ ఏది? పిచ్చి జానకి ... జానకి వైపు జాలిగా చూస్తూ అంది శారద.. "అదంత ఈజీ కాదు జానకీ. "

“నాకు తెలుసు శారదా! ఇన్నాళ్ళు ఇంటి నాలుగు గోడల మధ్య వెర్రి గొడ్డులా బతికిన జానకి సంస్థ పెట్టడం ఏమిటి? సోషల్ సర్వీస్ చేయడం ఏంటి అని భావించకు. చేస్తాను. తప్పకుండా చేస్తాను. అమ్మాయిలను కాపాడుకోవాలి అంటే వాళ్లకి కొన్ని జాగ్రత్తలు చెప్పాలి. కొన్ని మెళకువలు చెప్పాలి. ఎలా బతకాలో చెప్పాలి. ఎలా బతక్కూడదో చెప్పాలి. చెప్తాను” దృఢంగా అంది.”నేను తలచుకుంటే చేయగలను. అది ఎంత కష్టమైనదైనా నా సాధించగలను అని నమ్మకం ఉంది.

శారద ప్రేమగా నవ్వింది. “నీకు నా సహాయం, సహకారం ఉంటుంది జానకి. నిజమే నీవన్నట్టు మన అనుభవాలు పిల్లలకి చెబితే వాటినుంచి వాళ్ళు పాఠాలు నేర్చుకుంటారు. నువ్వు నీ ఆలోచనలు, అనుభవాలు వాళ్ళతో పంచుకోడానికి ఏ సంస్థ అవసరం లేదు... నువ్వే ఒక వ్యక్తిగా కాక శక్తిగా మారాలి. అవును జానకీ... నువ్వు మారతావు ఆ నమ్మకం ఉంది. శోకం నుంచి శ్లోకం పుట్టి వాల్మీకి రామాయణం రాసాడు. నీ ఆవేదన నుంచి నీలో ఒక ఆశయ సాధనకు స్ఫూర్తి కలిగింది. తప్పకుండా నువ్వు అనుకున్నది చేస్తావు. “

జానకి శారద చేయి అందుకుని సున్నితంగా నొక్కుతూ... “ఇరుగు,పొరుగు అంటే ఏవో గొడవలు ఉంటాయి అంటారు.. దేవుడి దయవల్ల మనమధ్య అలాంటి గొడవలు ఇప్పటి వరకూ లేవు. ఇకముందు కూడా ఉండవని ఆశిస్తాను. ఉండకూడదనే కోరుకుంటాను శారదా” అంది.

“ఛ అలాంటివి ఏమి ఉండవు” అంది శారద.

“ఎక్కడి నుంచి ప్రారంభిద్దాం?” అంది జానకి.

“చూద్దాం. మన దృష్టికి ఏదన్నా సమస్య ఆడవాళ్ళకు సంబంధించింది వస్తే మనమే వెళ్లి వాళ్ళను కలిసి ఆ సమస్య ఏమిటో తెలుసుకుని మనకు తోచిన సాయం చేద్దాం. ఉదాహరణకి భార్యాభర్తల గొడవ అనుకో. వెళ్లి వాళ్ళని కలుద్దాం. ఇద్దరినీ విడి,విడిగా కలిసి వాళ్ళ సమస్య ఏంటి ఒకరికి ఇంకొకరితో వస్తున్న గొడవలకి కారణం ఏంటి తెలుసుకుని ఇద్దరికీ సర్ది చెబుదాం. దీన్నే ఇంగ్లీషులో కౌన్సిలింగ్ అంటారు. అలాగే అవంతి లాంటి పిల్లలకు ఎలాంటి కౌన్సిలింగ్ కావాలో అలాంటివి చెబుదాం. రేపు అవంతిని మనింటికి తీసుకు రమ్మని చరితకి చెప్పు... కూర్చోబెట్టి ఇకముందు ఇలా ఇల్లు వదలిపోకుండా ఉండేలా ఆ అమ్మాయికి కొన్ని మాటలు చెబుదాం. అలా వెళ్తే వచ్చే కష్టాలు ఏమిటో సున్నితంగా ఎక్కువ భయపెత్తకుండా చెప్పామనుకో. ఇంకెప్పుడూ ఆ అమ్మాయి అలా అనాలోచితంగా ఇల్లు వదిలి వెళ్ళదు.”

జానకి కళ్ళల్లో మెరుపు కనిపించింది.

“అలాగే చెప్తాను శారదా” అంది.

శారద సంతృప్తిగా చూసింది ఆమె వైపు.

“కాసేపు టివి చూద్దామా?” అంది శారద రిమోట్ చేతిలోకి తీసుకుని.

“అలాగే ఆన్ చేయి ఆకలేస్తోంది మనిద్దరికీ లంచ్ ప్లేటులో పెట్టుకుని వస్తాను” అంటూ జానకి డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్లి ప్లేట్స్ లో పదార్థాలు అన్నీ పెట్టి తీసుకుని వచ్చి టీ పాయ్ మీద పెట్టింది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, మధ్య మధ్య సీరియల్స్ చూసి కామెంట్స్ చేసుకుంటూ భోజనం కానిచ్చారు.

శారదతో తన మనసులో ఆలోచన, ఆవేదన పంచుకున్నాక జానకి మనసు ఉల్లాసంగా అయింది. భారంగా ఉన్న మనసు ఇప్పుడు దూది పింజలా ఎగరసాగింది. తను తీసుకున్న నిర్ణయం శారద ఆమోదించి, సమర్ధించడం ఆమెకి ఎంతో బలాన్నిన్చింది. ఏదో చేయాలన్న తపన ఉంటె చాలదు. ఆ తపన అర్ధం చేసుకుని, సహకరించే కుటుంబసభ్యులు, స్నేహితులు ఉండాలి.

సాయంత్రం భాస్కర్ తో కూడా ఈ విషయం చర్చించి తన ఆలోచన అమలులో పెట్టడానికి ఎలాంటి ముందడుగు వేయాలో అడగాలి. భర్త, పిల్లల సహకారం కూడా ఉంటేనే కదా తను ఏమన్నా సాధించగలదు! పైగా వాళ్ళు కూడా తన నిర్ణయాలను ప్రశ్నించే వాళ్ళు కాదు, కాదని వ్యతిరేకించే వాళ్ళు కూడా కాదు. అలాంటప్పుడు వాళ్ళకి చెప్పి చేయడం తన ధర్మం కూడా.

అనుకున్నట్టే భాస్కర్ ఇంటికి వచ్చాక కాఫీ ఇచ్చి తన మనసులో మాట చెప్పింది జానకి.

భాస్కర్ ఊహించని ఆ మాటలు విని షాక్ అయినట్టు అప్రతిభుడయాడు.. "నిజంగా నువ్వు అలా చేయగలవా జానకీ" అడిగాడు.

"ఎందుకు చేయలేను ఆ దైవం దీవెన మీ సహకారం ఉంటే తప్పకుండా చేస్తానండి అప్పుడే నాలో కూడా ఒక విధమైన ఆత్మవిశ్వాసం వస్తుందని నా నమ్మకం" అంది.

"నిజం చెప్పాలంటే నీలో ఇంత త్వరగా ఇంత విప్లవాత్మకమైన మార్పు వస్తుందని నేను అనుకోలేదు. నువ్వు చాలా మారావు జానకీ" అన్నాడు ఆమె నుదుట పడిన ముంగురులు సవరిస్తూ.

"మారాలి కదండీ. మునుపటిలా ఉంటె జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అనవసరమైన ఆందోళన తో నేను మనశ్శాంతి పోగొట్టుకోవడం కాక మిమ్మల్ని, పిల్లలని కూడా బాధపెట్టాను. పాపం అమ్మా, నాన్న ఎంత కంగారు పడ్డారో కదా.. వాళ్ళని చూడాలని ఉందండి " అతనికి దగ్గరగా జరిగి గుండెల మీద తల పెట్టుకుంది.

భాస్కర్ మనసు అణువణువూ పులకించింది. జానకి ఇంతగా మారిందా. హమ్మయ్య తానింక నిశ్చింతగా ఉండచ్చు. కాస్త అలా బయట తిరగడం అలవాటు కావాలి. అసలు తను మొదటి నుంచీ ఆమెని అలా స్వతంత్ర భావాలతో ఉండేలా తయారు చేయాల్సింది. భార్య అంటే ఏదో వేళకింత వండిపెట్టి, పిల్లలని, ఇంటిని చూసుకుంటూ తను ఇంటికి రాగానే చిరునవ్వుతో ఎదురొచ్చి సేదతీర్చాలి అన్న ఒక స్వార్ధపూరిత భావజాలంతో ఆమె పూర్తిగా తన మీద ఆధారపడి బతికేలా తయారుచేసాడు. అవును జానకి ఇంత బేలలా అవడానికి నేనే కారణం ... అనుకున్న భాస్కర్ ఆమె వీపు చుట్టూ చేయి వేసి అన్నాడు.

"రేపు ఒకసారి జాహ్నవి దగ్గరకు వెళ్లి అవంతి తిరిగి వచ్చినందుకు సంతోషంగా ఉందని, నీకు తోచిన నాలుగు మాటలు చెప్పి రా" అన్నాడు.

"ఆ జాహ్నవి ధోరణి నాకు నచ్చలేదు కదండీ" అంది అయిష్టంగా .

"ఒక్క జాహ్నవితో డీల్ చేయలేకపోతే ఇలాంటి జాహ్నవిలు రేపటినుంచి నీకు చాలా మంది ఎదురవచ్చు .. అప్పుడెలా మానేజ్ చేయగలవు!" అన్నాడు అల్లరిగా.

ఉడుక్కుంటూ అంది "ఎందుకు చేయలేను. చూడండి రేపు వెళ్లి కాస్త గడ్డి పెట్టి వస్తాను" అంది జానకి.

"ఆ, ఆ ఆవేశం వద్దు...గడ్డి, తవుడు పెట్టద్దు కానీ, కాస్త సున్నితంగా మందలించి రా చాలు" అన్నాడు.

ఈలోగా చరిత, హరి రావడంతో జానకి లేచి చరితను దగ్గరకు తీసుకుని అడిగింది. "ఇప్పుడు సంతోషంగా ఉన్నావా... ఇవాళ అవంతి కాలేజీకి వచ్చిందా..

చరిత మెరిసే కళ్ళతో చెప్పింది "ఇంటికి వెళ్ళిపోయిందిగా అది చాలు. కాలేజి కి రేపు వస్తుంది."

జానకి చరిత మొహం రెండు చేతుల్లోకి తీసుకుని నుదుట ముద్దుపెట్టుకుంది.

కొంచెం ఎడంగా నిలబడిన హరిని తన దగ్గరకు పిలిచాడు భాస్కర్. హరి తండ్రి పక్కన కూర్చోడంతో చరిత కూడా వెళ్లి వాళ్ళ పక్కన కూర్చుని "మమ్మీ ... మాకు స్నాక్స్ కావాలి" అంది. జానకి చిరునవ్వుతో వంటగదిలోకి వెళ్ళింది బజ్జీ చేయడానికి.

**మెదక్ జిల్లాలో ఉన్న** ఒక గ్రామంలో దాదాపు పాతిక  ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఒక ఆశ్రమం నిర్మించుకున్నాడు బాబా గా పిలవబడే సుర్జితసింగ్.  ఆ స్థలం అతనికి ఎక్కడి నుంచి వచ్చిందో ఆశ్రమం పేరుతొ ఒక విలాసవంతమైన అత్యంత ఆధునిక సౌకర్యాలతో ఉన్న ఆ భవనం ఎవరు నిర్మించారో అసలు అంతకు మునుపు ఎన్నడూ చూడని ఆ వ్యక్తి అకస్మాత్తుగా ఎలా ఊడిపడ్డాడో ఎవరికీ తెలియదు.

ఆ ఆశ్రమం నిర్మాణ దశలో ఉండగా చూసిన వాళ్ళు అక్కడేదో అపార్ట్ మెంట్ కడుతున్నారని కొందరు, కాదు ప్రభుత్వ కార్యాలయాలు కడుతున్నారని కొందరు, కాదు ఏదో పెద్ద మల్టి ప్లేక్స్ మాల్ కడుతున్నారని కొందరు రకరకాలుగా వ్యాఖ్యానాలు చేసుకున్నారు. కానీ కేవలం మూడు అంతస్తుల్లో పూర్తీ అయిన ఆ బిల్డింగ్ చూసి ఎవరో ధనవంతుడు కట్టుకున్న ప్రైవేటు ఇల్లుగా నిర్ణయించుకున్నారు.

అయితే అది ఆశ్రమం అని తెలియడానికి కొన్ని రోజులు పట్టింది.

ఆ ప్రదేశానికి సుమారు అయిదారు కిలోమీటర్ల దూరం వరకూ ఎలాంటి మంచి ఇళ్ళు లేవు.. ఓ పదిమంది చిన్న  రైతులు మాత్రం వాళ్ళ పొలాలకు దగ్గరగా ఉంటుందని అక్కడికి దగ్గరలో మట్టి ఇళ్ళు నిర్మించుకుని కాలం గడుపుతున్నారు. అంతేకాదు ఆ గ్రామంలో ఒకరిద్దరికి తప్ప రెండు అంతస్తుల భవనం లేనేలేదు.

జనసంచారానికి దూరంగా ఉన్న ఆ ప్రాంతంలో  అంత అందమైన భవనం గురించి ఊళ్ళో ఉన్న జనానికి తెలియడం మొదలు పెట్టాక అందరూ కుతూహలం ఆపుకోలేక వచ్చి చూసి వెళ్ళడం జరిగింది. ఆ భవన యజమాని ఎవరో  కచ్చితంగా రాజకీయ నాయకుడు అయి ఉంటాడని కూడా కొందరు  భావించారు. కారణం ఎం ఎల్ ఏ కి, పంచాయితీ పెద్దలకు తెలిసినా వాళ్ళు పట్టించుకోకుండా ఉండడంతో ఆలోచనా జ్ఞానం ఉన్న వాళ్ళు మాత్రం రాజకీయం ఉందని నమ్మారు.

అయితే అక్కడ ఆశ్రమానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఒక కోట ఉంది. అది ప్రస్తుతం శిధిలావస్థలో ఉంది. మెదక్ జిల్లాలో ఎంతో ప్రాముఖ్యం ఉన్న ఒక చారిత్రాత్మక కోట అది. హైదరాబాదు నుంచి సుమారు వందకిలోమీటర్ల దూరంలో, రామాయం పేట నుంచి ఆదిలాబాద్, నిజామాబాద్ లకు  కోట నుంచి 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

ఇది 12 వ శతాబ్దంలో కాకతీయుల రాజు ప్రతాపరుద్రుడు రాజ్యరక్షణ కోసం నిర్మించాడని చరిత్ర ఆధారం. ఎక్కడానికి దుర్లభమైన ఎత్తైన  కొండమీద నిర్మించబడిన కోట చుట్టూ కందకాలు,  బురుజులు, సొరంగాలు, జలాశయాలు, దిగుడుబావులు మొదలైన వాటితో అత్యంత సుందరంగా ఉండేదని చెప్తారు.

ఈ కోటను మెతుకు దుర్గంగా  ప్రతాపరుద్రుడు పిలిచేవాడని అంటారు. పటిష్టమైన భద్రతతో అత్యంత శ్రద్ధగా నిర్మించబడిన ఈ కోట  బురుజుల నుంచి చూస్తే 40 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న శత్రువులు కూడా కనిపించేవారని చెప్తారు.  కాకతీయ సామ్రాజ్యానంతరం ఈ కోటని కుతుబ్ షాహీలు వశపరచుకున్నారు. ఈ కోటలో  ఇప్పటికీ ధాన్యాగారాలు, శిధిలమైన గృహాలు కనిపిస్తాయి. ఈ కోటకి మూడు ముఖద్వారాలున్నాయి. సింహద్వారానికి రెండు వైపులా ఆగ్రహంతో ఉన్న సింహాల శిల్పాలు , ఒక వైపు ఏనుగు తలలు ఉంటాయి. దీన్ని గజద్వారం అంటారు. ప్రధాన ద్వారం కి కాకతీయుల చిహ్నం అయిన రెండు తలల గండభేరుండం ఉంటుంది.

మంచినీటి పైపులైన్లు కుండపెంకులతో నిర్మించారు కానీ ఇప్పుడు అవి లేవు.  తెలంగాణా రాష్ట్రంలో ఉన్న చారిత్రక సంపదల్లో ఈ కోట కూడా ఒకటి.

ఆ కోటకి కొంచెం దూరంలో ఉంది ఆశ్రమం. ఒక విధంగా చెప్పాలంటే అల్లాఉద్దీన్ అద్భుత దీపం కధలో లాగే వెలిసిందని చెప్పచ్చు. అతి తక్కువ సమయంలో అత్యంత అద్భుతంగా నిర్మించబడిన ఆ భవనం ఆశ్రమం అని తెలిసేలా ఒకానొక  శుభోదయాన చుట్టు పక్కల

ఇళ్ళల్లోని ఆడవాళ్ళు నిద్ర లేచి వాకిళ్ళు ఊడ్చుకుంటున్న సమయంలో ఆ భవనం నుంచి పెద్దగా మంత్రాలు వినిపించడంతో చేతుల్లో చీపురు కట్టలతో విభ్రాంతులై నిలబడిపోయారు వాళ్ళంతా.

ఆ మంత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో ముందు అర్ధం కాలేదు. తరవాత గాలిలో తేలివస్తున్న ఆ మంత్రాల వైబ్రేషన్స్ వాళ్ళని ఆశ్రమం వైపు నడిపించాయి. ఆడ, మగా అంతా కలిపి ఓ పదిహేను మంది పిల్లలని చంకల్లో వేసుకుని బయలు దేరారు.

అప్పటికే దాదాపు పాతిక మంది శిష్యగణంతో పరివేష్టితుడై ఉన్నాడు .

గుండెల దాకా పెరిగిన తెల్లని గడ్డం, కాషాయ వస్త్రాలు, మెడలో నాలుగు వరసల రుద్రాక్ష హారాలు, కాషాయ తలపాగా ఆజానుబాహు విగ్రహం, నుదుట విభూతి రేకలు వాటిమీద రూపాయి కాసంత కుంకుమ బొట్టు. చూడగానే రెండుచేతులూ ఎత్తి నమస్కరించాలి అనిపించే తేజస్సు. ఎదురుగా ఒక పెద్ద వెండి సింహాసనం ... దాని మీద పెద్ద కాళికాదేవి విగ్రహం . ఎంతో సేపటి నుంచి పూజ చేస్తున్నట్టుగా పూలు, పసుపు, కుంకుమలతో నిండి ఉంది. అందరూ మంత్రముగ్ధులై నిలబడిపోయారు. వాళ్ళందరినీ చూసిన ఆయన వదనంలో చిరునవ్వు. అందరినీ దగ్గరకు పిలిచి కుడి చేయి చాపమని అరచేతుల్లో కుంకుమ వేసి దీవించాడు. మీ మనోరధాలు తీరతాయి అని అభయం ఇచ్చాడు.

మీకే కష్టం ఉన్నా తీర్చడానికి నేనున్నాను అని నమ్మపలికాడు.

అంతే ! అప్పటి నుంచి జనసంచారం ఉండని ఆ ప్రదేశం జనంతో నిండిపోయింది.

ఏడుకొండల వాడు, భక్తులను అనుగ్రహించడానికి బాబాగారిలా వెలిశారని, ఆయన అమ్మవారి ఉపాసకులని, ఎలాంటి సమస్యలున్నా అమ్మవారిని పూజించిన కుంకుమ బొట్టు పెడితే చేత్తో తీసేసినట్టు ఆ సమస్యలు తీరిపోయి ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారని ప్రచారం మొదలైంది. ఆనోటా, ఈ నోటా పాకి చుట్టూ పక్కల ఊళ్లకే కాక, జిల్లా మొత్తం ఆ వార్త వ్యాపించింది. ఎన్ని రకాల ప్రచారసాధనాలున్నా, నోటి ద్వారా జరిగే ప్రచారానికి వచ్చినంత వేగంగా స్పందన మరే ప్రచారానికి రాదు. అందుకే చాలా మంది, తాము నలుగురికి చెప్పాలనుకున్న విషయం తమంతట తాము చెప్పక, ఇక్కడి మాటలు, అక్కడ అక్కడి మాటలు ఇక్కడ చెప్పి తమాషా చూసే వారికి చెప్పి నిశ్చింతగా ఉంటారు. దీన్నే మౌత్ పబ్లిసిటీ అంటారు.

ఆ మౌత్ పబ్లిసిటీ బాబాగారి మహిమ విషయంలో చాలా బాగా పనిచేసింది. ఎక్కడెక్కడి వాళ్ళు బాబాగారిని దర్శించుకోడానికి రావడం మొదలైంది. బస్సులు వేసుకుని గుంపులుగా వస్తున్న జనం సౌకర్యాల కోసం పైన తాటాకుల పందిరి వేసి, నాలుగు అరుగులు కట్టి వాటి మీద టీ , కాఫీ, ఇడ్లి, దోస, వడ లాంటి అల్పాహారాలు, కొబ్బరికాయలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమల పొట్లాలు, రకరకాల దారాలు, దేవుడి ఫోటోలు, రాగిచెంబులు వగైరా అమ్మే ఒక చిన్న కొట్టు, బూరలు, ప్లాస్టిక్ బొమ్మలమ్ముకునే చిరు వ్యాపారుల హడావుడి మొదలై అక్కడ తీర్ధం లాగా తయారైంది.

ఆయన శిష్యగణం కూడా బాగా పెరిగారు. వారిలో స్త్రీలు కూడా చేరారు. బాబాగారి మహిమలు విని సినిమా తారలు, టి వి తారలు, రచయితలు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు ఒకరేమిటి అన్ని వర్గాల వాళ్ళు వారిని దర్శించుకోడానికి రాసాగారు. ఖరీదైన కార్లు ఆ ఊళ్ళో తిరగడం మొదలయాక ఆ ఊరి పేరు మారుమోగింది.

బాబా గారిని దర్శించుకున్న ప్రతివారు కోట గురించి విని చూడడానికి వెళ్ళడంతో ఇప్పుడు ఆ కోట కూడా ప్రాముఖ్యత సంతరించుకుంది.

ప్రజల బలహీనత ప్రారంభం అయేది ఇక్కడి నుంచే. మీకే కష్టాలు ఉన్నా నేను తీరుస్తాను అనే అభయం ఇచ్చే మనిషి కనిపిస్తే నమ్మని వాళ్ళు చాలా తక్కువ. అభయం ఇవ్వడం కాక, సమస్యలు తీర్చేస్తానన్న నమ్మకం ప్రజల్లో కలిగించడం, తీరాయన్న సంతృప్తి వారిలో కలిగించడం ... ఈ ఒక్క పని చేయగలిగితే చాలు... అది ఎలా సాధించాలో కొందరికి బాగా తెలుసు. అలాంటి వాళ్ళే బాబాలుగా, స్వామీజీలుగా అవతారాలు ఎత్తి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

అందరూ కష్టాలు వచ్చినపుడు పూజలు చేయడం, గుళ్ళ చుట్టూ తిరగడం అనేక రకాలు మొక్కులు మొక్కుకుని అవి తీర్చుకోడానికి ఎన్నో ప్రయాసలు పడడం సామాన్యం. అయితే వాళ్ళ కష్టాలు తీరాయా... వారి కోరికలు నెరవేరాయా లేదా అనేది వారి, వారి అనుభవాల ద్వారా ఎవరికీ వారు తెలుసుకోవాల్సిన విషయం. రాతిబొమ్మని ఎంత ప్రార్థించినా పలకనప్పుడు, తమ కష్టాలు విని స్పందించి పరిహార మార్గం చెప్పే వ్యక్తి సాధువు అవచ్చు... యోగి కావచ్చు, స్వామీజీ కావచ్చు ఒక జ్యోతిష్కుడు కావచ్చు.. వాళ్ళని విశ్వసించి కనిపించే దేవుడిగా భావించి పూజించడం సామాన్యుల బలహీనత. ఆ బలహీనత ఉండడానికి ఆ వ్యక్తి సామాన్యుడా, అసామాన్యుడా అనే మీమాంస అనవసరం. సామాన్యుడైతే తను బాగుపడతాడు .... అసామాన్యుడు అయితే ఆ బాబాలు, స్వామీజీలు బాగుపడతారు.

సరిగ్గా అలాంటిదే జరిగింది. ప్రముఖులు, బడా బాబుల ప్రాపకంతో ఆ బాబా గారి సామ్రాజ్యం అప్రతిహతంగా ఉత్తరాది నుంచి విస్తరించుకుంటూ అనేకమంది శిష్యులను, తయారు చేసుకుంటూ, హైదరాబాద్ చేరింది.

మహానగారాల్లోకి ప్రవేశించడానికి ముందుగా జనావాసాలు ఎక్కువగా లేని చిన్న, చిన్న ఊళ్ళల్లో అమాయక జనం ఉండే ప్రదేశం ఎంచుకుని, అక్కడ ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని అక్కడ ఓ చిన్న సామ్రాజ్యం నిర్మించుకుని అక్కడి నుంచి నగరాలలోకి ప్రవేశించడం ఆయనకీ తెలిసిన కళ.. గ్రామాల్లో ప్రజలు అమాయకులు.. వారు నిరక్షరాస్యులు ... ఎవరన్నా ఒక రాయిని చూపించి కాస్త, పసుపు, కుంకుమ వేసి ఇందులో మహిమ ఉంది దండం పెట్టుకోండి అంటే గుడ్డిగా నమ్మి ఆ రాయినే రత్నంగా భావించి చివరికి ఆ రాయికి ఒక చిన్న రక్షణ కవచం ఏర్పరచి, ఆ రాయి మా గ్రామదేవత ... ఆవిడ వల్లే మా గ్రామంలో పంటలు బాగా పండుతున్నాయి, నీళ్ళు సమృద్ధిగా ఉన్నాయి .. మేమంతా సుఖంగా ఉన్నాము... అని వాళ్ళు నమ్మడమే కాక, ఇతరులను కూడా నమ్మించడానికి ప్రయత్నిస్తారు. ఆ గ్రామదేవతకి ఒక కథ అల్లేస్తారు. ఎప్పుడో ఎక్కడో సుగుణవతి అయిన కోడలిని ఇంటిల్లి పాది నానా కష్టాలు పెట్టి చంపేస్తే ఆ కోడలు గ్రామదేవత గా వెలిసింది అని నమ్మబలికేలా తమకి తెలిసిన ఒక సంఘటనకి మహిమ ఆపాదించి చక్కటి కథ అల్లుతారు. అది వాళ్ళ అమాయకత్వం కావచ్చు.. వారు నమ్మిన కర్మ సిద్ధాంతంలో భాగం కావచ్చు. ఏది అయినా దానివలన ఉపకారం సంగతి ఎలా ఉన్నా ఎవరికీ ఎలాంటి అపకారం జరగదు.

ఆ బలహీనతను తమ స్వార్ధానికి ఉపయోగించుకుని ప్రజల్లో తమని తాము దేవుడిగా ప్రకటించుకునే వాళ్ళు అనేకమంది ఈ సైబర్ కాలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే ఇలాంటి బాబాల వలన మూఢనమ్మకాలు ప్రబలిపోయి వివేకం, విచక్షణ అనేవి నశించిపోయి వాళ్ళు, వీళ్ళు అని లేకుండా అందరూ ఈ బాబాల మహిమ అనే మత్తులో పడిపోతున్నారు. వీళ్ళ వలన దేశంలో అవినీతి, ఆక్రమణలు, అరాచకాలు, చీకటి వ్యాపారాలు, స్మగ్లింగ్ ఒకటేమిటి ఎన్ని దరిద్రాలు ఉండాలో అన్ని దరిద్రాలకు మూలకారకులు ఈ దొంగ బాబాలు అని ఎంత మంది విషయంలో తేటతెల్లం అయినా ఇంకా, ఇంకా జనం నమ్ముతూనే ఉన్నారు.. బాబాలు నమ్మిస్తూనే ఉన్నారు.

విలాసవంతమైన జీవితం, కష్టపడకుండా డబ్బు విచ్చలవిడిగా పొందాలన్న ఆశ ఉన్నవాళ్ళు ఈ బాబాల సంగతి తెలిసి వాళ్ళని ఆశ్రయించి, వాళ్లకి కొమ్ముకాసి మరింతగా ఈ రాక్షసకాండ శృతి మించడానికి శాయశక్తులా సహాయపడుతూ, స్వామీ కార్యం, స్వకార్యం యదేచ్ఛగా జరగనిస్తున్నారు. అలాంటి వాళ్ళల్లో ఆడవాళ్ళు, మగవాళ్ళు, నాయకులూ, వ్యాపారస్తులు అందరూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో

ఉపయోగపడుతున్న వాళ్ళే. ఎవరో నూటికి, కోటికీ ఒకళ్ళు ఇదంతా మాయ అని, ప్రజలను మోసం చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని నచ్చచెప్పినా వాళ్ళ మొర వినేదెవరు?

సరిగ్గా ఈ బాబా కూడా అలాంటి వాడే. ఆయనే సుర్జిత్ సింగ్ బాబా సుప్రసిద్ధుడు.

బీహార్ లో, రాజధాని ఢిల్లీలో, హరిద్వార్ లో, కలకత్తాలో, తమిళనాడులో, కర్నాటక లో ఏ మల్టీ నేషనల్ కంపెనీ విస్తరించనంతగా తన కార్యకలాపాలు విస్తరించుకుంటూ, ఆస్తులు సంపాదిస్తూ, విలాసవంతంగా జీవిస్తూ, పైకి సర్వసంగ పరిత్యాగినని చెప్పుకుంటూ తన అవినీతి సామ్రాజ్యానికి చక్రవర్తి గా వెలిగిపోతున్నాడు. తన సుఖాలకు, భోగాలకు అమాయకురాళ్ళు అయిన ఆడపిల్లలని ఆధ్యాత్మికత పేరుతొ వలవేసి పట్టుకుని తన గుప్పిట్లో వాళ్ళ జీవితాలని బంధించి ఉంచాడు. ఆయనే నిజామాబాద్ దగ్గర ఒక ఆశ్రమంలో కొంతకాలం ఉండి, మెల్లిగా హైదరాబాదు నగరానికి రావడానికి వేస్తున్న పధకంలో భాగంగా మెదక్ చేరాడు.

సరిగ్గా అప్పుడే శ్రేష్ఠ ఆ నోటా, ఈ నోటా ఆయన గురించి విన్నది. ఎంతటి దుర్మార్గుడైన భర్త అయినా ఆ బాబా ఇచ్చే కుంకుమతో మారిపోయి భార్యకి దాసోహం అవుతాడని ఎవరో చెప్పడంతో ఆరోజు ప్రద్యుమ్నతో తీవ్రంగా గొడవపడి నేరుగా ఆ ఆశ్రమం వెతుక్కుంటూ బాబా దగ్గరకు వెళ్లి తన గోడు వెళ్ళబోసుకుంది.

మిస,మిసలాడే చిన్నది, పైగా ఆస్తిపరురాలు, అన్నిటికీ మించి చదువుకున్న అమాయకురాలు..ఆమె అవసరం ఆయనకీ ఎంతైనా ఉంది. “నీకు ఒక మంత్రోపదేశం చేస్తాను అందుకు ఒక వారం రోజులు నువ్వు ఈ ఆశ్రమంలోనే ఉండాలి.. నిష్టగా ఉండాలి. ఆ మంత్రం నీ భర్త దగ్గర పఠిస్తే నీ పాదాక్రాంతం అవుతాడు” అని చెప్పాడు. అంతకన్నా ఏం కావాలి ఆమెకి. తన కసి తీరాలంటే అతని ప్రేయసి దగ్గర నుంచి తన కనుసన్నల్లోకి రావాలంటే ఇంతకన్నా మార్గం లేదు.

శ్రేష్ఠ వెంటనే ఒప్పుకుంది. ఆరోజు ఆశ్రమంలో అమ్మవారికి కుంకుమార్చన, భజనలు, భక్తులతో బాబాగారి సమావేశాలు, బాబాగారి ఉపన్యాసాలు..జాగ్రత్తగా వింది. పొంగిపోయింది. ఆయన సాక్షాత్తూ మహాశివుడు లా అనిపించాడు. ఇంక తన జీవితానికి ఎలాంటి ధోకా లేదనుకుని మురిసిపోయింది. ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయింది.

ఒకరోజు గడిచింది.. మర్నాడు సాయంత్రం ఏడున్నర వరకూ కూడా అలాగే గడిచింది. ఎనిమిది గంటలకి భోజనం చేసి తనకి కేటాయించిన గదిలోకి వెళ్ళింది.

తొమ్మిదైంది ..

ఒక స్త్రీ ఆమెని సేవకురాలు అంటారు... ఆవిడ వచ్చి “నిన్ను బాబాగారి గదిలోకి రమ్మంటున్నారు.. నీకు మంత్రోపదేశం చేస్తారట” అని చెప్పింది.

ఆ మంత్రం కోసమే ఎదురుచూస్తున్న శ్రేష్ఠ ఎగిరి గంతేసి ఆయన దగ్గరకు వెళ్ళింది..

విశాలమైన ఏ సి గది.. అత్యంతాదునికంగా ఉంది. ఆ గదిలో ఒక వైపు గుండ్రటి ఖరీదైన మంచం దానికి నైలాన్ దోమతెర ... ఒక వైపు రెండు హంసలు చేత్తో మోస్తున్నట్టున్న గ్లాస్ టీపాయ్ .. చుట్టూ నాలుగు మెత్తటి సోఫాలు. ఆయన ఒక సోఫాలో కూర్చుని ఉన్నాడు. ఇప్పుడు ఉదయం చూసిన దుస్తుల్లో కాక తెల్లటి గ్లాస్కో ధోవతి గూడ కట్టు కట్టుకుని తెల్లటి లాల్చి వేసుకున్నాడు. గదిలోకి వెళ్ళగానే ఒక చిత్రమైన పరిమళం మత్తుగా వ్యాపించింది.

“వచ్చావా... రా” అంటూ సోఫా చూపించాడు నవ్వుతూ.

ఆ నవ్వు ప్రశాంతంగా, అభయం ఇస్తున్నట్టుగా ఉండే నవ్వు కాదు.. ఆ నవ్వులో ఏదో మర్మం, శ్రేష్టలో ఏదో సంశయం, సందేహంగా దగ్గరగా వెళ్ళింది.

"కూర్చో.. భయపడకు ..." అన్నాడు.

శ్రేష్ఠ సందేహంగానే కూర్చుంది సోఫాలో ఒదిగి.

"బి ఫ్రీ.. హాయిగా కూర్చో ఎందుకంత బిడియం ... ఇది మన సమయం ... "ఇంగ్లిష్ లో మాట్లాడుతున్నాడు.

చురుగ్గా చూసింది మన సమయమా!

"అదే నీకు మంత్రోపదేశం చేయడానికి ఒక ఏకాంత సమయం కావాలి అన్నాను కదా.. ఇదే ఆ సమయం అన్నాడు" అలా అంటున్నప్పుడు ఆయన కళ్ళల్లో కనిపించిన ఎరుపు స్వరంలో వినిపించిన కొత్త ధ్వని ఆమెకి ఒక్క క్షణం ఏదో ఆపదని శంకించింది. బాబా గారి గురించి తప్పుడు ఆలోచన వచ్చినందుకు మళ్ళి తనే సర్దుకుని ..

"చెప్పండి స్వామి ... మంత్రం చెప్పండి" గబగబా అంది.

"అంత దూరంగా అలా కూర్చుంటే ఎలా ... ఇటురా" అన్నాడు తన పక్కన చోటు చూపిస్తూ.

శ్రేష్ఠ విస్తుబోయి చూసింది. " ఎందుకు?" అంది .

"చూడమ్మా.. భగవంతుడు మీద నమ్మకం లేకుండా పూజలు చేస్తావా! లేదుకదా. అలా చేస్తే ఎలాంటి ఫలితం ఉండదు... అలాగే పవిత్రమైన మంత్రం నేర్చుకోవాలంటే విశ్వాసం ముఖ్యం. నేను చెప్పేది చెప్పినట్టు ఆచరిస్తేనే నీకా మంత్రం లభిస్తుంది. అందుకే నేను చెపినట్టు విను " అన్నాడు.

"ఆ ... అంటే ఏ ... ఏం చేయాలి?" అంది గొంతు తడారిపోతుంటే.

మనసులో ఏదో శంక... కానీ ఒక మూల నుంచి భర్తను దాసుడుగా మార్చే మంత్రం నేర్చుకోవాలన్న తపన... మంత్రం నేర్పే మహానుభావుడు.. పెద్దవాడు.. ఆయనని శంకించడం కరెక్ట్ కాదు. బహుశా వాళ్ళ సిద్ధాంతాలలో అలా పక్కన కూర్చోవాలన్న రూల్ ఉందేమో! నమ్మకం, అపనమ్మకం అనే ఊయలలో ఊగుతున్నట్టుగా ఉంది.

"నీకు చెవిలో చెప్తా మంత్రం ... చెవిలో చెప్పాలంటే నువ్వు దగ్గరకి రావాలి కదా"

అవును కదా! అనవసరంగా భయపడ్డాను.. తనని తాను మనసులోనే వీపు మీద చరచుకుని సోఫాలోంచి లేచి ఆయనకి సమీపంగా వెళ్లి ఆయన కూర్చున్న సోఫా లో కొంచెం ఎడంగా కూర్చుంది.

ఆయన నవ్వాడు. ఆ నవ్వులో ఏవో అర్థాలు.. మళ్ళీ ఏదో భయం.... సందేహం.. మంత్రం, మంత్రం అంటోంది మనసు.

"మంచి పిల్లవి ... ఏది నీ చేయి ఇలా ఇవ్వు.. అసలు నీ దాంపత్యగీత ఎలా ఉందో చూస్తాను" అంటూ ఆమె ఎడం చేయి చనువుగా పట్టుకుని అరచేతిలో రేఖలు చూస్తూ... "నువ్వు చాలా అదృష్టవంతురాలివి. అందుకే నా దగ్గరకు వచ్చావు. నీ జీవితం నేను ఎంత అద్భుతంగా మార్చేస్తానో చూడు.." అంటూ నెమ్మదిగా అరచేతి నుంచి పైకి పాకిస్తూ భుజం పట్టుకున్నాడు.

అతని కళ్ళల్లో కనిపించిన ఎర్రజీరాలు, అదురుతున్న పెదాలు ...

శ్రేష్ఠ ఒక్కసారిగా ఉలిక్కి పడి అప్రయత్నంగా లేచి నిలబడింది.

కానీ ఆయన బలిష్టమైన చేతిలో చిక్కుకున్న ఆమె తిరిగి సోఫాలో వాలిపోయింది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా అదే చేయి గట్టిగా తనకి అభిముఖంగా లాగాడు. ఏం జరుగుతోందో తెలిసేలోగా ఆమె అతని ఒడిలో పడిపోయింది. రెండు చేతులతో గట్టిగా బంధించాడు.

“వదలండి...నాకు భయంగా ఉంది... మంత్రం వద్దు” అంది వణికే స్వరంతో.

అప్పటికే కామం శరీరం నిండా రోమాలతో అతనిని ఆవహించింది. విషపు నవ్వు నవ్వి అన్నాడు “నువ్వు వేశావు నాకు మంత్రం... ప్రేమ మంత్రం... నీ మంత్రం నన్ను ఆగనివ్వడం లేదు..” రెండు చేతుల్లో ఆమె మొహం పట్టుకుని తన మొహానికి దగ్గరగా తీసుకువెళ్ళాడు.

“ఛీ”, మొహం తిప్పేసుకుని ...”ఏయ్ వదులు” కీచుగా అరిచింది శ్రేష్ఠ.

“మంత్రోపదేశం వద్దా? మీ ఆయన ప్రతిక్షణం ఇలా నిన్ను కౌగిట్లో బంధించి ఉంచద్దా? మంత్రోపదేశం అందరిలో చేయకూడదు..ఇదిగో ఇలా రొమాంటిక్ గా అందంగా చెవిలో ఇలా చెప్పాలి.” ఆమె చెంప మీద గట్టిగా ముద్దు పెట్టుకుని చెవి కొరికాడు సన్నగా.

“ఒరేయ్ దొంగవేధవా ... వదులు..” గొంతు పెగుల్చుకుని గట్టిగా అరచి పెనుగులాడసాగింది.

“ఏయ్ ఎక్కువగా అరిచావంటే పీక నొక్కేస్తా.. అందరిని మత్తులో ముంచి అనుభవిస్తా. చదువుకున్న దానివి , అందగత్తెవి అని నీతో రసభరితంగా అనుభవించాలని ఆశ పడుతున్నా. అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు. మర్యాదగా ఒప్పుకున్నావా సరే... లేదంటే ఇప్పుడే పిలుస్తా నా మనిషిని. మత్తు ఇంజక్షన్ ఇచ్చిందంటే నీ ఒళ్ళు పచ్చిపుండు అయినా నీకు తెలియదు.. రా ఇటు” గబుక్కున ఆమెని రెండుచేతులతో లేవనెత్తి మంచం వైపు నడిచాడు.

శ్రేష్ఠ కాళ్ళతో, రెండు చేతులతో అతన్ని ఎడాపెడా తన్నడం మొదలుపెట్టింది. ఆమెని మంచం మీద విసిరేసి క్రూరంగా చూస్తూ లాల్చి విప్పి దూరంగా పడేశాడు.

శ్రేష్ట అటూ, ఇటూ చూసింది. ఎటూ తప్పించుకోడానికి దారి కనిపించలేదు. మంచం మీద నుంచి దిగాలన్నా చాలా విశాలంగా ఉన్న మంచం మీద మధ్యలో పడేసి అతను ఆమెని ఆనుకుని కూర్చున్నాడు. వెనకవైపు గోడ ఉంది. కుడి పక్కా, ఎడమ పక్కా మంచానికి రెండువైపులా పెద్ద ఇత్తడి కుండీలు వాటిలో ఏవో ఇంటీరియర్ మొక్కలున్నాయి.

“ఏంటే చూస్తున్నావు. నిన్ను పుట్టించిన దేవుడు కూడా నిన్నిప్పుడు రక్షించలేడు” అన్నాడు మీదకి ఒంగుతూ .

ఛీ .... అంత దగ్గరగా అతని చాతీ కనిపించగానే ఆమెకి వాంతి వచ్చినట్టు అయింది. కడుపులో తిప్పేసింది. గబుక్కున పక్కకి పొర్లింది.

“నీకు బతకాలని లేదా? నా కంటికి కనిపించిన ఆడదాన్ని అనుభవించకుండా వదలను. నిన్ను చంపి అయినా అనుభవిస్తా. వెధవ్వేషాలేయకు..” అంటూ రెండు భుజాలు పట్టుకుని బలంగా తన వైపు తిప్పుకుని మీదకి వంగాడు.

శ్రేష్టకి ఆగ్రహం, దుఃఖం ముప్పిరిగొన్నాయి. ఆమెలో సహజంగా ఉన్న పొగరు ఆత్మాభిమానం అతని మాటలతో నిప్పు కణిక మీద కిరోసిన్ పోసినట్టు భగ్గుమని లేచాయి.

“వదలరా దరిద్రుడా... నీ మొహానికి నేను కావాలా? తెల్లగడ్డం నువ్వూనూ.. నువ్వు, నీ బానపొట్ట... చెత్త వెధవా.. సిగ్గులేదూ ... దరిద్రపు బతుకు బతుకుతూ బాబాని, సర్వసంగ పరిత్యాగిని అని చెప్పుకుంటూ, జనాలని మోసం చేస్తావా?. నీ బతుకు బయట పెడతాను.

చంపేస్తాను వదులు... దేవుళ్ళు నీ దొంగ మంత్రాలు విని వరాలిచ్చేస్తున్నారనుకుంటున్నావా? నీ బండారం బయట పెడతా.. నిన్ను పోలీసులకి పట్టిస్తా..” కాలెత్తి మొహం మీద గట్టిగా లాగి తన్నింది.

ఆ దెబ్బ ముక్కు మీద తగలడంతో ఒక్కసారి ఉలిక్కిపడి, వెనక్కి తగ్గాడు.

శ్రేష్ఠ దొర్లింది. పశువులా ఓడిసిపట్టాడు. నీ సంగతి ఇలా కాదు అంటూ రెండు చేతులతో ఎత్తి బలంగా పట్టుకుని కొంచెం ఎడంగా గోడకి ఉన్న స్విచ్ నొక్కాడు. ఆశ్చర్యంగా కుడివైపు ఉన్న గోడ కదిలింది. ఇద్దరు స్త్రీలు వచ్చారు. అది గోడకాదు... గోడలా భ్రమింప చేస్తున్న ద్వారం. అవతల ఏముందో కనిపించలేదు. చూసే ఛాన్స్ లేకుండా అతను ఆమెని ఛాతీకి గట్టిగ ఒత్తి పట్టుకున్నాడు. ముక్కు ఆ ఛాతీకి నొక్కుకుని ఊపిరాడడం లేదు.

“మత్తు మందు పట్రండి త్వరగా” చెప్పాడు. వాళ్ళు పరిగెత్తుకుని వెళ్ళారు. శ్రేష్ఠ విడిపించుకోడానికి పెనుగులాడుతోంది.

అతను మధ్య, మధ్య ఆమెని అలాగే పైకి కొంచెం ఎత్తి ముద్దుపెట్టుకుంటూ నిలుచున్న చోటే ఉండిపోయాడు. ఆ ఇద్దరు స్త్రీలు చేతిలో సిరంజ్ తో వచ్చారు. శ్రేష్టకి భయంతో ముచ్చెమటలు పోశాయి. వాళ్ళ వైపు దీనంగా చూసింది.

ఆ చూపులో అర్థం గ్రహించలేని తెలివితక్కువ వాళ్ళు కాదు వాళ్ళు. అయినా ఇలాంటి సంఘటనలు నిర్లిప్తంగా చూడడానికి అలవాటు పడిన వాళ్ళు ఆమె చూపులకి కరగలేదు. కళ్ళు వాల్చుకుని అతని చేతుల మధ్య ఉన్న ఆమె కాళ్ళ వైపు వచ్చి చీర పైకి జరపబోయారు. శ్రేష్ఠ బలంగా ఒక్కసారి ఊపిరి పీల్చుకుని లాగి తన్నింది. ఒకామె చేతిలో సిరంజ్ కిందపడింది. ఒకావిడ ఆ తన్నుకి వెల్లకిలా పడింది. ఆ సంఘటనతో ఆగ్రహోదగ్రుడైన అతను గబుక్కుని శ్రేష్టని కిందకి పడేసినట్టు దింపి లాగి ఆమె చెంప మీద కొట్టబోయాడు. శ్రేష్ఠ అతని చేయి పట్టుకుని గట్టిగా కొరికింది.

ఏ ద్వారం నుంచి ఆ ఇద్దరు స్త్రీలు వచ్చారో ఆ ద్వారం తెరిచే ఉంది. మరోసారి అతని చెంప మీద ఎడాపెడా రెండు గుప్పిళ్ళతో కొట్టి, అతను కొంచెం సర్దుకునేలోపల మెరుపులా పరిగెత్తింది.

పట్టుకోండి అరిచాడు.

ఆ స్త్రీలు వేగంగా శ్రేష్ఠ వెళ్ళిన వైపు పరిగెత్తారు.

శ్రేష్టకి ఎటు వెళ్ళాలో తోచలేదు. తను పరిగెత్తుకుని వచ్చిన చోటు కూడా ఒక గదే. అందులో ఆడవాళ్ళకి సంబంధించిన చీరలు, మిగతా బట్టలు ఉన్నాయి. బహుశా అది ఆ ఇద్దరు ఆడవాళ్ళకి కేటాయించిన గది కావచ్చు. వెనకాల వాళ్ళు వచ్చేస్తున్నారు.. ఆ గదిలో ఇంకా ఏముందో చూసే సమయం లేదు. ఎటు నుంచి బయటకి పారిపోవాలో అర్థం కాలేదు. మళ్ళీ వాడి పడక గదిలోకి వెళ్ళాల్సిందే. అక్కడికి వెళ్ళడం అంటే పులి బోనులోకి వెళ్ళడం. కానీ తప్పదు.. సాహసం చేయాలి.

శ్రేష్టకి భయం పోయింది. మొండి ధైర్యం వచ్చింది. దేనికీ భయపడని తత్త్వం ఇప్పుడు ఉపయోగించుకోవాలి. ఓటమిని ఒప్పుకునే మనస్తత్వం కాదు ఆమెది. క్షణంలో అరక్షణం ఆ గదిలో నిలువునా ఓ మూల నిలబెట్టబడిన కర్ర కనిపించింది.

ఆ స్త్రీలు ఇద్దరూ దగ్గరకు వచ్చారు. గభాల్న కర్ర తీసుకుని ఇద్దరి నెత్తిన వేసింది. వాళ్ళిద్దరూ తలపట్టుకుని కూలబడ్డారు. ఆమె ఆ కర్ర అలా పట్టుకునే తిరిగి తను వచ్చిన ద్వారం నుంచి వాడి బెడ్ రూమ్ లోకి వెళ్ళింది.

గడ్డం కుడిచేత్తో దువ్వుకుంటూ విషపు నవ్వు నవ్వుతూ అడ్డుగా నిలబడ్డాడు.

“మర్యాదగా తప్పుకోకపోతే చస్తావు” అంది కర్ర ఎత్తి.

పెద్ద, పెద్ద ఇనుప రాడ్లు కింద పడినట్టు నవ్వాడు. అలా నవ్వుతుంటే వాడి పొట్ట ఊగుతోంది. శ్రేష్ఠ జుగుప్సగా మొహం తిప్పుకుంది.

"ఏంటి ఈ కర్ర దెబ్బకే..! దీంతోటే నన్ను చంపుతావా" హేళనగా అడిగాడు.

శ్రేష్టకి వాడి నవ్వు, ఆ పలువరస రోతగా అనిపించింది. గడ్డం అడ్డుగా ఉండి మామూలుగా మాట్లాడుతుంటే తెలియలేదు కాని , దగ్గరగా చూస్తుంటే గారపట్టిన పళ్ళు, కళ్ళల్లో ఎర్రజీరలు పెద్ద తాగుబోతు అని తెలుస్తోంది.

"దరిద్రుడా నీకు పెళ్ళాం, పిల్లలు లేరా... నువ్వసలు మనిషివేనా.. దేవుడి పేరు చెప్పి జనాలని మోసం చేయడానికి సిగ్గులేదూ.. చెత్త వెధవా.. ఛీ నిన్ను నమ్మినందుకు ఇదా నీ బతుకు ...మర్యాదగా తప్పుకో" నిప్పులు కురిపిస్తూ అరచింది

అప్పుడే ఇద్దరు జమాజెట్టీల్లాంటి వ్యక్తులు గదిలోకి రావడం ఆమె చేతిలో కర్ర అవలీలగా లాగి అవతల పడేయడం జరిగి స్థాణువులా నిలబడిపోయింది.

"ఇప్పుడు తెలిసిందా నా సెక్యూరిటీ ... చెప్పు మర్యాదగా లొంగుతావా ... వాళ్ళ చేతుల్లో చస్తావా?" అడిగాడు.

శ్రేష్ఠ మాట్లాడలేదు. వాళ్ళిద్దరూ అతని ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నట్టు నిలబడ్డారు. శ్రేష్ఠకి నిస్సహాయతతో కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఆ గడ్డం , వాడి వేషం చూస్తుంటే కనీసం కన్నీళ్ళతో వేడుకోడానికి కూడా ఆమె అహం అడ్డొచ్చింది. వేడుకున్నంత మాత్రాన కరిగిపోయే మనిషికాదు కర్కోటకుడు అని తెలుస్తూనే ఉంది.

ఆమె ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా అంది "వాళ్ళని బయటకి పంపించు."

ఆ మాటకి అతని కళ్ళు మెరిశాయి కుడిచేయి ఎత్తి వాళ్ళ వైపు చూడకుండానే వెళ్ళమన్నట్టు సైగ చేసాడు.

వాళ్ళు వెళ్ళగానే రా అంటూ రెండు చేతులూ చాచి ఆమెకి దగ్గరగా నడిచాడు. ఆమె రెండు అడుగులు వెనక్కి వేసి అంది.

"ఇవాళ కాదు. రేపు ... నాకు ఒక్క రోజు టైం ఇవ్వు. "

"ఎందుకు? ఏం ప్లాన్ చేస్తావు పారిపోడానికి."

"నువ్వే చెప్పావుగా నేను ఇక్కడి నుంచి పారిపోలేనని..ఎలా పోతాను ?"

"ఓ ... ఆ సంగతి అర్ధమైంది కదా.. సరే... రేపు రాత్రి నువ్వు నేను పిలవకుండానే రావాలి. ఇక్కడే నా పక్కనే రాత్రంతా ఉండాలి.. తేడా వచ్చిందో" తర్జని చూపించాడు.

పాదాల దగ్గరనుంచీ పాకిన అసహ్యాన్ని అదిమిపట్టుకుని సరే అంది.

కొంచెం ముందుకి నడిచి ఆమెకి బాగా సమీపంగా వచ్చి చేయి పట్టుకోబోయాడు. ఆమె చివ్వున వెనక్కి తగ్గింది. ఏమనుకున్నాడో చేయి దించి అన్నాడు.

"సరే వెళ్ళు నీ గదిలోకే ... ఇంకెక్కడన్నా కనిపించావంటే నీ ప్రాణాలు పోయినట్టే గుర్తుంచుకో" హెచ్చరించాడు.

తలూపి  అక్కడి నుంచి నీరసంగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

తలుపు వేసుకుని మంచం మీద పడిపోయిన శ్రేష్టకి ఎగసి, ఎగసి దుఃఖం వచ్చింది.  వెక్కి, వెక్కి ఏడవసాగింది. ఎంత తప్పు చేసాను! అమ్మావాళ్ళ ఇంటికన్నా వెళ్ళకుండా ఇక్కడికి ఎందుకు వచ్చాను. ప్రద్యుమ్న నిజంగా మంచివాడే.. తనే అతన్ని బాధ పెట్టింది.  తన ప్రవర్తన వల్లే కదా అతను తన పట్ల విముఖంగా ఉన్నది.. ఎందుకు ప్రవర్తన మార్చుకోలేక పోయాను!  పల్లవి... పాపం పల్లవిని ఇష్టం వచ్చినట్టు తిట్టినా పన్నెత్తి ఒక్క మాట అనలేదు. పల్లవి లాంటి అమ్మాయిని ప్రేమించాడంటే ప్రేమించడూ.. ఒక మగవాడు  ఎలాంటి అమ్మాయి భార్యగా కావాలి అనుకుంటాడో అన్ని లక్షణాలు ఉన్న అమ్మాయి పల్లవి. పాపం ఆమెని తిట్టినందుకే తనకీ శిక్ష వేసినట్టున్నాడు దేవుడు.

అయ్యో దేవుడా! నన్ను రక్షించు... ప్లీజ్ రక్షించు...ఇక్కడి నుంచి నేను వెళ్లిపోవాలి...ఎలా? ఎలా? శ్రేష్ఠ గబుక్కున లేచి కూర్చుంది, కళ్ళు తుడుచుకుని బాగ్ లోంచి మొబైల్ తీసింది. ప్రద్యుమ్న కి ఫోన్ చేస్తే టెన్షన్ పడిపోతాడు. అసలే సున్నితమైన మనసు.. ఎలా తట్టుకుంటాడు. అందుకే తనకి చేయద్దు. ఒకే ఒక మిత్రుడు... ఎం చేయలన్నా అతనే ... అనిరుద్కి ఫోన్ చేసింది. అదృష్టవశాత్తూ వెంటనే తీసాడు.

అలా శ్రేష్ఠ ఫోన్లో చెప్పిన విషయం తరవాత శశి, ప్రద్యుమ్న, అనిరుద్ ఆ సుర్జిత్ సింగ్ గురించి పూర్తిగా ఆరా తీసారు. అతని కార్యకలాపాలు, రహస్య స్థావరాల వివరాలు, రాజకీయ పరపతి ఎవరెవరు నాయకులు అతన్ని కలుసుకుంటూ ఉంటారు. ఎవరి అండదండలు అతనికి పుష్కలంగా ఉన్నాయి మొదలైన విషయాలు తెలుసుకున్నాక అతడిని అరెస్ట్ చేయడం సంగతి పక్కన పెడితే ముందు శ్రేష్టని అక్కడి నుంచి బయటకు తీసుకురావడం ఎంత కష్టమో అర్ధం అయింది. ప్రద్యుమ్న భయంతో వణికిపోసాగాడు. శశి, అనిరుద్ కూడా అతడిని ఓదార్చి మామూలు మనిషిని చేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది.

"నా శ్రేష్టని ఎలాగైనా కాపాడు శశీ... వాడికి ఎంత డబ్బు కావాలన్నా ఎలాగోలా ఇచ్చేస్తాను శ్రేష్టని కాపాడు" అని ఏడవసాగాడు ప్రద్యుమ్న.

" నువ్వు టెన్షన్ పడి నన్ను కూడా టెన్షన్ పెట్టకు ... నేను ఎస్ పి గారితో మాట్లాడి ఒక యాక్షన్ ప్లాన్ ఆలోచిస్తాను. అనిరుద్ మళ్ళీ ఒకసారి ఆవిడకి ఫోన్ చేసి వాడిని కాస్త మాటల్లో పెట్టి తనని తను ఎలాగోలా రక్షించుకునే ప్రయత్నం చేయమను. జస్ట్ టాక్టిక్స్ ఉపయోగించడం తప్ప వేరే మార్గం లేదు. ఆమె అక్కడి నుంచి తప్పించుకునే మార్గం లేదు.." అన్నాడు శశి.

"ట్రై చేస్తున్నాను సార్ స్విచ్ ఆఫ్ అని వస్తోంది.. నాక్కూడా కొంచెం టెన్షన్ గానే ఉంది" అన్నాడు శశికి మాత్రమె వినిపించేలా అనిరుద్. శశి సాలోచనగా ఉండిపోయాడు.

ఆరోజు బాగా పొద్దు పోవడంతో ప్రద్యుమ్నని, అనిరుద్ ని ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పాడు.

"ఇంటికి వెళ్లి ఏం చేయాలి శశి.. నాకు పిచ్చెక్కుతుంది" అన్నాడు ప్రద్యుమ్న.

"మీ మావగారు, అత్తగారు నీకన్నా టెన్షన్ గా ఉంటారు కదా... వారితో ఈ విషయం చర్చించు..ఎలా వాడి మీద ఎటాక్ చేయాలో నీకే ఏదన్నా ఐడియా వస్తుంది. నాకు ఫోన్ చేసి చెప్పు. వాళ్లకి కూడా ఇప్పుడు నీ అటెన్షన్ అవసరం నా మాట విను " నచ్చ చెప్పాడు శశి.

" లేదు శశి మావయ్యని ఫేస్ చేయలేను ... చాలా సిగ్గుగా ఉంది. "

" నువ్వు మాత్రం ఊహించావా శ్రేష్ఠ ఇలా చేస్తుందని... ఏం పర్లేదు.. వెళ్ళు.. ఆయన చాలా పెద్దమనిషి అర్ధం చేసుకుంటారు."

"అవును ప్రద్యుమ్నా ... మనలను ఏ విషయం అయితే భయపెడుతుందో అదే విషయం ఎవరితో నైనా డిస్కస్ చేస్తుంటే ఆ భయం పోతుంది.. లేదంటే నాతొ మా ఇంటికి రండి" అన్నాడు అనిరుద్.

ప్రద్యుమ్న గుండె నిండా దుఖం నిండి ఉంది. శ్రేష్ఠ ఎంత పెద్ద అపాయంలో ఉందో వీళ్ళకి అర్ధమవుతోందా! ఎంత ఈజీగా చెబుతున్నారు . డిస్కస్ చేయాలిట డిస్కస్.. నో తను ఇంటికి వెళ్ళలేడు.. మావయ్య, అత్తయ్యల మొహం చూడలేడు. అనవసరంగా తను ఆమెతో గొడవ పడిన సన్నివేశం గుర్తు వచ్చి మనసుని మెలిపెడుతుంది. శ్రేష్ఠ సంగతి తెలిసి కూడా తను అనవసరంగా రెచ్చిపోయి ఆమెని రెచ్చగొట్టాడు. పరిస్థితి ఇంతదాకా రావడానికి తనే కారణం. ప్రద్యుమ్న సున్నితమైన మనసు జరిగిన సంఘటనలో తనదే తప్పు అని నిర్ణయించేయడంతో కృంగిపోయాడు.

శశి అతని ఆలోచనలు గ్రహించిన వాడిలా మృదువుగా అన్నాడు. "శ్రేష్ఠ చాలా తెలివైనది, ధైర్యస్తురాలు. తన మీద నాకు గట్టి నమ్మకం ఉంది. ఎలాగోలా వాడిని మాయ చేసి తనకి అపాయం జరక్కుండా చూసుకోగలదు. నా ఉద్దేశంలో ఈ పాటికి ఖచ్చితంగా తప్పించుకునే మార్గాలు అన్వేషిస్తుంది .. తెల్లవారగానే వెళదాం నువ్వు వెళ్ళిపో ఇంటికి.

చాలాసేపు శశి, అనిరుద్ కూడా నచ్చచెప్పిన మీదట ప్రద్యుమ్న అనిరుద్ తో వెళ్ళడానికి ఒప్పుకున్నాడు.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక శశి కారులో కూర్చుని మొబైల్ లో కాంటాక్ట్ లిస్ట్ చూసాడు. అందులో ఆ ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో ఉన్న పోలీస్ స్టేషన్ ఎస్ ఐ బాగా తెలుసు శశికి. మంచివాడు. లిస్ట్ మొత్తం వెతికాక కనిపించింది అలోక్ ఫోన్ నెంబర్.

డయల్ చేసాడు. ఫోన్ రింగ్ అవుతుండగా కారు స్టార్ట్ చేసాడు.

అలోక్ హియర్ ... అతని స్వరం వినిపించింది.

కారు నడిపిస్తూనే మాట్లాడసాగాడు. జానకి ఈ మధ్య టివి లో సీరియల్స్, సినిమాలు వంటల కార్యక్రమాలు మానేసి వార్తలు బాగా చూస్తోంది. వార్తలు చూడడానికి కారణం ఎక్కడన్నా దొంగ బాబాల వార్తలు తెలుస్తాయని. అలాంటి వార్త తెలిస్తే తను ఏం చేయాలో గట్టిగా నిర్ణయించుకుంది. కిరణ్ చెప్పిన సూత్రాన్ని అనుసరించి ఆవిడ తనని ఇంతకాలం ఏ వార్తలు అయితే భయపెట్టాయో ఆ వార్తలు భయంతో కాక ఆసక్తితో చూసి, ఈ సమాజం లో జరిగే అనేక దారుణాలు ఎందుకు జరుగుతున్నాయి.. ఇవి జరక్కుండా ఏం చేయాలి.. ఎవరు చేయాలి... ఎలా చేయాలి అనే విషయాలు భర్తతో చర్చిస్తోంది. ఆవిడ ఆలోచనా పరిధి పెరిగింది.

చరితని అక్కడికి వెళ్ళకు, ఇక్కడికి వెళ్ళకు అంటూ నిషేధించ కుండా బయటకు వెళ్ళినపుడు ఏదైనా అనుకోని పరిస్థితి ఎదురైతే ఎలా స్పందించాలో, ప్రమాదకరమైన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తనకు తోచిన రీతిలో చెప్తోంది.

భాస్కర్ కాని, పిల్లలు కానీ ఆవిడలో వచ్చిన మార్పు చూసి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. ఎంత మార్పు వచ్చింది జానకిలో అనుకున్నాడు భాస్కర్. ఆడవాళ్ళు అమాయకులు కారు, తెలివి తక్కువ వాళ్ళు అసలేకారు.. వాళ్ళని అలా తయారు చేసేది మగవాళ్ళే.. అన్నిటికీ తమ మీద భార్య ఆధారపడి బతుకుతుంటే అదో ఆనందం మగవాడికి. నువ్వెందుకు వెళ్లావు చెబితే నేను తెచ్చేవాడినిగా అంటూ ఎక్కడికీ వెళ్ళనివ్వక పోవడం మగవాళ్ళు చేసే నేరం అనిపించింది.

ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళని కూడా కొందరు మగవాళ్ళు ఆఫీస్ నుంచి ఇంటికి నేరుగా వచ్చేయ్ ... ఏదన్న కావాలంటే నేను చేస్తా అని చెప్పడం అతనికి తెలుసు. ఆఖరికి చిన్న, చిన్న అనారోగ్యాలు వచ్చినా భర్త దగ్గరుండి తీసుకుని వెళితే తప్ప డాక్టర్ దగ్గరకు కూడా వెళ్ళరు కొందరు ... ఆడవాళ్ళలో ఈ పరాదీనతే లోకజ్ఞానం లేకుండా చేస్తోంది వారిలో

కొన్ని వ్యవహారాల్లో కూడా ఆడవాళ్ళని మాట్లాడనివ్వరు . వాళ్లు మాట్లాడితే తమ మగతనానికి ఏదో లోటు వచ్చినట్టు బాధపడతారు. స్వంత ఆలోచన, వ్యక్తిత్వం స్త్రీ మేధస్సుని ఎంత భాగా వికసింప చేస్తుందో ప్రత్యక్షంగా చూస్తుంటే అతనికి ఇంతకాలం తను చేసిన తప్పేంటో అర్థం అయి గిల్టీగా అనిపించసాగింది. ఆ విషయమే శారద భర్త దగ్గర అంటే ఆవిడకి ఎదురైన అనుభవం నుంచి నేర్చుకున్న పాఠం సార్ అన్నాడు. అదికూడా కావచ్చు అనుకున్నాడు భాస్కర్.

జానకి రమణ మహర్షి, వివేకానందుడి పుస్తకాలు చదువుతోంది. భక్తీ, వెంకటేశ్వర భక్తీ చానెల్ మొదలైన చానెల్స్ లో చాగంటి, గరికపాటి ప్రవచనాలు వింటోంది. హిందూ మతం పట్ల, ధర్మం పట్ల వాళ్ళు చెపుతున్న ప్రవచనాలు వింటుంటే నేనెంత గొప్ప దేశంలో పుట్టాను అనిపిస్తోంది ఆమెకి. నా ధర్మాన్ని, నా దేశాన్ని, నా మతాన్ని కాపాడుకోడం నా బాధ్యత కాదా అనుకుంటోంది. ఎంతో గొప్పది అనుసరించ దగినది అయిన హిందూ మతం ఎందుకు భ్రష్టుపట్టి పోతోందో వాళ్ళ ప్రవచనాల ద్వారా తెలుసుకోడం ఆమెకి ఉత్సాహాన్ని

ఇస్తోంది. ముఖ్యంగా గరికపాటి గారి ఆధునిక ఆలోచనా ధోరణి ఆవిడని బాగా ఆకర్షిస్తోంది. తను ఇంట్లో చేసే పూజల్లో కూడా కొన్ని మార్పులు చేసుకుంది. దేవుడి గదిలో గంటలు, గంటలు గడిపే జానకి ఇప్పుడు పది నిమిషాల్లో పూజ ముగించి బయటకు వస్తోంది. ఇల్లు, పరిసరాలు, మనసు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలండి అదే పూజ ... ఈ మాట ఇంగ్లిష్ వాడే చెప్పాడు cleanliness is Godlinessఅని ... అని చెప్తుంటే నోరు తెరుచుకుని విన్నాడు భాస్కర్. పూజ చేయడం అంటే పసుపు, కుంకుమలు పారబోయడం కాదు, అరిషడ్వర్గాలు భగవంతుడికి అర్పించడం ... కష్టం వస్తే వెళ్ళాల్సింది బాబాల దగ్గరకు కాదు .. భగవంతుడి దగ్గరకు. అలా అని గుళ్ళు, గోపురాలు తిరగడం కాదు .. మానసికంగా భగవంతుడిని చేరడం అనే మహానుభావుల వాక్కు ఆవిడ నమ్ముతోంది.

అతిగా ఆలోచించకూడదు.. అతిగా ఆలోచించడం వలన negative ఆలోచనలు వస్తాయి.. రోజుకు ఒక్కసారైనా మీతో మీరు మాట్లాడుకోండి..లేకపోతే ఒక అద్భుతమైన వ్యక్తితో మాట్లాడడం అనేది కోల్పోతారు అన్న వివేకానంద సూక్తి ఆవిడని బాగా ప్రభావితం చేసింది. అందుకే అందరూ వెళ్ళిపోయాక ఒక్కతీ కూర్చుని జరిగిన విషయాలు, జరుగుతున్న విషయాలు తల్చుకుని ఒకదానితో ఒకటి బేరీజు వేసుకుంటూ యాభై ఏళ్ల జీవితం ఎంత నిష్ప్రయోజనంగా గడిచింది అని నిట్టూరుస్తుంది. ఇక మిగిలిన జీవితం అయినా ఏదైనా ప్రయోజనకరమైన కార్యంతో సఫలం చేసుకోవాలి అని నిర్ణయించుకుంది.

ఆవిడ నిర్ణయాల్లో అతి ముఖ్యమైంది హిందూ మత పరిరక్షణ... ఈ పేరుతొ కొందరు స్వార్ధపరులు చేస్తున్న కుట్రలు ...సమాజంలో రగులుతున్న దొంగ బాబాల సమస్య. వీళ్ళ వలన అనేక చీకటి వ్యాపారాలు జరగడం ప్రభుత్వ స్థలాలు కబ్జా అవడం అమాయకులు వాళ్ళ మాయలో పడి జీవితాలు నాశనం చేసుకోడం, అమ్మాయిలను వ్యాపారవస్తువులు చేయడం ఇవి అన్నీ ఒక ఎత్తు... ఇవన్నీ చూసి ఇతర మతాల వాళ్ళు హిందూమతాన్ని చులకన చేసారంటే చేయరూ.. అందుకేగా నవ్వులపాలు అయిపోతోంది అన్న ఆవేదనగా అనుకుంది. అందుకు తను ఏదన్నా చేయాలన్న తపన ఆవిడలో రోజు,రోజుకీ పెరుగుతోంది.

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డేరా బాబా కధ , ఆశారం బాబా, ఇంకా ఎందఱో బాబాలు హిందూ దేవుళ్ళని అడ్డు పెట్టుకుని తమని తాము దేవుళ్ళుగా ప్రకటించుకుంటూ ప్రజల బలహీనతతో పెద్ద, పెద్ద సంస్థానాలు నిర్మించు కోడం కధలు, కధలుగా వింటుంటే ఆవిడ నర,నరం ఆవేశంతో రగులుతోంది. తనని భగవంతుడు కాపాడకపోయి ఉంటె తను చేసిన తెలివితక్కువ పనికి ఏం జరిగేదో తలచుకుంటే చాలు... ఆవిడ రక్తం మరిగిపోతుంది. సమాజంలో చాప కింద నీరులా పాకుతూ మొత్తం దేశాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న దొంగబాబాల బారి నుంచి అమ్మాయిలను, అమాయకులను రక్షించడం తన కర్తవ్యంగా భావించింది.

ప్రతి ఆదివారం ఇంటి దగ్గర ఉన్న గుడిలో ఇంటి చుట్టూ పక్కల మహిళలతో కలిసి వెళ్లి పని కట్టుకుని దొంగ బాబాల గురించి వాళ్ళు చేస్తున్న దారుణాల గురించి చెబుతూ ఎవరూ కూడా జ్యోతిష్యం, స్వామీజీలు నమ్మవద్దని, ఏ కష్టం వచ్చినా ధర్మాన్ని ఆచరిస్తూ, భగవంతుడిని నమ్ముకుంటూ తమ పని తాము చేసుకోవాలని చెప్పడం మొదలుపెట్టింది. ఒక్కో వారం భారతంలోని ఒక్కో ఘట్టం చెబుతూ భారతం జీవన వేదం అనీ మానవ జీవితం మొత్తం భారత కధే అని చెప్పడం కాక హిందూ సంప్రదాయాలు, ఆచారాలు మూఢనమ్మకాలు కాదని ప్రతి ఆచారం వెనుక ఒక శాస్త్రీయత ఉందని తనకు తోచిన రీతిలో చెప్తుంటే ఆవిడకి ఆ కాలనీలో బోలెడు మంది అభిమానులు ఏర్పడడం కాక, ఆమెని అనుసరించడానికి కూడా ముందుకు వస్తున్నారు.

ఏమాత్రం దొంగ బాబాల గురించిన వార్త విన్నా మంది, మార్బలంతో వెళ్లి ఆ బాబాలను తరిమి కొట్టాలని అందరికీ బోధించింది. జానకి బాటలో శారద కాక మరో ఇరవై మంది మహిళలు కూడా తోడయారు. రోడ్ల మీద అడుక్కునే సాధువులు కనిపిస్తే ఎందుకు అడుక్కుంటారు కష్టపడి పని చేసుకోలేరా అని తిట్టేస్తోంది. అలాగే వినాయకుడి గుడిలో ఇద్దరు, ముగ్గురు సాధువులు అరుగుమీద కూర్చుని

గుడికి వచ్చిన భక్తుల దగ్గర భిక్ష అడుగుతుంటారు. ఇంతకూ ముందు అనేక సార్లు పదేసి రూపాయలు, ఇస్తుండేది. ఈ మధ్య ఇవ్వడం మానేసింది. ఇలా దేవుడి పేరు చెప్పి అడుక్కోడం, దేవుడి పేరు చెప్పి అక్కర్లేని పూజలు చేయించడం ఇవన్నీ భక్తులను దోచుకోడం అని ఈ అలవాటు మానుకోండి అని క్లాసులు పీకుతోంది. ఒక అత్యంత సాధారణ గృహిణి తన కాలనీలో చేపట్టిన మూఢనమ్మకాల సంస్కరణా కార్యక్రమం పక్కన ఉన్న కాలనీల వాళ్ళు కొందరిని కూడా ఆకర్షించింది.

సరిగ్గా అప్పుడే టి వి లో మెదక్ చుట్టూ పక్కల ఉన్న ఒక గ్రామంలో రాత్రికి రాత్రి నేను బాబాని మీ అందరి కష్టాలు తీర్చడానికి వచ్చిన శివుడిని అని ప్రజలని నమ్మించి తన అవినీతి కార్యకలాపాలు యధేచ్చగా సాగిస్తున్న సుర్విత్సింగ్ బాబా ఆశ్రమం మీద రెయిడ్ జరిగినట్టు అన్ని చానెల్స్ లో వార్తలు మొదలయాయి. జానకి నిటారుగా అయింది. ఊపిరి బిగపట్టి చూడసాగింది.

అత్యంత భద్రతా ఏర్పాట్లతో, ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేసి, ఆశ్రమం గా పిలవబడే ఆ బాబా డెన్ మీద దాడి చేసి అతని బండారం బయట పెట్టడం కాక, ఎంత మంది రాజకీయ నాయకులు అడ్డం పడినా అతడిని అరెస్ట్ చేసాడు ఏ.ఎస్.పి శశిధర్ . అతడిని ఇంటర్వ్యూ చేస్తున్నారు.

"సార్! ఇంతవరకూ ఎవరికీ కించిత్తు అనుమానం కూడా రాకుండా తన కార్యకలాపాలు యదేచ్చగా కొనసాగిస్తున్న ఈ సుర్విత్ సింగ్ ఇంత పెద్ద క్రిమినల్ అని మీకెలా తెలిసింది... మీరెలా ఆయనని ఆయన శిష్యుల్ని పట్టుకున్నారు. "

శశి యాంకర్ ప్రశ్నకి చిన్నగా నవ్వి చెప్పసాగాడు. " నాకూ అదే విచిత్రంగా ఉంది. చాలా యాదృచ్చికంగా జరిగింది. నా స్నేహితుడు అతని భార్య గొడవపడ్డారు. ఆ గొడవ చిలికి, చిలికి గాలివాన అయి ఆవిడ ఇంట్లోంచి వెళ్ళిపోయింది. నా స్నేహితుడు నాకు ఫోన్ చేసాడు. నేను హుటాహుటిన వెళ్లాను. బంధువుల ఇంటికో, స్నేహితుల ఇంటికో వెళ్లిందని ఆవేశం తగ్గాక తనే వస్తుందని నేను ఒదార్చాను. కానీ అనుకోకుండా మరో స్నేహితుడి ద్వారా ఆమె ఈ బాబాను కలుసుకోడానికి వెళ్ళిందన్న విషయం తెలిసింది."

"ఎలా? ఆవిడ చెప్పారా? ఆవిడ మీకు ఫోన్ చేసారా?" అడిగాడు యాంకర్.

"నాకు కాదు నాకు ఈ కేసు విషయంలో సాయం చేస్తున్న మరో మిత్రుడికి చేసారు ఆవిడ."

"అంటే ఆయన మీ మిత్రుడికి ...." సంశయంగా చూసాడు యాంకర్.

"మిత్రుడు ... ఏం ఆడవాళ్ళకి మగవాళ్ళు స్నేహితులుగా ఉండకూడదా."

అతని స్వరంలో వినిపించిన సీరియస్ నెస్ కి బెదిరినట్టుగా అన్నాడు.. "అబ్బే అదేం లేదు సార్ చెప్పండి. ఆవిడకి ఈ బాబా దగ్గరకే ఎందుకు వెళ్ళాలి అనిపించింది."

శశి చిరునవ్వుతో అన్నాడు. " ఎవరి నమ్మకాలు వాళ్ళవి.. ఆవిడకి కొంచెం ఈ బాబాలు, మహిమలు అంటే మొదటి నుంచీ నమ్మకం.. అంతే కాదు జ్యోతిష్యం కూడా ఎక్కువగా నమ్ముతుంది. తన జాతకంలో ఎవరో భర్తతో సఖ్యత ఉండదని చెప్పారుట. అది నిజమా, కాదా అని confirm చేసుకోడానికి కూడా వెళ్లి ఉండచ్చు. ఇది మానవ బలహీనత.. దీనికి పెద్ద రీజనింగ్ ఉండదు."

"అఫ్కోర్స్ ... ఈ మధ్య చదువుకున్న వాళ్ళే ఇలాంటివి బాగా నమ్ముతున్నారు.. ముఖ్యంగా యువత బాబాల చుట్టూ తిరుగుతున్నారని వింటున్నాము."

"అవును ... కారణం వాళ్ళకున్న ఓవర్ ambitions.. ఏదో సాధించాలి అని ఆరాటం.. సాధించగలమా! లేదా అన్న సందేహం .. ఆ సందేహం తీరాలంటే మాట్లాడే దేవుడు అని ప్రచారం కాబడుతున్న ఈ బాబాలు. "

"కరెక్ట్ సార్... సో ఆవిడ కూడా తన సమస్య బాబా గారికి చెప్పుకోడానికి వెళ్ళారు."

" అవును. వెళ్ళాక తెలిసింది అతను ఎలాంటి వాడో.. వెంటనే భర్తకి చెప్పాలనుకుని అతని సున్నితమైన మనస్తత్వం తెలుసు కాబట్టి టెన్షన్ తో ఏం చేస్తాడో అనే భయంతో తన ఫ్రెండ్కి ఫోన్ చేసి చెప్పింది. ఆవిడ ఫోన్ చేయడం తెలిసిన ఆ బాబా అనుచరులు ఫోన్ లాగేసుకున్నారు. ఆ తరవాత మాకు ఆవిడ నుంచి ఎలాంటి కమ్యూనికేషన్ లేదు.

ఆ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియక మా officials తో డిస్కస్ చేశాము. ముందు ఆ ఆశ్రమ వివరాలు సేకరించాము. ఆ గ్రామ ప్రజలను కొందరిని మా ఇనస్పెక్టర్ ఇంటర్వ్యూ లు చేసి ఆ బిల్డింగ్ అసలు ఎప్పుడు, ఎలా అతి తక్కువ వ్యవధిలో వచ్చిందో తెలుసుకున్నారు. మేము అక్కడ నుంచి ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టాము .. ఈ బాబా గురించి అనేక విషయాలు తెలిసాయి. లోకల్ స్టేషన్ ఇనస్పెక్టర్ నా మిత్రుడు. అతనిని అడిగితే ఈ సంగతి మాకు చూచాయగా అనుమానం వ్యక్తం చేసినట్టుగా తప్ప పక్క కంప్లయింట్ రాలేదని చెప్పాడు. నేను జరిగింది చెప్పి ఒకసారి ఆశ్రమానికి వెళ్ళి చూసి రమ్మని చెప్పాను. అతను చాలా తెలివైన వాడు. తను వెళ్ళకుండా ఒక లేడీ కానిస్టేబుల్ని ఒక భక్తురాలిగా పంపించాడు. వెనకే మరో ఇద్దరు కానిస్టేబుల్స్ మఫ్టీలో వెళ్ళారు.

ఆవిడ లోపలికి వెళ్ళి తనకి వయసు దాటిపోతున్నా పెళ్ళి కావడం లేదని అందుకే ఆయన దగ్గరకు వచ్చానని చెప్పింది. వారం రోజులు ఆశ్రమంలో ఉండి కొన్ని పూజలు చేస్తే తప్పకుండా పెళ్ళి అవుతుందని చెప్పాడు. అయితే మా ఇంట్లో చెప్పి రేపు వస్తాను అని ఎంతో నమ్మకంగా చెప్పి బయటపడింది. "

యాంకర్ ఉత్సాహంగా అన్నాడు... "అమ్మో.. ఎంత లక్కీ ఆవిడ.."

"ఇక్కడ అదృష్టం కన్నా, లాజిక్ ఉపయోగపడింది అనవచ్చు. సాధారణంగా జ్యోతిష్కులు కానీ, ఏదన్న నిజంగా మహిమ ఉన్న వాళ్ళు కానీ ఒక తాయెత్తు ఇస్తారు. లేదంటే ఏదన్నా గుడికి వెళ్ళి ఫలానా పూజ చేయించు, లేదా 108 ప్రదక్షణలు చేయి అని చెప్పడం సర్వ సాధారణం. ఇలా మా ఆశ్రమంలో వారం రోజులు ఉండాలి. లేదా రెండు రోజులు ఉండాలి అని చెప్పగానే అనుమానం రావాలి. ఆ విషయం తెలిసిన మనిషి కాబట్టి ఆవిడ చాకచక్యంగా తప్పించుకుని వచ్చి విషయం చేరవేసింది. "

" నేను నా మిత్రులు మా ఫోర్సు తో మెదక్ వెళ్లాను. వెళ్ళే ముందు హోమ్ మినిస్టర్ ని కలిసి విషయం వివరించాము. ఆయన అనుమతి తీసుకుని వెళ్ళాము. అక్కడ లోకల్ స్టేషన్ ఇనస్పెక్టర్ అలోక్, కానిస్టేబుల్స్ అందరూ కూడా ఎంతో ధైర్యంగా, చాకచక్యంగా డీల్ చేసారు . లేకపోతే ఆయనని పట్టుకోడం సాధ్యం అయేది కాదు.

చూడడానికి ఆశ్రమం లా కనిపించే ఆ బంగాళా ఒక పద్మవ్యూహంలా ఉంది. . అందులోకి ఒకసారి అడుగుపెడితే బయటకు రావడానికి చాలా కష్టం, గమ్మత్తేంటంటే చూడడానికి గోడల్లా ఉంటాయి కానీ ఒక గదిలోనుంచి మరో గదిలోకి వెళ్ళడానికి ఆ గోడలే ద్వారాలుగా మారుతుంటాయి. గదుల్లోకి వెళ్ళడం అంటే జైలు లోకి వెళ్ళడం ... అలాంటి ఆ జైలులోకి ఎలా వెళ్లిందో నా స్నేహితుడి భార్య వాడి గుహలాంటి ఆ బంగళాలో ఇరుక్కుపోయింది. ఆవిడ ఫోన్ చేయడం గమనించాక, ఫోన్ తీసేసుకోడం కాక, ఆ తరవాత ఆవిడని నానా విధాలుగా టార్చర్ పెట్టారట అతను , అతని అనుచరులు. ఒళ్ళంతా గాయాలు... ఇప్పుడు హాస్పిటల్ లో ఉంది.. fortunately ప్రాణాపాయం లేదు. "

"థాంక్స్ సార్... " శశికి కృతజ్ఞతలు చెప్పిన యాంకర్ మళ్ళీ మొదలుపెట్టాడు.

"విన్నారుగా... ఇదండీ నేనే దేవుడిని అంటూ ఇంద్రజాల మహేంద్ర జాలాలు చేసి అవే దైవ లీలలుగా అమాయక ప్రజలని నమ్మించి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ది గ్రేట్ సుర్జిత్ సింగ్ బాబా లీలలు.. ఈ సమాజంలో ఇప్పుడు అసలైన క్రిమినల్స్ ఈ బాబాలే. మహారాజా పాలెస్ లాంటి అనేక పాలెస్ లు దేశంలోని అనేక చోట్ల నిర్మించుకుని విలాసవంతమైన జీవితం గడుపుతూ ప్రజల దృష్టిలో సర్వసంగ పరిత్యాగిగా పేరు పొందిన బాబా ఇప్పుడు జైల్లో ఊచలు లెక్క పెడుతున్నారు. పదండి వారు ఏం చేస్తున్నారో చూద్దాం ... "

తరవాత live టెలికాస్ట్ మొదలైంది. జైల్లో ఉన్న దుర్మార్గుడిని చూపించారు. అతని మందీ మార్బలం జైలు బయట హర్తాల్ చేయడం,

జానకి ఒళ్ళంతా చెమటలు పట్టేసింది.

ఎంత దారుణం! ఎలా పుడుతున్నారు ఈ బాబాలు .. ఎంత మందిని అరెస్ట్ చేసారు అయినా ఇంక, ఇంకా ఎక్కడినుంచి వస్తున్నారు ... ఒకళ్ళు దొంగ అని తెలిసాక రెండోవాడిని ఎలా నమ్ముతారు? ఇద్దరు, ముగ్గురు, ఇంకా, ఇంకా పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నారు.. వీళ్ళకి అంతంత స్థలాలు ఎలా లభిస్తున్నాయి. ఒక సామాన్యుడు రెండు గదుల ఇల్లు నిర్మించుకోడానికి యాభై గజాల స్థలం ఇవ్వని ప్రభుత్వం ఈ దొంగ వెధవలకి ఎలా వందల, వేల ఎకరాల భూమి అప్పనంగా ఇస్తోంది.

జానకి మెదడంతా ఆలోచనలతో బరువెక్కింది. వెంటనే వెళ్లి ఆ బాబాని ఆ చెంపా, ఈ చెంపా ఎడా, పెడా కొట్టాలనిపించింది. ఆ అమ్మాయి ఎవరో పాపం ఎలా ఉందో!

భాస్కర్ వచ్చినట్టు స్కూటర్ శబ్దం అవడంతో గబుక్కున లేచి ఎదురు వెళ్ళింది.

"చూసారా అనుకున్నంతా అయింది.. ఇంకో దొంగ వెధవ పట్టు పడ్డాడు. ఎందుకండీ ఈ జనాలు ఇలా నమ్ముతారు.. ఎన్ని అనుభావాలైనా బుద్ధి రాదేం వీళ్ళకి ...పాపం ఆ అమ్మాయేవరో నాకు వెళ్లి చూడాలని ఉండండి .. ప్లీజ్ వెళదామా" జాలిగా అడుగుతున్న జానకి వైపు చూసి ఆమె నుదుట పడిన వెంట్రుకలు సవరిస్తూ అన్నాడు " విన్నాను జానకీ.. వార్త దావానలంలా పాకింది.. సోషల్ మీడియాలో వైరల్ అయింది.. మొత్తానికి పట్టు పడ్డాడు.. ఆ అమ్మాయి సేవ్ అయింది... చాలు... వెళ్లి ఏం చేస్తావు ?"

"ఆ అమ్మాయికి బుద్ధి చెప్తాను. ఎంత మొగుడిమీద కోపం వస్తే మాత్రం దొంగ బాబా దగ్గరకు వెళ్ళడం అంటే తెలిసి, తెలిసి పులి బోనులో తలపెట్టడం కాదా... చదువుకున్న పిల్లకి ఆ మాత్రం బుద్ధి లేకపోతే ఎలా?"

నవ్వాడు భాస్కర్. " ఇప్పుడు చెప్పడం దేనికి? ఆ అమ్మాయికే తెలిసింది కదా అనుభవం అయితే గాని ఇలాంటి విషయాల్లో ఎవరూ బుద్ధి తెచ్చుకోరు జానకీ.. అనవసరంగా ఆందోళన పడకు."

"అలా అని అందరూ ఊరుకుంటే ఇలాంటి దారుణాలు పెరిగిపోవా.. ఒక్క వ్యక్తీ వలనో, ఒక సంస్థ వల్లనో మారతారా.. అందరూ కలిసి సమిష్టిగా కృషి చేస్తేనే కదండీ మార్పు వచ్చేది. "

"నువ్వన్నది అక్షరాలా నిజం జానకీ! అందుకే నువ్వు ఈ విషయం చేస్తున్న కృషికి నేను సహకరిస్తున్నాను. నీలాగే మరి కొందరు, ఆ మరి కొందరు ఇంకా మరి కొందరిని జత కూడండి. అందరూ కలిసి ఒక సంస్థగా ఏర్పడండి... నేను రిజిస్టర్ చేయిస్తాను.

ఒక పని చేయి గుడిలో నువ్వు ఇస్తున్న ఉపన్యాసాలు మరి కొన్ని గుళ్ళల్లో ఇవ్వు.. వీలయితే మీ మహిళలు ఎప్పుడన్నా గర్ల్స్ కాలేజీకి వెళ్లి, ఆడవాళ్ళు ఎక్కువ మంది ఉన్న చోట్లకి వెళ్లి చెప్పండి.. ప్రచారాలు చేయండి.. బాబాలను నమ్మద్దని కృషిని, పట్టుదలని, ఆత్మవిశ్వాసాన్ని నమ్మాలని చెప్పండి..

నీకు తెలుసా పరీక్షల్లో ఫెయిల్ అయ్యే అమ్మాయిలూ, మార్కులు తక్కువ వచ్చాయని భయపడే అమ్మాయిలూ, అత్తగారు వేదిస్తున్నదని బాధపడే వాళ్ళు భర్త బాధలు తట్టుకోలేని వాళ్ళు, పిల్లలు సరిగా చదువుకోడం లేదన్న ఫ్రస్ట్రేషన్ ఉన్న వాళ్ళు ఇలా చాలా మంది బాబాలను నమ్ముతారు...

అలాగే తమ పార్టీ గెలుస్తుందా లేదా తమ పార్టీ అధికారంలోకి వస్తుందా లేదా అని రాజకీయ నాయకులూ వెళ్తే, తమ బిజినెస్ ఎలా నడుస్తుందని ఎలా కోట్లు సంపాదిస్తామని అడగడానికి కొందరు వ్యాపారులు, నా సినిమా వంద రోజులు ఆడుతుందా అని నిర్మాతలు, హీరోలు, నా ప్రేమ ఫలిస్తుందా లేదా అని యువకులు ఇలా బాబాలని నమ్మని వాళ్ళు లేరు. దేవుడిని నమ్మని వాళ్ళు ఉండచ్చు కాని బాబాలను మాత్రం అందరూ నమ్ముతారు. కారణం వాళ్ళు చేసే ఇంద్రజాలాలు మహిమల్లా భావించడం .. కాబట్టి ఇవన్నీ చెప్పండి మీరు వెళ్లి .. ప్రజలని ఎడ్యుకేట్ చేయండి. ఒక విషవృక్షం బాగా ఎదిగి దాని కొమ్మలు సమాజం మొత్తం విస్తరిస్తుంటే చెట్టు కొట్టేయడం కాదు, మొదళ్ళ దగ్గరనుంచి అంటే రూట్స్ నుంచి పీకి అక్కడ కిరోసిన్ పోసి అగ్గిపుల్ల వేయాలి. అప్పుడు మళ్ళి చిగురించదు."

జానకి భర్తవైపు కళ్ళప్పు చెప్పి చూడసాగింది. ఆవిడ మనసులో తన కర్తవ్యం ఏమిటో స్పష్టంగా అర్థం ఒక రూపం దిద్దుకుంటున్నట్టుగా అనిపిస్తోంది.

ఆమె భుజం చుట్టూ చేయి వేసి లోపలికి నడిపించుకుంటూ వెళ్ళాడు భాస్కర్.

శ్రేష్ఠ మంచం మీద లేచి కూర్చుంది. ప్రద్యుమ్న బత్తాయి రసం గ్లాసులో పోసి ఆమె పక్కనే కూర్చుని ఒక చేయి ఆమె మెడచుట్టు వేసి, ఒక చేత్తో తాగించసాగాడు. మరో కుర్చీలో అనిరుద్ కూర్చున్నాడు.

శ్రేష్ఠ కళ్ళల్లో కారిన నీళ్ళు టప్ మంటూ రసం లో పడ్డాయి. తాగడం ఆపేసి మోకాళ్ళ మధ్య తలపెట్టుకుని వెక్కి, వెక్కి ఏడవసాగింది ...

"ఏడవకు శ్రేష్టా.. జరిగిందంతా ఒక పీడకల అనుకుని మర్చిపో. నిన్ను నేను ప్రేమిస్తున్నాను శ్రేష్టా.. నన్ను నమ్ము. పెళ్లి కాక ముందు ఎవరి జీవితం వాళ్ళది అయినా పెళ్ళయాక నా జీవితం నీ జీవితంతో ముడిపడి ఉందని తెలియని మూర్ఖుడిని కాను. కొంచెం అర్ధం చేసుకో శ్రేష్టా... అపార్థాలు వినాశకాలు. మన మధ్య ఇంక అపార్ధాలు వద్దు.."

"నువ్వు కూడా నాకు అనిరుద్ కి అఫైర్ ఉందని అనుకోలేదా.." రోషంగా అంది నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ.

అనిరుద్ ఇబ్బందిగా కదిలాడు.

"సారీ చెప్పాను అనిరుద్ కి నీకు కూడా చెప్తున్నాను సారీ...సారీ .."

అనిరుద్ లేచి నిలబడి " మీరిద్దరూ రిలాక్స్ అవండి నేను మళ్ళీ ఈవినింగ్ వస్తాను" అన్నాడు.

అప్పుడే శశి లోపలకు వచ్చాడు "హవార్యు శ్రేష్టా" అడిగాడు.

అతని రాకతో శ్రేష్ఠ, ప్రద్యుమ్న సర్దుకున్నారు. "ఫైన్" అంది నీరసంగా నవ్వి.

ప్రద్యుమ్న శశి చేయి అందుకుని "చాలా థాంక్స్ శశి ... నిజానిక్ నీ ఋణం థాంక్స్ తో తీరేది కాదు.." అన్నాడు.

"నో నో మా డిపార్ట్ మెంట్ మీ ఇద్దరికీ రుణపడి ఉంది. శ్రేష్టా నిజంగా నీ సాహసం రిమార్కబుల్" అన్నాడు శశి నవ్వుతూ.

ఇంతలో డాక్టర్ , ఆయన వెనక నర్స్ వచ్చారు. డాక్టర్ శ్రేష్టని పరీక్షించి "డిశ్చార్జ్ అవుతారా?" అన్నాడు .

"మీరు చేస్తే" అంది చిన్నగా నవ్వి.

డాక్టర్ నవ్వి శశికి షేక్ హ్యాండ్ ఇచ్చి " మొత్తానికి డేంజరస్ ఆపరేషన్ సక్సెస్ చేసారు. ఈ బాబాగాడి లీలలు ఒకటి కాదు.. పాపం శ్రీ కృష్ణ లీలలు ఎందుకూ పనికి రావు" అన్నాడు.

"అప్పుడే ఎక్కడైంది సార్? ఇంకా ఉన్నాయి గోతులు తవ్వుతున్నాము... రోజూ టి వి న్యూస్ వాచ్ చేస్తూ ఉండండి.. కొత్త, కొత్త విషయాలు తెలుస్తాయి."

"అప్పుడుగాని మా జీవితం ధన్యం అవదు.." డాక్టర్ మాటలకి అందరూ నవ్వారు.

డాక్టర్ ప్రద్యుమ్న వైపు చూసి "ఈవినింగ్ తీసికెళ్ళిపొండి .. షె ఈజ్ ఆల్రైట్ ...గాయాలు మానడానికి కొంచెం టైం పడుతుంది. అని శ్రేష్ఠ వైపు చూసి ఇంతంత దెబ్బలు ఎలా? వాడి దగ్గర అంత పదునైన ఆయుధాలు ఉన్నాయా "అడిగాడు ఆసక్తిగా .

" వాళ్ళంతా ఆడ, మగా అందరూ రాక్షసులు...వాళ్లకి ఆయుధాలు ఎందుకు? చేత్తో ఎడా,పెడా చెంప మీద కొట్టేవాళ్ళు.. వీపుమీద కొట్టేవాళ్ళు. నేనూ తక్కువ తినలేదు. దొరికిన వస్తువు దొరికినట్టు ఎత్తి వాళ్ళ మీద వేసాను."

ప్రద్యుమ్న కంగారుగా ఆమె వైపు చూసాడు. అతని కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరగడం గమనించిన శశి అనిరుద్ వైపు చూసి "నిన్ను డ్రాప్ చేయనా అనిరుద్? " అన్నాడు.

"ఎస్ సర్ ప్లీజ్" అన్నాడు అనిరుద్ ...

అందరూ ప్రద్యుమ్న, శ్రేష్ఠ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

ప్రద్యుమ్న శ్రేష్ఠ పక్కన కూర్చుని గాయపడిన ఆమె చెంప మీద సున్నితంగా రాసాడు.

ఆ చేయి అలాగే చెంపకి ఒత్తుకుని "ఐ లవ్ యు ప్రద్యు ... నువ్వంటే నాకు పిచ్చి... ఎక్కడ ఆ పల్లవిని వదలవో అని భయంతో పిచ్చిగా ప్రవర్తించాను నన్ను క్షమించవూ!? " అంది.

అతను జవాబు చెప్పకుండా గబుక్కున ఆమెని దగ్గరకు లాక్కుని కౌగిట్లో బంధించాడు.

(సమాప్తం)

*నా ఈ ధారావాహిక ఇంతకాలం చదివి, ఆదరించిన కౌముది పాఠకులకు ధన్యవాదాలు, కిరణ్ ప్రభ గారికి, కాంతి కిరణ్ గారికి కౌముది ఎంతో చక్కగా ప్రతినెలా మొదటి తారీకుకే అందిస్తూ మంచి, కథలు, మంచి నవలలు, శీర్షికలతో తీర్చి దిద్దుతున్నందుకు హృదయపూర్వక అభినందనలు.*

*అత్తలూరి విజయలక్ష్మి*